
# సుమతి

అంతర్జాల సమగ్ర కుటుంబ మాసపత్రిక

01-12-2024 సంపుటి -2 క్రిస్టమస్(డిసెంబర్ ) సంచిక-10 రూ.25/-



సుమతి పారకులకు
క్రిస్టమస్
శుభాకాంక్షలు

'సుమతి'ఉగాది కథలు,కవితలు, నవలల కార్టూన్ల పోటీల వివరాలు ఈ సంచికలో




# సుమతి 'సాహితీ సామ్రాట్' పోటీలు
# డిసెంబర్ - 2024 ఫలితాలు

## ఈ నెల ఉత్తమ కథలు :

### మొదటి బహుమతి రూ1000 /-

1.సాక్షాత్తు మానవుడు — డా.సుగుణారావు
2.కౌముది — కె .అమృత జ్యోత్స్న
(బహుమతి ఇద్దరికీ సమానంగా పంచబడును

### రెండవ బహుమతి రూ500/-

1.ఎవరు కారణం — ఎస్.శ్రీనివాసరావు
2 .వరమా ?శాపమా ? — కె .పుష్ప
(బహుమతి ఇద్దరికీ సమంగా పంచబడును )

### కన్సొలేషన్ బహుమతి పొందిన కథలు :

1 .రహదారి — ఎం .కారుణ్యకుమార్
2. ది టచ్ — కె .రాధ హిమబిందు
3. మారిన వైఖరి — సి .ఎస్ .జి .కృష్ణమాచార్యులు
4. విభిన్న వ్యక్తిత్వాలు — ఎ .శ్రీధర్ బాబు
(బహుమతి లేకపోయినా పోటికి పరిగణించబడును )

### సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథలు :

1.తరాలు -అంతర్యాలు . — .యశోద కైలాష్ .
2. అంతర్వాహిని — ఎం .వీరేశ్వరారావు
3. చేరిన గమ్యం .... — .వి .పూర్ణ కామేశ్వరి
4. వర్షం రాత్రి ... — నన్ద త్రినాధరావు

## ఈ నెల ఉత్తమ కవితలు:

### మొదటి బహుమతి రూ500 /-

1.ప్రతి ఇల్లు ఒక బృందావనం — ఎస్ .శ్రీనివాసరావు
2.ఎనిమిదో అడుగు — ఎన్ .రమేష్
(బహుమతి ఇద్దరికీ సమంగా పంచబడును )

### రెండవ బహుమతి రూ250/-

1. ఇదేనా జీవితం — ఎం .వీరేశ్వరారావు
2.అజ్ఞానాన్ని నింపుకోకు — డి.భైరవ
(బహుమతి ఇద్దరికీ సమంగా పంచబడును)

### కన్సొలేషన్ బహుమతి

1.ఎడబాటు — తాటి హరీష్
2. ఔను — ఎం .కారుణ్యకుమార్
(బహుమతి లేకపోయినా పోటికి పరిగణించబడును)

### సాధారణ ప్రచురణకు ఎన్నికైనవి :

1.అక్షరమంటే .... — ఎన్ .లహరి
2. యదార్ధం — .కె .విజయకుమార్



# సుమతి

## (సమగ్ర సకుటుంబ మాసపత్రిక)

**తెలుగు సాహితీ జగత్తులో**

**అనతి కాలంలోనే ధ్రువతారగా సుమతి ని నిలిపినందుకు**

**ధన్యవాదాలు తెలుపుతూ**

- ఎడిటోరియల్ బోర్డ్

## సుమతిలో ప్రకటనలు ఇవ్వండి

అనతి కాలంలోనే అశేష పాఠకలోకానికి చేరువైన

సుమతి సకుటంబ మాసపత్రికలో ప్రకటనలు ఇవ్వండి

కవర్ పేజి కలర్ :రూ.5000/–

కవర్ పేజి బ్లాక్ అండ్ వైట్ :రూ. 3000/–

లోపలి పేజీల్లో కలర్ :రూ2000 /–

లోపలి పేజీల్లో బ్లాక్ అండ్ వైట్ :రూ.1000 /–

ఆరోగ్యకరమైన సాహిత్యాన్ని కుటుంబం మొత్తానికి అందించాలని తెలుగు భాషకు

మరింత ఉన్నత స్థానాన్ని కల్పించాలని మీ ముందుకు ప్రతి నెల ఒకటవ తారికునే వస్తుంది.

ఇప్పుడు సుమతి పత్రికను ఆన్లైన్లో కూడా చదవ వచ్చు



# సుమతి

మాసపత్రిక

సంపుటి :2 సంచిక:8

అక్టోబర్ 2024

సంపాదకురాలు

అవుతు శ్రీవిద్య

సహ సంపాదకురాలు

జి .జ్ఞానిక

ముఖచిత్రం

మోక్ష

గ్రాఫిక్స్

జ్ఞానిక

చందా వివరాలు

సంవత్సర చందా రూ 250

ఐదేళ్ళ చందా రూ 1200

ప్రకటనలు , చందాలకు మరియు

రచనలు ,అభిప్రాయాలు

పంపవలసిన చిరునామా

SUMATHI.POTILU@GMAIL.COM

ప్రచురణ

సుమతి పబ్లికేషన్స్

(RC NO.:538/2006)

హౌస్ నం :26 -46 -79

వేణుగోపాల నగర్ ,గుంటూరు

ఆంధ్రప్రదేశ్


## సంపాదకీయం

పరిచయం లేనివాళ్లు ఇంటికొస్తే.. గడప బయటే నిలబెట్టి మాట్లాడి పంపించేస్తాం. మాట కలపడానికి ప్రయత్నిస్తే.. సున్నితంగా తిరస్కరిస్తాం. కానీ, నెట్టింట్లో మాత్రం దీనికి భిన్నంగా వ్యవహరిస్తున్నాం. హద్దూ, అదుపూ లేకుండా ఇంటి గుట్టంతా రట్టు చేస్తున్నాం. గుర్తు తెలియని వ్యక్తులను గడప దగ్గరే నిలబెట్టి శల్యపరీక్ష చేసే మనం.. సామాజిక మాధ్యమాల్లో మాత్రం అపరిచితులతో అపరిమిత స్నేహాన్ని కొనసాగిస్తున్నాం. అనవసరమైన విషయాలను పంచుకుంటున్నాం. దీన్నే ఓవర్ షేరింగ్ అంటారు. మీరు కూడా ఈ తరహా వ్యకులుఅయితే ఈ అలవాటు మానుకోండి . ముఖ్యంగా ఆడపిల్లలు అపరిచిత వ్యక్తులకు మీ వ్యక్తిగత వివరాలు ఫోటో లు ఇచ్చి ఇబ్బందులు కొని తెచ్చుకోకండి .

సుమతి

## సుమతి – సుభాషితాలు

అన్నివాట్సప్ గ్రూపుల్లోనూ ఉంటూ ఎవ్వరితోను చాట్ చెయ్యక , ఎక్కడా పోస్టులు పెట్టక ,ఎవ్వరికి లైకులు కొట్టక , కామెంట్లు పెట్టక తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతి

లోపలి పేజీలలో....

# ఈ నెల సాహితి సుమాలు...

## 36 ఫీచర్స్ అందరి కోసం


6 ముఖచిత్ర కథ
8 ఈ నెల కవిత
9 నడుస్తున్న చరిత్ర
13 అంతర్నేత్రం
64 జీవన చిత్రాలు
71 వైరల్
73 నాలుగో కోతి
77 సెటైర్
81 కార్టూన్స్ పేజి
82 యాత్ర
84 విహారి
88 కార్టూన్స్ పేజి
101 శ్రీసుక్తం
103 నమ్మకాలూ –నిజాలు
105 కరెంట్ అఫైర్స్
107 అవగాహన
110 వైరల్
111 ఫోటోగ్రఫి పాఠాలు
115 యువతా తెలుసుకో
118 భేతాళ భారతం
121 మన కథానాయకులు
123 కార్టూన్స్ పేజి
124 వార్తల్లో వ్యక్తి
130 చదవాల్సిన పుస్తకం
134 చూడాల్సిన సినిమా
137 వినాల్సిన పాట
139 క్రాస్ రోడ్స్ కబుర్లు
166 మన పురాణాలు
168 సప్తపది
183 ధర్మసందేహాలు
184 సృజన
185 పిల్లలు పిడుగులు
186 రాశి ఫలాలు


## 9 సీరియల్స్


16 పంచవటి( కామెడి సీరియల్ )
38 మమతల తరంగాలు (ఫ్యామిలీ సీరియల్ )
42 యమపాశం (క్రైం సీరియల్ )
49 బాబా బాబా బ్లాక్ షీప్ ( సీరియల్ )
54 యూనివర్సిటీ
59 రాణ ప్రతాప్ (చరిత్రాత్మక సీరియల్ )
67 గర్భ శ్లోకం (క్రైం సీరియల్)
126 డెత్ మెసేజ్ (క్రైం సీరియల్ )
170 నయన ( సీరియల్ )


## 9 కథలు


21 సాక్షాత్తు మానవుడు
27 కౌముది
32 ఎవరు కారణం
87 వరమా శాపమా
97 శాంతబాయి సెల్లు ఫోను
142 రహదారి
151 ది టచ్
156 మాఽరిన వైఖరి
162 విభిన్న వ్యక్తిత్వాలు
176 అమల


## 6 కవితలు


20 ఆమె
63 ప్రతి ఇల్లు ఒకబృందవనం
76 ఎనిమిదో అడుగ
87 అజ్ఞానాన్ని నింపుకో
161 అక్షరమంటే గ్రంధాలయం
165 నిజం చెబుతా వింటారా


★★★



# క్రిస్మస్ ట్రీ యొక్క ప్రాముఖ్యత ఏమిటి?

సంవత్సరం తర్వాత మళ్ళీ క్రిస్టమస్ సమయం ఆసన్నమైంది. ఉల్లాసభరిత వాతావరణం లో బహుమతులు, ఉత్సాహం మరియు వెచ్చదనాన్ని అందించే సమయం. ఈ పండుగను సూచించే పురాతనమైన క్రిస్మస్ ట్రీ అందరూ ఇష్టపడే మరియు ప్రముఖ చిహ్నం. క్రిస్మస్ ట్రీ ఆధ్యాత్మిక జీవితం యొక్క చిహ్నంగా పరిగణించబడుతుంది. క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేసే సంప్రదాయం మొదట జర్మనీలో ప్రారంభం అయింది అని విశ్వసిస్తారు, ఆ తరువాత 1830లలో ఇది యుకె కి వచ్చింది. శీతాకాలంలో జీసస్ క్రైస్ట్ పుట్టిన తర్వాత, ఆ గొప్ప సంఘటనకి గుర్తుగా కొన్ని చెట్ల మీద ఉన్న మంచు కింద పడిపోయి పచ్చగా మారిపోయాయి. అందువల్ల, క్రిస్మస్ ట్రీ శాశ్వతత్వము మరియు అమరత్వాన్ని సూచిస్తుంది.

అనాది కాలంగా, నిరుత్సాహంగా, నిరాసక్తిగా మరియు ఉదాసీనంగా ఉండే వాతావరణంలో క్రిస్మస్ ట్రీ ఉల్లాసం, సానుకూలత మరియు ఆశావాద స్ఫూర్తిని తీసుకువస్తుందని నమ్ముతారు. కఠినమైన వాతావరణ పరిస్థితులు ఎదురైనప్పటికీ పట్టుదల వదలకుండా పచ్చగా ఉండే స్ఫూర్తి క్రిస్మస్ ట్రీ అందించే సానుకూలతను సూచిస్తుంది. అలాగే, ఈ నిత్యనూతన చెట్ల నుండి ఉత్పన్నమయ్యే మంచి సువాసన మిమ్మల్ని రోజువారీ ఒత్తిడి నుండి విశ్రాంతి తీసుకోవడంలో మరియు మనశ్శాంతిని అందించడంలో మీకు సహాయపడుతుంది.

కస్టమరీ అలంకరణ

పూర్వం, ప్రజలు క్రిస్మస్ చెట్టును జింజర్‌బ్రెడ్ మరియు యాపిల్ వంటి ఆహార పదార్థాలతో అలంకరించేవారు. కానీ సమయం గడిచే కొద్దీ సంప్రదాయాలు మారాయి మరియు ఇప్పుడు అలంకరణలలో క్రిస్మస్ లైట్లు, క్యాండీలు, టిన్సెల్, బాబుల్స్, మెరిసే నక్షత్రాలు, రంగు రంగుల కాగితాల ముక్కలు, గోల్డ్ ఫాయిల్స్, సిల్వర్ వైర్స్, శాంటా క్లాజ్ పప్పెట్స్ వంటి చిన్న బొమ్మలు, కృత్రిమ స్నోఫ్లేక్స్ మరియు క్రిస్మస్ బెల్ వంటివి ఉన్నాయి.

బహుమతుల కోసం ప్లేస్‌హోల్డర్

క్రిస్మస్ పండుగ నాడు శాంటా క్లాజ్ పిల్లల కోసం బహుమతులు తీసుకువస్తారు అని మరియు వాటిని క్రిస్మస్ చెట్టు కింద పెడతారు అని అంటారు. ఈ సంప్రదాయాన్ని మరింత సరదాగా చేయడానికి, ప్రజలు పెద్ద చెట్లను తీసుకువస్తారు మరియు శాంటాని ఆశ్చర్యపరచడానికి వాటిని విశేషంగా అలంకరిస్తారు. క్రిస్మస్ ట్రీ బహుమతులను సేకరించడానికి మరియు వాటిని తెరవడానికి ఒక మంచి ప్రదేశం. అన్ని పండుగలు మిమ్మల్ని కొంత వరకు ఆనందపరుస్తాయి, అయితే, మీరు ఇచ్చిపుచ్చుకునే బహుమతులు ఆశ్చర్యాన్ని మరియు ఆనందాన్ని అందిస్తాయి. ఈ పండుగ సీజన్లో, మీ ప్రియమైన వారికి జీవితకాలంపాటు వారి జ్ఞాపకాలలో మిమ్మల్ని ఉంచే బహుమతిని ఇవ్వండి.ఈ క్రిస్మస్ రోజున, క్రిస్మస్ చెట్టు కింద ప్రత్యేకమైన భావావేశం కలిగిన మీ బహుమతిని ఉంచండి. ఈ పండుగ సీజన్ మీ ప్రియమైన వారికి ఏదైనా ప్రత్యేకమైన బహుమతిని ఇవ్వండి

## సాహితి భోజులకు... మహారాజ పోషకులకు ఇదే మా ఆహ్వానం . మీరు తెలుగు భాషా ప్రేమికులా..?సాహితీ ప్రియులా ..? తెలుగు సాహిత్యాన్ని బతికించుకోవాలని మీలో బలమైన కోరిక ఉందా ..?ఐతే సుమతికి అండగా నిలవండి

మహామహులు సాహితీ పత్రికలు నడపడం మావల్ల కాదు అని చేతులెత్తేసిన నేపథ్యంలో పురుడు పోసుకున్న సుమతి సకుటుంబ మాస పత్రికకు మీరు అందించే తోడ్పాటు కొండంత బలాన్ని ఇస్తుంది. మానసిక ఉల్లాసంతో పాటు, ఆలోచన రేకెత్తించే కథలు, కవితలు సీరియల్స్ అదే విధంగా నాలుగో కోతి , సెటైర్ ,కబుర్లు , భేతాళ భారతం,కార్టూన్లు ,అంతర్నేత్రం వంటి ఎన్నో ఫీచర్స్ తో పాఠక లోకాన్ని అలరిస్తున్న విషయం మీకు విదితమే. కేవలం చందాల తో పత్రిక నడపడం అంటే సాధ్యమయ్యే పని కాదు .తెలుగు భాషను బ్రతికిన్చుకోవాలి అనే ఒకే ఒక్క మహా సంకల్పంతో సుమతి పత్రికను సుమతి ఫౌండేషన్ ద్వారా ప్రారంబించటం జరిగింది .

ఈ సంకల్పానికి మీ సహకారం తోడైతే నిర్విఘ్నంగా ఈ మహా ప్రస్థానం సాగుతుంది. ఇందుకు గాను సుమతి అకౌంట్ కు గానీ మేము ఇచ్చే ఫోన్ పే / గూగుల్ పే నంబరు 10/- రూ నుండి మీ అవకాశాన్ని. బట్టి ఎంతైనా డోనేషన్ ఇవ్వవచ్చు. మీ చందా / డొనేషన్ ఆన అయిన అదే రోజు వాట్సాప్ లేదా పోస్ట్ ద్వారా రసీదు అందుతుంది. మన తెలుగు భాష పరివ్యాప్తి చెందడానికి సాహిత్య సంపద సృష్టించడం తప్ప మరొక మార్గం లేదు. ఇప్పటికే వివిధ పోటిల ద్వారా రచయతలను ప్రోత్సహిస్తూ వస్తున్నాము . ప్రతి నెల రచయతలకు ఎంతో కొంత బహుమతి మనస్సు పెట్టి రూపం లో సహాయం చేస్తూ వస్తున్నాము . ఈ ఏడాది ఉగాది రోజున 50 మంది కరచయతల్ను సన్మానించాము . సుమతి ఫౌండేషన్ ఇప్పటికే అనేక సేవ కార్యక్రామాలలో సమాజానికి ఇతోధిక సేవలందిస్తోంది .మనవ సేవే మాధవ సేవ అని నమ్మి ఎన్నో అనాథ , వృద్ధ ఆశ్రమాలకు సహాయం చేస్తూ వస్తోంది .భవిష్యత్తులో ఫౌండేషన్ ద్వారా దిగువ కార్యక్రమాలు చెయ్యాలనే సంకల్పం తో ఉన్నాము

1. ప్రతి పాఠశాలలో తెలుగ భాష పై పోటీలు నిర్వహించి చిన్నారులలో సాహిత్యం పట్ల అభిమానం పెంపొందించేటట్లు చూడటం
2.సాహిత్య రంగంలో కృషి చేసే వారికి ఆరోగ్య భీమా /అవసరమయ్యే మందులకైన ఇతోధిక సహాయం
3.ఔత్సాహిక పేద రచయితల పుస్తకాలు ముద్రించటం
4. పేద వృద్ధ రచయతలకు ఎంతోకొంత ఆర్ధిక సహాయం

దీనికి మీ తోడ్పాటు అనివార్యం.
ఎంత చిన్న సహాయం చేసినా , మీ పేర్లు ఫోటో తో సహా సుమతి పత్రికలో ప్రచురింప బడును . పోషకులకు పత్రిక ఉచితంగా పంపబడును. సుమతి నిర్వహించే అన్ని కార్యక్రమాలలో మీకు ఉచిత ప్రవేశం కల్పించబడును
వివరాలకు సంప్రదించాల్సిన నంబర్: 7893111985
సుమతి అకౌంట్ నంబర్ :150810100022726
IFS CODE :UBIN0815080
Phone Pay No;7893111985

ఆరుద్ర (రచన) కవితల సంకలనం " నుండి

# పీర్ల పండగ

. కేకేసి దూకండి
ఈ అగ్నిలోన;
ఈ వేడి కన్నీళ్లై
మన 'చెమట బిందువులె

ఈ బాధనాపాలి
ఈ మంట నార్పాలి
కేకేసి దూకండి ...

రివ్వురివ్వున ఎగిరి
కష్టాల డేగ
మన నెత్తిమీదున్న
పండు తన్నుకుపోవు
దూకండిలే వేవేవేగ
ఈ చిచ్చులోన ...

లోకాని కీనాడు
పురుడు పొయ్యాలి
ఆనంద బాలుడికి
బొడ్డు కొయ్యాలి
ఊదండి గట్టిగా కొలిమితిత్తి

ఇది కష్టమే గాని
ఇక మీద మనకు
ముళ్లులేని గులాబి
పువ్వు దొరకొచ్చు

ఉరకండి గబగబా'
ఈ నెగడిలోన ...
పరమపద సోపాన
పఠములో మాదిరిగ
పెనుపాము లుండొచ్చుగాని

గుండాన నడవండి
ఆలస్య మొద్దు...
ఈ కోసనాడూ
ఆ సీమనాడూ
యిద్దరం ఒకటిగా
మార్చవుతు పోదాం
కెరటాలు కెరటాలుగా

దూకండి దూకండి
ఈ అగ్నిలోన...



# ట్రంప్ ..రెండో సారి ..!

అమెరికా వంటి నాగరిక దేశంలో ట్రంప్ వంటి అనాగరికుడు అధ్యక్షుడిగా ఎన్నిక కావడమేమిటి, వింత కాకపోతే అనిపిస్తుంది, నాలుగేళ్ల క్రితం బైడెన్ పోటీ చేసినప్పుడు 'ముసలివాడు, మతి తప్పినవాడు, అంతటి బాధ్యతలను మోయడానికి అనర్హుడు' అంటూ వ్యాఖ్యలు వచ్చాయి. అయినా వ్యక్తిగతంగా ట్రంప్ కంటె మెరుగు అంటూ ఓట్లేశారు. అతను పూర్తి పదవీకాలం జీవించి ఉండడని, మధ్యలో పుటుక్కుమంటే కమలా గద్దె కెక్కుతుందని, ఆ విధంగా మన భారతీయులందరూ లక్కీ అని కూడా కొందరు ఊహాగానాలు చేశారు. కానీ బైడెన్ నాలుగేళ్లూ లాక్కొచ్చాడు. ఈసురోమని యీడుస్తూ వచ్చాడు. ప్రపంచానికే ప్రధాన దేశమైన, 80 దేశాల్లో సైనిక స్థావరాలున్న అమెరికా నాలుగేళ్లగా యిటువంటి దుర్బలుడి చేతిలో ఉందా అన్న విషయం తేటతెల్లమై భయాన్ని కలిగించింది. శారీరక దుర్బలత అనేది పెద్ద విషయం కాదు. బైడెన్ విషయంలో చిత్తచాంచల్యం కూడా కనబడుతోంది. ఇటువంటి మానసిక స్థితితో అతను ఉక్రెయిన్ యుద్ధం, గాజా యుద్ధం వంటి అంతర్జాతీయ వ్యవహారాలు, బలహీన పడుతున్న దేశ ఆర్థిక పరిస్థితి, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి దేశ సమస్యలు పరిష్కరించడానికి చూశాడన్న మాట, అందుకే అవి అలా అఘోరించాయి అని తెలిసి వచ్చింది. ట్రంప్ వచ్చి ఏం చేస్తాడో తెలియదు కానీ అసమర్థుడు అయిన మంచివాడి కంటే , సమర్థుడు అయిన చెడ్డవాడే మేలు ఎనుకునారో ఏమో అమెరికా

# ప్రజలు రెండోసారి ట్రాంప్ కు పట్టం కట్టారు .

అధ్యక్షుడిగా మొదటి విడత పాలనలోనే వలసలపై చాలా కఠినంగా ఉన్న ట్రంప్.. ఇప్పుడు మరింత కఠినంగా ఉండొచ్చనే అంచనాలు భయపెడుతున్నాయి. భారత్ నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు అమెరికాలో ఉన్న తరుణంలో.. వీరందరి భవిష్యత్తుపై ట్రంప్ కత్తి వేలాడుతోంది. ఏం తేడా వస్తుందో.. ఎప్పుడు అమెరికా దాటాల్సి వస్తుందోనని భారత్ విద్యార్థులు చాలా టెన్షన్ పడుతున్నారు. విదేశీ విద్యార్థులతో పాటు వీరు ఎక్కువగా ఉన్న వర్సిటీలు కూడా కంగారు పడుతున్నాయి. ట్రంప్ విధానాలు తమ విద్యార్థుల్ని ఎలా దెబ్బతీస్తాయోనని హడలిపోతున్నాయి. వీలైనంత వరకు డ్యామేజ్ కంట్రోల్ చేయటానికి ప్రయత్నం చేస్తున్నాయి. ట్రంప్ విధానాలు ఎలా ఉండొచ్చో ఊహించి.. కొన్ని వర్సిటీలు తమ విదేశీ విద్యార్థుల్ని తయారు చేస్తున్నాయి.

ట్రంప్ విధానాలు వలసవచ్చినవారికి చాలా సమస్యలు సృష్టిస్తాయి. ట్రంప్ ఈ విషయంపై చాలాసార్లు బహిరంగంగానే ప్రకటనలు చేశారు. అమెరికా ఎన్నికల్లో ఇది ముఖ్యమైన అంశం. అక్రమ వలసదారులు అమెరికా ప్రజల ఉద్యోగాలను లాగేసుకుంటున్నారని, వారిని వెనక్కు పంపుతానని ట్రంప్ వాగ్దానం చేశారు.అమెరికా టెక్నాలజీ రంగంలో భారతీయులు చాలా మంది పనిచేస్తున్నారు. వీరిలో ఎక్కువమంది హెచ్–1బీ వీసాపై అక్కడికి వెళ్లారు. ఈ వీసా నిబంధనల విషయంలో ట్రంప్ గతంలో కఠినంగా వ్యవహరించారు.

ఇది భారత ఉద్యోగులు, టెక్నాలజీ కంపెనీలపై ప్రభావం చూపించింది.



ఒకవేళ ఇదే విధానం కొనసాగితే, అమెరికాలో భారతీయులకు ఉద్యోగ అవకాశాలు తగ్గుతాయి. భారత టెక్ కంపెనీలు సైతం అమెరికా కాకుండా మిగిలిన దేశాలలో పెట్టుబడులు పెడతాయి.
ఏటా భారత్ నుంచి అమెరికాకు లక్షల మంది వెళ్తూ ఉంటారు. ఇందులో కొన్ని వేలమంది

హెచ్–1బి వీసాలపై అక్కడికి చేరుకుంటారు. మరీ ముఖ్యంగా భారత ఐటీ కంపెనీలు ఎక్కువ సంఖ్యలో హెచ్–1బి వీసాలపై పంపిస్తూ ఉంటాయి. అయితే గతంలో ఈ విధానాన్ని డొనాల్డ్ ట్రంప్ వ్యతిరేకించారు. అయితే తాజాగా అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ హెచ్–1బి వీసాల విషయంలో ట్రంప్ ఏ నిర్ణయం తీసుకుంటారు అనేది తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. అయితే గతంలో ట్రంప్ అధికారంలో ఉన్న సమయంలోనే అమెరికా ఉద్యోగులకు ఇచ్చే వేతనాలతో సమానంగా హెచ్–1బి వీసాదారులకు ఇవ్వాలనే ప్రతిపాదన వచ్చింది. ఈ నేపథ్యంలోనే ట్రంప్ ఎటువైపు మొగ్గుచూపుతారో అని హెచ్–1బి వీసాదారుల్లో ఉత్కంఠ నెలకొంది.

ట్రంప్ అధ్యక్ష పీఠం ఎక్కగానే వలసదారులపై ఉక్కుపాదం మోపే విధంగా కొత్త చట్టాలు, పాలసీలు తీసుకువస్తారనే అమెరికాలోని యూనివర్సిటీలు కూడా ఆందోళన చెందుతున్నాయి. అందుకే యూనివర్సిటీ నుంచి సెలవుల పై తమ స్వదేశం, లేదా ఇతర దేశాలకు వెళ్లిన విద్యార్థులు జనవరి 20 కి ముందే అమెరికా చేకోరువాలని కోరుతున్నాయి. అలా చేయని పక్షంలో అమెరికాలో వా రికి వీసా సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. యేల్ యూనివర్సిటీలో అయితే అమెరికాలో కొత్త వలస చట్టాల వల్ల అంతర్జాతీయ విద్యార్థులు ఎదుర్కోబోయే సమస్యలపై వెబినార్ కార్యక్రమం నిర్వహించారు. 2017లో ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ముస్లిం దేశాలు, ఉత్తర కొరియా, వెనెజులా లాంటి దేశాలకు ప్రయాణాలపై నిషేధం విధించారు. ఆ తరువాత విద్యార్థుల వీసాలపై ఆంక్షలు విధించారు. ఈసారి ఆ దేశం ఈ దేశం అని లేకుండా విదేశీ విద్యార్థులందరికీ ఇబ్బందులు తప్పవనే సంకేతాలు కనిపిస్తున్నాయి.

అమెరికా పరిస్థితి బాగున్నంత కాలం బయట నుంచి ఎంతమంది వచ్చినా స్థానికులు అభ్యంతరాలు చెప్పలేదు. మన కడుపు నిండుతోందిగా, మనం తినగా మిగిలింది వాణ్నీ తిననీయ్ అనుకున్నారు. ఆ యాటిట్యూడ్ వలననే అమెరికా ప్రపంచ మేధావులందర్నీ ఆకర్షించ గలిగింది. కానీ యిప్పుడు మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ఆదాయం లేక, ధరల పెరుగుదలను తట్టుకోలేక అల్లాడుతున్నారు. ఈ పరిస్థితికి దారి తీసిన కారణాలను లోతుగా అధ్యయనం చేయలేక, ట్రంప్ అనుచరుల ప్రచారానికి ప్రభావితులై తమ దుస్థితికి వలసదారులనే నిందిస్తున్నారు. కానీ కొన్నేళ్లగా తద్భిన్నంగా వ్యవహరిస్తున్నారు వారు. వలసదారుల వలన లబ్ధి పొందుతున్న కార్పోరేట్ వర్గాలకు అనుకూలమైన విధానాలను పాటిస్తున్నారు. ఆ విధంగా తమ కారెక్టరుకు భిన్నంగా వ్యవహరించి, తమ ఓటు బ్యాంకును చేజార్చుకున్నారు.

అగ్రరాజ్యం అమెరికా రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా ట్రంప్ అమెరికాలో నివసిస్తున్న విదేశీయులు, వలసదారుల పట్ల కఠినంగా వ్యవహరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో అమెరికాలో చదువుకుంటున్న విదేశీ విద్యార్థులు తమ భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతున్నారు. ట్రంప్ ఎన్నికల ప్రచారంలో పదే పదే వలసదారులపై ఉక్కుపాదం మోపుతామని చెప్పారు. ముఖ్యంగా అక్రమ వలసదారులు, సరైన అనుమతి పత్రాలు లేని వారిని వారి దేశాలకు తిరిగిపంపిచేస్తామని అవసరమైతే జైళ్లలో, డిటెన్షన్ సెంటర్లలో పెడతామని.. అవి సరిపోకపోతే డిటెన్షన్ సెంటర్లు సరిపోక పోతే పెద్ద డిటెన్షన్ సెంటర్లు, కౌంటీ జైళ్లు ఉపయోగిస్తామని అన్నారు. అక్రమ వలసదారులపై చర్యలు చేపట్టడానికి మిలిటరీ చర్యలు కూడా చేపడతామని హెచ్చరించారు. గతంలో అమెరికా అధ్యక్షుడిగా ఉన్న బరాక్ ఒబామా.. డిఫర్డ్ యాక్షన్ ఫర్ చైల్డ్‌హుడ్ అరైవల్స్ ప్రొగ్రామ్ చట్టాన్ని తీసుకువచ్చారు. ఈ చట్టం ప్రకారం.. విదేశాల నుంచి చిన్నతనంలో అమెరికా వచ్చి అక్కడే చదువుకుంటున్న విద్యార్థులుకు వలసల చట్టం

నుంచి ఉపశమనం లభించింది. ఇప్పుడు ఒబామా తీసుకువచ్చిన చట్టాన్ని ట్రంప్ రద్దు చేసే యోచనలో ఉన్నారని చెబుతున్నారు. అదే జరిగితే భారత, ఇతర దేశాల నుంచి అమెరికా వెళ్లి చదువుకుంటున్న దాదాపు 5 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది.

అమెరికాలో చదువుతున్న, పనిచేస్తున్న భారతీయ విద్యార్థులు వీసా నిబంధలపై అనుమానాలు ఉన్నాయి. అందుకే చాలామంది ఇండియా వచ్చారు. ట్రంప్ అధ్యక్ష పీఠం ఎక్కకముందే తిరిగి అమెరికా రావాలని ఆయా విశ్వవిధ్యాలయాలు విద్యార్థులకు సూచించాయి. 2023, 24లో భారత్ నుంచి చైనా కంటే ఎక్కువ మంది విద్యార్థులు విదేశాల్లో విద్య కోసం వెళ్లారు. ఇంటర్నేషనల్ ఎడ్యుకేషనల్ ఎక్స్ఛేంజ్‌పై ఓపెన్ డోర్స్ 2024 నివేదిక ప్రకారం.. 3లక్షల 31వేల 602 మంది భారతీయ విద్యార్థులు అమెరికన్ విద్యాసంస్థలలో జాయిన్ అయ్యారు. ఇది గత సంవత్సరంతో పోలిస్తే 23 శాతం పెరిగింది. ట్రంప్ ప్రధాన హామీల్లో ఒకటైన ఇమ్మిగ్రేషన్ పాలసీ ప్రస్తుతం భారతీయులకు ఇబ్బందికరంగా మారే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా భారతీయ అమెరికన్లకు ప్రధాన ఆందోళన కలిగిస్తోంది. వారి పిల్లలు సహజంగా అమెరికా పౌరులుగా మారడంపై అనిశ్చితి నెలకొంది. సహజసిద్ధమైన పౌరుడు అంటే ఆ దేశంలో జన్మించిన కారణంగా అమెరికా పౌరసత్వం మారే ఒక ప్రక్రియ. అలాంటి వ్యక్తి తమ జాతికి చెందిన దేశ పౌరసత్వాన్ని కలిగి ఉంటే, వారు తమ జీవిత కాలంలో ఎప్పుడైనా పుట్టిన దేశమైన అమెరికా పౌరసత్వాన్ని ఎంచుకోవచ్చు. ట్రంప్ సహజసిద్ధమైన పౌరసత్వాన్ని అడ్డుకుంటానని హామీ ఇచ్చారు. అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేసే అవకాశం ఉంది.

ఈ ఉత్తర్వు ప్రకారం.. పిల్లాడు అమెరికా పౌరసత్వం పొందాలంటే కనీసం తల్లిదండ్రుల్లో ఒకరు ఖచ్చితంగా అమెరికన్ అయి ఉండాలి లేదా చట్టబద్ధమైన పర్మినెంట్ రెసిడెన్స్ అయి ఉండాలి. దీని అర్థం ఏంటంటే, అమెరికాలో జన్మించిన పిల్లల తల్లిదండ్రుల్లో ఒక్కరూ కూడా అమెరికన్ సిటిజన్ లేదా పర్మినెంట్ రెసిడెంట్ కాకుంటే వారికి పౌరసత్వం లభించదు. 2022 US జనాభా లెక్కల విశ్లేషణ ప్రకారం, USను తమ నివాసంగా మార్చుకుని 4.8 మిలియన్ల భారతీయ-అమెరికన్లు ఉన్నట్లు అంచనా. వీరిలో 1.6 మిలియన్ల భారతీయ-అమెరికన్లు అమెరికాలో పుట్టి పెరిగారు, వారిని సహజ పౌరులుగా మారారు. అయితే, డొనాల్డ్ ట్రంప్ తీసుకువచ్చే ఎగ్జిక్యూటివ్ ఆర్డర్, రాజ్యాంగ విరుద్ధమైతే కోర్టులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. కోర్టులు ఏం తేల్చుతాయనే సంగతి తర్వాత.. ముందు ట్రంప్ తమ కొంప ముంచుతారేమోనని భారత్ విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

ట్రంప్ రాకముందే ఈ స్థాయిలో భయపడుతున్న విదేశీ విద్యార్థులు.. ఆయన అధికారం చేపట్టాక జరగబోయే పరిణామాలకు ముందే సిద్ధపడుతున్నారు. కొందరు మాత్రమే ప్రత్యామ్నాయాలు చూసుకోగలుగుతున్నారు. కానీ చాలా మందికి తమ కలలన్నీ కల్లలౌతాయనే దిగులు తప్పటం లేదు. ఎన్నో ఆశలతో అమెరికా వచ్చిన వారు, కష్టపడి డిగ్రీలు పూర్తిచేసిన వారు, ఇప్పటికే ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ పై ఉన్నవారు, ఒక్క మాటలో చెప్పాలంటే హెచ్ వన్ బీ వీసాపై ఉన్నవారందరి మెడపై ట్రంప్ కత్తి వేలాడుతున్నట్టే

★★★.



# అంతర్నేత్రం



## జీవితాన్ని ఆస్వాదించు

మనం భూమ్మీదకు వచ్చింది జీవించటానికి. జీవితం నుంచి తప్పించుకోవడానికి కాదు. చాలా మంది జీవిత మూలాల్లోకి వెళ్ళి తెలుసుకోలేక, పైపై మెరుగులతో సరిపెట్టుకుంటున్నారు. పూర్తిగా ఎవరైతే జీవితంలో నిమగ్నమౌతారో వారికే జీవితమంటే తెలుస్తుంది. ప్రఖ్యాత శాస్త్రవేత్త న్యూటన్కు మృత్యువు సమీపించినప్పుడు, ఆయన ‘నాకు ఈ సైన్సు అంటే ఏమి తెలియదు, నే సముద్రపు ఒడ్డున గవ్వలు ఏరుకోవటంలో జీవితాన్ని వ్యర్థం చేశాను. అసలు సముద్రాన్ని అన్వేషించలేదు. నాకు సముద్రాన్ని అన్వేషించే అవకాశం మళ్ళీ వస్తే బాగుంటుంది’ అన్నాడు. జీవితాన్ని బాగా ఆస్వాదించినవారు, జీవితాన్ని మరిన్ని కోణాల గుండా చూడాలని కోరుకుంటారు.

జీవితం చాలా చిన్నది. పశ్చాత్తాపంతో మొదలయ్యే ఉదయాలతో దాన్ని నింపలేం. అందుకే మనల్ని ఆదరించే వారిని ప్రేమిద్దాం. ఆ

# పరిణితి

పని చేయని వారినీ గౌరవిద్దాం. ప్రతి సంఘటనా ఏదో కారణం చేతనే జరుగుతుందని నమ్ముదాం. అవకాశం వస్తే దాన్ని స్వీకరిద్దాం. అది మన జీవితాన్ని మారిస్తే, అనుమతిద్దాం. ప్రేమించే కన్నులతో చూసేవారికి జీవితం సుందరం, మృదువైన మాటలు పలికే వారికి జీవితం శాంతిమయం, సున్నితమైన చేతులతో సహకరించేవారికి జీవితం ఆనందమయం, సుతిమెత్తని హృదయంతో సంరక్షించే వారికి జీవితం సకల శుభప్రదం.

జీవించడం అనేది ఉత్తేజకరమైన పని. ముఖ్యంగా ఇతరులకోసం జీవించినప్పుడు అది పరమ ఉత్తేజకరమైంది. ఊహించిన వాటిని పోగొట్టుకోవడం, అనూహ్యమైన వాటిని ఎదుర్కోవడమే జీవితం. మనది ఒప్పయితే ఎవరూ మనల్ని గుర్తుంచుకోరు. మనది తప్పయితే ఎవరూ మనల్ని మరచిపోరు. అదే జీవితం.

జీవితంలో ప్రతి సమస్య మనల్ని తుంచేందుకు గాని పెంచేందుకు గాని వస్తుంది. జీవితంలో ప్రతి పరీక్ష మనల్ని బాగు చేసేందుకు గానీ బాధ పెట్టేందుకు గానీ వస్తుంది, జీవితంలో ప్రతి కష్టం మనల్ని మెరుగు పరిచేందుకు గానీ మెడలు విరిచేందుకు గానీ వస్తుంది. విజేతగా నిలవడమా లేక పరాజితునిగా మిగలడమా అనేది మన చేతుల్లోనే ఉంది.

> సృష్టిలోని ఎనభైనాలుగు లక్షల జీవరాసుల్లో అత్యంత ఉత్కృష్టమైంది. మానవ జన్మ. అందుకే మనిషిగా పుట్టినందుకు మన జన్మను సార్థకం చేసుకోవాలి. ఏ మనిషికైనా యోగ్యత ఉంటుంది. సృష్టిలో తన ఉనికిని, పుట్టుకకు గల కారణాన్ని తెలుసుకోవటమే జీవితం.

చాలా మంది జీవితంలో ఎదురైన వైఫల్యాలకు కుమిలిపోతుంటారు. ముందుకు సాగలేరు. చరిత్రను పరిశీలిస్తే జీవపరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన ఛార్లెస్ డార్విన్, విద్యుత్ బల్బు కనిపెట్టిన ఎడిసన్, టెలిఫోన్ కనిపెట్టిన గ్రహంబెల్, విజ్ఞాన ఖని ఐన్స్టీన్ రాజకీయ రంగంలో లబ్ద ప్రతిష్టులైన వాషింగ్టన్, విన్స్టన్ చర్చిల్ బాల్యంలో ఎందుకూ పనికిరాని వారుగా ముద్రపడినవారే. వారంతా తమ వైఫల్యాలను అధిగమించి ముందుకు సాగుతూ విజేతలుగా చరిత్రలో నిలిచారు.

ఉదయాన్నే నిద్ర నుంచి సరైన ఎరుకతో మేల్కొనాలి. మనోదృష్టితో శరీరాన్నంతా దర్శించాలి. నీళ్ళు తాగుతున్నప్పుడు నీటిధారను మానసికంగా చూడగలగాలి. నడుస్తున్నప్పుడు ప్రతి అడుగు లెక్కపెడుతున్నంత స్పృహతో నడవాలి. జీవితంలోని ప్రతి అణువులను పరిపూర్ణంగా ఆస్వాదించాలి. అప్పుడే జీవితం ఆనందమయంగా మారుతుంది. అలా ప్రేమతో ఆనందంతో జీవించేవారు తప్పకుండా జీవిత లక్ష్యాన్ని చేరుకుంటారు.

సృష్టిలోని ఎనభైనాలుగు లక్షల జీవరాసుల్లో అత్యంత ఉత్కృష్టమైంది. మానవ జన్మ. అందుకే మనిషిగా పుట్టినందుకు మన జన్మను సార్థకం చేసుకోవాలి. ఏ మనిషికైనా యోగ్యత ఉంటుంది. సృష్టిలో తన ఉనికిని, పుట్టుకకు గల కారణాన్ని తెలుసుకోవటమే జీవితం.

★★★

ఈ శీర్షిక మీదే



# పాయింట్లు గెలుచుకొండి –బహుమతులు పొందండి

## ఎన్ని పాయింట్లు గెలుచుకుంటే అన్ని రూపాయలు

ఈ పోటిలో పాల్గొనటానికి సంవత్సర చందా కట్టిన వారు ఎవరైనా అర్హులే .అర్హులైన ప్రతి ఒక్కరికి , సుమతి ఒక కోడ్ నెంబరు తో ఖాతా తెరవబడుతుంది

1. మీరు పత్రిక చందా కట్టగానే 10 పాయింట్లు మీ ఖాతా లో జమ అవుతాయి
2. మీరు మీ స్నేహితులను , మిత్రులను చందా దారులుగా చేర్పించినట్లైతే , ప్రతి చందాకు 10 పాయింట్లు జమ చెయ్యబడుతుంది .
3. మీరు రాసి పంపిన కథ/కవిత /కార్టూన్ పత్రికలో ప్రచురించినట్లయితే 10 పాయింట్లు జమ చెయ్యబడతాయి .(ఉగాది , దసరా,దీపావళి తదితర పోటిలలో గెలుపొందినవి కాకుండా. ఎందుకంటే వాటికి ఎటు బహుమతులు ఉంటాయి కాబట్టి )
4. పాయింట్లను బట్టి మిమమల్ని
★డైమెండ్ (5000 పాయింట్లు )మెంబర్ /
★ప్లాటినం (1000 పాయింట్లు ) మెంబర్/
★గోల్డ్ (500.. పాయింట్లు )మెంబర్ /
★సిల్వర్ (300.. పాయింట్లు )మెంబర్ /
★కాపర్ (100 ..పాయింట్లు )మెంబర్ గా గుర్తించ బడుతుంది .
5.ప్రతి నెల మీ పాయింట్లు తెలియచెయ్యటం జరుగుతుంది.
6. ఎన్ని పాయింట్లు సాధిస్తే అన్ని రూపాయలు గెలుచుకునే అవకాశము మీదే
7. పోటీలు 01-01-2025 నుండి 30 -12 -2025 వరకు
8. మీరు టార్గెట్ పాయింట్లు చేరుకోగానే ఎప్పుడు కోరుకుంటే అప్పుడు మీ బహుమతి మీకు అంద జేయ బడుతుంది.
9. 01-01-20 25 సంచికలో మీ ఖాతా నెంబరు ప్రచురిస్తాము .

కామెడి సీరియల్

# పంచవటి

## ఓ పదిళ్ళ లోగిలి



అలేఖ్య

" కేసుల సంగతి ఎలావున్నా... మీరు మాత్రం వాళ్ళకు శత్రువు అవుతారు"

"అయితే అవ్వ నీఅమ్మా.. ఏం చేస్తారు చంపుతారా? మనం ఇలా భయపడి ఎదురు తిరగక పోబట్టే ఇటువంటి వాళ్ళ ఆటలు సాగుతున్నాయి. అయినా మీ ఆయన వెనకాల కొండంత అండగా నువ్వు వుండనే వున్నావుగా... " వాళ్ళ మాటలు విన్న వర్లు గారు కొడుక్కి ధైర్యం చెప్పారు.

'"యం కాదు మామయ్యా. సమాజంలో ప్రతి ఒక్కరూ ఓ కంఫర్ట్ జోన్ ఏర్పరుచుకుని బతకటం అలవాటు చేసుకున్నారు. ఆ కంఫర్ట్ జోనలో నుండి బయటకు రావటానికి ఇష్టపడరు. ఎప్పుడైతే వాళ్ళు కంఫర్ట్ జోన్'కి ప్రమాదం ఏర్పడుతుందో అపుడు తప్పకుండా బయటకొస్తారు"

# కామెడి సీరియల్

**జరిగిన కథ**

ఉమా ,శంకరం భార్య భర్తలు. ఉమా ఉళ్ళోని పోలీస్ స్టేషన్ లో ఎస్ ఐ గా పనిచేస్తూ ఉంటె , శంకరం చెట్టు కింద ప్లీడరు గా పేరుపడి వాదించటానికి కేసులు లేక ఇంటిదగ్గరే ఉండి ఇంటిపనులు చుసు కుంటూ ఉంటాడు . వర్లుగారి స్నేహితుడు తాతారావు వంటపని ఇంటిపని చేస్తూ భార్య చాటు భర్తగా గడుపుతుంటాడు . కాలనీ చుట్టూ అపార్ట్మెంట్లు రావటం తో నీటి ఎద్దడి రావటంతో మినిష్టేర్ని కలవల్నుకుంటారు వర్లు గారు . మునిసిపల్ కమిషనర్ ణి కలిసిన ఫలితం ఉండదు .హెడ్ కానిస్టేబులు రంగనాథం శంకరం దగ్గరకు చిన్న చిన్న కేసులు తీసుకువస్తుంటాడు .తాతారావు కొడుకు పద్మనాభం అందరిని పార్టీకి పిలుస్తాడు.పార్టీలో రియల్ ఎస్టేట్ కింగ్ హరీష్ ని అందరికి పరిచయం చేస్తా డు పద్మనాభం . కొంత మంది రౌడీలు తమ ఇల్లు ఆక్రమించారని శంకరాన్ని సంప్రదిస్తాడు ఆ ఉరి పోస్టు మాస్టర్ .ఉమ శంకరం కలిసి వాళ్ళ ఆట కట్టిస్తారు .కోబ్రా పేరుతో కోసి నది పరివాహక ప్రాంతంలో కట్టిన ఇళ్ళను కులగాడతారు మాహనగర్ మునిసిపాలిటి వాళ్ళు .పేదవాళ్ళు శంకరం దగ్గరకోస్తారు కేసు వాదించమని

**ఇక చదవండి**

”అవునమ్మా నువ్వు చెప్పించి నిజమే , మీ పోలీసులు లాయర్లకు ఉద్యోగాలు నిత్య సంఘర్షణే, కాని మా బోటి టీచర్లు ,బ్యాంకు ఉదుఒగులు వంటి వాలు హాయిగా కాలు కదపకుండా , మా చుట్టూ ఏమి జరుగుతున్నా పట్టించు కోకుండా బతికేస్తునాము. కాళ్ళ దగ్గకు నీళ్ళు వస్తే కాని ఆలోచించని సమాజంలో వున్నాము మనం. అయినా ఫరవాలేదు మీ లాంటి ఒకరిద్దరు అడుగు ముందుకెయ్యండి వెనకాల మాబోటి వాళ్ళం అనుసరిస్తాము”

“అలాగే మామయ్య.... మామయ్యగారు మనకు భరోసా ఇచ్చారంటే మనం ఇంక వెనక్కి చూసుకోనక్కరలేదు “ అంటూ సంతోషంతో భర్త వైపు చూసింది.

“ థాంక్ యు నాన్న. “ అంటూ తండ్రి వంక చూశాడు శంకరం

★★ ★

“ఎప్పుడూ ఈ సీరియళ్ళ గోలేనా కాస్త దేశంలో ఏం జరుగుతుందో వార్తలు పెట్టు కుందాం అంటే పడనివ్వవు కదా? భార్య పక్కనే కూర్చుంటూ అన్నాడు తాతారావు.

## గిలిగింతలు పెట్టె హాస్య వల్లరి

“ఎందు కంటా మీకు రాజ కీయాలు ఈ వయసులో ఏఊళ్ళు ఏలాలని హాయిగా ఏభక్తి ఛానలో చూస్తూ.. కృష్ణ రామ అనుకోకుండా..” మంగతాయారు మొగుడిని వెక్కిరించింది

“ నాకు ఎం వయసు అయిపోయిందని మొన్న నేగా నేను రిటైర్ అయ్యింది . అయినా నేనే మన్న రికార్డింగు డాన్సులు పెట్ట మన్నానా.. “ “ భార్యను కవ్వించాడు

“ఆ ఇప్పడు ఆడాన్సులొక్కటే తక్కువ. నా పెళ్ళైన నాటి నుండి చూస్తున్నా ఎప్పుడన్నా ఓగుడికో షికారుకో తీసుకెళ్ళరా... ‘నిష్ఠ రాలాడింది మంగ తాయారు.

“నేను నిన్ను షికారుకు తీసుకెళ్ళాలా .. ఎక్కడన్నా ఏనుగును, పీనుగు షికారుకు తీసుకెళ్ళటం చూసావా? “అణి గొణిగాడు

‘ఏమిటి గొణుగుతున్నారు ... ‘తలతిప్పకుండా అడిగింది

అబ్బే ఏమి లేదు... ఎక్కడ కుదురుతుంది మనకి ..నీకేమో సీరియల్స్, నాకమో వంటపని “ నసిగాడు తాతారావు

“ వంట పనంటే గుర్తొచ్చింది, ఈపూట వంట అయ్యిందా ? రేపటి నుండి త్వరగా పూర్తి చెయ్యండి”

“ వంటా పూర్తి అవ్వకుండా ణి పక్కన కూర్చో గలనా “

“ సరే ..రేపటి నుండి త్వరగా పూర్తి చెయ్యండి” ఆర్డర్ వేసింది

“ఎందుకో...” అడగలేక అడిగాడు

“ఎందుకైతే మీ కెందుకు.. అన్నీ మీకు చెప్పాలా?”కాస్త గొంతు పెంచింది మంగతాయారు

“ నిజమే అన్నీ నాకెందుకు, ఆ వంటేదో త్వరగా పూర్తి చేస్తే పోలా.. అని తనని తాను తిట్టు కుంటూ అక్కడి నుంచి కదిలాడు.

"ఏమనుకుందో ఏమో మంగతాయారు.. రేపటి నుండి కార్తీక మాసం ... " అంటూ అరిచింది

"అయితే ఏమిటట రేపు కార్తీకం, ఎల్లుండి మార్గశిరం .. నాకు మాత్రం ఈ వంట తప్పుదు అని మనసులో అనుకుంటూ "అలాగే.. "అని జవాబు ఇచ్చాడు తాతారావు

" ఏమిటి అలాగే, అభిషేకం టి .వి ఛానల్ వాళ్ళు కోటి దీపోత్సవం చేస్తున్నారు రేపటి నుండి , మనం వెళ్తున్నాం... "మళ్లీ అదే అరుపు

" నేంనెదుకు అక్కడికి.. ఆ చలిలో ... "

'చేసిన పాపాలు కడుక్కోవటానికి ... కాస్త పుణ్యం సంపాదించటానికి "జవాబిచ్చింది

"పాపాలా? నేనెం చెయలేదు .మొగుణ్ణి రాచి రంపాన పెడుతూ. నువ్వే పాపం మూట కట్టు కుంటు న్నావు అని అరుద్దామనుకుని

"చలికి నేను తట్టుకోలేనని నీకు తెలుసు కదా?! "

"ఏం ఫరవాలేదు.. అక్కడ దీపాల మధ్య వెచ్చగా వుంటుంది.. "అన్నది మంగతాయారు. మొండిగా

మంగతాయారు మొదటి నుండి మొండిదే. తనతో వాదించటం అనవవవసరం అని పెళ్లైన మూడో రోజుకే అర్ధం అయ్యింది తాతారవుకి

అందుకనే ప్రతిదానికి సరే సరే, అన్నట్లు తల ఉపటం నేర్చుకున్నాడు

' ఎక్కడ ఏర్పాటు చేశారు మీ ఈఅభిషేకం టి.వి. వాళ్ళు ."

'ఏమో... అది మీరు తెలుసుకోవాలి. ' అంటూ తాతారావుకు హుకుం జారీ చేసింది.

"ఒప్పుకునేది కాక మళ్ళీ ఇదోకటా. అయినా ఇంత సేపు టి.వి చూసావు. . టి.వి.లో చెప్ప లేదా ఎక్కడో ?'

"చెప్తారు.. మీరు కనుక్కుంటారోలేదో చూద్దామని "అంటూ నవ్వటం మొదలుపెట్టింది మంగతాయారు

(ఇంకా ఉంది )

# ఆమె

ఈదర శ్రీనివాస రెడ్డి

ఆకాశం లో సగం ఆమె
అందుకే కాబోలు ఎగురుతోంది
గాలిపటం లా దారం మగని చేతికిచ్చి
అవని పై మాత్రం తన అస్తిత్వాన్ని
అడుగులను కుదించు కుంటూ

వంటింటికి మాహారాణి ఆమె
అందుకే కాబోలు ముచ్చటపడుతోంది
ప్రతి గిన్నె మీద మొగుడి పేరు చూసుకుని
అందరి ఆకలి కోసం తన రుచులు
అభిరుచులు చంపు కుంటూ

ఇంటికి దీపం ఇల్లాలు ఆమె
అందుకే కాబోలు మెరిసిపోతోంది
కొవ్వొత్తిలా వెలుగులు విరజిమ్ముతూ
అందరి ఆనందం కోసం తన చుట్టూ
మాత్రం చీకటిని మిగుల్చుకుంటూ

ప్రతి ఇంటికి మహాలక్ష్మి ఆమె
అందుకె కాబోలు మురిసిపోతోంది
పోపులపెట్టెలో చిల్లర నాణాలు ఉన్నాయని
అందరి అవసరాల కోసం తను మాత్రం
పదికి పరకకి పతిని దేబిరిస్తూ

అందరికి ఆధారం ఆమె
అందుకే కాబోలు సంతోష పడు తోంది
అందరి ఆశలు తీరుస్తున్నానని తను మాత్రం
మిగిలిపోతోంది పులదండలో దారం లా

ఈ నెల కథ

మొదటి బహుమతి పొందిన కథ

..

## సాక్షాత్తు మానవుడు

డా .ఎం .సుగుణా రావు

ఆ గదిలో అందరి ముందు దోషిలా నిలబడ్డాడు కేశవరావు. ఆరోజు అతని షష్టిపూర్తి. ఉదయమే కుటుంబ సభ్యులంతా ఇంట్లో అతని చేత ఆయుష్హోమం చేయించారు. పండితులు హోమగుండం వేసి ఆశీర్వదించారు. అలాగే అదేరోజు అతను పదవీవిరమణ కావడంతో ఆఫీసు ఉద్యోగులు వీడ్కోలు సభ నిర్వహించారు. కుటుంబ సభ్యులంతా ఆ నగరంలోని మంచి హోటల్‌లో అందరికీ విందు ఏర్పాటు చేశారు. ఆ సాయంత్రం జరిగిన అతని సన్మాన సభలో కేశవరావుని బాగా పొగిడారు ఆఫీసువాళ్లు, స్నేహితులు. అతని గురించి మంచిగా రాస్తూ దినపత్రికల్లో వార్తలు వచ్చాయి.

ఇదంతా ఒక ఎత్తయితే, తర్వాతి రోజు ఉదయం 'వాతావరణం చాలా ప్రశాంతంగా ఉంది' అనుకుంటూ లేచాడు. బైటికి వచ్చాడు. కుటుంబ సభ్యులెవరూ కనబడలేదు. భార్యా, కొడుకు, కోడలు, కూతురు, అల్లుడు క్రింద వాకింగ్‌కి వెళ్లినట్టుగా అనిపించింది. బాల్కనీలోంచి చూశాడు. వాళ్లంతా నడుస్తూ కనిపించారు. వారి ప్రక్కనే మనవరాలు కూడా ఉంది.

తనే కాఫీ పెట్టుకుని బెడ్‌రూమ్‌లోకి వచ్చి కూర్చున్నాడు. అరగంట తర్వాత ఇంట్లోవాళ్లు వచ్చారు. వచ్చిన వెంటనే అతని మీద దాడి చేశారు. నానా మాటలతో అతన్ని దుయ్యబట్టారు. తల వంచుకున్నాడు.

రచ్చ గెలిచి ఇంట్లో గెలవకపోవడం అంటే ఇదే అనుకున్నాడు. కడుపున పుట్టిన పిల్లలు, అలాగే అగ్నిసాక్షిగా పెళ్లాడిన భార్య, ఆ ఇంట్లో సభ్యులైన అల్లుడు, కోడలు ` వీరందరి ముందు తను దోషిగా నిలబడ్డాడు. వారి దృష్టిలో అతను చేసిన తప్పును పదే పదే చెప్పడం మొదలుపెట్టారు. అతనేమీ మాట్లాడలేదు.

''ఏం మాట్లాడరేం, రాయిలాగా... సమాధానం చెప్పండి'' అంది భార్య.

మౌనం వహించాడు. ఆమె తన తిట్ల ప్రహసనం కొనసాగించింది. ''ముప్ఫయ్ ఏళ్లుగా మీకు వండి పెట్టాను. చాకిరీ అంతా చేశాను. మీరు డ్యూటీ సక్రమంగా చేసి, హాయిగా రిటైర్ అయ్యారు. మీకు భారం లేకుండా కుటుంబాన్ని చక్కదిద్దాను. అలాంటి నాకు మీరిచ్చే గౌరం ఇదా?'' అంది భార్య రెట్టిస్తూ.

'కొంపతీసి తను నిజంగానే తప్పు చేశాడా?' అనుకుంటూ ఆలోచనలో పడ్డాడు.

అంతకు ముందురోజు జరిగిన సన్మానం, ఆఫీసువాళ్లు, స్నేహితుల తనపై చూపించిన ఆప్యాయత, అభిమానం ఆ క్షణంలో కరిగి ఆవిరైపోయింది కేశవరావుకు. కుటుంబ సభ్యులు ఇలా మాట్లాడతారని అసలు ఊహించలేకపోయాడు. పావుగంట తర్వాత అందరూ ఆ గదిలోంచి నిష్క్రమించారు. ఆ గదిలో ఒంటరిగా ఉన్న కేశవరావులో ఎడతెగని ఆలోచనలు.

క్రోధంతో రగిలిపోతూ, తన మీద ఆవేశపడిన కొడుకు, కూతురు గుర్తుకొచ్చారు. వాళ్లు చిన్నప్పుడు చేసినవన్నీ కళ్ల ముందు మెదిలాయి. ఒకసారి చెత్తకుండీలో తల్లి చనిపోయిన బుజ్జికుక్క దొరికితే దాన్ని తీసుకొచ్చారు. తన భార్య తిట్టినా, ఆ కుక్కపిల్లను పెంచుకుంటామంటూ గొడవ చేశారు. అలా ఆ కుక్కపిల్లను చాలా సంవత్సరాలు కూతురు, కొడుకు ముద్దుగా పెంచుకున్నారు. అది చనిపోయినప్పుడు వారం రోజులదాకా ఇద్దరూ భోజనం చేయలేదు. పిల్లల మంచితనం చూసి తను పొంగిపోయాడు.

కొడుకు, కూతురుకు భూతదయ ఎక్కువే! అది జంతువుల పట్లే కాదు, ఎవరైనా చెట్టూచేమ కొట్టేసినా దాని ఫోటో తీసి ఫేస్‌బుక్‌లో పెడతారు. ఎలక్ట్రిక్ తీగెల మీద కాకి చనిపోయి వ్రేలాడుతూ వుంటే దాన్ని ఫోటో తీసి వాట్సాప్ గ్రూపుల్లో ఉంచుతారు. అది చూసి చాలా గర్వించేవాడు. ఇక భార్య విషయానికొస్తే భార్య చేసే పనులు కూడా చాలా నచ్చేవి. పండుగలకు ప్రతీసారి ఇంట్లో పనమ్మాయికి, వంట చేసే అమ్మాయికి బట్టలు పెడుతుంది భార్య. చిన్నప్పుడు తనకు తల్లి చెప్పేది ` ''పెద్దయిన తర్వాత మీకు పెళ్లవుతుంది. భార్య వస్తుంది. మీకంటూ ఒక కుటుంబం ఏర్పడుతుంది. అలాఅనిచెప్పి తోటబుట్టిన చెల్లిని మరచిపోకు. పండగకి పిలిచి, భోజనం పెట్టి, మీ తోబుట్టువుకు గుడ్డముక్క పెట్టు. ఏ స్త్రీ అయినా పుట్టింటి నుంచి ఆశించేది ఇదే!''

ఈ విషయం తను గుర్తుంచుకున్నాడు. పెళ్లయినా, బాధ్యతలు పెరిగినా తల్లి చెప్పినట్టే ప్రతి సంక్రాంతి పండుగకి చెల్లెల్ని, బావగారిని పిలిచి తల్లి చెప్పిన పని చేసేవాడు. దానికి భార్య కూడా వెన్నుదన్నుగా నిలబడేది.

ఇలా తన కుటుంబంలో మనుష్యులంతా మానవత్వం ఉన్నవాళ్లే అనుకుంటూ తను ఈ పని చేశాడు. అయ్యో, ఒక్కసారే విరుచుకుపడ్డారే. ఇంతకీ తనేం చేశాడు? పరాయివాళ్లకో, పక్కింటివాళ్లకో కాదుకదా. తోట బుట్టిన చెల్లెలికి కష్టం వచ్చిందని ఆదుకున్నాడు. ఆమెకు ఒకగానొక్క కొడుకు. వాడికి పెళ్లయి పిల్లలున్నారు. చిన్న ఉద్యోగం కూడా ఉంది. అయితే కిడ్నీ సమస్య వచ్చింది. దానికి ఐదు లక్షలు కావాలి. ఎవరో దాత దొరికాడు.

చెల్లెలు తన దగ్గరకు వచ్చి ఏడ్చింది. అంతే! రక్తం పంచుకు పుట్టిన తోబుట్టువు అలా ఏడ్వడం తనకు బాధ కలిగించింది. రిటైర్‌మెంట్ తాలూకు సొమ్ములో ఐదు లక్షలు చెల్లెలికి ఇచ్చేశాడు.
''వాళ్లు డబ్బు ముందు కట్టమన్నారు. తర్వాత మీ మేనల్లుడి ఆఫీసువాళ్లు తిరిగి ఇస్తారట. వాడికి మెడికల్ పాలసీ ఉంది'' చెప్పింది చెల్లెలు.

ఇది తను చేసిన పని. ఇంట్లోవాళ్లు హర్షిస్తారనుకున్నాడు. అంతా మంచివాళ్లే! తను చేసిన కొద్దిపాటి సాయం ఇంట్లో ఇంత కల్లోలాన్ని రేపుతుందని ఊహించలేకపోయాడు. మనసు స్తబ్ధుగా అయిపోయింది.
భారంగా అయ్యింది శరీరం. కళ్లు మూసుకున్నాడు. అయినా ఎడతెగని ఆలోచనలు. లేచి నిలబడి గదిలో పచార్లు చేస్తున్నాడు.
వారం రోజుల క్రితం తన కొడుకు ఒక విషయం గురించి గొప్పగా చెప్పాడు. అలాంటి గొప్ప పని ఒక్కటైనా చేయాలన్నాడు.

తమిళనాడుకి చెందిన ఒక పెద్దాయన ఒక ప్రభుత్వ గ్రంథాలయంలో ముప్ఫయ్ సంవత్సరాలు పని చేశాడు. ప్రతీనెలా జీతం అనాథశరణాలయానికి ఇచ్చి అక్కడే బ్రతికేవాడు. వాళ్లు పెట్టింది తినేవాడు. వాళ్లతో కలిసి తిరిగేవాడు. అలా ముప్ఫయ్ సంవత్సరాలు గడిచిపోయింది. రిటైరై పెన్షన్ వచ్చిన తర్వాత ఆ పెన్షన్ కూడా అలాగే అనాథాశ్రమానికి ఇస్తూ అక్కడే బ్రతుకుతున్నాడు. ఈ మధ్యనే ఆయన గురించి తెలిసిన అమెరికాలోని ఒక సంస్థ ముప్ఫయ్ కోట్ల రూపాయిలు అవార్డు ఇచ్చింది.

దాన్ని కూడా ఆయన ముప్ఫయ్ అనాథాశ్రమాలకు దానం చేసేశాడు. ఈ విషయం చూసి చలించిపోయిన ఒక ప్రముఖ తమిళ నటుడు 'మీరు నా గాడ్ ఫాదర్' అన్నాడు. ఈ డబ్భయ్ తొమ్మిది సంవత్సరాల వయసులో మీకు తోడు అవసరం. నా దగ్గరకు వచ్చేయండి. మిమ్మల్ని పెంచుకుంటాను. తండ్రిగా స్వీకరిస్తాను అన్నాడు. అందుకు అతగాడు ఏమన్నాడు?

''నేనే నిజంగా నీ తండ్రినైతే కొడుకు ఎప్పుడూ తండ్రి దగ్గరే ఉండాలి కదా. నువ్వు కూడా వచ్చి నాతో ఉండొచ్చు'' అంటూ నవ్వుతూ చెప్పాడు. అంత పెద్ద నటుడు, ఐశ్వర్యవంతుడు నెలలో కొన్ని రోజులు ఆ అనాథాశ్రమంలో గడుపుతాడు. ఒక సాధారణ మనిషిగా!

ఈ విషయం కొడుకు చెప్పి ఎంత మురిసిపోయాడు.

కూతురు ఇంకో విషయం చెప్పింది. దానం గురించి చెప్పింది. ఎవరికి అవసరమో తెలుసుకొని ఇవ్వడమే దానం. మనకు మిగిలిపోయింది, పనికిరానిది ఇవ్వడం కాదు.

ఇలా కొడుకు, కూతురు చెప్పిన మాటలకు తను ఆరోజు ఎంత పొంగిపోయాడు!

ఇంతలో తలుపు చప్పుడైంది. మనవరాలు ''తాతయ్యా! టిఫిన్'' అంది, ప్లేటులో పట్టుకువచ్చి.

కేశవరావు దాని వంక చూడలేదు. నిశ్చలంగా, నిర్లిప్తంగా ఉండిపోయాడు.

చిన్నప్పుడు జరిగిన విషయం గుర్తుకొచ్చింది. నాన్నది రైల్వే ఉద్యోగం. రైల్వే క్వార్టర్‌లో ఉండేవారు. ఇంటి వెనుక పెరడు ఉండేది. నాన్న గొయ్యి తవ్వుతుంటే, తను మట్టి తీసి పారేసేవాడు. అదంతా అడవిప్రాంతం. ఎక్కడి నుంచో పాములు, తేళ్లు వచ్చేవి. పెరటిలో ఆడుకుంటున్న తనను తేలు కుట్టింది. ఆ తర్వాత అది కనిపించలేదు. అమ్మ మందు రాసి, రాత్రంతా ఏడుస్తూ కూర్చుంది, తన బాధ చూడలేక.
ఆ తర్వాత కొన్ని రోజులకు పెరటిలో ఆ తేలు కనిపించింది. 'చంపేయ్' అంది అమ్మ. ఎందుకో తనకు మనసు ఒప్పలేదు. మిలమిల మెరుస్తూ దాని మానాన అది పోతోంది. పాపం దాన్ని చంపడం దేనికీ అనుకున్నాడు.
''ఒరేయ్... అది విషపురుగు. దాని గుణం కుట్టడమే. అంచేత చంపెయ్'' అని అంది అమ్మ.
అమ్మ మాటలకు తను ఆలోచనలో పడ్డాడు. 'కుట్టడం దాని గుణం. మనిషి అన్న తర్వాత మనిషిలా ప్రవర్తించాలి కదా. తను తేలు కాదు కదా' అనుకున్నాడు.

ఆ విషయం అంతా గుర్తుకొచ్చి కేశవరావుకు తనకు తెలిసిన పద్యం గుర్తుకొచ్చింది.

'తలనుండు విషము ఫణికిని
వెలయంగ తోకనుండు
వృశ్చికమునకున్
తలతోక యెనక యుండును
ఖలునకు నిలువెల్ల విషము గదరా
సుమతీ!'

ఆ పద్యం గుర్తుకొచ్చింది. అవును మనిషికి నిలువెల్లా విషమే! మంచిగా ఉండడానికి ప్రయత్నిస్తాడు తప్ప మంచివాడు కాలేడేమో!

గదిలో పచార్లు చేస్తున్నవాడల్లా మళ్లీ కుర్చీలో కూలబడ్డాడు. కేశవరావుకు అర్థమైపోయింది. తనను అంతగా తిట్టిన తర్వాత తను కోపంలో ఉన్నాడని ఇంట్లోవాళ్లు తన దగ్గరకు రావడానికి మొహం చాటేశారు. అవును. అది వాళ్లకీ, తనకీ అలవాటైపోయింది. ఎవరి మీదైనా తనకు కోపంవస్తే తను అరవడు. కేకలు వేయడు. మౌనంగా ఆయిపోతాడు. ఒంటరితనంలో కూరుకుపోతాడు. ఏకాకిగా గడుపుతాడు. అందుకే మనవరాలి చేత టిఫిన్ పంపించారనుకున్నాడు. మళ్లీ ఆలోచనలో పడ్డాడు.

తెల్లగా ఉన్న గోడల మీద రకరకాల కొటేషన్లు. అవి చిన్నప్పుడు కూతురు, కొడుకు బోర్డుల మీద రాసి తగిలించినవి. ఆ కొటేషన్లు చదువుతూ ఉండిపోయాడు.

'మీరు పెద్దయ్యాక మీకు రెండు చేతులున్నాయని మీరు తెలుసుకుంటారు. ఒకటి మీకు సహాయం చేయడానికి. మరొకటి ఇతరులకు సహాయం చేయడానికి.' ఇది కూతురు రాసింది.

'ఈ లోకంలో మంచిగా ఉండడం మంచిదే కానీ మంచి చేయడంలోనే దాని ఉపయోగం.' ఇది కొడుకు రాసింది.
'మన కోసం మనము ఏం చేసుకున్నామో అది మనతో పాటు చచ్చిపోతుంది. మనం ఇతరుల కోసం చేసింది మాత్రం ప్రపంచం అంతమయ్యేవరకూ మిగిలే ఉంటుంది.'

ఇలా ఆ గోడ మీద ఎన్నో కొటేషన్లు.

చిన్నగా నిట్టూర్చాడు. ఆకలేసినట్టనిపించింది. అయినా తినాలనిపించలేదు. అలాగే ఉండిపోయాడు. మరికొంతసేపు గడిచింది. మధ్యాహ్నం అయింది. మనవరాలు మళ్లీ తలుపు తెరిచింది. "భోజనానికి రమ్మంటుంది నాన్నమ్మ" చెప్పి వెళ్లిపోయింది. కేశవరావు కదల్లేదు.

మరో పావుగంట తర్వాత మనవరాలు తలుపు తోసుకుంటూ వచ్చింది. ప్లేటులో అన్నం, పప్పు, కూర, పచ్చడి, మరో గిన్నెలో పెరుగు ఆ గదిలో టేబుల్ మీద పెట్టింది. "తాతయ్యా, మేము బైటికి వెళ్తున్నాం. సాయంత్రం వస్తాం" అంటూ చెప్పి వెళ్లింది.

అవును. ఎవరిదో గృహప్రవేశం. తనూ వెళ్లాల్సి ఉంది. కానీ వెళ్లాలనిపించడం లేదు. ఇది ఇంట్లోవాళ్లకి అర్థమైపోయింది.

మరో అరగంట గడిచింది. భోజనం ముట్టుకోలేదు. ఉదయం తెచ్చిన టిఫిన్ చుట్టూ ఈగలు మూగుతున్నాయి. టిఫిన్ గాలికి చల్లబడినట్టు మెత్తమెత్తగా ఆయిపోయి ఉంటుందనుకున్నాడు. కాసేపటికి ఈ అన్నం పరిస్థితీ అదే! నీరసంగా అనిపించింది. మంచం మీద వాలిపోయాడు. ఎంతసేపు నిద్రపోయాడో తెలియదు. గదంతా చీకటి. మెళకువ వచ్చినా కళ్లు తెరవలేకపోయాడు. ఇంతలో ఎవరో తలుపు తీసుకుంటూ వచ్చారు.

చెల్లెలు! చేతిలో సంచీ. "అన్నయ్యా, ఏమైంది, ఒంట్లో బాగలేదా?" అంది, చెయ్యి పట్టి చూస్తూ.

ఏమీ మాట్లాడలేదు. ఇంతలో భార్యా, కొడుకు, కోడలు, మనవరాలు లోపలికి వచ్చారు. ఆ గదిలో ఉదయం మనవరాలు ఉంచిన టిఫిన్ ప్లేటు, మధ్యాహ్నం ఆమె తెచ్చిన భోజనం ప్లేటు వంక చూస్తూ ఉండిపోయింది భార్య. "ఏమైంది?" అంది, భర్త వైపు ఆశ్చర్యంగా చూస్తూ.

"ఇంతకీ నువ్వెప్పుడు వచ్చావు?"

అంది, ఆడపడుచు వైపు తిరిగి.

కేశవరావు చెల్లెలు ''ఇప్పుడే వచ్చాను వదినా'' అంటూ అన్నగారి తల నిమురుతూ ''నీ మేలు మరచిపోలేం. సమయానికి దేవుడిలా కాపాడావు. మేనల్లుడి ప్రాణాలు నిలబడ్డాయి. ఆపరేషన్ విజయవంతంగా ముగిసింది.''

ఆమె చెప్తోన్న మాటలకు ఆ ముగ్గురూ నిర్లిప్తంగా చూస్తూ నిలబడ్డారు. ఆ చూపులు గమనిస్తే కోపం కూడా కనిపిస్తుంది. మరో నిమిషం తర్వాత తను తెచ్చిన సంచీ విప్పింది. దాంట్లో డబ్బు కట్టలు తీసి కేశవరావుకు ఇస్తూ ''మా అబ్బాయి ఆఫీసువాళ్లు తిరిగి చెల్లించేశారు. మీరు ఇచ్చిన డబ్బు ఆసుపత్రిలో కట్టేశాం. అందువల్లే వాళ్లు ఆపరేషన్ చేశారు. నువ్వు డబ్బివ్వకపోతే ఆపరేషన్ జరిగేది కాదు. పాపం... నువ్వు రిటైర్‌మెంట్ అయిన డబ్బులు రాగానే మాకే ఇచ్చేశావు. నిజంగా మనిషివంటే నువ్వే అన్నయ్యా!'' అంది.

ఆ మాటలకు చిన్నగా నవ్వాడు. కానీ ఆ డబ్బు వంక చూడలేదు. భార్య ఆ డబ్బు తీసుకుని ''పోనీలే, సాయపడ్డాం'' అంటూ నవ్వింది. అంతవరకూ అభావంగా, ముభావంగా ఉన్న కొడుకు, కోడలు మొహాల్లో నవ్వు ప్రత్యక్షమయ్యింది.
''నేను వెళతానన్నయ్యా. అబ్బాయిని చూసుకోవడానికి ఎవరూ లేరు. నీ ఆరోగ్యం జాగ్రత్త!'' అంది, లేచి నిలబడి.
''కాఫీ త్రాగి వెళ్లువుగానీ'' అంది కేశవరావు భార్య.

''నాకు వద్దులే. వెళ్లిపోతాను. బైట ఆటో ఉంది. అన్నయ్య ఉదయం నుంచీ ఏమీ తినలేనట్టుంది. కాఫీ త్రాగుతాడేమో అడుగు'' అంటూ గదిలోనుంచి బైటికి నడిచింది.

''మన మాటలకు కోపం వచ్చినట్టుంది నాన్నగారికి'' అంటూ గుసగుసగా అన్నాడు కొడుకు.

''రేపటికి అదే సర్దుకుంటుందిలే. ఇది మనకు తెలిసిందే కదా. పదండి. ఆయన కాసేపు పడుకుంటారు'' అంటూ భార్య గదిలోనుంచి బైటికి వచ్చింది. అంతా వెళ్లిపోయిన తర్వాత కేశవరావుకు చాలా ప్రశాంతంగా ఉన్నట్టనిపించింది. ఒంటరితనమే బాగుందనుకున్నాడు.

మరికొన్ని గంటలు గడిచాయి. సాయంత్రం దాటింది. చుట్టూతా చీకటి ఆవరించింది. మనవరాలు ప్లేటులో చపాతీలు, కూర, గ్లాసుతో మజ్జిగ పట్టుకొచ్చింది. ఉదయం నుంచీ ఖాళీ కడుపుతో ఉన్నా కేశవరావుకు ఆకలి వేయలేదు. దాహంగా అనిపించి మనవరాలు తెచ్చిన మజ్జిగ త్రాగి పడుకున్నాడు. మగతనిద్ర. ఏవో కలలు. తను అగాధంలో కూరుకుపోతోన్నట్టు. తన చెయ్యి పైకి చాపుతున్నా ఎవరూ తనని బైటికి లాగటం లేదు! ఈ కలతో మరింత కల్లోలానికి గురయ్యాడు.

ఉదయం లేచిన భార్య కేశవరావు దగ్గరకు వచ్చి చూసింది. ఇంకా పడుకునే ఉన్నాడు. 'ఏవండీ... ఏవండీ' అని పిలిచినా, కళ్లు తెరచి చూసి నవ్వాడే తప్ప, నోట్లోంచి ఏ మాటా లేదు. మరో రోజు గడిచింది. ఆ ఇంట్లోవాళ్లకి భయంవేసింది కేశవరావును చూసి. తనకు నచ్చిన తను ఎప్పుడో చదివిన ఆ కవిత మాత్రం మనసులో నెమరువేసుకుంటాడు.

'జరిగినదంతా చూస్తూ ఏమీ
ఎరగనట్టు పడి ఉండక
సాక్షీభూతుడ్ని కాను సాక్షాత్తూ
మానవుడిని'

ఈ పద్యం పదే పదే గుర్తుకొస్తోంది అతనికి. ఎప్పుడూ ఉదయమే లేచి, గడ్డం గీసుకుని, స్నానం చేసే కేశవరావు తర్వాతి రోజు మాసిన గడ్డంతో కనిపించాడు. ఎంత రెట్టించినా మాట్లాడకపోవడంతో మరింత భయం వేసింది ఇంట్లో అందరికీ. ఇంటిల్లిపాదీ వచ్చి అతని కాళ్లమీద పడ్డారు.

''అయ్యో మిమ్మల్ని మీ పుట్టినరోజునాడే అవమానం చేశాము. మమ్మల్ని క్షమించండి. మీరు చాలా బాధపడ్డారని అర్థమైంది'' అంటూ కళ్లనీళ్లు పెట్టుకున్నారు.

అయినా కేశవరావులో మార్పు లేదు. ఏమీ అడగడు. ఏమీ తినడు.

కూతురు తీసుకొచ్చి ముద్దలు కలిపి పెడుతుంది. మంచినీళ్లు తాగిస్తుంది. అంతే!
అతడి స్నేహితులు, బంధువులు వచ్చి పలకరించినా శూన్యంలోకి చూస్తూ ఉంటాడు. 'పిచ్చెక్కిందేమో! మెంటల్ డాక్టర్‌కు చూపించండి' అన్నారెవరో. రెండు రోజుల తర్వాత కేశవరావును ఆ ఊళ్లోని ఒక కార్పొరేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అందులో డాక్టర్ తెలిసినవాడే. ముప్పయ్ ఏళ్లుగా వారికి ఫ్యామిలీ డాక్టర్. ఆయన ఆసుపత్రిలోని మానసిక వైద్య నిపుణుడికి చూపించాడు. ఆయన ఏవో పరీక్షలు చేశాడు. మందులు రాశాడు. కేశవరావు గురించి మొత్తం తెలిసిన వారి ఫ్యామిలీ డాక్టర్ ఒక మాట అనేశాడు.

''కేశవరావు గారి గురించి నాకు తెలుసు కదా. ఆయన రిటైర్‌మెంట్ అయిన రోజున పేపర్‌లో ఆయన గురించి మరికొంత చదివాను. 'సాక్షాత్తూ మానవుడు!' అంటూ రాశారు. అవును. ప్రతీ మనిషికి కొద్దిగా మంచితనం, కొంచెం స్వార్థం, కాస్త ప్రేమ, మరికొంత ద్వేషం ` ఇలా సమపాళ్లలో ఉంటాయి. ఇలా కేశవరావులాగ సంపూర్ణ మానవత్వం ఉన్నవాళ్లు ఈ సమాజంలో బ్రతకలేరు. వాళ్లు పిచ్చివాళ్లుగా మిగిలిపోతారేమో ఇలా!'' అంటూ దిగులుగా చూశాడు.

ఆ మాటలకు భార్యతో పాటు కొడుకు, కోడలు కూడా ఏడ్చారు.

కేశవరావు వారి వంక చూస్తూ చిన్నగా నవ్వాడు. ఆ నవ్వు మాత్రం అతని జీవితాంతం అతని పెదాల మీద ఉండిపోయింది. మాటలు కరువై మౌనాన్ని ఆశ్రయించాడు. అతని మౌనయాగం అంతిమగడియల వరకూ అలాగే కొనసాగింది.

★★★

ఈ నెల కథ

# కౌముది

మొదటి బహుమతి పొందిన కథ

కె. అమృత జ్యోత్స్న

పేపర్ అంటూ పేపర్ బాయ్ పేపర్ విసిరేసి వెళ్ళాడు .రోజు మాదిరి పేపర్ని చేతిలోకి తీసుకుంది వెన్నెల .కానీ అందులో వచ్చిన న్యూస్ 2023 కి గాను సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వేదాంత్ అల్లూరి అని ఉన్న వార్త మాత్రం వెన్నెలను రోజులాగా ఉంచలేదు. ఆ పేరు చదవగానే కాసేపు మది స్తంభించిపోయినట్లు అనిపించిందేమో పేపర్ పక్కన పెట్టేసి వంట గదిలోకి వెళ్ళింది .మళ్ళీ వెనక్కి వచ్చి అతను అతనేనా ?అని మనసులో అనుకుంటూ అతని గురించి ఏమైనా వ్రాసారా అని వార్త పూర్తిగా చదవడం మొదలు పెట్టింది. తనకు వచ్చిన సందేహం నిజమైంది అతను మరెవరో కాదు తనతో డిగ్రీ చదువుకున్న వేదాంత్ తను రాసిన 'కౌముది' అనే నవలకు తెలుగు సాహిత్యం కింద కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చిందని తెలుసుకుని వెన్నెల. ఆ వార్త చదవడం పూర్తయ్యాక డిగ్రీ రోజుల్లోకి తన మనసు వెళ్ళిపోయింది.

★★★★★★★★

'వేదాంత్  వేదాంత్ '. అంటూ తన తెలుగు మాస్టారు పరంధామయ్య గారు క్లాసులో హాజరు వేసే సమయానికి ,ప్రజెంట్ సార్ అంటూ క్లాసులోకి ప్రవేశించాడు వేదాంత్ . పరంధామయ్య మాస్టారు కోపంతో "ఏమయ్యా వేదాంతు !ఎప్పుడు లేటేనా చదువులో ముందు ఉంటే సరిపోదయ్యా అటెండెన్స్ లోను ఉండాలి" అంటూ ఉండగానే ,వేదాంత దానికి సారీ సార్ మీకు తెలియందేమీ కాదు మా పల్లె నుంచి ఈ టౌన్ కి బస్సు లేటుగా రావడంతో రోజు ఇలా లేటుగా వస్తున్నాను సార్ అంటూ వివరణ ఇచ్చుకున్నాడు వేదాంత్.  తప్పు నీది కాదంటావ్ అయితే ఆర్టీసీ వాళ్ళతో మాట్లాడి నీకు ఆ రవికి ఒక బస్సు వేస్తాములే అన్న పరంధామయ్య మాస్టారు మాటలకి క్లాస్ మొత్తం నవ్వుల మయం. గాబరాగా రావడం వల్ల తనకు పట్టిన చెమటలు తుడుచుకుంటూ క్లాసులోకి వచ్చి తన స్థానంలో కూర్చున్నాడు వేదాంత్ .తన డిగ్రీ రోజుల్లో తన క్లాసులో వాళ్లంతా ఎంతో స్నేహంగా ఉండేవాళ్లు వేదాంత్ తో పాటు రవి ఇద్దరు ఎక్కువగా లేటుగా రావడం వల్ల వాళ్లకు పుస్తకాలు ఇవ్వడం ,జరిగిన క్లాసుల గురించి చర్చించుకోవడం, అసంపూర్ణంగా మిగిలిపోయినవి వ్రాసి ఇవ్వడం చేస్తూ ఇలా ఎంతో సరదాగా గడిచిపోయాయి ఆ డిగ్రీ రోజులు అనుకుంది వెన్నెల .

అది డిగ్రీ చివరి రోజు. కాలేజీలో జరుగుతున్న వార్షికోత్సవానికి పసుపు రంగు చీర కట్టుకొని వెళ్ళింది వెన్నెల ఎప్పుడూ చుడీదార్లు కనిపించే వెన్నెల కొంచెం బెరుకుగా సిగ్గుపడుతూనే వెళ్ళింది. నువ్వు చీరలో అచ్చం మహాలక్ష్మి లాగా ఉన్నావు అంటూ కితాబు ఇచ్చాడు వేదాంత్.  ఆ మాటలకి సంతోషంతో నవ్వుతూ ఉన్న వెన్నెల దగ్గరకు వచ్చి మనం విడిపోతున్నాం కదా నీకు బాధగా లేదా అని అడిగాడు వేదాంత్.  దానికి వెన్నెల అవును మరి మనం ఎంత స్నేహంగా ఉన్నాము ఈ ఒక్కరోజుతో విడిపోతామంటే మరీ నిన్ను ,రవిని,జయాన్ని ,లక్ష్మిని వదిలి వెళ్లాలంటే బాధగానే ఉంది మరి. డిగ్రీ అయింది కదా ఆ తర్వాత ఏం చేయాలనుకుంటున్నావని వేదాంత్  వెన్నెలను అడిగాడు. దానికి వెన్నెల "ఏ తల్లిదండ్రులైనా మగవాళ్ళకి 20 ఏళ్లు వస్తే ఉద్యోగం గురించి ఆలోచించమంటారు ,మాకు అలా కాదుగా మాకు 20ఏళ్ళు వస్తే ఉద్యోగం లేదా పై చదువు గురించా ఆలోచించమంటారు అయ్యో రామ ఇక పెళ్లి గురించేగా ఆలోచిస్తారు అంటూ నిష్టుర పోయింది వెన్నెల. ఆ పెళ్లి నన్ను ఎందుకు చేసుకోకూడదు అని టక్కున మనసులో మాట చెప్పిన వేదాంత్ ని కాసేపు అలా చూస్తూ ఉండిపోయింది వెన్నెల.

దానికి వెన్నెల సమాధానం దాటవేస్తూ నువ్వేం అవ్వాలనుకుంటున్నావో ?అని అడిగింది వేదాంత్  ని .దానికి వేదాంత్  తనకు సాహిత్యం పైన ఆసక్తి ఉందని కవితలు, రచనలు చేసి మంచి పేరు తెచ్చుకోవాలని అనుకుంటున్నాను అని చెప్పాడు .దానికి వెన్నెలకు నవ్వు ఆగలేదు "ఏంటి ,ఈ కంప్యూటర్ యుగంలో నీ కథలు నవలలు చదివే ఓపిక ఎవరికైనా ఉందంటావా ?అని అడుగుతూనే పనిచేయడానికి ఎన్నో మార్గాలు ఉంటే ఏంటి వేదాంత్  ఇది ఎంచుకున్నాడు అని ఇతనికి జీవితం పైన సరైన లక్ష్యం లేదనుకుంటూ !అని మనసులో అనుకుంది వెన్నెల .సరే వేదాంత్ " నేను ఇంటికి వెళ్ళాలి "అంటూ లేచి వెళుతుండగా వెన్నెల చేయి పట్టుకొని, ఆగువెన్నెల మరి నేను అడిగిన దాని గురించి ఏమి సమాధానం చెప్పలేదు? అని అడిగాడు .నాకు కొంత సమయం కావాలి అంటూ వెన్నెల చెప్పి వెళ్ళబోతున్నావా ?సరే వెన్నెల రేపు కలుద్దామా ?అది ఎక్కడంటే మనం ఎప్పుడు ఫ్రెండ్స్ తో కిట్టి పార్టీలు చేసుకుంటామే ఆ అమృత కేఫ్ కి వస్తావా ?నేను నీకోసం సాయంకాలం ఐదు గంటలకు ఎదురుచూస్తూ ఉంటా అని చెప్పాడు వేదాంత్.  'సరే' అని వెన్నెల ముక్తసరిగా సమాధానం చెప్పి ఇంటికి వెళ్లినా కూడా మనసు అంతా వేదాంత గురించే ఆలోచన వేదాంత మంచోడే కానీ సరైన లక్ష్యం లేదేమో అని తన కలని నిజం చేసుకోగలడో లేదో అని అనేక ప్రశ్నలు ఉక్కిరిబిక్కిరి చేశాయి వెన్నెలని.

అదే రోజు సాయంత్రం. వెన్నెలకు పెళ్లి చూపులు ఏర్పాటు

చేశారు తన మామయ్య తండ్రి చిన్నప్పుడే చనిపోవడంతో తనఅమ్మకు చేదోడు వాదోడుగా ఉండే మామయ్య మాటను కాదన లేకపోయింది వెన్నెల అబ్బాయి పేరు రాజీవ్ అనీ,హైదరాబాదులో సాఫ్ట్వేర్ ఇంజనీరు అని ,తల్లిదండ్రులకు ఒక గాని ఒక కొడుకుని అమ్మ ద్వారా అన్ని వివరాలు తెలుసుకుంది వెన్నెల .వేదాంత రమ్మన్న రోజే పెళ్లి చూపులు ఏర్పాటు జరగడం యాదృచ్ఛికమే అయినా పెళ్ళి చూపులకి తలవంచింది వెన్నెల. పెళ్ళికొడుకు తరుపున వాళ్లకు నచ్చడంతో వాళ్ళ అభిప్రాయం చెప్పి వెళ్లిపోయారు అలా పెళ్లి జరిగిందని తలుచుకుంటూ అత్తగారింట్లో వాలు కుర్చీలో కూర్చొని ఆలోచిస్తూ ఉండగా 'ట్రింగ్ ' _ _ _'ట్రింగ్ 'అనే ఫోను రావడంతో ఈ లోకంలోకి వచ్చింది వెన్నెల .ఎవరబ్బా ?అని ఫోన్ చూడగా తన అమ్మ చేసింది అని గ్రహించి వెన్నెల. ఏం చేస్తున్నావురా ?అల్లుడు అమెరికా నుంచి ఫోన్ చేశాడా ?అనే ప్రశ్నల వర్షం కురిపించింది వెన్నెల అమ్మ .హైదరాబాదులో ఉద్యోగం అయిన కంపెనీ తరఫున ఆరు నెలలు అమెరికాలో ఉండాలని వారం కిందటే అమెరికాకి వెళ్ళాడు రాజీవ్. మళ్ళీ అమ్మ వెంటనే పెళ్లి అయ్యి సంవత్సరం అవుతున్న నీ కడుపున ఒక కాయ అయినా కాయలేదే అదే బాధగా ఉందమ్మా 'అంటూ మాటలు పూర్తి కాకముందే టక్కున ఫోన్ కట్ చేసింది వెన్నెల.

ట్రింగ్' ట్రింగ్ 'మని మళ్లీ ఫోను తీరా చూస్తే మళ్ళీ అమ్మే ఫోన్ చేసింది అని గ్రహించిన వెన్నెల ఫోన్ తీసుకొని సరే అమ్మ నాకు వంట గదిలో పనుంది ఫోన్ కట్ చేయబోతుంటే" అమ్మా, వెన్నెల నీకు ఒక ముఖ్య విషయం చెప్పాలి .నిన్న వేదాంత్ మన ఇంటికి వచ్చి ఒక పుస్తకం ,ఇన్విటేషన్ కార్డు ఇచ్చి వెళ్ళాడు. నీకు ఇవ్వమన్నాడమ్మా ఇక్కడ మన ఊర్లో వాసవి క్లబ్ లో సన్మానం ఉందట. నీకు మరీ మరీ చెప్పమన్నాడు అని చెప్పి అమ్మ ఫోన్ పెట్టిన తన మనసు' వేదాంత్ ' అన్నమాట దగ్గరే ఆగిపోయింది. తన అమ్మకు వేదాంత్ గురించి ఆ పెళ్లిచూపుల రోజే చెప్పింది వెన్నెల .వేదాంత్, వెన్నెల ఈ పేర్లు వలన పరీక్షల్లో పక్క పక్కనే వచ్చేవి కాబట్టి తనకు వేదాంత్ ఎంతో సహాయం చేశాడని తను లేకపోతే తనకు డిగ్రీ కూడా పాస్ అయ్యేది కాదేమో అనుకుంటూ ఉండగానే, తను ఎప్పుడు ఏవో పిచ్చి గీతలు రాసుకుంటూ ఉండేవాడని ఇవేమైనా తిండి పెడతాయా? అని ఎన్నోసార్లు చెప్పి చూశానని తను మారడని అర్థమైందని ఇంతలో ఇలా పెళ్లి చూపులు ఏర్పాటు కావడం తనను ఇష్టపడుతున్నాడని చెప్పిన వేదాంత్ కంటే బాగా స్థిరపడిన రాజీవ్ వైపే మనసు వెళుతోందని అమ్మకు చెప్పుకొచ్చింది వెన్నెల .దానికి వాళ్ళ అమ్మ మనం ఎవరినైనా ప్రేమించగలం కానీ మనల్ని ప్రేమించే వాళ్ళు దొరకడం చాలా అరుదు .ఆ వేదాంతు

జీవితాంతం ప్రేమిస్తాడు ,నీ చెయ్యి వదలడు అని నీకు అనిపిస్తే మామయ్యతో నేను మాట్లాడతా అని తనకు ఎటువంటి అభ్యంతరం లేదని అమ్మ చెప్పినప్పటికీ వెన్నెల మాత్రం మామయ్య తెచ్చిన సంబంధానికే తలొంచా అనుకుంటూ మళ్లీ ఆ పెళ్లి చూపుల రోజుల సంఘటనను గుర్తు చేసుకుంది వెన్నెల. మళ్లీ వేదాంత్ గురించి ఆలోచనలు మొదలయ్యాయి వెన్నెలకి. అతను ఏ పుస్తకం రాశాడో ?ఏమి రాశాడో? కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చిందంటే అందులో ఏముంటుందో ?ఆలోచనలన్నీ దాని వైపే తిరగసాగాయి వెన్నెలకి .వెంటనే తన భర్తకి ఫోన్ చేసి అమ్మగారింటికి వెళ్ళాలని అనుకుంటున్నాను అని అడగగా, అమ్మా నాన్నకి చెప్పి వెళ్ళమన్నాడు రాజీవ్. అత్త మామయ్య లకు చెప్పి వెంటనే అమ్మగారింటికి బయలుదేరింది వెన్నెల.

★★★★★★★★

మదనపల్లె బస్టాండుకు చేరుకొని ఆటోలో ఇంటికి వెళ్లే దారిలో తన కాలేజీ ,కేఫ్ చూసుకుంటూ ఇల్లు చేరింది వెన్నెల. కాళ్లు చేతులు కడుక్కొని రామ్మా నీకోసం ఉగ్గాని చేశాను, కాస్త ఎంగిలి పడుదువు అనే అమ్మ చెప్పే మాటలను వింటూనే, సరే కానీ అమ్మ !ఆ వేదాంత్ తెచ్చిన పుస్తకం ఏది అంటూ ఆ పుస్తకం పై వెతుకులాట మొదలెట్టింది ఆ ఇంట్లో వెన్నెల.

అమ్మ తెచ్చిన ఆ పుస్తకం చేతిలోకి తీసుకున్నాక ముందుగానే ఆ

పుస్తకం పేరు మరో మారో చదివింది వెన్నెల. ఆపేరే “కౌముది”. ఇదివరకే వార్తాపత్రికలో వచ్చింది .ఈ నవల పేరు' కౌముది ' అంటే వెన్నెల అని అర్థం వస్తుంది .తన మనసు ఎందుకో తనని గుర్తు చేసుకుని ఈ వేదాంత్ ఈ కథ రాశాడేమో !అనిపించింది వెన్నెలకు .ఒక్క రోజులో వదలకుండా అశాంతం పూర్తిగా చదివింది వెన్నెల .ఎంత బాగా రాశాడో తల్లిదండ్రులు లేకుండా పెరిగిన ఓ అనాధ కౌముది. తను ఎలా ఎదిగింది ఎలా మంచి స్థాయికి చేరింది ,ఎన్ని అవమానాలు ఎదుర్కొంది ,ఉద్యోగంలోనూ అవమానాలు ఎదుర్కొన్న ఆత్మహత్యకు పాల్పడకుండా ఆత్మస్థైర్యంతో ఎలా ధైర్యంగా నిలదొక్కుతుందో అని కౌముది అనే ఆత్మ అభిమానం గల స్త్రీ గురించి ఎంత చక్కగా రాశాడో వేదాంత్ అని అనుకుంటూ అందుకే ఏమో అవార్డు తననే వెతుక్కుంటూ వచ్చింది అని తలుచుకుంటూ పుస్తకం మూసివేసి వేదాంత్ గురించి ఆలోచించడం మొదలుపెట్టింది వెన్నెల.

★★★★★★

“ నాతో కలిసి చదువుకున్నాడు కాబట్టి తన మనసు బాగా తెలుసు ఆడవాళ్ళ పట్ల తనకు ఎంత గౌరవం ఉంది ఎవరిని కించపరిచేలా మాట్లాడడు. తన ఆలోచనలు ఎప్పుడూ ఉన్నతంగానే ఉండేవి అందుకే ఏమో బహుశా ఇంత గొప్ప నవల అతని చే రాయబడింది” అనుకుంటూ తన మనసులో అనుకుంది వెన్నెల.

వేదాంత ఫంక్షన్ ఎప్పుడమ్మా?

రేపే .

ఎక్కడమ్మా?

వాసవి క్లబ్లో ..

మరుసటి రోజు రానే వచ్చింది మంచి పూల బొకే కొని వాసవి క్లబ్ కు బయలుదేరింది వెన్నెల. అప్పటికే ప్రోగ్రామ్ మొదలైంది .వెన్నెల పేరుతో రిజర్వ్ చేయబడ్డ సీట్లో కూర్చుంది వెన్నెల. వేదాంత్ గురించి అందరూ పొగుడుతూ ఉంటే అలా వందల మంది ప్రేక్షకుల్లో ఒక ప్రేక్షకురాలుగా చూస్తూ ఉండిపోయింది వెన్నెల .వేదాంత్ ఇప్పటికే రెండు సినిమా పాటలు రాశాడని ,ఇలా సినీ రచయితగా మంచి పేరు పొందాలని ,యుక్త వయసులోనే కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం నేటి యువతకు స్ఫూర్తిదాయకమంటూ, ఇలా ఎన్నో అవార్డులు భవిష్యత్తులో అందుకోవాలని కోరుతూ ఉంటే నా వేదాంత్ గొప్ప స్థాయికి వెళ్ళాడని సంతోషంతోపాటు ఇలాంటి వ్యక్తిని దూరం చేసుకోవడం అంతే బాధను కలిగించింది వెన్నెలకి .డబ్బుపై వ్యామోహంతో నేను వద్దనుకున్న వ్యక్తి స్టేజి పైన నేనేమో స్టేజి కింద. తను అంత గొప్ప స్థాయికి ఎదిగాడంటే తాను నమ్మిన కలపైన ,సాహిత్యం పైన పట్టు సాధించాడు అంటే తాను చేసిన కృషి ఏమిటో తెలుస్తోంది అనుకుంటూ ఒకప్పుడు “ తనను రచనలు చదివే వాళ్ళు ఉంటారా ?”అని హేళనగా నవ్విన వెన్నెల ఈనాడు చప్పట్లు కొట్టకుండా ఉండలేకపోయింది .అయినప్పటికీ ఆ పాత జ్ఞాపకాలు గుర్తుకు వచ్చి ఫంక్షన్ మధ్యలోనే లేచి వెళుతుండగా ,ఓ అబ్బాయి వచ్చి తన చేతికి ఒక పేపర్ ఇచ్చి వెళ్ళాడు.ఆ ఉత్తరం తెరిచి చూడగానే అర్థమైంది వెన్నెలకి. దాన్ని వేదాంత్ రాశాడని ,ఆ దస్తూరిని ఇప్పటికీ మర్చిపోలేదేమో ఆ వెన్నెల. తన ఫోన్ నెంబరు రాసి తను ఫంక్షన్ లో బిజీగా ఉన్నానని ,తర్వాత ఫోన్ చేయమని దాని సారాంశం. ఆ పేపరు చదివిన తర్వాత అక్కడి నుంచి ఇంటికి వెళ్ళింది వెన్నెల .

★★★★”””

అతనికి ఫోన్ చేయాలా ?వద్దా ?అంటూ రోజంతా ఆలోచిస్తూనే ఎట్టకేలకు రాత్రికి వేదాంత్ కి ఫోన్ చేసింది వెన్నెల. వేదాంత్ ఫోన్ తీయగానే ఎలా ఉన్నావ్ వేదాంత్?ఎక్కడ ఉంటున్నావ్? ఏం చేస్తున్నావ్? అని ప్రశ్నల వర్షం కురిపించిన వెన్నెలకి వేదాంత్ మాత్రం రేపు సాయంత్రం మనం చదువుకునే రోజుల్లో కిట్టి పార్టీలు చేసుకునే ఆ ‘అమృత కేఫ్’ కి వస్తావా అని అడిగాడు. దానికి సరే అని సమాధానం చెప్పింది వెన్నెల .ఎంతకు కలుద్దామని ?వెన్నెల అడిగేలోపు ,సాయంత్రం

ఐదు గంటలకు వస్తావా ?అని అడిగాడు వేదాంత్. ‘ సరే ‘అని చెప్పి ఫోన్ పెట్టినా ఆ రోజంతా నిద్ర పట్టనే లేదు వెన్నెలకి .తనతో ఏం మాట్లాడాలి? తను ఏం మాట్లాడతాడో? అని ఆలోచిస్తూ పడుకున్నది వెన్నెల.

★★★★★

తెల్లారింది.సాయంత్రం అయ్యే వరకు వెన్నెల మనసు కుదుటగానే లేదు .మహాలక్ష్మి లాగా ఉంటావని చెప్పిన పసుపు రంగు చీరనే కట్టుకొని సాయంత్రం నాలుగు గంటలకే అమృతాకేఫ్ కి చేరింది వెన్నెల. నాలుగు గంటల దాటి ఐదు గంటలు అయింది కానీ వేదాంత్ రాలేదు .ఉండబట్ట లేక ఫోన్ చేసింది వెన్నెల.

ఫోన్ తీసిన వేదాంత్ తాను వైజాగ్లో స్థిరపడ్డాడని అని రాకరాక సొంత ఊరికి వచ్చినందున బంధువులు ,స్నేహితులు ఇంటికి వచ్చి అభినందిస్తున్నారని కొంతసేపు వేచి ఉండు తొందరగా వచ్చేస్తానని చెప్పాడు. ఐదు దాటి ఆరు అయింది ,ఆరు కాస్తా ఏడయ్యింది.కానీ వేదాంత్ ఫోన్ చేయలేదు. ఫోన్ చేయడానికి మనస్కరించలేదు వెన్నెల కి. ఒకనాడు తనను ఎదురుచూసేలా చేసిన నాకు బుద్ధి చెప్పడానికి చేశాడా ? లేదా చుట్టాల వల్ల రాలేదో? అని ఆలోచిస్తుండగా, ఇంతలో బేరర్ వచ్చి” ఏం? మేడం ఎవరికోసమైనా ఎదురుచూస్తున్నారా ?అని వెన్నెల్ని అడిగాడు. దానికి వెన్నెల’ నేను పోగొట్టుకోవాల్సింది ఎప్పుడో పోగొట్టుకున్నాను ఇప్పుడు ఎంత ఎదురు చూసినా అది నాకు దొరకదు” అని అనుకుంది మేడం మిమ్మల్నే! అనే బేరర్ మళ్ళీ అడిగేసరికి అదేమీ లేదు లెండి అని చెప్పి వెంటనే లేచి ఇంటికి బయలుదేరింది వెన్నెల.

‘కౌముది’ అనే నవల పేరు చదవగానే తనను ఉద్దేశించి పెట్టాడేమో అనుకుంది కానీ డైరీ రాసే అలవాటు ఉన్న కౌముది చివరిలో “మనల్ని ఎవరైనా అవమానించినప్పుడు తనని తిరిగి అవమానించకూడదని ,వారి కన్నా ఒక మెట్టు పై స్థాయికి చేరుకోవడమే వారికి ఇచ్చి అసలైన అవమానమని “రాసుకుంటుంది. ఇప్పుడు అర్థమైంది వెన్నెలకు అది అచ్చంగా అతనికతే అది వేదాంత్ కథ అని అనుకుంటూ కళ్ళనిండా నీళ్లతో బరువెక్కిన హృదయంతో ఇంటికి దారి పట్టింది వెన్నెల.

★★★★

ఈ నెల కథ

## ఎవరు కారణం...?

రెండవ బహుమతి పొందిన కథ

ఎస్ . శ్రీనివాసరావు రావు

“విశ్వా..విశ్వా..కొంప మునిగిందిరా..నీ కూతురు దేదీప్యను పబ్ లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారట. పోలీసులు రైడ్ చేసేటప్పటికి పబ్ లో మిగిలిన పదిమందిలో మీ అమ్మాయి కూడ ఉందట. కొకైన్ ఎక్కువగా తీసుకోవడంతో స్పృహతప్పి పడిపోయి ఉందట. పోలీసులు ఆమెను ఆసుపత్రిలో చేర్పి ట్రీట్మెంట్ ఇప్పిస్తున్నారట. ఇప్పుడే కానిస్టేబుల్ రంగమార్తాండ ఫోను చేసి చెప్పాడు. విషయం మీడియాకు తెలిసేలోపే మనల్ని వచ్చి సర్కిల్ ఇన్స్పెక్టరుతో మాట్లాడమన్నాడు. పదరా వెళ్దాం” హడావుడిగా వచ్చి చెప్పాడు లాయర్ విశ్వనాథానికి అతని మిత్రుడు విఠలవర్మ.

చేతిలో వున్న ఫైలును టేబుల్ మీద జారవిడిచి “ఏందిరా నువ్వనేది? దేదీప్య పబ్ కు వెళ్ళడమేమిటి? అది రాత్రి దాని స్నేహితురాలితో కలిసి పెనమలూరు పెళ్ళికి వెళ్ళింది కదురా” అన్నాడు విశ్వనాథం.“ఏం జరిగింది..ఎలా జరిగింది..అన్న విషయాలను తరువాత తాపీగ చర్చించుకోవచ్చు. ముందు ఎఫ్.ఐ.ఆర్ తెరిచే లోపు మనం దేదీప్యను చేరుకోవాలి.

ఎలాగోలా ఇన్స్పెక్టరును బ్రతిమలాడి అమ్మాయి పేరును ఎఫ్.ఐ.ఆర్ లో లేకుండా చూడాలి" అని తొందరపెట్టి విశ్వనాథాన్ని కారులో ఎక్కించుకుని బయలుదేరాడు విఠలవర్మ. ఆఘమేఘాల మీద పోలీసు స్టేషనుకు చేరుకున్నారిద్దరూ. చేతిలో ఫైలును పరిశీలిస్తూ కూర్చుని ఉన్న సి.ఐ శాండిల్య,

విశ్వనాథను చూడగానే లేచి సెల్యూట్ చేసి "ఏంటి సార్.. మీరు ఇక్కడికి వచ్చారు. అప్పుడే విషయం మీదాక వచ్చి, ఎవరినైనా విడిపించడానికి బెయిలు తీసుకువచ్చారా?" కాస్త వ్యంగ్యాన్ని మేళవించి అడిగాడు.

"సర్..నిన్న పబ్ లో జరిగిన విషయానికి రిపోర్టు తయారుచేశారా?" అడిగాడు విఠలవర్మ.

"చేశాము సర్. అక్కడ మాదకద్రవ్యాల వినియోగం జరుగుతున్నదని మాకు తెలిసింది. వెంటనే రైడ్ చేశాము. అక్కడవున్న పదిమందిని అరెస్టు చేశాము. వారిలో నలుగురికి మత్తు విపరీతంగా తలకెక్కడంతో స్పృహ కోల్పోయి ఉన్నారు. వారిని ఆసుపత్రిలో చేర్చి రంగమార్తాండను కాపలా పెట్టి వచ్చాము. అందులో ఇద్దరు అమ్మాయిలు కూడ ఉన్నారు" అని చెపుతుండగా ఫోను మ్రోగింది.

"హలో" అన్నాడు శాండిల్య ఫోను తీసి. ఎదుటివారు ఏదో అడిగారు.

"సారీ సర్..మీరు బిజినెస్ మ్యాన్ అయినా, రాజకీయ నాయకుడైనా, నేను చేయగలిగింది ఏమీ లేదు. దొరికిన పదిమంది పేర్లు వ్రాసి ఎఫ్.ఐ.ఆర్ ఫైల్ చేశాను. అందులో మీరు అడిగిన పేరు కూడ ఉంది. మాదకద్రవ్యాల వినియోగ విషయంలో ఆఖరుకు తన కొడుకు దొరికినా విడిచిపెట్టవద్దని గట్టిగా చెప్పారు ముఖ్యమంత్రి గారు. నేను ఏమీ చేయలేను. క్షమించండి" అని మరో మాట వినకుండా ఫోను పెట్టేశాడు శాండిల్య.

మరల ఫోను మ్రోగింది. రిసీవర్ తీసి పక్కనబెట్టాడు.

"ఇక నుంచి వచ్చే ఫోనులన్నీ ఇవే సర్. బిడ్డలను కని రోడ్డు మీద వదిలేస్తారు. వాళ్ళు అచ్చోసిన ఆంబోతుల్లా ఊరి మీద పడి తిరుగుతుంటారు. అదేమంటే పిల్లలు స్వేచ్ఛగా పెరగాలంటారు. ఇలా కేసుల్లో ఇరుక్కుంటే లబోదిబో మంటారు. ఆడపిల్లలు కూడ పబ్బులకు వస్తున్నారు సర్. అదే మరింతగా బాధ పెడుతున్నది. సారీ సర్..నేనేదో చెప్పుకుపోతున్నాను. ఇంతకూ మీకు ఏంకావాలి?" అడిగాడు శాండిల్య.

"ఇన్స్పెక్టరు గారు..నేను ఎవరికోసమో రాలేదు. నా కూతురు దేదీప్య కోసం వచ్చాను. దయచేసి ఆమె పేరును మీ రిపోర్టు నుంచి తొలగించండి" ప్రాధేయపూర్వకంగా అడిగాడు విశ్వనాథ.

"ఏంటి సర్..మీరనేది. దేదీప్య మీ అమ్మాయా. అందరికంటే ఎక్కువ మత్తుపదార్థాన్ని తీసుకున్నది తనే. అందుకే మనలోకంలో లేకపోతే ఆసుపత్రిలో చేర్చి వచ్చాను. ముందు మీరు వెళ్ళి మీ అమ్మాయికి మంచి వైద్యం చేయించుకోండి సర్. వెళ్ళండి" విషయాన్ని బయటపెట్టాడు శాండిల్య.

"నాకు తెలిసింది ఇన్స్పెక్టర్ గారు. వెళతాను. వెళ్ళేముందు ఒక్కమాట. దయచేసి నా కూతురు పేరును రిపోర్టుల నుంచి తొలగించండి. లేకుంటే సమాజంలో నా పరువు పోతుంది. ఒక క్రిమినల్ లాయరు కూతురు మత్తుమందుకు బానిసయిందని మీడియాలో వస్తే నా రిపుటేషన్ దెబ్బతినడమే కాదు. దాని భవిష్యత్తు పాడవుతుంది" ప్రాధేయపడ్డాడు శాండిల్య.

"అందుకోసం మీకు ఎంత కావాలో చెప్పండి" అందుకున్నాడు విఠలరావు.

"సారీ సర్..మీరున్న పరిస్థితులలో మీతో కఠినంగా మాట్లాడడం మంచిది కాదు. రిపోర్టు తయారుచేసిన వెంటనే కాపీని కమీషనురు గారికి మెసేజి పెట్టాను. ఈపాటికి అది ముఖ్యమంత్రి గారికి కూడ చేరి ఉంటుంది. ఆయన మాదకద్రవ్యాల నియంత్రణ

మీద చాలా పట్టుదలతో ఉన్నారు. ఇందులో భాగస్తులయిన వారిని ఎవరినీ వదలవద్దు అన్నారు. ఈ పిల్లలను నిలదీస్తే తప్ప ఈ తతంగానికి సూత్రధారులు ఎవరో తెలియదు. పరిస్థితి నా చేయిదాటి పోయింది. నేనిప్పుడేమీ చెయ్యలేను" అని ఇక దయచేయండి అని చెప్పకనే చెప్పాడు శాండిల్య.

మౌనంగా వెనుదిరిగారు విశ్వనాథ, విఠలవర్మ.

★★★★★★★★

దేదీప్యకు స్పృహ వచ్చింది. జరిగిన విషయం తెలుసుకుని బాధపడింది. దేదీప్యను కేసు నుంచి తప్పించడం కోసం విశ్వనాథ చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. దేదీప్య దగ్గరికి భార్య సువిధతో సహా వచ్చాడు విశ్వనాథ.

"ఎలా ఉంది తల్లీ..మత్తు పూర్తిగా వదిలిందా"

"ఇప్పుడు బాగానే ఉంది డాడీ"

"నేను మొదటినుంచి మొత్తుకుంటూనే ఉన్నాను. దీనికంత స్వేచ్ఛ ఇవ్వొద్దు అని. మన పనులలో మనం బిజీ అయిపోతే, ఇది దానిపాటికది తిరగడం మొదలుపెట్టింది" చిర్రుబుర్రులాడింది సువిధ.

"చూడు..ఇక్కడ గొడవ చేయకు. ఉన్నది ఒక్కగానొక్క కూతురు. జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడు అనుకుని లాభం లేదు. ఎలాగైనా ఈ కేసు దాని మెడకు చుట్టుకోకుండా చూసుకోవాలి. చూడు తల్లీ..నేను చెప్పినట్లు చెయ్యి. రేపు కోర్టులో నిన్ను బోనులో నిలబెట్టి లాయరు ప్రశ్నలు అడిగేటప్పుడు, 'నాకేమీ తెలియదు, నా స్నేహితులు పార్టీ ఉందంటే వచ్చాను. నేను వారిచ్చిన డ్రింకు మాత్రమే తాగాను. అందులో ఏం కలిపారో నాకు తెలియదు. నాకు మత్తుగా అనిపిస్తే అక్కడే నిద్రపోయాను. కళ్ళు తెరిచేసరికి ఆసుపత్రిలో ఉన్నాను' అని మాత్రమే చెప్పు. ఎవరు గుచ్చిగుచ్చి అడిగినా 'తెలియదు' అన్న మాటమీదే ఉండు. ఆ తరువాత జరగవలసినదేమిటో నేను చూసుకుంటాను" ఆమె కోర్టుకు వచ్చినపుడు ఏంచేయాలో చెప్పాడు విశ్వనాథ.

"డాడీ..ప్రణవ్ ఎక్కడ ఉన్నాడు?" అడిగింది దేదీప్య.

"అతనెవరు" ఉలిక్కిపడి అడిగింది సువిధ.

"మేమిద్దరం కలిసే పబ్ కు వెళ్ళాం. అతను ఎవరూ లేని అనాథట డాడీ.. చాలా మంచివాడు" అని దేదీప్య చెబుతుండగానే అక్కడికి వచ్చాడు విఠలవర్మ.

"విశ్వనాథ..దేవుడి దయవల్ల దేదీప్యకు చాలా ప్రమాదం తప్పిందిరా. ఇప్పుడే కానిస్టేబుల్ రంగమార్తాండ చెప్పాడు. ఇదంతా శిశు సంక్షేమ శాఖా మంత్రి గోపాలం గారి మేనల్లుడు ప్రణవ్ పథకమట. అతనే దేదీప్యను తీసుకుని వచ్చాడట. ఇంతకుముందు కూడ రెండుసార్లు వచ్చారట పబ్ కు. ఈసారి మాత్రం దేదీప్యకు మత్తుమందు ఎక్కువగా ఇచ్చి ఆమెను అనుభవించాలని, అతని స్నేహితుడు లోకేశ్ తో కలిసి పథకం వేశాడట. దేదీప్యకు డ్రగ్స్ మత్తు బాగా ఎక్కిన తరువాత ఆమెను తీసుకుని గదిలోకి వెళ్ళే సమయంలో పోలీసులు పబ్ లోకి రావడంతో ఆమెను వదిలేసి వేరేదారి గుండా బయటకు వెళ్ళిపోయాడట. అరెస్టయిన వారిలో లోకేశ్ కూడ ఉన్నాడు. అతనే ఈ విషయాలు చెప్పాడట" చెప్పాడు విఠలవర్మ.

అతని మాటలు విని అక్కడికక్కడే కూలబడిపోయింది సువిధ. నోట మాటరాలేదు విశ్వనాథకు.

"అంకుల్..మీరు చెప్పేది నిజమా.. ప్రణవ్ అనాథ కాదా? నన్ను మోసం చేయడానికి ప్రయత్నించాడా? నమ్మలేక పోతున్నాను. నన్ను ప్రాణంగా ప్రేమించానని చెప్పాడు.. నేనే లోకం అన్నాడు. అంటే..అంతా మోసం..దగా.." చేతులలో ముఖం దాచుకుని ఏడుస్తున్నది దేదీప్య.

"ఆడపిల్ల బరితెగించి తిరుగుతుంటే పర్యవసానాలు ఇలాగే తగలబడతాయే. ఏ దేవుడో మాయందు ఉండి నిన్ను ఈ ఆపద నుంచి కాపాడాడు. లేకుంటే నువ్వు చేసిన పనికి మనమంతా కలిసి ఆత్మహత్య చేసుకోవలసి వచ్చేది" ఊగిపోతున్నది సువిధ.

ఒక్కసారి తలపైకెత్తి తల్లివైపు కోపంగా చూసింది దేదీప్య.

“అంతా నా తప్పేనా..ఇందులో మీ తప్పేమీ లేదా..” గట్టిగానే అడిగింది దేదీప్య.

“అవును మా తప్పుకూడ ఉందే. నీలాంటి బిడ్డకు జన్మనిచ్చామే అదే మా తప్పు. చేసిన ఛండాలపు పనికి తలవంచుకోక ఇంకా నిలదీస్తున్నది మనల్ని. చూశారా.. ఎలా తగలబడిందో మీ పెంపకం” గొంతు శృతి పెంచింది సువిధ, అది ఆసుపత్రి అన్న స్పృహను మరచి.

“ఆపండి ఇక. ఎలాగోలా గండం గడిచింది. అది చాలు. సువిధ.. ఇంటికి పద. రేపు ఉదయం పదిగంటలకు దేదీప్యను కోర్టుకు తీసుకువెళతారు. మనం కూడ రేపు కోర్టుకు వెళ్ళాలి” అని చెప్పి బయలుదేరాడు విశ్వనాథ. అతడిని అనుసరించారు సువిధ, విఠలవర్మ. ఒక నిట్టూర్పు విడిచి బెడ్ మీద వెనక్కు వాలింది దేదీప్య.

★★★★★

పోలీసులు సంపాదించిన ఆధారాల ప్రకారం పార్టీని నిర్వహించింది ప్రణవ్ అని తేలిందని, అక్కడికి వచ్చిన యువతీ, యువకులందరూ అతని ఆహ్వానం మేరకు ఆ పబ్ లో సమావేశమయ్యారని పబ్లిక్ ప్రాసిక్యూటరు చెప్పారు. అంతా విన్న న్యాయమూర్తి మాట్లాడుతూ,

“మిమ్మల్ని ఈ స్థితిలో చూస్తుంటే నాకు చాలా బాధగా అనిపిస్తున్నది. సమాజాన్ని ప్రక్షాళన చేయవలసిన యువతరం, ఇలా సిరలనిండా మత్తును నింపుకుని నిర్వీర్యమై పోవడమేమిటి? మీరు ఇలా తయారవడానికి కారణం ఎవరు? ఇది మీ స్వయంకృతమా? లేక స్నేహితుల ప్రోద్బలమా? ఎందుకు ఇలా జరుగుతుంది చెప్పండి. ఈ వాదోపవాదాలు కాదు. మీరు ఇలా తయారుకావడానికి మీరు చెప్పే కారణాలు ఏమిటో సభాముఖంగా చెప్పండి. మీ సమాధానాన్ని ఆధారం చేసుకునే నా తీర్పు..చెప్పండి” అని అక్కడ నిలుచున్న వారిని అడిగాడు. ఎవరూ పలుకలేదు. అందరూ మౌనం వహించారు. ఒక్క అయిదు నిముషాల పాటు అక్కడ మౌనం రాజ్యమేలింది. ఇంతలో ఒక స్వరపేటిక పురివిప్పింది.

“యువరానర్..నేను మీతో కొన్ని విషయాలు చెప్పాలనుకుంటున్నాను. దయచేసి అనుమతి ఇస్తారా?” అడిగింది దేదీప్య అక్కడి మౌనాన్ని ఛేదిస్తూ.

“గుడ్. చెప్పమ్మా.. వచ్చి బోనులో నిలబడి నువ్వేమి చెప్పదలుచుకుంటే అది చెప్పు” అన్నారు న్యాయమూర్తి. అందరిలా మౌనంగా ఉండకుండా మాట్లాడడానికి ముందుకు వచ్చిన కూతురు ఏంమాట్లాడి, ఏ బాంబు పేలుస్తుందోనని భయపడి పోతున్నాడు విశ్వనాథ.

“యువరానర్..నేనిలా మాట్లాడాలనుకోవడం తప్పో, ఒప్పో నాకు తెలియదు. ఇది కొన్ని సంవత్సరాలుగా నా గుండెల్లో రగులుతున్న వ్యథ. నేను నా తల్లిదండ్రులకు ఒక్కగానొక్క కూతురిని. విచ్చలవిడిగా ఖర్చుచేసినా తరగని ఆస్తిని మా నాన్నగారు లాయర్ విశ్వనాథం గారు సంపాదించారు, ఇంకా సంపాదిస్తున్నారు కూడ. నేను పుట్టిన తరువాత బాగ కలిసివచ్చిందని అనేవారు నాతో. నాకు ఊహ తెలియక ముందు ఎలా పెరిగానో నాకు తెలియదుగానీ, నాకు ఆరేళ్ళ వయసు నుంచి ఎలా పెరిగానో నాకు గుర్తే. అందరూ చదివే పాఠశాలలో కాకుండా అంతర్జాతీయ పాఠశాలలో, శీతలీకరణ గదులలో చదువుకున్నాను. అక్కడ చదువు తప్ప మరి ఏ ఇతర వ్యాపకాలు లేవు. ఇంట్లో కూడ నాది ప్రత్యేకమైన గది. అందులో నేను ఒక్కదాన్నే. నా చుట్టూ గోడల మీద రకరకాల బొమ్మలు. అలాగే ఆడుకోను కూడ నా గదినిండా బొమ్మలే. అంతేతప్ప మరో మనిషి అలికిడి ఉండేదికాదు. ఉదయాన ఆరు గంటలకు మా పనిమనిషి నన్ను నిద్రలేపి స్నానం చేయించి రెడీ చేస్తే, మా వంటమనిషి నాకు టిఫిన్ తినిపించేది. లంచ్ బాక్స్ తీసుకుని కారులో స్కూలుకు బయలుదేరుతుంటే,

అప్పుడు మా అమ్మ లేచి వచ్చి 'హాయ్ స్వీటీ..లెసన్ శ్రద్ధగా విను. బాగ చదువుకో. మీ నాన్నను మించిన లాయరు కావాలి నువ్వు' అంటూ ఒక ముద్దును నా బుగ్గకు బహుమతిగా ఇచ్చేది. సాయంత్రం వచ్చేసరికి మరల అదే పనిమనిషి, వంటమనిషి. స్నానం చేయించడం, భోజనం పెట్టడం, నిద్రపుచ్చడం. అమ్మ, నాన్న ఎప్పుడు వచ్చేవారో తెలియదు. సెలవులు వచ్చిన రోజు తప్ప, మిగతా రోజులలో వాళ్ళు కనిపించేవారు కాదు. కనిపించినా 'హాయ్ స్వీటి..ఎలా ఉన్నావురా? నీకేం కావాలన్నా అమ్మను అడుగు. అన్నీ కొనిపెడుతుంది. లాయర్ విశ్వనాథ కూతురంటే ఒక రేంజ్ ఉండాలి. తగ్గేదేలె... చూడు సువిధ. మా కొలీగ్స్ పిల్లలందరికి స్మార్ట్ ఫోను ఉంది. దానికి కూడ కొనివ్వు. చదువుతోపాటు ఎంజాయ్ మెంట్ కూడ ఉండాలి కదా మరి' అని చెప్పి నాకో హగ్ ఇచ్చి వెళ్ళిపోయేవారు మా నాన్న. అలా జీవితమంతా యాంత్రికమే తప్ప, మరోటి లేకుండా గడిచింది. వయసు వచ్చాక నాలో ఏదో వెలితి చోటు చేసుకుంది. పుస్తకాలు చదువుతున్నపుడు, యూట్యూబులలో చూస్తున్నపుడు తల్లిప్రేమ అనేది ఒకటి ఉంటుందని, దానికి ప్రత్యామ్నాయం ఉండదని, ఆ ప్రేమకు నోచుకున్నవారు అదృష్టవంతులని చెబుతుంటే, మరి మా అమ్మ నాకెందుకు ఆ ప్రేమను పంచడం లేదు అనిపించేది. తండ్రి వీపుమీద ఎక్కి ఆడుకునే పసిపాపలను, నాన్నతో కలిసి షాపింగుకు వెళ్ళే పిల్లలను చూసినపుడు, నేనేదో కోల్పోయాననే ఫీలింగ్ కలిగేది. వయసు పెరిగే కొద్దీ ఆ వెలితి కూడ పెరగసాగింది. నా మనసు ఏదో కావాలని, నన్ను నన్నుగా చూసే వ్యక్తులు కావాలని ఆరాటపడేది. సరిగ్గా అటువంటి మానసిక అస్తవ్యస్థ స్థితిలో ఉండగా ప్రణవ్ పరిచయమయ్యాడు. నాలో కొత్త మనిషిని నిద్రలేపాడు. నేనే లోకమంటూ తిరిగాడు. నా తల్లిదండ్రులు నాకు పంచని ప్రేమను, దగ్గరతనాన్ని నాకు రుచి చూపించాడు. మంచేదో, చెడేదో తెలియని వయసు, హద్దులేవో చెప్పని పెద్దరికం, నన్ను అతను ఎలాచెబితే అలా చేసేలా చేసింది. అతనితో కలిసి తిరిగాను. అతనితో నా స్నేహాన్ని ఇంట్లో చెప్పాలనుకున్నాను. కానీ వినే తీరిక, ఓపిక ఎవరికుంది సార్. నాన్నకు నాకోసం ఎంత కూడబెడదామా అని, అమ్మకేమో తనలోకం తప్ప, ఇతరుల గురించి పట్టదు. జాగ్రత్త అనేది ఆడవారి జన్యుకణాలలోనే ఉంటుందేమో..అదే నన్ను అతనికి లొంగకుండా కాపాడింది. ఈసారి కూడ ఎప్పటిలా అతను పార్టీ ఉందంటే వెళ్ళాను. కేవలం కూల్ డ్రింకు మాత్రమే త్రాగాను. ఘాటుగా అనిపించినా అతని సంతోషం కోసం త్రాగాను. తరువాత ఏం జరిగిందో నాకు తెలియదు. కళ్ళు తెరిచేసరికి ఆసుపత్రిలో ఉన్నాను. విఠలవర్మ అంకుల్ కు ఎవరో చెబితే తెలిసింది..ఈ పార్టీ ఏర్పాటు చేసింది ప్రణవ్ అని. ఇదంతా ప్రణవ్ ఆడిన నాటకమని, అతని ప్రేమ బూటకమని. నేను మరల మోసపోయాను సార్.

దేవుడు నన్ను పట్టించుకోని అమ్మ, నాన్నలను ఇచ్చి మోసం చేశాడు. ప్రణవ్ ప్రేమ నటించి మోసం చేశాడు. ఇంకా రాబోయే రోజులలో ఎంతమంది నన్ను ఎలా మోసం చేస్తారో.. అందుకే నన్ను జైలులో పెట్టండి సార్. అక్కడన్నా తోటి ఖైదీల నుంచి నాకు ప్రేమ దొరుకుతుందేమో. అమ్మ ఒడి తెలియదు, నాన్న మెడమీద ఎక్కి ఆడిన ఆనవాళ్ళు లేవు. పసితనంలో తోటివారితో కలిసి స్వేచ్ఛగా తిరిగి ఆడుకున్న దాఖలాలు లేవు. అంతా యాంత్రికం. ఈ దురదృష్టం నా ఒక్కదానిదే కాదు, ఈరోజుల్లో నాలాంటి ఎందరో పిల్లలది. పిల్లలను అందలం ఎక్కించాలని, విదేశాలకు పంపాలని తల్లిదండ్రులు వారు కష్టపడి, మమ్మల్ని కష్టపెడుతున్నారు. వారి కలలను మా కంటి వెనుక స్వప్నాలుగా మారుస్తున్నారు. ప్రేమను పంచవలసిన వయసులో మమ్మల్ని పాఠశాల అనే జైలులో పెట్టి ఒంటరివారిని చేస్తున్నారు. మాటలు రాని వయసు నుంచే మామీద వత్తిడి పెంచి పిచ్చివాళ్ళను చేస్తున్నారు. మనసు విప్పి చెప్పుకునే దారిలేకనే మేము దారి తప్పున్నామని అనిపిస్తున్నది. మేము ఇలా ఒంటరివాళ్ళమై, మత్తుమందులకు బానిసలమై, ఎదగవలసిన వయసులో వొరిగిపోతున్నామంటే ఎవరు కారణమో..మీరే చెప్పండి యువరానర్. మాకోసం ఎంత డబ్బు సంపాదించి పెట్టాలని ఆలోచించే తల్లిదండ్రులు తప్ప, మమ్మల్ని గుండెకు హత్తుకుని

లాలించి, చేయిపట్టి నడిపించి, మంచి, చెడులను తెలియజేసి, మాకు సంస్కారం నేర్పించే వారు ఎక్కడ? చెప్పండి యువరానర్" వెక్కి వెక్కి ఏడుస్తూ బోనులో కూలబడి పోయింది దేదీప్య.
వెంటనే జడ్జిగారు సువిధను పిలిచి దేదీప్యను తీసుకెళ్ళమన్నారు. సువిధ పరిగెత్తుకుంటూ వచ్చి దేదీప్యను, పోలీసుల సాయంతో లేపి తీసుకువెళ్ళి గ్యాలరీలో తన ప్రక్కన కూర్చోబెట్టుకుంది. తల్లి భుజంపై తలపెట్టుకుని అలాగే ఉండిపోయింది దేదీప్య.

"న్యాయవాదుల వాదోపవాదాల కంటే, దేదీప్య వేసిన ప్రశ్న, న్యాయమూర్తిగా ఉన్న నా స్థానానికి సవాలు విసురుతున్నది. ఈనాడు పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను సూటిగా, నిర్భయంగా చెప్పింది. ఏదో తెలియని వత్తిడితో నేటి యువతరం సతమతమవుతున్నది అన్నది వాస్తవం. కన్నవారు కాసుల వేటలో పడి పసిగుడ్లను కాన్వెంట్ల పాలు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇందులో తప్పు ఎవరిది అని తేల్చడం అంత సామాన్యమైన విషయం కాదు. దేదీప్య వేసిన ప్రశ్నకు సమాధానం చెప్పగలిగేది ఆ పిల్లల తల్లిదండ్రులే. యువతరాన్ని ఈ ఊబిలోకి లాగుతున్నది ఎవరో తేలాలంటే, ఈ మత్తుమందు ఉత్పత్తుల మూలం తెలియాలి. ఈ కేసును ఒక ఛాలెంజిగా తీసుకుని విచారించవలసినదిగా పోలీసులను ఆదేశిస్తున్నాను. న్యాయాన్ని కాపాడవలసిన బాధ్యతగల న్యాయవాదులు ప్రలోభాలకు లొంగక న్యాయంవైపు నిలబడతారని ఆశిస్తున్నాను. ఈ కేసులో ప్రధాన నిందితుడు మంత్రి గారి అల్లుడు ప్రణవ్ అని పోలీసులు సంపాదించిన ఫుటేజిల ద్వారా నిరూపణ అవుతున్నది. కానీ ఆ ఆధారాలు చాలవు. అసలు గంజాయి అక్కడికి ఎలా చేరుతున్నదో, దీని వెనుక ఎవరు ఉన్నారో తెలుసుకోవాలి. ముందు ప్రణవ్ ను అరెస్టు చేయండి. ఈ కేసు విషయం తేలేవరకు దోషులుగా ఉన్న ఈ యువతీ, యువకుల రక్షణ బాధ్యతను వారి తల్లిదండ్రులకు వదిలిపెడుతున్నాను. వారు వీరిపట్ల ఎలా ప్రవర్తించారో ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకోమని, తప్పుదిద్దుకోమని చెబుతున్నాను. దేదీప్యతో సహా ఇక్కడ పట్టుబడిన అందరినీ విడుదల చేస్తూ, ఎప్పుడు అవసరమైతే అప్పుడు వారిని పోలీసులకు అప్పగించవలసిన బాధ్యతను వారి తల్లిదండ్రులకు ఇస్తూ ఆదేశాలు జారీ చేస్తున్నాను" అని చెప్పి లేచి కోర్టును వాయిదా వేసి వెళ్ళారు న్యాయమూర్తి గారు.

తలదించుకుని గ్యాలరీ వైపుకు నడిచాడు విశ్వనాథ. కూతురు వేసిన ప్రశ్నలకు అతని వద్ద సమాధానం లేదు. లేచి తండ్రికి ఎదురు వెళ్ళింది దేదీప్య. దేదీప్యను గుండెకు హత్తుకుని కన్నీటి పర్యంతమయ్యాడు విశ్వనాథ. తండ్రి స్పర్శలో మాధుర్యాన్ని, అతని ఆప్యాయతను తొలిసారిగా అనుభవిస్తున్నది దేదీప్య. కూతురి తల నిమిరి నుదిటిని చుంబించాడు విశ్వనాథ. కూతురి చేతిని తన చేతిలోకి తీసుకుని ముద్దుపెట్టుకున్నది సువిధ.

"అమ్మా.. ఇటువంటి ప్రేమ కోసం ఇరవై మూడు సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నానమ్మా. చాలమ్మా..ఈ ఆనందం చాలు. నేను ప్రణవ్ ను ప్రేమించానే గానీ ఏ తప్పు చేయలేదు" అంటున్న దేదీప్యను గుండెలకు హత్తుకున్నది సువిధ.

"తప్పు చేశామమ్మా..మమ్మల్ని క్షమించు" అంటూ దేదీప్య తలమీద చెయ్యివేశాడు విశ్వనాథ.

దేదీప్య మనసు ఆనందంతో నిండి పోయింది.
★★★★

★★★★★★★★★★★★★★

సీరియల్

# మమతల తరంగాలు





పాండ్రంకిసుబ్రమణి

కాసేపట్లో కారు ఒక ప్రైవేటు ఆస్పత్రి ఆవరణలో ఆగింది. అక్కడున్న వీల్ స్ట్రెచర్లో భరద్వాజ్ ని ఎమర్జన్సీ వార్డు వేపు తీసుకెళ్ళి అడ్మిషన్ ఫార్మాలిటీస్ ముగించమని మాన్వితకు చెప్పి డ్యూటీ మెడికల్ ఆఫీసర్ సలహాతో ఇద్దరు నర్సులు పేషంట్ స్ట్రెచ్చర్ ని అందుకుని ఐసీయూ వార్డులోకి తీసుకువెళ్ళారు.జేవురించిన ముఖంతో గోడకు ఆనుకుని నిల్చున్న కామేశ్ వద్దకు వెళ్ళి అతడి చేతిని తన చేతుల్లోకి తీసుకుని స్వాంతనగా అంది మాన్విత– “ఇప్పటికి నథింగ్ టు వర్రీ కామేశ్!సమయానికి పేషంటు ని తీసుకొచ్చి గోల్డెన్ అవర్ లో చేర్పించామని డాక్టర్ భరోసా యిచ్చి వెళ్ళారు.రా——వచ్చి కూర్చో“అని అతణ్ణి వెయిటింగ్ రూము లో కూర్చోబెట్టి డ్రైవర్ తెచ్చిచ్చిన వాటర్ బాటల్ అందించింది. అతడు నిస్తేజంగా నోరు తడుపుకుని గిర్రున తిరుగుతూన్నసీలింగు ఫ్యాను వేపు తలెత్తి చూసాడు.అతడికి ఒకరు కాదు–ఇద్దరమ్మలు మనోనేత్రానికి గోచరించారు.

# ఫ్యామిలీ సీరియల్

**జరిగిన కథ**

శారద ,పూర్ణ చందర్ దంపతులు. శారదకు నాలుగు కాన్పుల్లో కుడా ఆడపిల్లలే పుట్టటం తో అత్త బద్రమ్మ సూటిపోటి మాటలతో ఇబ్బంది పెడుతూ ఉంటుంది . శారద తల్లి చంద్రావతి మనుమరాళ్ళను చూడటానికి వస్తే ఆమెను కూడా నానా రకాల మాటలతో ఇబ్బంది పెడుతుంది . శారద సహనం కలది కాబట్టి ఏ గొడవలు లేకుండా కాపురం నెట్టుకొస్తోంది .చాల రోజుల తరువాత శారద అన్నయ్య ఫోన్ చెయ్యటం తో శారద ఆనందానికి అవధులేకుండా పోతాయి .పూర్ణ చందర్ ఫాక్టరీలో స్ట్రైక్ చేయించాడని ఉద్యోగంలో నుండి తీసివేస్తారు .శారద అన్న వివేక్ ,శారద ఇద్దరు కూతుళ్ళను తన దగ్గర చదివించటానికి తీసుకువేళతాడు .వివేక్ స్నేహితుడు గణేష్ అతని భార్య చనిపోవటం తో అతని కూతురు ప్రశాంతిని ఇంటికి తీసుకువస్తాడు

**ఇక చదవండి**

థేంక్ గాడ్!మంచి పనయింది నాన్నను గోల్డెన్ అవర్ లో చేర్పించాడు.లేకపోతే యేమయి ఉండేదో!అతడికి తెలియకుండానే కళ్ళమ్మట నీరు కారుతూంది.

మరి కాసేపు తరవాత కామేశ్ కి డాక్టరు నుండి కబురందింది. అతడు మాన్వితతో బాటు దూసుకు వెళ్ళాడు.”పూర్తి గా చెకప్ చేసాం.గంట తరవాత మీ నాన్నగారిని జనరల్ వార్డులోకి మారుస్తున్నాం.మరో గంట తరవాత మీరు మీ నాన్నను డిశ్చార్జ్ చేసి తీసుకు వెళ్ళవచ్చు” ఆ మాట విన్నంతనే కామేశ్ యెంతటి రిలీఫ్ పొందాడంటే——చప్పున లేచి డాక్టరు రెండు చేతు లూ అందిపుచ్చుకుని కళ్ళకు హత్తుకున్నాడు.అతడంతటితో ఊరుకోలేదు.అక్కడ వైద్య సిబ్బంది చూస్తున్నారన్న విషయం కూడా మరచి ప్రక్కనున్న మాన్వితను కౌగలించుకున్నాడు–“థేంక్స్!మెనీ మెనీ థేంక్స్!నువ్వు గాని మెలకువతో మనకెందుకు లే అనుకోకుండా క్రిందకు దిగి గుంపులోకి వెళ్ళుండకపోతే–––“అతడికి ఆపైన మాటలు అందలేదు. మాన్విత అతడి ఆలింగనం నుండి విడిపించుకోవడానికి ప్రయత్నించలేదు.కళ్ళనుండి కారుతూన్న కన్నీటిని తుడుచుకోలేదు.భాషకు అందని మనోరాగం ఆమెను పెనవేసుకుంది.అతడి ఆలింగనంలో ఒదిగిపోయింది.

★★★

డిశ్చార్జయి ఇల్లు చేరిన తరవాత భరద్వాజ్ ని చూడటానికి మాతృమూర్తి మైనింగ్ కంపెనీ సీనియర్ మేనేజర్లు–కెంపెనీ పే–రోల్ లో ఉన్న చట్ట నిపుణులు కాళ్ళకు బలపం కట్టుకుని వచ్చారు.అతడి చిరకాల మిత్రుడు కాబోయే దగ్గరి బంధువు సూర్య వివేక్ భార్యతో బాటు వచ్చాడు.ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేయడం యేమాత్రం తగదని,నడుస్తూ నడుస్తూ పడిపోవ డం అంటే అది పరాకాష్ఠ కు చేరబోతూన్న రక్తపు పోటుకి ముందస్తు హెచ్చరికేనని,కొడుకు త్వరలో పెండ్లి పీటలపై కూర్చోబో తున్నా దన్నది మరచిపోకూడదని నిలదీసి వెళ్ళాడు.ఇంకా మైనింగ్ కంపెనీతో వ్యాపార సంబంధాలు గల నగర ప్రముఖులు కూడా పరామర్శించి వెళ్ళారు.ఇదంతా ఎటువంటి వెసులుబాటుకీ తావివ్వకుండా గమనిస్తూన్న మంగళకు ఇద్దరు మాత్రం కళ్ళకు అగుపించలేదు. వాళ్ళలో ఒకరు భరద్వాజ్ బామ్మర్ది భావేశ్––ఆమెకు తెలుసు భర్తతో ఆయనకు ఆదినుంచీ యెడబాటే నని––మరి తన ప్రియ సపత్ని పార్వతికేమయింది?ఈపాటికి పరుగుతో వచ్చి చేరాలి కదా!అందర్నీ ప్రక్కలకు తోసి హడావిడి చేస్తుండాలి కదా!రెక్కలు కట్టుకుని కదా వాలాలి!ఇద్దరి మధ్యా వ్యవహారం బెడిసికొట్టిందేమో––కామేశ్ చెల్లితో కలిసి తండ్రితోనేగా యెక్కువ కాలం ఉంటున్నాడు!తల్లికి కబురందివ్వ లేదా!లేక పార్వతి

ఊళ్ళో లేదా!

★★★

సాయంత్రం దాటింది. దీపాలు పెట్టె వేళ సమీపించింది,ఆ రోజు గుడిలో లింగోద్భవ పుణ్య ముహూర్తం కావటాన శివార్చన ఉదయం నుంచీ అవిశ్రాంతంగా సాగుతూంది.గగన గోపురానికి చేరేలా గుడి గంటలు మ్రోగుతూనే ఉన్నాయి.ఎక్కడో హిమాల య పర్వత శ్రేణుల్లో తపోధనులై సంచరించే నాగసాధువులు కొందరు యాగం చేయడానికి ఊరి శివాలయానికి వచ్చారని వింది మంగళ.ఆమె భర్త చెంతన కూర్చుని అలా పరిపరి విధాల ఆలోచిస్తున్నప్పుడు యింటి ముందు కారాగిన చప్పుడు వినిపించి ఆమె చప్పున లేచి లోపలకు వెళ్ళిపోయింది.ఆమె అప్పటికప్పుడు గురితప్పని రీతిన ఊహించగలిగింది ఆ వచ్చిందెవరో——పార్వతి అయుంటుంది.ఆమె అనుకున్నది సబబే——కామేశ్ యెదురొచ్చి తల్లిని భరద్వాజ్ గదిలోకి తీసుకెళ్ళి కూర్చోబెడ్తూ–"నేనలా వెళ్ళి కాసేపట్లో వస్తానమ్మా!మీరు మాట్లాడుతుండండి." అంటూ కదలబోయాడు.పార్వతి కొడుకుని ఆపింది."అనురాధ యేదీ?ఆఫీసుకి వెళ్ళిందా!"

"అబ్బే! అనురాధ యిక్కడే ఉంది. నాతోనే ఉంది.ఆఫీసుకి వెళ్ళలేదు. స్నానాలగదిలో ఉందేమో–– " అంటూ అక్కణ్ణించి కదలి వెళ్ళిపోయాడు. కొడుకెందుకు అలా ఆదరాబాదరాగా వెళ్ళిపోయాడో ఆమెకు తెలుసు;ఇద్దర్నీ ముఖాముఖి మనసు పొరలు విప్పి మాట్లాడుకోవడానికి వీలు కల్పించడానకే–– అతడలా వెళ్ళిపోయిన తరవాత ఆమె భరద్వాజ్ వేపు తిరిగింది."మీరిప్పుడు ఉద్వేగానికి లోను కాకూడదు.నీరసంగా కనిపిస్తున్నారు.ఎంత నీరసంగా ఉన్నారంటే–– అక్కడ మీరు తీస్తూన్న ఊపిరి నాకి క్కడకు వినిపిస్తూంది.ఇక విషయానికి వస్తాను,మాట్లాడకుండా నినండి. మీగురించి ముఖ్యంగా మీ మనస్తత్వం గురించి నాకు తెలుసు. ఎలాగంటే——మనం అందరిలా పెళ్ళి చేసుకోలేదు.మనసిచ్చి ప్రేమించి పెళ్ళి చేసుకున్నాం.ఇంకా చెప్పాలంటే——మీరు భావేశ్ లా రాటుదేలిన వ్యాపారస్థులు కారు.ఉద్వేగాల కుదుపులకు లోనవుతూ మనోరాగాల సమీరాలకు ప్రభావితులవుతూ మనుగడ చేసే మనిషి మీరు. అందుకే చెప్తున్నాను మీరెందుకు అనారోగ్యానికి లోనయి అలా నడిరోడ్డున పడిపోయారో నాకు తెలుసు.అంతెత్తు ఉద్వేగాలకు మీరే కాదు——ఎవరూ తట్టుకోలేరు. మీ విషయంలో అదే జరిగింది. ఇప్పుడు మీ కోసం–మీ కొడుకు మంచికోసం నేను విధించిన షరతు తిరిగి తీసుకుంటున్నాను. నానుండి డైవోర్స్ తీసుకోవడానికి మీరు కామేశ్ ని సంప్రదించ నవసరం లేదు.తిన్నగా లాయర్ నోటీసు పంపించండి.నా జవాబు అందుకున్న తరవాత డైవోర్సు పేపర్లు పంపించండి.నేను సంతకం చేసి పంపిస్తాను.జడ్జిగాని ఫ్యామిలీ కౌన్సలింగ్ కోసం పిలిస్తే నేను మీకు అనుకూలంగానే స్టేట్మెంట్ యిస్తాను. పొరపాటు నాది.తొందరపాటు నాది. ఫలితాన్ని నేనే అనుభవించాలి. ఎవడో యెక్కణ్ణించో మోర్ఫింగ్ చేసి వీడియో పిక్చర్ పంపిస్తే దానిని ముఖత: నమ్మి మిమ్మల్నీ అత్తయ్యనూ క్షోభకు లోను చేసి యేకంగా ఇంగ్లాడులో ఉన్న అన్నయ్య వద్దకు చెప్పాచెయ్యకుండా పరారి కావడం నేను జీవితంలో చేసి న పెద్ద పొరపాటు.నేను మాటిస్తున్నాను. విడాకులు ఫ్యామిలీ కోర్టు జారీ చేసిన మరుక్షణం మీరు కట్టిన పుస్తెల తాడుని మీకప్పగిస్తాను. చూసారా––నాకు తెలియకుండానే నా కళ్ళనుండి కన్నీరు యెలా కారుతుందో!" అంటూ పార్వతి లేచి కదలి గది బైటకు నడిచింది.ఆమె అలా నిష్క్రమించిన కొన్ని క్షణాల వ్యవధిలో అనురాధ వచ్చింది.తండ్రి వేపు సూటిగా చూస్తూ అంది "నేను రియర్ రూములో మీకోసం హార్లిక్స్ కలుపుతూ పెద్దమ్మ మాటలన్నీ విన్నాను నాన్నా! చిన్నదానిని,మీకు చెప్పేంత జ్ఞానం నాకు లేదు, ఐనా——మీ కన్నకూతురుగా రెండే రెండు మాటలు చెప్తాను,ఏది యెలా ఉండాలో మీరే నిర్ణయం తీసుకోండి.మీరెప్పుడు పెద్దమ్మ యింటికి వెళ్ళారు——అన్నయ్య జబ్బున పడ్డప్పుడు,అంతకు ముందు మిమ్మల్ని యెవరూ పెద్దమ్మ యింటికి రావద్దని ఆపలేదు. మీరుగా వెళ్ళ లేదు.అన్నయ్య కోసం వెళ్ళారు. అదే విధంగా––పెద్దమ్మ యెప్పుడు ఇక్కడకు వచ్చింది——మీరు మంచాన పడ్డప్పుడు.అంతకు ముందు

పెద్దమ్మగాని తానుగా మనింటికి వస్తే మీరెవరైనా ఆపగలరా!లేదు కదా! ఇక ఆఖరి మాట. మీకు పార్వతిగారు ఒకప్పటి ప్రియురాలు కావచ్చు.ఒకప్ప టి సతీమణి కావచ్చు. కాని——అన్నయ్యకు ఆమె కన్నతల్లి. కన్నతల్లికి మీరు డైవోర్సు యిచ్చిన తరవాత అన్నయ్య మళ్ళీ మనింటికి వస్తాడంటావా నాన్నా!మీకు కొడుకు లేకుండా పోడు గాని–మీకు దూరమైపోతాడు. నాకు మాత్రం అన్నయ్య లేకుండా పోతాడు.ఇలా జరగడం మీకు సమ్మతమైతే అలాగే చేయండి” అంటూ హార్లిక్స్ గ్లాసు తండ్రికి అందించి అక్కణ్ణించి కదలబోతూ యేదో గుర్తుకి వచ్చినట్టు చప్పున ఆగింది అనురాధ. ”అన్నయ్య అండ మీకే కాదు,ఆడపిల్లగా వాడి తోడు నాకూ కావాలి. మొన్నేమి జరిగిందో మీకిప్పుడు చెప్తాను. నాకు రెండు పెళ్ళి సంబంధాలు వచ్చాయి.ఒకటి కెనడా నుండి. మరొకటి యూ యస్ నుండి.రెంటికీ మీరూ అమ్మా ఉబ్బితబ్బిబ్బయి పోతూ బుర్రలూపారు. వాటిలో ఒక సంబంధానికి ఇన్స్టెంట్ కాఫీలా ఒప్పుదల ఇవ్వడానికి తీర్మానించేసారు. తాంబూలాలు పుచ్చుకోవడానికి సిద్ధమయిపోయారు. కాని అన్నయ్య అలా చేయలేదు.నన్ను కొన్నాళ్ళు ఆగమని చెప్పి తానుగా విదేశాలలో ఉన్న తనకు తెలిసిన సహధ్యాయులను సంప్రదించి రెంటినీ తిరస్కరించాడు. చివరకు మనకు దగ్గరగా ఉన్న తిరుపతి సంబంధం గురించి నాకు వివరించి నన్ను ఒప్పించాడు.ఔను——అన్నయ్య చెప్పింది నిజమే——కీడెంచి మేలెంచమన్నారుగా! తీరాలు దాటి నేనక్కడకు వెళ్ళిన తరవాత నాకు యిక్కట్లు యెదురైతే నాగోడు యెవరితో చెప్పుకోను? నా బ్రతుకు బుగ్గిపాలు ఐన తరవాతనా! అన్నయ్య ఉన్నాడు కాబట్టి నన్ను అద్దరికి పోనివ్వకుండా ఆపాడు.ఇక మీరు చివరి నిర్ణయం తీసుకోండి.“అనురాధ అక్కణ్ణించి కదలి వెళ్ళిపోయింది.

భరద్వాజ్ చేతిలో గ్లాసుతో మౌనంగా ఉండిపోయాడు. అతడికి అసంకల్పితంగా పురాణంలోని ఒక సంఘటన ఊహాజిని తంగా కళ్ళ ముందు మెదిలింది.నేలపైన సర్పం సర్రు సర్రున వెళ్ళిపోతూంది.పైనుండి గగన వీధినుండి గరుడు పలకరించాడు–“ఓ సర్పమా! క్షేమమేనా!” అని.అప్పుడు సాగుతూన్న సర్పం తలెత్తి కూడా చూడకుండా“ఎవరున్నచోట వారుంటే అందరూ క్షేమమే కదా!”అంటూ పుట్టలోకి తుర్రుమంది. ఇదే సూత్రం తనకూ తనను నమ్ముకున్నవారందరికీ అదే రీతిన వర్తిస్తుంది కదా!పార్వతి కట్టుకున్న గూటిని,ఇన్నాళ్ళూ కాపాడుతూ వస్తూన్న గుటిని తనెందుకు పనిగట్టుకుని చెదరగొట్టాలి? ఇంతమంది జీవ నదుల్ని తనెందుకు ఛిన్నాభిన్నం చేయాలి? చట్టపూర్వక అంశాలన్నీ జీవన మనుగడకు ఆసరాగా నిలువ లేవు కదా! ఎవరున్న చోట వాళ్ళుంటే,ఒకరి గుడారంలోకి మరొక రు చొరబడకుండా ఉంటే——అందరూ వాళ్ళ వాళ్ళ పరిధిలో గిరి గీసుకుని ఉంటే––అంతా బాగుగానే ఉంటుందేమో!ఆది నుంచి అంతం వరకూ మానవజీవితం అంతా ఒక క్లిష్ట తరమైన సమత్వస్థితిని సాధించాలన్ని నిరంతర ప్రక్రియకు ప్రతిరూపమేగా!

భరద్వాజ్ చేతిలోని హార్లిక్స్ గ్లాసుని అలాగే బిగ బట్టుకుని చలనరహితంగా కూర్చున్నాడు. మంగళాదేవి కన్నార్పకుండా చూస్తూ భర్తకు ఆసరాగా ప్రక్కన చోటు చేసుకుని కూర్చుంది.

(సమాప్తం )



సీరియల్

# యమపాశం

చోటు



జి .నరసింహ మూర్తి;

రెండు రోజుల్లో కేసు కోర్టులో వచ్చే ముందు అనంత్, ఇంకో ఎస్సై కలిసి భరద్వాజ దగ్గరకు వచ్చారు.

“భరద్వాజ గారూ! కేసు రెండు రోజుల్లో హియరింగ్ కి రాబోతోంది. అన్ని ఆయుధాలు సిద్ధం చేసుకోండి. ఎక్కడా వాదనల్లో తడబాటు ఉండకూడదు. ఎవరెవరు సాక్షులుగా రావాలో వారినందరినీ సమాయత్తం చెయ్యండి. మేము కూడా ఈ విషయంలో ఒక ఫైలు తయారు చేసాము” అంటూ ఒక ఫైల్ నిచ్చాడు.

“ఒక వరుస క్రమంలో అన్నీ పెట్టాను. ఎవరెవర్ని కలవాలో అందర్నీ కలిసాను. లెటజ్ హొప్ ఫర్ ది బెస్ట్...” అన్నాడు భరద్వాజ.

"ఈసారి పాముని కొట్టడానికి పెద్ద కర్రనే తెస్తున్నాడు వరుణ్ ప్రసాద్" అన్నాడు అనంత్... భరద్వాజకి అతని మాటలు అర్థం కాక "అంటే?" అని అడిగాడు.

"ఈసారి తన తరపున వాదనలు వినిపించటానికి దేశంలోనే ప్రముఖ న్యాయవాది, సుప్రీంకోర్టు లాయర్ అయిన అమరేంద్ర జైన్ హాజరవుతాడట... అతను ఒకప్పటి ప్రముఖ లాయర్ నానీ పాల్కీ వాలా శిష్యుడట. ఇతను ప్రత్యర్థి లాయర్లను తన వాదనా పటిమతో బురిడీ కొట్టించి కేసుని తారుమారు చెయ్యగల శక్తి ఉన్నవాడట. కాబట్టి మనం కొంచెం జాగ్రత్తగా వాదనలు వినిపించవలసిన అవసరం ఉంది" అన్నాడు అనంతరావు;

"బురిడీలు కొట్టించటం, నిజానిజాలను తారుమారు చెయ్యటం, తిమ్మిని బొమ్మి చెయ్యటం ఇవన్నీ చెప్పుకోవటానికీ బాగుంటుంది. కానీ వాస్తవంగా కష్టం... ఎంత పెద్ద న్యాయవాదైనా లేని వాటిని సృష్టించ లేడు... జరిగినదానిని కాదనజాలడు. నిజం నిప్పులాంటిది. దాన్ని ఎవ్వరూ దాచలేరు. దాచినా అది మరింత వేగంతో బయటకు వస్తుంది. మన వాదనల్లో నిజం ఉంటే వాదనా పటిమ కొంతవరకు ఉపయోగపడుతుంది. అంతే కాని మొత్తం కేసునే మార్చలేదు . కాబట్టి అతని గురించి ఆలోచించి బుర్రపాడు చేసుకోవడం వ్యర్థం" అన్నాడు భరద్వాజ.

"శత్రువు బలం ఏమిటో తెలిస్తే మన రణతంత్రాన్ని మార్చుకోవచ్చన్నది నా అభిప్రాయం... శత్రువు మన కన్నా బలవంతుడైతే అందు కనుగుణంగా మనం ఆయుధాలను ప్రయోగించాలి... ఇదే రణనీతి" అన్నాడు అనంతరావు;
భరద్వాజ అతని మాటలకు మౌనం దాల్చేడు... రెండు రోజుల తరువాత కోర్టులో వాదనలు మొదలయ్యాయి.

★★★

భరద్వాజకి కోర్టు ఆవరణలో వరుణ్ ప్రసాద్ ఎదురు పడ్డాడు...

"నమస్కారం భరద్వాజ గారూ! మొన్న నా తరపున వాదించడానికి ఒప్పుకున్నారు. ఇప్పుడేమో నాకు వ్యతిరేకంగా వాదించబోతున్నారు. ఇది నైతికత అనిపించుకుంటుందా?" అనీ వ్యంగ్యంగా అన్నాడు
.
"ముమ్మాటికీ నైతికతే వరుణ్... అందుకే నీ కేసు నుంచి తప్పుకున్నాను... నువ్వు అన్నీ దాచకుండా చెబుతాననీ చాలా విషయాలు చెప్పలేదు. అదేనా నీ నిబద్ధత... నేనెప్పుడూ నిజం కోసం, న్యాయం కోసం పోరాడతాను తప్పా వ్యక్తుల కోసం కాదు..." అన్నాడు భరద్వాజ.

"భరద్వాజా! కోట్లకు పడగలెత్తిన నాలాంటి సింహాన్ని ఎదుర్కోవడం అంత సులభం కాదు. నన్ను రక్షించడానికి, గెలిపించడానికి ఈ రోజు ఈ దేశంలోనే ఘనత వహించిన న్యాయవాదులొస్తున్నారు. వాళ్ళ ముందు నీవాదనలు వీగిపోక తప్పదు" అన్నాడు క్రీగంట చూస్తూ...

"గాలి అనుకూలిస్తే ఎంగిలి విస్తరాకు కూడా మేడ మీదకు చేరుకుంటుంది . కానీ ఎదురు గాలి వీస్తే అదే విస్తరాకు ఏ పెంటకుప్ప మీదనో పడుతుంది; అప్పనంగా నడిమంత్రపు సిరి వల్ల ఈ రోజు నీ దగ్గర డబ్బు ఉండొచ్చు... అంతమాత్రం చేత నువ్వు గెలుస్తావనీ విర్రవీగకు. డబ్బుతో దేన్నైనా కొనవచ్చు గానీ న్యాయాన్ని కొనలేవు... ఆ వాస్తవాన్ని కొద్ది రోజుల్లోనే తెలుసుకుంటావు" అన్నాడు భరద్వాజ కోపంగా.

"ఈ కేసు మనిద్దరికీ పందెం లాంటిది... చూద్దాం ఎవరు గెలుస్తారో... రాబోయే ఓటమిని ఎలా ఎదుర్కోవాలో ఆలోచించుకో భరద్వాజా..." అన్నాడు బొటనవేలు మీదకు చూపుతూ...
"గుడ్ లక్ వరుణ్... న్యాయం ఎటువైపు ఉందో కొద్ది రోజుల్లోనే తెలిసిపోతుంది... మండోకపనిషత్తు లో చెప్పినట్లు "సత్యమేవ జయతే. ట్రూత్ ఎలోన్ ట్రింప్స్" అంటూ కోర్టు వైపు కదిలాడు భరద్వాజ...

వరుణ్ ప్రసాద్ మాటలు అతన్ని కొద్దిగా బాధ పెట్టాయి. అయినా ముఖంలో ప్రశాంతతని తెచ్చుకొని చిరునవ్వుతో కోర్టులోకి ప్రవేశించాడు.

ఉదయం పదకొండు గంటలకు కు వాదనలు మొదలయ్యాయి.

ముందుగా భరద్వాజ పోలీసుల తరఫున తన వాదనలు వినిపించటం మొదలు పెట్టాడు...

"యువరానర్! గోపాలరావు ఈ జిల్లాకే కాకుండా రాష్ట్రంలో ఓ పెద్ద పారిశ్రామికవేత్త. చాలా నిజాయితీపరుడు... అతని ఏకైక కూతురు అనుష్క... చాలా తెలివైనది. విద్యావంతురాలు... వరుణ్ ప్రసాద్ ఆస్తికోసం ఆమె వెంటబడ్డాడు. ప్రేమ నటించాడు. నువ్వు లేకపోతే తన జీవితం వ్యర్థం అనీ ఆమెను నమ్మించాడు. చివరకు పెళ్ళికి ఒప్పించాడు. అలా ఆమెను పెళ్ళాడాడు. పెళ్ళైన దగ్గర్నుంచీ కంపెనీల మీద పెత్తనం చెలాయించడం మొదలు పెట్టాడు.

అల్లుడన్న గౌరవంతో గోపాలరావు వరుణ్ ని కొన్ని కంపెనీల్లో డైరెక్టర్ గా నియమించాడు. కానీ వరుణ్ ప్రసాద్ తిరుగుబోతు... తాగుబోతు... వ్యసనపరుడు... ఎంతో మంది అమ్మాయిలతో అతనికి అక్రమ సంబంధాలున్నాయి... వీటన్నిటి కోసం అతను ప్రతీ నెలా లక్షల్లో ఖర్చు పెడుతున్నట్లు ఇంటెలిజెన్స్ డిపార్టుమెంటు వాళ్ళు గోపాలరావుకి ఓ నివేదిక ఇచ్చారు. దాంతో గోపాలరావు మేల్కొని అతనికి తన అనుమతి లేనిదే ఒక్క పైసా కూడా ఇవ్వొద్దనీ తన ఆర్థిక శాఖని ఆదేశించాడు.

దాంతో వరుణ్ ఉక్కిరి బిక్కిరయ్యాడు. అప్పులవాళ్ళు అతని మీద వత్తిడి తేవడం మొదలు పెట్టారు...
పెళ్ళికి ముందే వరుణ్ కి మధుమాలిని అన్న అమ్మాయితో సంబంధం ఉంది. ఆమెను రహస్యంగా వివాహం కూడా చేసుకున్నాడు. అనుష్కతో పెళ్ళి విషయాన్ని ఆమె దగ్గర దాచి పెట్టాడు. ఆ విషయం తెలిసి మధుమాలిని అల్లరి చెయ్యపోతే త్వరలో అనుష్కని అడ్డు తొలగించుకొనీ నిన్ను నా భార్యగా స్వీకరిస్తాను అనీ ఆమెను నమ్మించాడు. ఈ విషయాన్ని మధుమాలిని స్వయంగా కోర్టులో చెప్పింది కూడా..."

భరద్వాజ వాదిస్తుంటే డిఫెన్స్ లాయర్ జైన్ చేతులెత్తాడు.

"అబ్జెక్షన్ యువరానర్" అన్నాడు.

జడ్జిగారు అతని వైపు తిరిగి "చెప్పండి" అన్నాడు.

"ఎవరినో తెచ్చి తన కనుకూలంగా సాక్ష్యం చెప్పిస్తే అబద్ధం నిజం అయిపోదు... మధుమాలిని కి నా క్లయింట్ వరుణ్ కి ఏవిధమైన సంబంధం లేదు అనీ కోర్టుకి విన్నవించుకుంటున్నాను... మాటలు కాదు సరియైన రుజువులు చూపాలి..." అనీ కూర్చున్నాడు.

మళ్ళీ భరద్వాజ చెప్పడం మొదలు పెట్టాడు.

"రాను రాను గోపాలరావుకి అల్లుడి ప్రవర్తన మీద అనుమానం వచ్చింది... అతన్ని తన కంపెనీల డైరెక్టర్ పదవి నుంచి తప్పించాడు.

అప్పుడు వరుణ్ ప్రసాద్ కి 'గోపాలరావు బతికి ఉన్నంత కాలం తన పప్పులు ఉడకవనీ అర్థం అయింది. అందుకే అతన్ని ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలనీ పథకం వేసాడు. ఒకరోజు సాయంత్రం కార్లో ఇంటికి వెళుతున్న గోపాలరావుని కారుకి ఏక్సిడెంట్ చేసి చంపించాడు వరుణ్..." అనీ భరద్వాజ చెబుతుండగానే డిఫెన్స్ లాయర్ జైన్ లేచి నిలబడి 'ఐ స్ట్రాంగ్లీ అబ్జెక్ట్ యువరానర్... నేను దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నాను... ముందు అనుష్కని నా క్లయింట్ హత్య చేసాడనీ అన్నారు. ఇప్పుడేమో గోపాలరావుని చంపాడంటునారు. పోలీసులు గోపాలరావుది హత్య కాదు, ప్రమాదంలో మరణించాడనీ తేల్చి కేసుని మూసివేసిన విషయం నా ఫ్రెండ్, డిఫెన్స్ లాయర్ కి తెలియదనుకుంటాను" అన్నాడు వ్యంగ్యంగా.

భరద్వాజ మళ్ళీ లేచి మొదలు పెట్టాడు.

"అన్నీ తెలుసు యువరానర్...

# క్రైం సీరియల్

ఇవన్నీ ఒకదానికొకటి సంబంధాలున్న విషయాలు... అనుష్క హత్యకి ముందు గోపాలరావుని ఎవ్వరికీ అనుమానం రాకుండా అడ్డు తొలగించుకున్నాడు; ఈ విషయంలో కోర్టువారు అనుమతిస్తే నేను ఒక ముఖ్యమైన సాక్షిని ప్రవేశ పెట్టాలనుకుంటున్నాను" అన్నాడు.

జడ్జిగారు అతని వైపు తిరిగి "పర్మిషన్ గ్రాంటెడ్; ప్రవేశ పెట్టండి" అన్నారు.

"పల్లవి అనే స్త్రీని కోర్టులో హాజరు పరచ వలసినదిగా కోర్టు వారిని కోరుతునాను" అని అడిగాడు. ఐదు నిముషాల తరువాత పల్లవి బోనులోకి వచ్చింది.

"మీ పేరు" ఆమెను ప్రశ్నించడం మొదలు పెట్టాడు భరద్వాజ.

" పల్లవి "

"ఏం చేస్తుంటారు"

"నేను ఒక ప్రైవేట్ సంస్థలో మేనేజర్ గా పనిచేస్తున్నాను;

"ఆరు నెలల క్రితం మే 10వ తారీఖున సాయంత్రం ఒక కారు ప్రమాదానికి గురైంది... దాని గురించి మీకు ఏమైనా తెలుసా"?

"ఆరోజు నేను ఆఫీసు పని మీద పక్క వూరు కారు లో వెళుతున్నప్పుడు బై పాస్ రోడ్డు దగ్గర దాని టైరు పంక్చర్ అయింది.దాన్ని డ్రైవర్ మారుస్తున్నప్పుడు నేను కిందకు దిగాను; అప్పుడు ఇద్దరు వ్యక్తులు ఏపీ 7777 కారు మీద కాల్పులు జరపడం వల్ల దాని ముందు టైరు పేలి పోయి వేగంగా డివైడర్ ని ఢీ కొనడం వల్ల ప్రమాదానికి గురై అందులోని వ్యక్తి డివైడర్ మీద పడి చనిపోయాడు..."

"ఆ కారు మీద కాల్పులు జరిపిన వ్యక్తుల్ని మీరు చూసారా? వాళ్ళని పోల్చగలరా?" ఆ తరువాత మీరు ఏం చేసారు?"

"కారు మీద కాల్పులు జరిపిన వ్యక్తులు ముప్పై ఏళ్ళ యువకులు. ఆ సమయంలో నేను రోడ్డు మీద వున్నాను; వాళ్ళని నేను దగ్గరగా చూసాను.వాళ్ళని చూస్తే నేను పోల్చగలను" అంది పల్లవి;

"మేడం! మీరు పోలీస్టేషన్లో ఫిర్యాదు చేసారా?"

"నేను వెంటనే పోలీస్ స్టేషన్ కి వెళ్ళి ఫిర్యాదు చేసాను."

భరద్వాజ తన దగ్గర ఉన్న డ్రాయింగ్ పేపర్లను ఆమెకు చూపించాడు. అందులో ఇద్దరు వ్యక్తుల ఫోటో ఉంది... ఇద్దరు గెడ్డాలతో ఉన్న యువకుల ఫోటో అది.

"మేడం! ఈ ఫోటో ఎవరిదో తెలుసా?"

"తెలుసు... ఇందులో ఉన్న వ్యక్తులే ఆ రోజు కారు మీద కాల్పులు జరిపారు. ఈ పెయింటింగ్ ని నేనే గీసి పోలీసులకు ఫిర్యాదు తో పాటు ఇచ్చాను" అంది ఆమె...

"ఒకే మేడం... మీరు వెళ్ళవచ్చు;" అనీ చెప్పగానే ఆమె బోను దిగి వెళ్ళిపోయింది.

"దట్సాల్ యువరానర్..." అన్నాడు భరద్వాజ.

"డిఫెన్స్ వారు ఆమెని ఏమైనా ప్రశ్నిస్తారా?" అని అడిగారు జడ్జిగారు.

జైన్ నిలబడి 'లేదు' అన్నాడు.

మళ్ళీ భరద్వాజ నిలబడ్డాడు.

"కోర్టువారు అనుమతిస్తే ఓ ముఖ్య సాక్షిని ప్రవేశ పెట్టాలనుకుంటున్నాను" అని జడ్జిని అడిగాడు.

"అనుమతించబడింది" అన్నారు జడ్జి.

"వెంకట్ అనే వ్యక్తిని ప్రవేశ పెట్టవలసిందిగా కోరడమైనది."

ఐదు నిముషాల తరువాత వెంకట్ ని బోనులోకి ప్రవేశ పెట్టారు. అతనికి నలభై ఏళ్ళుంటాయి. గుండు, ఎర్రటి బనియన్ వేసుకొని

ఉన్నాడు...

"మీ పేరు" భరద్వాజ ప్రశ్నించాడు.

"వెంకట్" అనీ చెప్పాడు.

"ఏం చేస్తుంటారు?"

"నేను సినిమా హాళ్ళ దగ్గర బ్లాక్ టికెట్స్ అమ్ముతుంటాను"

"బ్లాక్ టికెట్స్ అమ్మడం నేరం కదా?.. అది సరే... ఆరు నెలల క్రితం... అంటే క్రితం మే పదవ తారీఖునాడు మీరెక్కడ ఉన్నారు" అని అడిగాడు భరద్వాజ.

"ఆ రోజు ఒక కొత్త సినిమా రిలీజ్ అయింది. నేను ఆ సినిమా టిక్కెట్లను హీరో అభిమానులకు అమ్ముతుంటే నన్ను పోలీసులు అరెస్ట్ చేసి లాకప్పులో పెట్టారు. ఆ రోజు నేను ఈ పట్టణ పోలీసు స్టేషన్ లాకప్పులో ఉన్నాను" అనీ చెప్పాడు వెంకట్.

"ఓకే... ఈ ఫోటోలోని వ్యక్తుల్ని మీరెప్పుడైనా చూసారా?" అనీ ఒక డ్రాయింగ్ ని చూపించాడు.
అది ఇందాక పల్లవి కి చూపించిన డ్రాయింగే .. ఆమె గీసిన పఠాన్, దిలావర్ల ఫోటో అందులో ఉంది.
"చూసాను... వాళ్ళిద్దర్నీ నేను క్రితం మే 10వ తారీఖునాడు పోలీసు లాకప్పులో ఉన్నప్పుడు నా పక్క లాకప్పు గదిలో వాళ్ళిద్దర్నీ చూసాను. పొడవుగా, గెడ్డాలతో ఉన్నారు కాబట్టి వాళ్ళ గురించీ పోలీసుల్ని అడిగితే వాళ్ళు పఠాన్, దిలావర్ అన్న దొంగలు అనీ చెప్పారు" అన్నాడతను...

"మీరిక వెళ్ళ వచ్చు" అన్నాడు...

"దట్సాల్ యువరానర్" అన్నాడు భరద్వాజ.

"డిఫెన్స్ వారు ఏమైనా అతన్ని ప్రశ్నిస్తారా? ప్రశ్నించాడు జడ్జి.

"లేదు యువరానర్" అనీ కూర్చున్నాడు జైన్.

"కోర్టు వారి అనుమతిస్తే ఇంకొక ముఖ్యమైన సాక్షిని ప్రవేశ పెట్టాలనుకుంటున్నాను" అన్నాడు భరద్వాజ ;.
"ప్రవేశపెట్టడానికి అనుమతిస్తున్నాను" అన్నాడు జడ్జి.

"గోవర్ధన్ అనే వ్యక్తిని ప్రవేశ పెట్టాలనీ కోరుతున్నాను" అన్నాడు భరద్వాజ.

40 ఏళ్ళ వయసున్న నల్లటి వ్యక్తి బోనులోకి వచ్చాడు. ముఖానికి తెల్లటి కళ్ళజోడు, ఎర్రటి టీ షర్ట్ విచిత్రంగా ఉన్నాడు. భరద్వాజ అతన్ని ప్రశ్నించడం మొదలు పెట్టాడు.

మీ పేరు?"

"గోవర్ధన్"

"ఏం చేస్తుంటావు?"

"నేను పోలీసు ఇన్ఫార్మర్ గా పనిచేస్తుంటాను సార్..."

"అంటే ఏమిటి?"

"పోలీసులకు రహస్యాలను చేరవేస్తుంటాను;ఎవరైనా అనుమానితులుంటే పోలీసులకు చెబుతుంటాను" అన్నాడు గోవర్ధన్...

"గోవర్ధన్ ఈ ఫోటోలోని వ్యక్తులను ఎప్పుడైనా చూసావా?" అనీ పఠాన్, దిలావర్ల ఫోటోని చూపించాడు భరద్వాజ.

"చూసాను... 6 నెలల క్రితం ఒక కేసు విషయంలో వీళ్ళని పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ లాకప్పులో పెట్టారు. ఆరోజు ఏదో పనిమీద నేను స్టేషన్ కొచ్చినపుడు వాళ్ళిద్దర్నీ నేను చూసాను" అన్నాడు.
"వీళ్ళు అక్కడే ఉన్నారా? లేకపోతే పోలీసులు వాళ్ళని వదిలేసారా?"

"ఆ రోజు సాయంత్రం 6 గంటల దాకా నేనక్కడే ఉన్నాను. 6 గంటల సమయంలో ఎవరో ఓ డబ్బున్న బాబు ఖరీదైన కారులో స్టేషన్ కొచ్చారు. అతన్ని చూడగానే డ్యూటీలో ఉన్న ఎస్సై మురళీధర్ బాబు గారు లేచి వెళ్ళి లోపలికి తీసుకొచ్చారు." అన్నాడు గోవర్ధన్
.
"అతను ఏ కారులో వచ్చాడో దాని నెంబరు గుర్తుందా?"

"బాబూ... నేను స్టేషన్లో ఉన్నప్పుడు ఎవరైనా కారులో వస్తే వాళ్ళ పేరు, కారు నెంబర్లు నా ఈ పోకెట్ డైరీలో

# క్రైం సీరియల్

తేదీ, టైముతో సహా రాస్తాను. ఆ రోజు మే 10వ తారీఖు... సమయం 5.30 కారు నెం. ఎపి 3535 లో ఒక వ్యక్తి వచ్చాడు." అనీ దాన్ని చూసి చెప్పాడు.

"కారులో వచ్చిన వ్యక్తి పేరు తెలుసా?"

"ప్రయత్నించాను కానీ డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ శివరాం చెప్పలేదు" అన్నాడు గోవర్ధన్.

"ఆ కారులో వచ్చిన వ్యక్తిని గుర్తుపట్టగలవా?" అని అడిగాడు భరద్వాజ.

"గుర్తు పట్టగలను" అన్నాడు గోవర్ధన్.

"ఈ హాల్లో ఉన్న మనుషుల్లో ఆరోజు వచ్చిన వ్యక్తి ఉన్నాడా?" భరద్వాజ మళ్ళీ ప్రశ్నించాడు.

గోవర్ధన్ ఒక్కసారిగా హాలంతా పరిశీలించాడు; చూస్తుండగా అతని దృష్టిలో అక్కడే కూర్చొని వాదనలు వింటున్న వరుణ్ ప్రసాద్ పై అతని దృష్టి పడింది.

వెంటనే "సార్... ఆ తెల్లటి చొక్కా తొడుక్కున్న వ్యక్తే ఆరోజు స్టేషన్ కి 3535 కార్లో వచ్చాడు" అనీ వరుణ్ని చూపిస్తూ అన్నాడు.

"ఆ తరువాత ఏం జరిగింది?"

"అతను వచ్చి వెళ్లిన తరువాత కానిస్టేబుల్ శివరాం లాకప్పు తీసి పఠాన్, దిలావర్లను వదిలేసాడు... వాళ్ళిద్దరూ త్వరత్వరగా పరుగులు పెడుతూ బయటకు వెళ్ళిపోయారు" అనీ చెప్పాడు గోవర్ధన్.

"ప్లీజ్ నోట్ దిస్ పాయింట్ యువరానర్" అన్నాడు భరద్వాజ.

ఆ తరువాత అతను వెళ్ళిపోయాడు.

భరద్వాజ మళ్ళీ తన సీటు దగ్గరకు వచ్చి జడ్జిగారి వైపు తిరిగి వాదనలు ప్రారంభించాడు.

"యువరానర్... ఈ కేసు పూర్వాపరాల్లోకి వెళితే ఈ కేసులో ముద్దాయి వరుణ్ ప్రసాద్ తన భార్య అనుష్కని చంపడానికి ముందు తన మామగారిని చంపాలనీ పావులు కదిపాడు.

తన పలుకుబడితో పఠాన్, దిలావర్లనే రౌడీషీటర్లను ఓ కేసులో అరెస్ట్ చేయించి పోలీసు లాకప్పులో పెట్టించాడు. ఆ తరువాత ఇన్స్పెక్టర్ మురళీధర్, కానిస్టేబుల్ శివరాం ల సహాయంతో వాళ్ళిద్దర్నీ బయటకు వదిలిపెట్టి వాళ్ళచేత కారుమీద కాల్పులు జరిపించి తన మామగారు గోపాలరావుని చంపించేడు. అంటే అది ప్రీప్లాన్డ్ కోల్డ్ బ్లడెడ్ మర్డర్. కారు మీద కాల్పులు జరిపీ కారుని ప్రమాదానికి గురిచేసి గోపాలరావు చనిపోవడానికి కారణం పఠాన్, దిలావర్లైనా, దాన్ని పకడ్బందీగా వ్యూహం పన్ని వాళ్ళిద్దరిచేత అతన్ని హత్య చేయించింది మాత్రం వరుణ్ ప్రసాదే... అతనే సూత్రధారనీ, మూలకారకుడనీ ఇప్పుడు ప్రవేశపెట్టిన సాక్షుల ద్వారా ఋజువైంది... సాక్షులిచ్చిన వాఙ్మూలాలు, ఫోటోలు అన్నీ ఇందులో ఉన్నాయి... కోర్టువారు వీటిని పరిశీలించుకోవచ్చు".

"దీని ద్వారా గోపాలరావు మరణం ప్రమాదవశాత్తూ జరగలేదనీ, అది హత్యనీ, దాన్ని పఠాన్, దిలావర్లు చేసినా దాని వెనుకన ఉన్నదీ, హత్యను చేయించిందీ వరుణ్ ప్రసాదే అన్న విషయాన్ని కోర్టువారు నోట్ చేయవలసిందిగా కోరుతున్నాను. అనుష్క హత్య కేసుని రెండు భాగాలుగా పరిశీలించాలి. మొదటిది ఆమె తండ్రి గోపాలరావు హత్య, ఆతరువాత అనుష్క హత్య... ఇప్పటి దాకా మొదటి పార్ట్ వాదనలు పూర్తయ్యాయి. ఇంక రెండో పార్ట్ మొదలు పెడతాను" అన్నాడు భరద్వాజ.

ఈలోగా డిఫెన్స్ లాయర్ జైన్ లేచి నిలబడుతూ "యువరానర్. ఈ కేసుకి సంబంధించని అనవసర అసంబద్ధ వాదనలతో కోర్టు అమూల్య సమయాన్ని నా సహచర న్యాయవాది శ్రీ భరద్వాజ వృథా చేసారు... ఈ కేసు అనుష్క హత్యకు సంబంధించినది. ఆమెది హత్యా కాదా? అన్నది ప్రశ్న; హత్య అయితే

# క్రైం సీరియల్

ఎవరు చేసారన్నది తేల్చాల్సిన కేసు, కానీ నా స్నేహితుడు తన తెలివితేటల్తో హతురాలి తండ్రి మరణాన్ని హత్యగా చిత్రించే ప్రయత్నం చేసి తద్వారా ముద్దాయే ఆమెని హత్య చేసినట్లు కోర్టుని నమ్మించే ప్రయత్నం చేసాడు కానీ అందులో నిజం లేదు…" అంటూ కాసేపు మౌనం వహించి గాజు గ్లాసులో ఉన్న మంచినీళ్ళని తాగి మళ్ళీ వాదనలు మొదలు పెట్టాడు.

"ఈ కేసులో ముఖ్యమైనది అనుష్క హత్య… అది క్రితం మే పదిన రాత్రిపూట జరిగింది… కానీ ఆరోజు ఆమె భర్త ఈ కేసులో ముద్దాయి అయిన వరుణ్ ప్రసాద్ ఈ ఊళ్ళో లేడు… అతను ఆ రాత్రి షెరాటన్ హొటల్లో జరిగిన ఓ కాన్ఫరెన్స్ లో పాల్గొన్నాడు. అతను రూమ్ నెం. 101లో ఉన్నట్లు హొటల్ వాళ్ళు ఇచ్చిన రశీదు ఇది…" అంటూ ఒక రశీదు కాపీని కోర్టు గుమస్తా కందించాడు. అతను జడ్జీగారికి చూపించాడు.

అతను ఆ రూమ్ లోకి చెకిన్ – 10వ తేది ఉదయం 10 గంటలకు… చెక్ అవుట్ 11వ తారీఖు ఉదయం 5 గంటలకు… ఆ సమయంలో అతనికి భార్య అనుష్క హత్య గురించి తెలిసి వెంటనే తన కారులో బయలుదేరి వెళ్ళిపోయాడు. చెక్–ఇన్, చెక్ అవుటుల వివరాలు ఈ రిజిస్టర్లో ఉన్నాయి" అంటూ రిజిస్టర్ జిరాక్స్ పేజీలను కోర్టు గుమాస్తాకిచ్చాడు.

డాక్టరు రిపోర్ట్ ప్రకారం అనుష్క హత్య అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో జరిగింది. హంతకుడు జాలీని విరగ్గొట్టి దాని ద్వారా లోనికి ప్రవేశించాడు… ఇక్కడ ఇంకో విషయం కోర్టువారు గమనించాలి. అదే కోలనీలో మధూలిక అనే స్త్రీమీద కూడా ఆరు నెలల క్రితం అనుష్క మీద జరిగిన హత్యలాగే హత్యా ప్రయత్నం జరిగింది. ఆమెను కూడా అనుష్క లాగే తాడుతో ఉరివేసి ఫేనుకి వేలాడదీసే ప్రయత్నంలో ఆమె తప్పించుకుంది.

దీనివల్ల ఏమి అర్థమవుతోందంటే ఈ హత్యకూ వరుణ్ ప్రసాద్ కు ఏ విధమైన సంబంధం లేదనీ చెప్పవచ్చు. ఎందుకంటే అతను ఆ రోజు జిల్లా పట్నంలోని హొటల్లో ఉన్నాడు. కాబట్టి అనుష్క హత్యతో ఆమె భర్త వరుణ్ కి ఏ విధమైన సంబంధం లేదనీ కోర్టు వారికి సవినయంగా విన్నవించుకుంటున్నాను. కాబట్టి కోర్టు వారు నిజా నిజాలను పరిశీలించి నా క్లయింట్ ని నిర్దోషిగా భావించి కేసుని కొట్టివేయ వలసిందిగా కోరుచున్నాను" అంటూ తన వాదనలనూ వినిపించి కూర్చున్నాడు. ఇంతలో 5 గంటలైనట్లు గడియారం లో 5 గంటలు మ్రోగాయి…

"కోర్టు సోమవారానికి వాయిదా వెయ్యబడిందనీ చెప్పి జడ్జీగారు వెళ్లి పోయారు.

(ఇంకా ఉంది)

సీరియల్




## అవతారిక

అసలు, దేవుని తో మనిషికి అవసరమేముంది. ఈ సృష్టిలో  మిగిలిన జీవరాశులన్ని దేవుడనే భావన లేకుండా బతుకుతున్నప్పుడు మనిషి మాత్రం ఆ భావన లేకుంగా బ్రతకలేడా? ఈ భూమి మీద ఉన్న అన్ని జీవరాశుల లో మనిషి మాత్రమే తెలివితేటలున్నాయి. మనిషి మాత్రమే విచక్షణాజ్ఞానంతో అలోచించగలడు. తన తెలివి తేటలతో ఈ భూగ్రహం  మీద ఆధిపత్యాన్ని సంపాదించి , ఇతర గ్రహాలను కూడా ఆక్రమించాలని చూస్తున్నాడు. ఇంతటి తెలివి తేటలు, ధైర్యసాహసాలు వున్న మనిషి దేవుడనే గుడ్డి నమ్మకాన్ని ఏర్పరుచుకుని, తన శక్తి యుక్తులను మరచిపోతున్నాడు,తన మీద తనే నమ్మకాన్ని కోల్పోయి బలహీనుడుగా మారిపోతున్నడు.

## కొత్త సీరియల్

దేవుడు ఉన్నాడా లేడా అనే విషయాన్ని పక్కన పెడితే, మనిషికి దేవుడితో అవసరం ఉన్నప్పుడే ఆయన గుర్తుకొస్తాడు. అసలు దేవుడి తో మనిషికి అవసరం ఏమిటి?

దేవుడితో మనిషికి ఎప్పుడు అవసరం వస్తుందంటే మనిషి తన మీద తను మ్మకం కోల్పోయిన రోజు, తనకన్నా తన చుట్టూ వున్న సమస్యలు పెద్దవని నమ్మిన రోజు, సహాయం కోసం భగవంతుడి వైపు చూస్తాడు.కోరికలు ఎక్కువై వాటిని సాధించుకునే శక్తి లేక బలహీనుడిగా మారినపుడు దేవుడితో అవసరం ఏర్పడుతుంది .కోరికలను జయించగలిగితే మనిషే దేవుడిగా మారిన తధాగతుడి జీవన సత్యాన్ని మరచిపోతున్నాడు మనిషి .విచిత్రం ఏమిటంటే కోరికలను జయించి దేవుడిగా మారిన బుద్ధుడిని కుడా కోరికలు తీర్చమని మనిషి వేడుకోవటం .

అసలు దేవుడు బయట లేడు, మనలోపలె ఉన్నాడు అని ఎంతమందికి తెలుసు . "దేహో దేవాలయః ప్రోక్తో జీవః ప్రోక్త స్సనాతనః' ,త్యజేదజ్ఞాన నైర్మాల్యం సోహం భావేన పూజయేత్"

దేహమే దేవాలయం. జీవుడు ఈశ్వర స్వరూపం. అజ్ఞానమనే నైర్మాల్యాన్ని తీసివేసి.. నీవే నేను,అనే భావం తో మనం జీవిస్తే మనమే దేవుళ్ళం అవుతాము .కాని ఎంతమంది ఈ సత్యాన్ని నమ్ముతున్నారు ? కాని మనం చేస్తుంది ఏమిటి ..మన దేహాన్ని కుళ్ళ బెట్టి , జీవుడిని క్షోభ బెట్టి శవాల్లా బ్రతుకుతున్నాము .

దేవుడు బయట రాళ్ళల్లో రాప్పల్లో ఉన్నాడంటే మాత్రం గుడ్డిగా నమ్మేస్తారు . ఒకప్పుడు మనిషి చెట్లను , పసువులను ,ప్రకృతిని పూజించేవాడు. కాని రాను రాను నాగరికత పెరిగి అజ్ఞానం ఎక్కువ అయ్యి రాళ్ళను రాప్పలను పూజిస్తున్నాడు . ఇప్పటికి నాగరికత అంతగా ఎదగని వెనుకబడిన ప్రాంతాలలో చెట్లను పుజిస్తునే ఉన్నారు .

అన్ని తనేకే కావాలనే దురాశ కలిగినప్పుడు మాత్రం, ఆ అశ తీరటానికి ఎదో అద్భుతం జరిగితే బాగుండని మనిషి ఆశిస్తాడు. అప్పుడే బాబాలు, స్వామీజీలు అద్భుతాలు చేస్తూ వాళ్ళ దృష్టి ని తమ వైపు తిప్పుకుంటారు. వాళ్ళు చేసే అద్భుతాలు, అభూత కల్పనలని తెలిసినా కుడా వాళ్ళ మనసు అంగీకరించదు. ఎందుకంటే వాళ్ళ మనసులోని కోరికలు వాళ్ళ మెదడులోని విచక్షణా జ్ఞానాన్ని మేల్కొననివ్వవు. అందుకనే మన దేశం లో

ఉన్నంత మంది బాబాలు ,స్వామిజిలు ,సన్యాసులు మరే దేశం లో లేరు .ఇంకోరకంగా చెప్పాలంటే తమ కష్టాన్ని నమ్ముకోకుండా, కేవలం అదృష్టం వల్ల,బాబాల వల్ల మాత్రమే తమ జీవితాలు బాగుపడతాయి అనుకునే అమాయకులు మన దేశం లోనే ఎక్కువ .ఇప్పుడు భక్తి ఒక పెద్ద వ్యాపార వస్తువుగామరి పోయింది. వేలకు వేలు పోసి మరీ బాబాల దర్శనాలు చేసుకుంటున్నారు వెర్రి జనం.



## అసలు కథ

విశాఖ నగరానికి దూరంగా, సముద్ర తీరానికి దగ్గరగా ఓవంద ఎకరాల్లో కట్టిన సువిశాల శ్వేత సౌధం అది . దాని చుట్టూ పది అడుగుల ఎత్తులో ప్రహారీగోడ, ఆపై కరెంటు ఫెన్సింగ్, ప్రధాన ద్వారం దగ్గర ఓ పది మంది కాపలా . చూడటానికి రాజ్యాలు పోయిన ఎవరో రాజుగారి రాజమహల్లా లేదా పదవి పోయిన ఏ ప్రధాన మంత్రో ,ముఖ్యమంత్రి గారి ప్యాలెస్ లా ఉంటుంది ఆ భవనం . కేంద్ర మంత్రుల దగ్గర నుంచి , బడా పారిశ్రామిక వేత్తలు , వ్యాపారస్తులు ఐ ఏ ఎస్ ఆఫీసర్లు , అంత దాక ఎందుకు దేశంలోనే అత్యధిక ధనవంతులు అనబడే వాళ్ళు భక్తులుగా ప్రధాన అనుచరులుగా కల 'సుఖభోగ్ బాబా 'గారి ఆశ్రమం అది. పేరుకి ఆశ్రమమే కాని, భక్తులకోసం ఏ.సి కాటేజీలు, భోజనశాలలు, యోగా, వ్యాయామనికి విడిగా సదుపాయాలు ఇలా ఒకటేమిటి అక్కడి వసతులు సౌకర్యాలు బహుశా స్టార్ హోటళ్ళలో కుడా లభించవేమో.

# కొత్త సీరియల్

బాబా గారు తన ధ్యానమందిరం నుండి భక్తుల దర్శనార్థం ఇంకా బయటకు వచ్చినట్లు లేదు. అప్పటికె అక్కడ గుమికూడిన వేలాదిమంది భక్తులతో ఆ ప్రాంగణం మొత్తం కోలాహలంగా వుంది. వాళ్ళల్లో కొంత మంది విదేశీ భక్తులు కూడా వున్నారు. బాబాకు తమ కోరికలు విన్నవించుకోవాలని ముందు వరసల్లో కూర్చోటానికి వేలకు వేలు పోసి దర్శనం టికెట్లు కొన్నారు కొంతమంది .మరి కొంతమంది "లివ్ విత్ బాబా "ప్యాకేజి టికెట్లు లక్షలు పోసి కొని అక్కడే మకాం పెట్టారు .మొత్తం మీద బాబా గారి ఆశ్రమం లో కోట్ల మీద వ్యాపారం జరుగుతోంది అనేది సత్యం. ఇంత జరుగుతున్నా ప్రభుత్వాలు కాని , వాటి పెంపుడు కుక్కలు సి బి ఐ ,ఇ.డి ఇటువైపు వైపు కన్నెత్తి కుడా చూడవు ,ఎందుకంటే ప్రభుత్వం లో ఓ పెద్ద తలకాయి ఆశ్రమం పాలక మండలి లో ఉండటమే .

దేశం లోని మిగిలిన బాబాలతో పోలిస్తే సుఖదేవ్ బాబా తీరే వేరు .నవవిధ భక్తి మార్గాల్లో భగవంతుని చేరుకోవచ్చని అందరు బాబాలు బోధిస్తూ ఉంటె , సుఖదేవ్ బాబా మాత్రం పదో మార్గం ద్వారా భగవంతుని చేరవచ్చని చెపుతుంటాడు .ఇంతకి ఆ పది మార్గం ఏమిటి అంటారా..అదే శృంగారం . శ్రీ కృష్ణ పరమాత్మకి శృంగారం అంటే ఇష్టమని, దాని ద్వారా ముక్తి పొందవచ్చని ,అందుకే తన ఆశ్రమం లో స్త్రీ పురుషులు శృంగారం జరుపుకోవటం తప్పు కాదని భాక్తులుకు బోధిస్తూ ఉంటాడు . అందుకనే ఆయన భక్తుల్లో ఎక్కువ మంది యుక్తవయస్కులే ఉంటారు .

ఆయనంటే పడని ప్రజా సంఘాలు మాత్రం , ఆయనో వ్యభిచారి అని , లైసెన్సు ఉన్న బ్రోకర్ అని ,అయన ఆశ్రమాన్ని వ్యభిచార కుపంగా మార్చాడని, ఎంతో మంది కన్నెపిల్లల జీవితాలు నాశనం చేసాడని విమర్శిస్తూ ఉంటారు . వీళ్ళ గొడవ పడలేక అడపా దడపా ప్రభుత్వం సైతం . ఆయన ఆశ్రమం మీద పోలిసు రైడింగులు చేపట్టినా అక్కడ వ్యభిచారం జరుగుతున్నట్టు ఏమి దొరక్క పోవటం తో వెనక్కి తగాల్సి వచ్చింది .ప్రజా సంఘాలు మాత్రం , ముఖ్యమంత్రి కి బాబా కు ఆర్దిక లావాదేవీలు ఉండటం వల్లే అక్కడి రహస్యాలేవి బయటకు రావట్లేదు అని విమర్శిస్తూ ఉంటారు . (ఇంకా ఉంది )





## దేశం లో దొంగ బాబాలు -1

నిత్యానంద అసలు పేరు అరుణాచలం రాజశేఖరన్. తమిళనాడు రాష్ట్రంలోని తిరువణ్ణామలైలో జన్మించారు. సన్యాస సంచారం చేస్తున్న సమయంలో మహావతార్ బాబాజీ తనకు నిత్యానందగా నామకరణం చేసినట్లు ఆయనే చెప్పారు. తొలిసారి 2003లో బెంగళూరు సమీపంలోని బిదాడి వద్ద నిత్యానంద ధ్యానపీఠం నెలకొల్పారు. తనకు 12వ ఏటనే జ్ఞానోదయం(enlightenment) అయినట్లు భక్తులకు ఉపదేశించారు. ధ్యానపీఠంలో ప్రవచనాలు చెబుతూ నిత్యానంద బాగా పేరు సంపాదించారు. విదేశీయులు కూడా ఆయనకు భక్తులుగా మారారు. దీంతో ఫ్లోరిడాలోని హిందూ యూనివర్సిటీ ఆఫ్ అమెరికాకు నిత్యానంద ఛైర్మన్ గా ఉన్నారు. బ్రహ్మసూత్ర, పతంజలి, యోగసూత్ర, శివసూత్ర వంటి వాటిపై ఆయన ఉపన్యాసాలు ఇచ్చేవారు. నిత్యానంద ధ్యానపీఠం ధార్మిక కార్యక్రమాలు దాదాపు 47 దేశాల్లో ప్రాచుర్యం పొందాయి. ఆధ్యాత్మిక గురువుగా సాగిపోతున్న నిత్యానంద 2010లో లైంగిక వీడియో(video) వివాదంలో చిక్కుకున్నారు. ఓ నటితో కలిసి రాసలీలలు సాగిస్తున్నట్లుగా అందులో ఉంది. స్థానిక తమిళ ఛానళ్లతోపాటు, ఇంటర్నెట్లోనూ ఆ దృశ్యాలు అప్పట్లో వైరల్గా మారాయి. అయితే దానిపై స్పందించిన నిత్యానంద అందులో తాము శవాసనం సాధన చేస్తున్నామని తనను తాను రక్షించుకునే ప్రయత్నం చేశారు. అప్పట్లో ఈ కేసు ఓ సంచలనంగా మారింది. తరువాత కొన్ని రోజులకు ఈ కేసులో బెయిల్ పొందారు. మరోసారి 2019లో ఆయనపై అహ్మదాబాద్లో కేసు నమోదైంది. మైనర్ బాలికలను ఆశ్రమంలో నిర్బంధించి వేధిస్తున్నారని కొందరు ఫిర్యాదు చేశారు.

ఇక ఈ కేసులో ఇరుక్కుంటే తన మనుగడ కష్టమని భావించిన నిత్యానంద దేశం విడిచి పారిపోయారు. భారత్ను వీడిన తరువాత నిత్యానంద ఎక్కడున్నారో ఎవరికీ తెలియరాలేదు. అనూహ్యంగా కొద్దిరోజులకు దక్షిణ అమెరికాలోని ఈక్వెడార్ ఐలాండ్లో నిత్యానంద 'రిపబ్లిక్ ఆఫ్ కైలాస'ను స్థాపించి సంచలనం సృష్టించారు. ప్రపంచంలోనే అతిగొప్ప, స్వచ్ఛమైన హిందూ దేశంగా దాన్ని ప్రకటించుకున్నారు. ఈ కైలాస ఏర్పడిన తొలినాళ్లలో గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్కు చెందిన కొందరు ప్రముఖులు తమ వ్యాపారాలను త్యజించి ఈ దీవికి వెళ్లాలనుకుంటున్నారని వార్తలు వినిపించాయి. నిత్యానంద శిష్యుల్లో చాలా మంది ధనికులున్నారు. వారే ఆయనకు ఈ దీవిని కొనుగోలు చేసి ఇచ్చారని చెబుతుంటారు. 'రిపబ్లిక్ ఆఫ్ కైలాస'లో అడుగుపెట్టాలంటే దానికి అక్కడి 'ప్రధాన మంత్రి(నిత్యానంద)', 'కేబినెట్' అనుమతి పొందాల్సి ఉంటుంది. నిత్యానంద భక్తులై ఉండి ఆయనకు విరాళాలు ఇచ్చిన వారికి మాత్రమే ఇక్కడ ప్రవేశం కల్పిస్తారు. నిత్యానంద ప్రకటించుకున్న దేశంలో పలు మంత్రిత్వశాఖలు కూడా ఉన్నాయి. అందులో 'జ్ఞానోదయ నాగరికత విభాగం' కూడా ఒకటి. సనాతన హిందూ ధర్మాన్ని పునరుద్ధరించాలనే లక్ష్యంతో దాన్ని ఏర్పాటు చేశారు. ఇక కైలాస పర్వతానికి దేశం తరహాలోనే ప్రత్యేక జెండా ఉంది. దాన్ని 'రిషభధ్వజ'గా పిలుస్తున్నారు. జాతీయ జంతువుగా నంది, పక్షిగా 'శరభం', పుష్పంగా కమలం, చెట్టుగా మర్రిని ఎంపిక చేశారు. ఇంగ్లిష్, సంస్కృతం, తమిళంను అధికారిక భాషలుగా ప్రకటించారు.

నిత్యానంద తన హిందూ రిజర్వ్బ్యాంకుకు వచ్చిన విరాళాలను క్రిప్టో కరెన్సీగా మారుస్తున్నట్లు ఆయన వెబ్సైట్(Kailaasa.org) గతంలో పేర్కొంది. 2018లోనే పనామాలో ఈ వెబ్సైట్ను రూపొందించినట్లు సైబర్ నిపుణులు చెబుతున్నారు. ప్రపంచంలోని ఎవరైనా సరే స్వేచ్ఛగా హిందూ మతాన్ని ఆచరించడానికి అడ్డంకులు ఎదుర్కొంటూ ఉంటే ఈ కైలాసానికి రావొచ్చని పిలుపునిస్తున్నారు. భారత్ నుంచి పారిపోయినప్పటి నుంచి నిత్యానంద రోజువారీ ఉపన్యాసాలు ఇన్స్టా, యూట్యూబ్లలో ప్రసారం అవుతున్నాయి.

## కొత్త సీరియల్

సీరియల్



# యూనివర్సిటీ

పాంచజన్య

## అవతారిక



విద్యార్థులను విశ్వ నరులగా లేదా విశ్వ మానవులగా రూపొందించాలనే సదుద్దేశ్యం టో స్థాపించినవే విశ్వ విద్యాలయాలు .ప్రపంచం కళ్ళు తెరవక ముందే మన దేశం లో

స్థాపించబడిన తక్ష శిల , నలందా విశ్వవిద్యాలయాలు మానవ జాతికి మనుగడ నేర్పాయి..త్రేతాయుగం లో రామాయణ కాలం లో శ్రీ రాముని తమ్ముడు భరతుడు తన కొడకు అయిన తక్ష కుని పేరుమీద ఒక మహా నగరాన్ని నిర్మించాడు దాని పేరే తక్ష శిల . ఇప్పుడా నగరం మన పొరుగున ఉన్న పాకిస్తాన్ లో ఉంది .

తదనంతర కాలం లో ద్వాపరయుగం లో ఆ తక్షశిలా నగరం లో , తక్షశిల మహావిద్యాలయాన్ని స్థాపించాడు కురుసార్వభౌముడైన దుర్యోధనుడు అక్కడ వేదాలు , ఆయుర్వేదం , వాణిజ్యం , ఖగోళ శాస్త్రం , వ్యవసాయం వంటి అనేక శాస్త్రాలు అధ్యనం చెయ్యటానికి చైనా, గ్రీకు ,అరేబియా వంటి దేశాలనుండి విద్యార్థులు వచ్చేవాళ్ళు . ఆ తరువాతి కాలం లో ఈ విశ్వవిద్యాలయం అనేకమంది చేతులు మారుతూ చివరికి క్రీస్తు పూర్వం 4 వ శతాబ్దిలో మౌర్య చక్రవర్తి అయిన చంద్రగుప్తుని ఆస్థాన ప్రధాన మంత్రి చాణుక్యుడు దీన్ని పరిపూర్ణ విశ్వవిద్యాలయం గా తీర్చి దిద్దాడు. ప్రముఖ వైద్యులు చరకుడు ,జీవకుడు, వ్యాకరనకర్త పాణిని వంటివారు ఇక్కడి విద్యార్థులే .5 వ శతాబ్ది లో హుణుల దండయాత్రలో ఈ విశ్వవిద్యాలయం నాశనమయ్యింది .

క్రీస్తు పూర్వం 427 లో కుమారగుప్త చక్రవర్తి నలంద విశ్వవిద్యాలయాన్ని స్థాపించాడు .800 సంవత్సరాల పాటు 2000 మంది అధ్యాపకులతో ,పది వేలమంది విద్యార్థులతో

# కొత్త సీరియల్



అప్రతిహతంగా కొనసాగిన ఈ విశ్వ విద్యాలయం 12 వ శతాబ్దిలో మన దేశం పైకి దండెత్తి వచ్చిన మ=మహమ్మద్ ఖిల్జీ చేతిలో నాశనం అయ్యింది .ఈ విశ్వవిద్యాలయం గ్రంధాలయం లోని పుస్తకాలను ఖిల్జీ సైనికులు తగలబెడితే , అవి పూర్తిగా తగలబడటానికి కొన్ని నెలలు పట్టిందట .

ఆధునిక భారత దేశం లో మొట్ట మొదటి ఆధునిక విశ్వవిద్యాలయం 1857 లో కొలకొత్తాలో 'యూనివర్సిటీ అఫ్ కలకత్తా 'బిటిష్ వారిచే జరిగింది. అంతకు పూర్వమే 1818 లో స్థాపించబడిన సేరం పోర్ విద్యాలయానికి 1829 లో విశ్వవిద్యాలయ హోదా ఇవ్వటం జరిగింది .స్వాతంత్రం వచ్చే నాటికి మన దేశం లో 21 విశ్వవిద్యాలయాలు వాటికి అనుబంధంగా 500 కళాశాలలు ఉండేవి . అప్పట్లో విశ్వవిద్యాలయాల్లో బోధనా మరియు పరిశోధనలు జరిగేవి కావు .కేవలం విద్యార్ధులకు పరీక్షలు పెట్టి పట్టాలు ప్రదానం చేసేవి.

ప్రస్తుతం 2024 లో మన దేశం లో వెయ్యికి పైగా ఉన్న 500 పై చిలుకు విశ్వవిద్యాలయాలు వివిధ ప్రభుత్వాల ఆధీనంలో నడుస్తున్నాయి వీటిలో 50 కేంద్ర ప్రభుత్వ ఆధీనం లో మిగిలినవి వివధ రాష్ట్రాల ఆధీనం లో నడుస్తున్నాయి .వీటిలో అత్యుత్తమమైన బోధనా , పరిశోధనలు జరగాలి.కాని దురదృష్టం ఏమిటంటే ఇక్క పరిస్ధనల్ కంటే రాజాకీయాలే ఎక్కువగా జరుగుతుంటాయి .

ప్రపంచం లో ప్రసిద్ది చెందిన శాస్త్ర వేత్తలు విదేశాలలోని విశ్వవిద్యాలయాల నుండి వస్తుంటే మన దేశం లోని విశ్వ విద్యాలయాల నుండి రాజకీయ నాయకులు వస్తున్నారు .దీనికి ఉదాహరణ మన దేశంలో కేవలం నలుగురు శాస్త్ర వేత్తలు మాత్రమే నోబుల్ బహుమతి అందుకున్నారు . విద్యార్ధి దశలోనే విశ్వవిద్యాలయాల్లో రాజకీయ పార్టీల అనుబంధ యూనియన్ల లో చేరి అక్కడ గొడవలు చేసి, గుర్తింపు పొంది తదనంతర కాలం లో ఎం ఎల్ ఏ లు, ఎం పి లు అయిన వాళ్ళు మన దేశం లో చాల మంది ఉన్నారు

# కొత్త సీరియల్

విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా, సమాజానికి ఉపయోగపడే నాయకులుగా తీర్చిదిద్దాల్సిన విశ్వవిద్యాలయాలు నేడు రాజకీయ బురదలో కురుకుపోయి , కులాల కుంపట్లను అనుక్షణం రాజేస్తూ ,మతాల మంటల్లోవిద్యార్థుల భవిష్యత్తును కాలుస్తూ ,తమ స్వార్థం కోసం విద్యార్థులను రాజకీయ కార్యకర్తలుగామార్చి వారిని అసాంఘిక శక్తులుగా తయారుచేస్తూ దేశ భవిష్యత్తుకే ప్రమాదకరంగా మారాయి అనటం లో ఏ సందేహం లేదు. అటువంటి ఒక విశ్వవిద్యాలయం యొక్క మనోగతానికి ప్రతిరూపమే ఈ నవల ..ఇక చదవండి

విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా, సమాజానికి ఉపయోగపడే నాయకులుగా తీర్చిదిద్దాల్సిన విశ్వవిద్యాలయాలు నేడు రాజకీయ బురదలో కురుకుపోయి , కులాల కుంపట్లను అనుక్షణం రాజేస్తూ ,మతాల మంటల్లోవిద్యార్థుల భవిష్యత్తును కాలుస్తూ ,తమ స్వార్థం కోసం విద్యార్థులను రాజకీయ కార్యకర్తలుగామార్చి వారిని అసాంఘిక శక్తులుగా తయారుచేస్తూ దేశ భవిష్యత్తుకే ప్రమాదకరంగా మారాయి అనటం లో ఏ సందేహం లేదు . విశ్వవిద్యాలయాలలో జరిగే అవినీతి పై , అసాంఘిక కార్యకలాపలాపై ,లైంగిక దుశ్చర్యలపై పోరాటానికి పూరించిన పంచాజన్యమే ఈ నవల .

దీనిని నవల అనేకంటే నిజాల ప్రబంధం , వాస్తవాల దృశ్య కావ్యం అని పేర్కొనవచ్చు . ఈ నవలలో జరిగే ప్రతి సంఘటన ఏదో ఒక విశ్వవిద్యాలయం లో జరిగినదే .” పాంచజన్య “ కలం నుండి నెల నెల వెలువడబోతున్న ఈ నవలను చదివి మీ అభిప్రాయాలను , మీకు ఎదురైనా సంఘటనలను రాసి పంపండి ఉత్తమమైన వాటికి బహుమతి ఉంటుంది .

# కొత్త సీరియల్

## అసలు కథ

మనం మాట్లాడుకునే విశ్వవిద్యాలయం స్థాపించి 90 సంవత్సరాల పైమాటే అయ్యింది . త్వరలో శతాబ్ది ఉత్సవాలు కుడా జరుపుకోవాలని ఉవ్విళ్ళూరుతోంది . ఆ విశ్వ విద్యాలయానికి ఆ ప్రాంత జమిందారులు 1500 ఎకరాల భూమిణి దానికి రాసిచ్చారు. కాని కాల క్రమేణావివిధరకాల ఆక్రమణలకు గురయ్యి ఇప్పుడు కేవలం నలుగ వందల ఎకారాలలో మాత్రమే కొనసాగుతోంది . విచిత్రం ఏమిటంటే ఆ విశ్వ విద్యాలయం స్థాపించినప్పుడు అది అటవీ ప్రాంతం.అంతా నిర్మానుష్యంగా ఉండేది . కాని ఇప్పుడు అదే ఓ పెద్ద మహా నగరంగా రూపుదాల్చింది . విశ్వవిద్యాలయం చుట్టూ అనేక కాలనీలు వేలిసాయి . ఆ కాలనీలకు వెళ్ళే ప్రధాన రహదారులన్నీ విశ్వవిద్యాలయం నడిబొడ్డు గుండా వెళతాయి .ఆ రహదారుల పక్కన ఆక్రమించిన స్థలాల్లో అనేక దుకాణాల సముదాయాలు , మురికి వాడలు కుడా. చూసే వాళ్ళకు అది అసలు విశ్వవిద్యాలయం అనిపించదు , అది కుడా ఓ కాలని అనుకుంటారు . చాల మంది విశ్వ విద్యాలయ కులపతులు, ఆ జిల్లా కలెక్టర్లు ఆ ఆక్రమణలను తొలగించాలని చూసారు కాని , వాళ్ళ పదవి కాలం పూర్తి కాకుండానే రిటైర్ అవ్వాల్సి వచ్చింది .

రాష్ట్రంలో ఎక్కడ ఈ గొడవ జరిగినా దానికి మూలాలు ఆ విశ్వ విద్యాలయం లోనే దొరుకుతాయి , ఎందుకంటే అక్కడి హాస్టళ్ళలో వివిధ రాజకీయ పార్టీల కార్యకర్తలు , విద్యార్థుల ముసుగులో సంవత్సరాల తరబడి అక్కడ తిష్ట వేసుకుని కూర్చున్నారు . వాళ్ళను ఖాళీ చెయ్యమని అడిగే దమ్ము ధైర్యం అక్కడి అధ్యాపకులేవ్వరికి లేదు.ఒక వేల ఎవరన్నా వాళ్ళను ఖాళీ చెయ్యమని అంటే అతని పోస్టు ఖాళీ అయిపోతుంది .వాళ్ళు స్టూడెంట్లకు ఎక్కువా , గుండాలకు తక్కువ అన్నట్టు వాళ్ళు వచ్చిందే రాజకీయ నాయకుల అండతో , ఇంకా ఎవరు వాళ్ళను పోమ్మనేది .మూడు పూటలా హాస్టల్ మెస్ లో పడి తిని బాలాదూరుగా రాజకీయ నాయకుల వెంబడి తిరుగుతుంటారు. ఉద్యమాల పేరుతో నిత్యం ధర్నాలు , నిరసనలు , ఊరేగింపులు చెయ్యాలంటే రాజకీయనాయకులకు వీళ్ళు కావాలి . అందుకనే ఓ ముక్క పళ్ళెం లో వేసి , ఓ పెగ్గు గొంతులో పోసి పెంపుడు కుక్కల్ల వీళ్ళను పోషిస్తుంటారు

(ఇంకా ఉంది )



సీరియల్

# రాణాప్రతాప్





డా. పులిచెర్ల సాంబశివరావు

తిరిగివచ్చిన రాణాప్రతాపుని గాంచి భిల్లవీరులు చుట్టూ మూగారు. వారి నాయకుడు భీమచాంద్ పరమానందంతో అందరికీ తేనె అందించాడు.

“మేవాడ్ని శత్రువుల కబంధహస్తాలనుండి రక్షించడానికి రాణాప్రతాపుడు తిరిగి వచ్చాడు. దేశభక్తి ప్రపూర్ణులైన వీరులంతా వచ్చి ప్రతాపుని సైన్యంలో చేరవచ్చును! భామాషాహీ దయవలన సమృద్ధిగా సొమ్ము లభించింది. వీరవరులంతా సముచితంగా సమ్మానింపబడతారు! కనుక వెనువెంటనే కదలిరండహో!” చాటింపు రోదసీకుహరంలో ప్రతిధ్వనించగా, ఎక్కడెక్కడున్న రసపుత్రులు ప్రతాపుని సైన్యంలో నూతనోత్సాహంతో వచ్చి చేరారు. బేడ్లాకోటేరియా రాజులు ప్రతాపునికి నమస్కరించి నిలిచారు. చౌహానులు రాణా రాణువతో కలిశారు. షాపూర్, బునేరా ప్రభువులు సమస్త ఆయుధాలతో ప్రతాపుని కలుసుకోవటం కోసం పయనమయ్యారు.

# చరిత్రాత్మక సీరియల్

రాఠోడులు యుద్ధానికి సంసిద్ధత ప్రకటించారు. సాద్రినుండి శ్యామసింహుడు వచ్చాడు. దేవగఢ్నుండి దూదాసింగ్ ఊడిపడ్డాడు. దుర్జయసింగ్ తన అనుచరులతో రాణా ఆజ్ఞకోసం వేచి ఉన్నాడు.

–

ఆకాశంలో ఇంద్రధనుస్సు వెలసింది.

"ఇదే మనకు మంచి ముహూర్తం! చీకట్లు తొలగిపోయాయి. స్వాతంత్ర్య భానూదయంతో మన నేలపై వెలుగురేఖలు పరచుకున్నాయి. వీరరసము పొంగిపొరలే ఈ క్షణమే మనకు శుభముహూర్తము. మనకు అఖండ విజయం తథ్యం! విదేశీ – ముష్కరులను వెడలగొట్టి స్వాతంత్ర్య సముపార్జనకు నడుం బిగించండి!"

రాణాప్రతాపుని పలుకులు విని అందరూ వీరరసంతో ఊదులాడుతూ నూతనో త్సాహంతో "జై ఏకలింగేశ్వరా! జైజై రాణాప్రతాప్!" అని నినదించారు.

రాణీ పాటేశ్వరీదేవి బిడ్డలను వెంటబెట్టుకుని ప్రతాపునికి హారతి ఇచ్చి, వీర తిలకం దిద్దింది.

"దేవీ! బిడ్డలతో నీవు అరణ్యంలోనే నిలచి ఉండు! ఈ భిల్లులు కొందరు నీకు సంరక్షణగా ఉంటారు. ముప్పయి దుర్గాలను జయించిన తరువాతే తిరిగి వస్తాను.

పరమ సంతోషంతో నన్ను రణరంగానికి పంపు!"

"స్వామీ! మీ మోముపై వెన్నెలవంటి చిరునవ్వును తిరిగి ఇన్నాళ్ళకు చూడగలిగాను! విజయలక్ష్మి సమేతులై యుద్ధభూమినుండి తిరిగి రండి!"

అమరసింహుడు తండ్రి పాదాలమీద వ్రాలాడు.

"స్వామీ! మీవెంట యుద్ధభూమికి వచ్చి తురుష్కుల తలలు త్రెంచాలనే ఉబలాటంతో ఉన్న ఈ అమరసింహుని నేను ఇక ఆపజాలను! దయతో మన కుమారునికి ఈ చిన్న అవకాశాన్ని ఇవ్వండి!" పాటేశ్వరీదేవి ప్రతాపుని ప్రార్థించింది.

ప్రతాపుడు ప్రియనందనుణ్ణి లేవనెత్తి, భుజంతట్టి కరవాలాన్ని అందించాడు. అమరసింహుని మోము వికసించింది.

ఖరదూషణాది రాక్షసులను సంహరించడానికి బయలుదేరిన రామచంద్రునిలాగా ప్రతాపుడు భాసించాడు. ప్రతాపుడు సైన్యసమేతుడై నడుస్తూ ఉండగా, చెట్లపైనున్న భిల్ల కాంతలు పూలు చల్లారు.

దేవియర్ కోట చేరేసరికి అర్ధరాత్రయింది. తురుష్కులు కోట తలుపులు వేసుకొని నిశ్చింతగా నిద్రపోతున్నారు. గురకలు పెడుతున్న తురకలు కోటచుట్టూ చేరిన ప్రతాపుని సైనికుల సందడి లీలగా వినబడుతున్నా, కడుపునిండా ఉన్న మద్యమాంసాలు వాళ్ళని పక్కమీద నుంచి లేవనీయటంలేదు!

"నిద్రపోయేవాళ్ళని నిద్రపోతున్నట్లుగానే పరపర గొంతులుకోసి నరకానికి పంపుదాం!" భీమచాంద్ ఉత్సాహంతో పలికాడు.

"మా పూర్వులు ఈ కోటను మొన్నటిదాకా ధాటిగా పాలించారు. క్షత్రియధర్మాన్ని మరచి దొంగలవలె మనం లోనికి ప్రవేశించడం తగదు. ప్రతాపాన్ని ప్రదర్శించి మరీ పట్టుకుందాం!" ప్రతాపుడు వారిని వారించాడు.

"ఇప్పుడు కోట తలుపులు బద్దలు కొట్టేద్దాం!" కాగడాల వెలుగులో ద్వారాలు పరిశీలిస్తూ ప్రతాపుడు పలికాడు.

కోట దర్వాజా ఇరవైనాలుగడుగుల ఎత్తూ, ముప్పయిరెండడుగుల వెడల్పూ వుంది. రెండు పెద్ద తలుపులతో అభేద్యంగా ఉంది. తలుపులకు ఇనుప ములుకులుగల గుబ్బలు అమర్చబడ్డాయి.

"ప్రభూ! ఆ పని మాకు అప్పగించండి!" ఇద్దరు యువకులు ఉత్సాహంతో పలికారు. ప్రతాపు అటు చూశాడు. షెకావత్, చందావత్ అనే ఇద్దరు యువకులు ప్రభువు మ్రోల నమస్కరించి నిలిచివున్నారు. ప్రతాపుని గజసైన్యానికి చెందిన వీరవరులు వాళ్ళు.

ప్రతాప్ అనుమతి సూచకంగా వారికి కైజారులందించి. తాను మిగిలిన సైనికులకు సూచనలిస్తూ ఆవలికి వెళ్ళాడు. షెకావత్, చందావత్లు మహోత్సాహంతో వెళ్ళి రెండు గజరాజాలను తెచ్చి, దేవియర్ కోటద్వారం ముందు నిలిపి, మావటీలకు సూచనలిచ్చారు. మావటీలు ఏనుగులను కొంత వెనుకకు తీసుకువెళ్ళి, వేగంగా దర్వాజా దగ్గరకు దౌడుతీయించాడు. వేగంతో పరుగిడి వచ్చిన మత్తేబాల కుంభస్థలాల తాకిడికి వేయి వక్కలై విరిగిపడాలి! కానీ, అలా జరుగలేదు. వేగంగా వచ్చిన ఏనుగులు తలుపుల దగ్గరకు వచ్చేసరికి ఠక్కున నిలిచిపోయాయి!

తలుపులకు బిగించిన ఇనుప ములుకుల గుబ్బలే ఇందుకు కారణం. ఆ ములుకులను చూచి భయంతో ఏనుగులు తోకముడిచాయి.

నిమిషంలో తలుపులు బద్దలుకొట్టవచ్చునుకున్న షెకావత్, చందావత్లు హతాశు లయ్యారు. ప్రభువుకి తామెంతో గొప్పగా చెప్పి వచ్చారు! ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని తిరిగివెళ్ళాలి! ఏమైనాసరే, సాధించితీరాలి! దర్వాజాలు బద్దలై రాణా రాణువ కోటలోనికి ప్రవేశించాలి.

# చరిత్రాత్మక సీరియల్

**జరిగిన కథ** అక్బర్ చక్రవర్తి! అశేష సైన్యసమూహాలతో, విశేషాయుధ సంపత్తితో చిత్తోడ్ను కైవసం చేసుకోవడానికి అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు! ఈ ఆలోచనలతో సతమతమవుతూ, మనశ్శాంతి కోసం ఉదయసింహుడు రాజధానిని విడిచి అరణ్యమార్గాన అనుచరవర్గంతో ఏకలింగనాథస్వామి సన్నిధికి చేరాడు.అక్కడ 'ఓం నమశ్శివాయ!' అంటూ వినపడింది. ఆ శబ్దం వచ్చిన దిశగా వెతుక్కుంటూ వెళితే ఓ సాధువు కనిపించాడు . 'ఉదయా చిత్తోడ్ వదిలి నేను చుపించాచోట కోట నిర్మంచమని చెపుతాడు . దానికి ఉదయసింహుడి మంత్రులు అది పిచ్చి ఆలోచన అంటారు .కాని ఉదయ సింహుడి కొడుకు మాత్రం తండ్రి ఆజ్ఞ పాటించలంటాడు. అక్బర్ అనుమతితో బైరాంఖాన్ తన కరకు కరవాలంతో హేమూ శిరమును ఒక దెబ్బతో తెగనరికాడు .చిత్తోడ్ అక్బర్ వశంఅయ్యింది . అగ్ర కోటకి ఇరు వైపులా జయమల్, పత్తా విగ్రహాలను నిలిపాడు అక్బర్ .చిత్తోడ్ మొత్తం శ్మశానంలా మారిపోయింది.దానితో దిగులుతో మంచం ఎక్కాడు ఉదయ సింహుడు .చిన్నరాణి తనకొడుకు జగమ్మల్లుడికి పట్టాభిషేకం చెయ్యమంటుంది .మాట ఇచ్చి మరణిస్తాడు ఉదయ సింహుడు. కాని అక్కడి సర్దారులు అందుకు ఒప్పుకోరు . రాణాప్రతపుడికే పట్టం కడతారు .దానితో జగమల్లుడు పగ బడతాడు .రాజ మాన్సింగ్ షోలాపూర్ జయిస్తాడు .మాన్సింగ్ను రాణాప్రత్జాప్ అవమానిస్తాడు . తగిన గుణ పాఠం చెప్పాలని అక్బర్ అనుకుంటాడు .మాన్ సింగ్ ను సర్వ సైన్యా ధ్యక్షుడిగా నియమించి రణ ప్రతాప్ మీదకు యుద్దానికి పంపుతాడు అక్బర్ .రాజా రాం తన కొడుకు శాలివాహన్ తో యూద్దనికి వస్తాడు .రాజా జగన్నాథ్ వెన్నుపోటుతో దాందాస్ మరణిస్తాడు రాణాప్రతాప్ రామ్ప్రసాద్ అనే ఏనుగు ను మొఘలుల మీదకు పంపిస్తాడు. దాన్ని వాళ్ళు స్వాధీనం చేసుకుంటారు . ప్రతాప్ మాన్సిన్హ తో తల పడతాడు . మొఘలుల సైన్యం ఎక్కువగా ఉండటం వల్ల ప్రతాప్ కు గాయాలవుతాయి.ఝులా ప్రతాప్ సుర్యద్వాజం తీసుకుని పారిపోతాడు .ప్రతాప్ పరిపోతున్నాడని అతని వెంటపడి అతన్ని హతమారుస్తారు మొఘలులు.గాయపడ్డ ప్రతాప్ ణి అతన్ని గుర్రం చేతక్ దూరంగా రహస్య ప్రదేశానికి తీసుకు వెళుతుంది

**ఇక చదవండి**

ఒక్క నిమిషం ఇరువురూ ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. ఏదో మాట్లాడు కున్నారు! గట్టిగా కౌగలించుకున్నారు! చేతులు పట్టుకుని ద్వారం దగ్గరకు చేరారు.

"ఊ! ఇప్పుడు రానివ్వండి!" ఆజ్ఞాపించారు.

ఇద్దరూ తలుపులకు ఆనుకొని నిలుచున్నారు. వాళ్ళను చూచి మావటీలు విభ్రాంతు లయ్యారు. వాళ్ళు ఏనుగులను తోలలేదు!

ఇద్దరూ ఖడ్గాలను సర్రుసలాగి "ఊ! మీ పని కానివ్వండి! కదలకపోయారో మీ పని ఖాళీ!" అని హుంకరించారు.

చేసేదిలేక మావటీలు ఏనుగులను కొంతదూరం వెనుకకు తీసుకుపోయి, ద్వారంవైపు వేగంగా పరుగెత్తించారు.

ఇప్పుడు గజరాజులకు ఇనుప ములుకుల గుబ్బలు కనబడలేదు. వాటికి అడ్డుగా షెకావత్, చందావత్లు ఉన్నారు!

ఏనుగుల దెబ్బకు తలుపులు భళ్ళున పగిలిపోయాయి.

మావటీలు హాహాకారాలు చేశారు.

దేవీయర్ కోటద్వారాలు తెరుచుకున్నాయనే సంబరంతో ప్రతాపుడు కోట దర్వాజా దగ్గరకు తిరిగి చేరుకున్నారు. అక్కడి దృశ్యంచూచి విచలితుడయ్యాడు. కోట తలుపుల ఇనుప ములుకులు వెన్నునుండి ముందుకు పొడుచుకొనివచ్చి షెకావత్, చందావత్లు విగతజీవులయ్యారు.

"ఆదర్శవీరులైన షెకావత్, చందావత్ల ఆత్మత్యాగం రిత్తవోవరాదు! ఆలస్యం చేయకుండా కోటను ఆక్రమించండి!" కృష్ణసింహుడు రాణాప్రతాప్ను ఓదార్చి, కర్తవ్యం బోధించాడు.

ప్రతాప్ ద్విగుణీకృతోత్సాహంతో కోట లోపలకు దూకాడు.
అప్పుడప్పుడే మత్తులోంచి తేరుకుంటున్న తురుష్కులు ఆయుధాలకోసం వెతుకు తున్నారు.

అమరసింహుడు చెంగున గుర్రంపై లోనికి జొరబడి వీరవిహారం చేయడం మొదలుపెట్టాడు.

లోపలవున్న షాబాజ్ఖాన్ తన సైన్యాన్ని సన్నద్ధం చేద్దామనుకునేలోపే సగంమంది ణి పోగొట్టుకున్నాడు. రాణాప్రతాపుడు

కాలయముడులాగా వారినందర్నీ తన కరవాలానికి ఎరగావించాడు. వెనక్కి తిరిగి పరుగెత్తడానికి కూడా వీలు లేకపోవడం వలన విదేశీ దురాక్రమణదారుల మూక రణమో మారణమో అని తెగించి యుద్ధం చేయవలసి వచ్చింది.

భిల్లులు దివిటీలు ధరించి, భీమచాంద్ నాయకత్వంలో కౌరవిదెయ్యాల లాగా కోటంతా కలయదిరిగి, దొరికినవారిని దొరికినట్లుగా పట్టుకొని తమ చిన్న కత్తులతో వారి కుత్తుకలు కోసిపారేస్తున్నారు.


కృష్ణసింహుడు సూర్యధ్వజాన్ని ఒక చేతిలోనూ, పొడవైన ఈటెను ఇంకొక చేతిలోనూ పట్టుకొని “జై ఏకలింగేశ్వరా” అంటూ తురుష్కులపైబడి దెబ్బకు ముగ్గురి చొప్పున పొడిచి, కోటను పీనుగులరాసులతో నింపివేశాడు. శ్యామసింహుడు వీరసింహమై శత్రువుల పైబడి కనబడిన వారినందర్నీ చీల్చిచెండాడాడు.

భూపతిసింగ్, దూదాసింగ్, ముకుందదాస్ మొదలైన వీరులంతా వీరమత్తేభాలై ఘీంకరించి సమరాంగణాన నిలిచారు. షాపూర్, బునేరా రాజులు, బేద్లా ప్రభువు, కోటీరియా నృపుడు... ఒక్కరేమిటి రాణా అనుచరులంతా ఒక్కొక్క దొక్కొక్క సూర్యుడై కోటలో నిలిచి ఆ అర్ధరాత్రిని తమ వీరప్రకాశంతో ధగద్ధగలాడించారు.

తనవారి పాటు చూచి షాబాజ్ఖాన్ ఒళ్ళు తెలియని కోపంతో తనవారినీ, పెర వారినీ తేడా వీడి కనబడిన వారినందర్నీ నరకడం మొదలుపెట్టాడు.

ఎట్టఎదుట వేయిసూర్యుల వెలుగులతో ప్రత్యక్షమైన రాణాప్రతాపుణ్ణి గాంచి, కన్నులు బయర్లుగమ్మగా, చెమటతో దేహం తడిసిపోగా, ఒడలు గడగడ వణుకుతూ వుండగా షాబాజ్ఖాన్ ఖడ్గం పైకి ఎత్తాడు. ఖడ్గం పైకి ఎత్తాడు. రాణాప్రతాపసింహుడు సింహగర్జనచేసి, తన కరవాలంతో బలంగా షాబాజాఖాన్ శిరస్సుపై ఒక్కవేటు వేశాడు. మరుక్షణం ఖాన్ దేహం రెండు వ్రయ్యలై నేలకూలింది. యుద్ధం పరిసమాప్తి అయ్యింది. దేవియర్కోట ప్రతాపుని వశమైంది. రాణా సుడిగాలిలా ఒక్క ఊపులో అక్బర్ ఆక్రమించిన ప్రాంతాల పైబడి మేవాడ్లోని అత్యధిక భాగాలను తిరిగి తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడు. చిత్తోడ్, అజ్మేర్, మండల్ గఢ్ ప్రాంతాలు మాత్రం మిగిలిపోయాయి. సమాధిలోనుండి కూడా ప్రతాప్ తిరిగి లేచి రాగలడని మాన్ సింగ్ భయపడుతూ ఉండేవాడు. అతని భయం నిజమైంది. రాణాప్రతాప్ అంతటితో ఆగక, అంబర్ రాజ్యంపైబడి ముఖ్య వాణిజ్యకేంద్రమైన మాలురాను ఊచముట్టుగ దోచుకున్నాడు!

**(ఇంకా ఉంది)**



మొదటి బహుమతి పొందిన కవిత

# ప్రతి ఇల్లు ఒక బృందావనం

శింగిరాజు శ్రీనివాసరావు

పచ్చని వనాలు నవ్వడం మానేసి

ఏ కత్తి పదునెంతో తెలియక వణికి పోతున్నాయి

మానవుడి గుండెల స్వార్థపు హోమగుండంలో

సమిధలవుతున్నవి అడవి బిడ్డలు

అమ్మ వంటిచుట్టూ పచ్చచీరె లేదిప్పుడు

వంటినిండా గునపాల గాట్లు తప్ప

రెక్కల తుంచి ఊయలనిచ్చి బిడ్డను మోసి

కట్టెను కాల్చే కట్టెలను తన తనువును త్రుంచి ఇచ్చి

మౌనంగా నిలిచిన ఎవరూ పెంచని దేహం ఎదురుతిరగలేక

ఎద మీద తగిలే గాయాలకు కన్నీరు కారుస్తున్నది

మన చేతికి చేతికర్ర నిచ్చిన తరువు తల్లి కన్నీరును

తుడిచే చేయి ఎక్కడా కనపడటం లేదు

ఔను నిజం..ఎవరి చేతులూ ఖాళీగా లేవు

చరవాణి తెరపై తాండవం చేస్తున్నాయి

ఎవరి మనసులూ మానవత్వాన్ని మోయడం లేదు

అరిషడ్వర్గాల మత్తులో జోగుతున్నాయి

చెట్టు నీడన ప్రాణాలు నిలుపుకున్నపుడే కదా

చంద్రమండలం మీద నివాసానికి ఆలోచించగలవు

గుప్పెడు గుండె కొట్టుకోవాలంటే

గుమ్మటం వంటి చెట్లకొమ్మల గుబురులు కావాలి

రేపటితరానికి జవసత్వాలు అందించాలంటే

ధరణి తల్లి తనువు మీద పచ్చని తివాచి పరవాలి

గొడ్డలి వదిలి చేతులు చిరుమొక్కలను పట్టాలి

ప్రతి ఇల్లు బృందావనమై హరివిల్లుల తోరణమై వెలగాలి...



# మురికివాడల పిల్లల ఫ్యాషన్ షో



ఓ ఫ్యాషన్ షూట్ వీడియో వైరల్‌గా మారింది. ఓ పేద విద్యార్థుల గ్రూప్‌ను ఈ వీడియో స్థానిక సెలబ్రిటీలుగా మార్చివేసింది. 12 నుంచి 17 ఏళ్ల మధ్య వయసున్న పిల్లలు ఆ వీడియోలో కనిపిస్తారు . వారిలో ఎక్కువ మంది అమ్మాయిలే. వారంతా ఎరుపు, బంగారు రంగు దుస్తులు ధరించారు. అవన్నీ కొందరు వాడి వదిలేసిన దుస్తులతో తయారు చేసిన డ్రెస్‌లే.ఆ డ్రెస్‌లను ఆ పిల్లలే రీడిజైన్ చేసి కుట్టుకున్నారు. మోడళ్ల మాదిరిగా ప్రదర్శన నిర్వహించారు. ర్యాంప్ వాక్ చేశారు. మురికి వాడల్లోని మురికి గోడలు, మిద్దెలు వారి ర్యాంప్ వెనక బ్యాక్‌డ్రాప్‌గా ఉన్నాయి. ఇన్నొవేషన్ ఫర్ చేంజ్' అనే ఇన్‌స్టాగ్రామ్ పేజీలో ఈ నెల ఆరంభంలో ఈ వీడియో మొదట కనిపించింది. ఇన్నొవేషన్ ఫర్ చేంజ్ అనేది లఖ్‌నవూకు చెందిన స్వచ్ఛంద సంస్థ.

నగరాల మురికివాడల్లోని 400 మంది చిన్నారుల కోసం ఈ స్వచ్ఛంద సంస్థ పనిచేస్తోంది. వారికి ఆహారం, విద్య, ఉద్యోగ నైపుణ్యాల శిక్షణ అందిస్తోంది. వీడియోలో కనిపించిన చిన్నారులు ఈ ఎన్జీవో ద్వారా సాయం పొందుతున్న విద్యార్థులు.బాలీవుడ్ నటుల దుస్తుల ఎంపికలను ఎప్పుడూ ఇన్‌స్టాగ్రామ్‌లో గమనిస్తుంటామని, వాటిలో కొన్ని దుస్తుల అనుకరణలను తరచుగా తమ కోసం తయారు చేసుకుంటుంటామని అంటున్నారు వీళ్ళు .

ఈ వీడియో కోసం పిల్లలు బాలీవుడ్ సెలబ్రిటీలకు, హాలీవుడ్ నటీమణులకు, బిలయనీర్లకు దుస్తులు డిజైన్ చేసే సబ్యసాచి ముఖర్జీ ఫ్యాషన్ డ్రెస్‌లను గమనించారు. సబ్యసాచి ముఖర్జీకి డిజైనర్‌గా అంతర్జాతీయ గుర్తింపు ఉంది. కిమ్ కర్దాషియన్ 2018లో వోగ్ షూట్‌లో సబ్యసాచి డిజైన్ చేసిన ఎర్ర చీర ధరించారు.భారత్‌లో సబ్యసాచిని ''వెడింగ్స్ కింగ్'' అని కూడా పిలుస్తారు. అనుష్కశర్మ, దీపికా పదుకొణె వంటి బాలీవుడ్ సెలబ్రిటీలతో పాటు వేలమంది వధువులకు పెళ్లిదుస్తులను సబ్యసాచి రూపొందించారు. ప్రియాంక చోప్రా కూడా తన పెళ్లిలో సబ్యసాచి డిజైన్ చేసిన ఎర్రచీర కట్టుకున్నారు. సబ్యసాచి వధువుల కోసం సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా తయారు చేసిన దుస్తులను స్ఫూర్తిగా తీసుకుని 'యే లాల్ రంగ్(ఎరుపు రంగు)' అనే పేరుతో ఈ ప్రాజెక్టు ప్రారంభించారు వాళ్ళు .

దాతలు ఇచ్చిన దుస్తులను జల్లెడపట్టి, ఎర్ర రంగులో ఉన్న వాటన్నింటినీ ఎంచుకున్నారు . వాటన్నింటినీ కలిపి మాకు కావాల్సినట్టుగా, కోరుకున్న విధంగా మార్చుకున్నారు . ఇందుకోసం చాలా కష్టపడ్డారు .అమ్మాయిలు మూడు, నాలుగు రోజుల్లో 12 రకాల డ్రెస్‌లు కుట్టారు. ర్యాంప్‌వాక్ కోసం సబ్యసాచి వీడియోల్లో మోడళ్లను జాగ్రత్తగా గమనించి, వారిని అనుకరించారని తెలిపింది.

మోడళ్ల లో కొందరం సన్‌గ్లాస్ పెట్టుకున్నారు . ఒకరు సిప్పర్‌తో, ఇంకొకరు చంక కింద దుస్తుల మూట ఉంచుకుని ర్యాంప్ వాక్ చేశారు. కొన్ని అయితే అనుకోకుండా అలా జరిగిపోయాయి. మురికివాడల చిన్నారులు ప్రతిష్టాత్మకంగా భావించి చేసిన ఈ ప్రాజెక్టు భారత్‌లో అనేకమంది హృదయాలను గెలుచుకుంది. అతి తక్కువ డబ్బులతో, దాతలు ఇచ్చిన దుస్తులతో కలిసికట్టుగా అందరూ కలిసి రూపొందించిన ఈ వీడియోను సబ్యసాచి ముఖర్జీ ఇన్‌స్టాగ్రామ్‌లో హార్ట్ ఎమోజీతో రీపోస్ట్ చేశారు. ఆ తర్వాత ఇది వైరల్‌గా మారింది.

ఈ వీడియోపై పెద్దఎత్తున ప్రశంసలు కురిశాయి. సోషల్ మీడియాలో చాలా మంది ఈ చిన్నారుల పనితీరును నిపుణులతో పోలుస్తూ కామెంట్లు పెట్టారు. ఈ వైరల్ వీడియో వల్ల చారిటీ సంస్థ, వారి స్కూల్ అందరి దృష్టినీ ఆకర్షించింది. చాలా టీవీ చానళ్లు ఆ స్కూల్‌ను సందర్శించాయి. వీడియోలో నటించిన పిల్లల్లో కొందరిని తమ షోల్లో పాల్గొనాల్సిందిగా ప్రముఖ ఎఫ్ఎం రేడియో స్టేషన్లు ఆహ్వానించాయి. సినీ నటి తమన్నా ఈ పిల్లల దగ్గరకు వెళ్లారు. అయితే, ఈ వీడియోపై విమర్శలు కూడా వచ్చాయి. చిన్నవయసు అమ్మాయిలను పెళ్లికూతుళ్లలా చూపించడం వల్ల బాల్యవివాహాలను ప్రోత్సహించినట్టవుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిర్ణీత వివాహ వయసు 18 ఏళ్లు రాకముందే లక్షల మంది అమ్మాయిలకు తల్లిదండ్రులు పెళ్లిళ్లు చేస్తున్న దేశంలో ఇలాంటి వీడియోలు సరైనవి కావన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఈ విమర్శలపై ఇన్నోవేషన్ ఫర్ చేంజ్ ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందించింది. బాల్యవివాహాలను ప్రోత్సహించే ఉద్దేశం తమకు లేదని తెలిపింది.

★★★★

# అంత్యక్రియల్లో డ్యాన్స్‌చేసే అమ్మాయిలు



ఏవరైనా పెద్దవారు చనిపోయినప్పుడు, బ్యాండ్, మ్యూజిక్‌తో అంత్యక్రియలకు తీసుకెళ్లడమన్నది సంప్రదాయం. కానీ, డ్యాన్స్‌లు వేయడం అన్నది ప్రస్తుతం సరికొత్త ట్రెండ్‌గా మారింది.చావైనా, పెళ్లయినా డ్యాన్స్ అనేది ఇప్పుడు అన్నింటికీ అవసరమవుతోంది. ఎలాంటి కమీషన్ లేకపోతే (కొందరు మధ్యవర్తులు వీరి కూలీలో కొంత తీసుకుంటారు), ఒక రాత్రి కార్యక్రమానికి ఆరు వేల వరకు సంపాదించుకోవచ్చు. డ్యాన్స్ కార్యక్రమం రాత్రి ఎనిమిది, తొమ్మిదికి మొదలవుతుంది. తెల్లవారుజామున నాలుగు, ఐదు గంటల వరకు జరుగుతుంది. తొలుత హిందీ పాటలు పెడతారు. రాత్రి 12 గంటల నుంచి భోజ్‌పురి పాటలు ప్లే చేస్తారు. భోజ్‌పూర్, ఔరంగాబాద్, బంకా సహా.. బిహార్‌లోని చాలా ప్రాంతాల్లో అంత్యక్రియల్లో డ్యాన్స్‌లు చేసే ట్రెండ్ పెరుగుతోంది. అంత్యక్రియల సమయంలో ప్రజలు డ్యాన్స్ ప్రోగ్రామ్‌లు పెడుతూ.. గాలిలోకి కాల్పులు కూడా జరుపుతుంటారు.

ఇటీవలే, ఒక చోట అంత్యక్రియల సందర్భంగా నిర్వహించిన ''బాయిజీ కా నాచ్'' సందర్భంగా నలంద జిల్లాకు చెందిన అశీర్వాద్ కుమార్ అనే వ్యక్తి బుల్లెట్ తగిలి మరణించారు. అంత్యక్రియల కార్యక్రమాల్లో నిర్వహించే డ్యాన్స్ ప్రోగ్రామ్‌లలో, కొందరు చేతుల్లో గన్‌లు పట్టుకుని డ్యాన్స్ చేసే వీడియోలు చాలానే వైరల్ అవుతున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని పీజీ ఘాజిపూర్ కాలేజీలో రామ్ నారాయణ్ తివారి ఇంగ్లీష్ టీచర్‌గా పనిచేస్తున్నారు. 'భోజ్‌పురి కార్మికుల జానపద గేయాల్లోని జంతసార్' అనే పుస్తకంతో పాటు పలు పుస్తకాలను రామ్ నారాయణ్ తివారీ రాశారు. మరణాలకు సంబంధించిన మూడు రకాల పాటలు ఉన్నాయి. ఒకటి మృత్యు గీత్. రెండోది నిర్గుణ్, మూడోది శ్రీ నారాయణి. అంత్యక్రియలప్పుడు మహిళలు ఏదైనా చెబుతూ ఏడవడాన్ని రుద్రన్ గీత్ అంటారు.

చావుతో ముడిపడి ఉన్న సంప్రదాయ గేయాలలో అపరాధం, కరుణ, శాంతి ఉంటుంది. కానీ, ప్రస్తుతం పెడుతున్న పాటలు, డ్యాన్స్ చేసేందుకు మహిళలను పిలవడం వంటివి వారి కులాధిపత్యం చూపించుకునేందుకు ప్రదర్శిస్తున్నారు. మరణాంతరం, చనిపోయిన వారికి, ఈ భూమ్మీద ఉన్న వారికి ఈ జర్నీని సులభతరం చేయాలని కోరుతూ పాటలు ఉండేవి. ప్రస్తుతం ప్రత్యేకంగా డ్యాన్సర్లను పిలిపించి, భోజ్‌పురి పాటలకు రెచ్చగొట్టేలా డ్యాన్స్‌లు వేయిస్తున్నారు. సమాజానికి ఈ ట్రెండ్ అంత మంచిది కాదని సామాజికవేత్తలు అంటున్నారు. దీనివల్ల వచ్చే పర్యవసనాలు ఏమిటి? అని ప్రశ్నించినప్పుడు, చావుకి, జీవితానికి మధ్య తేడాన్ని మనం చెరిపేసినప్పుడు, పశ్చాత్తాపం, హింసపై ద్వేషం, శాంతి, మరణం తర్వాత సంయమనం పాటించే ప్రవర్తన ఇలా అన్నింటిన్ని కోల్పోతాం. దీనివల్ల, సమాజం మరింత హింసాత్మకంగా మారుతుంది.

సీరియల్




# గర్భశ్లోకం

ఈదర శ్రీనివాస రెడ్డి

మఫ్టీలో ఓ పది  మంది పోలీసులను షూటింగ్ జరిగే స్టూడియో చుట్టూ మొహరించాడు వివేక్ . తను కూడా మఫ్టి లోనే స్టూడియో లోపల షూటింగ్ జరిగే ప్రాంతంలో ఒక పక్కగా కుర్చి వేసుకుని నిశతంగా, అక్కడకు వచ్చే వాళ్ళు, పోయే వాళ్లను గమనించ టం ప్రారంభించాడు.

భార్గవి దురదృష్టమో  లేక ఉషకి ఇంకా ఈ భూమి మీద నూకలు వున్నామేమో తెలియదు. భార్గవి ఎక్కడైతే నిలబడి తన పథకాన్ని అమలు చేద్దామనుకుందో అక్కడే తిష్ట వేశాడు ఎస్ ఐ  వివేక్

భార్గవి మారు వేషంలో అదీ మగవాడి వేషంలో వుండటంతో, అక్కడ ఎదురుగా తిరుగుతున్నా వివేక్ కనిపెట్టలేక పోయాడు. కాని భార్గవి ఎస్.ది. వివేకిని ఇట్టే పసి గింట్టి ది.

## జరిగిన కథ

ఓ గుర్తు తెలియని మహిళ , పోలీసులు వెంబడిస్తుంటే తన బిడ్డతో సహా కృష్ణా నదిలోకి దూకుతుంది .ప్రముఖ హీరోయిన్ సుస్మిత హత్యకు గురవుతుంది .డి సి పి శ్రీనివాస రావు కేసు టేక్ అప్ చేస్తాడు .సుస్మితను పెళ్లి చేసుకోమని హీరో నవీన్ బ్లాక్మెయిల్ చేస్తుంటాడు .జూనియర్ ఆర్టిస్ట్ కాంతం తన కూతురు సుస్మితని ఇండస్ట్రిలో పెద్ద స్టార్ని చెయ్యాలని ప్రయత్నిస్తుంది.డి . సి పి మళ్ళి ఒకసారి హత్యా జరిగిన ఇంట్లో వాళ్ళఅందిరిని ప్రశ్నిస్తాడు . ఊరి శివార్లలో ఎవరిదో శవం ఉన్నాదని తెలిసి అక్కడకు వెళతాడు డి .సి .పి.అక్కడ శవం పక్కన పోలీసులు పెట్టుకునే స్టార్ పడి ఉంటుంది. సుస్మితను పెళ్లి చేసుకోవటానికి నవీన్ ఇష్టపడకపోతే సి .ఐ. అంబుజం ఒప్పిస్తాడు. ఎంత ప్రయత్నించినా ఒక్క సాక్ష్యం కుడా సేకరించలేక పోవటంతో సుస్మిత నటించిన సినిమాల్లో పనిచేసిన వాళ్ళను ఇంటరాగేట్చెయ్యాలని నిర్ణయించుకుంటారు. తీరా వాహిని స్టూడియో కి వివేక్ వెళ్లేసరికి డైరెక్టర్ అనిల్ కుమార్ తన కారవాన్ లో చచ్చిపడి ఉంటాడు . డి.సి. పి తన బృందం తో అక్కడి కెళ్ళి దర్యాప్తు చేస్తే అనిల్ ని చంపింది కుడా ఒక ఆడదే అని తెలుస్తుంది.ఉష మీద అనుమానం తో ఆమె ఫోటో తో పోల్చి చూస్తాడు వివేక్ .సుస్మిత వేణు అవుట్ డోర్ షూటింగ్ కి వెళతారు .వాళ్ళతో పాటు రౌడి శంకర్ కుడా వాళ్ళను అనుసరిస్తాడు .సుస్మిత వేణు గుడిలో ఎవ్వరికి తెలియకుండ పెళ్లి చేసుకుంటారు . సరగోసి ద్వారా బిడ్డని కనాలని నిర్ణయించుకుంటారు. సుస్మిత వేణు దగ్గరవుతున్నాడని అతనికి వేరే పెళ్లి చెయ్యాలని ఆలోచిస్తాడు అనిల్ . విషయం తెలిసిన వేణు వేరొక అమ్మాయిని పెళ్లి చేసుకుంటాడు . రౌడి షీటర్ శంకర్ కుడా హత్యకు గురౌతాడు .దానితో భయపడిన సి ఐ అంబుజం నిజాన్ని పోలిసులముందు ఒప్పుకుంటూ జరిగింది చెబుతాడు హంతకురాలు పట్టుబిడిందని పోలీసులు ప్రకటన ఇస్తారు . భార్గవి కో కోసం వల పన్నుతాడు వివేక్

## ఇక చదవండి

లేళ్ళను వేటాడే సింహానికి లేడిని పెద్దగా గుర్తు పెట్టుకోదు, కాని లేడికి మాత్రం తనను వేటాడే సింహం ఎప్పుడూ గుర్తే

వివేక్ ను చూడగానే నిశ్శబ్దంగా అతనికి కనపడకుండా ఒక మూలకు చేరి అక్కడ నుంచి ఏం జరగబోతుందా అని గమనిస్తోంది భార్గవి.

ఇవేవి తెలియని ఉష మాత్రం హీరోయిను మేకప్ చెయ్యడంలో నిమగ్నమై పోయింది.

“భార్గవి తన మొగిడిని, తన పిల్లాడిని తనకు కాకుండా చేసిన వాళ్ళను ఒక్కోక్కరిని చంపుకొస్తాంది అంటే ఒక అర్థం వుంది. కాని అసలు భార్గవి భర్తను, పిల్లాడిని చంపాల్సిన అవసరం సుస్మితకు ఎందుకు వచ్చింది. మిగిలిన వారందరూ ఎందుకు సుస్మితతో చేతులు కలిశా రు” అ నుకుండూ ఒకసారి కేసు మొత్తాన్ని విశ్లేషించటం ప్రారంభించాడు, డి.సి.పి శ్రీనివాస రావు.

ఆస్తి కోసమే ముసలి హీర్లో నవీన్ సుస్మితను రెండో పెళ్లి చేసుకున్నాడు. ఇండస్ట్రీలో నిలబడటానికి ఎవరో ఒకరి అండ కావాలి కాబట్టి నవీన్ తో పెళ్ళికి ఒప్పుకుంది. కాని ప్రేమించిన వేణుని వదులు కోలేక రహస్యంగా రెండో పెళ్ళి చేసుకుని కాపురం చెయ్యటం మొదలుపెట్టింది. వేణు మీద ప్రేమతో తన ఆస్తికి వారుసుడు వేణు మని కాగితాలు రాసి తన లాయరు దగ్గర దాచింది సుస్మిత, అది ఎవ్వరికీ తెలియదు .
కాని రాను రాను సినిమాలు పెరగటం, సంపాదన ఎక్కువ అవ్వటం తో వేణు ని పట్టించుకోవటం మానేసింది. దానితో వేణు సుస్మితకు దూరం జరగటం మొదలు పెట్టాడు.

అదే అద నుగా భావించి ఆస్తికోసం వేణుకి తన చే ల్లెలితో పెళ్ళి జారిపించాలని ప్రయత్నించి విఫలమయింది ఉష. వేణు భార్గవిని చేసుకోవటం, అమెకు ఒక పిల్లాడు కూడా పుట్టటం తో ఉష సుస్మితకు ఈ విషయం చెప్పి, అతని పై కక్ష,తీర్చు కోమని రెచ్చకొట్టింది. ఆవేశంతో వేణుపై పగ తీర్చుకోటానికి సి.ఐ. అంబుజం సాయం కోరింది . అప్పటికే సుస్మిత పైన కన్నేసిన అంబుజం, డైరెక్టరీ అనిల్, అంతా కలసి వేణుని ఊరుచివరకు తీసుకు వెళ్లి చంపారు. భార్గవిని, ఆమె పిల్లాడిని చంపే ప్రయత్నంలో భార్గవి బతికి బయట పడింది.

ఒక మనిషిగా ఇదంతా చూస్తే భార్గవి చేస్తొంది తప్పు కాదనిపించింది. భార్గవి మీద మొట్టమొదటి సారి జాలివేసింది. ఎలాగైనా భార్గవిని ఈ కేసునుంచి బయట పడేయాలనిపించింది.


కాని బాధ్యతాయుతమైన పదవిలో వున్నాడు కాబట్టి భార్గవిని పట్టుకోవాల్సిందే. దీనికంతటికీ సూత్రధారి ఉష . ఉషను పట్టుకుని తమదైన శైలిలో విచారిస్తే సరిపోతుంది కదా . ఇంతకాలం ఉష బయటకు రాలేదు. ఇప్పుడు బయట కాచ్చి తిరుగుతోంది కదా. ఉషను పట్టు కోకుండా, అనవవసరంగా భార్గవి కోసం సమయం వృధా చేస్తున్నాడేమో వివేక్ అనిపించింది డి.సి.పికి.

ఉషని పట్టుకుంటే, భార్గవి కూడా తేలిగ్గా దొరుకుతుంది. ఎర దగ్గరకు చేప తప్పకుండా వస్తుంది. అంతే కాని ఎరను , చపను రెండింటిని నీళ్ళలో ఒదిలేసి, ఒట్టి గాలం పట్టకు ని జట్టున కూర్చు నట్టుంది తమపని అని అనుకుంటూ ఎస్. ఐ వివేక్ కి ఫోన్ చేశాడు.

ఫోన్ లో తన ప్లాన్ చెప్పుకొచ్చాడు డి,సి .పి , వివేక్ కి

"ఒకే సారి మీరు చెప్పినట్లే చేస్తాను ... అంటూ కుర్చీ లోనుంచి లేచాడు వివేక్
(ఇంకా ఉంది )



## వైరల్

# తృప్తి కల మనిషే నిజమైన ధనవంతుడు...



తృప్తికి / ఆశకి హద్దు ఎక్కడ?..అస్సలు ఉండదు ఈరోజుల్లో..“ఇంకా కావాలి,ఇంకా ఇంకా కావాలి, మొత్తం నాకే కావాలి” ఇదే నేటి మనుష్యుల ఆలోచన..

మేధస్సు మరియు వినోదాన్ని మిళితం చేసే “కౌన్ బనేగా కరోడ్‌పతి” షోని అందరూ ఆనందిస్తున్నారు..
ఇది అందరి జ్ఞానాన్ని పెంచుతుంది కూడా. ఇటీవలి ఎపిసోడ్‌లో నీరజ్ సక్సేనా “ఫాస్టెస్ట్ ఫింగర్” రౌండ్‌లో అత్యంత వేగంగా సమాధానమిచ్చి హాట్ సీట్‌లో నిలిచాడు..అతను అరవకుండా,డ్యాన్స్ చేయకుండా,ఏడవకుండా,చేతులు ఎత్తకుండా,అమితాబ్‌ను కౌగిలించుకోకుండా చాలా ప్రశాంతంగా కూర్చున్నారు..

నీరజ్ ఒక శాస్త్రవేత్త, Ph.D. మరియు కోల్‌కతాలోని ఒక విశ్వవిద్యాలయానికి వైస్-ఛాన్సలర్..
అతను ఆహ్లాదకరమైన మరియు సరళమైన వ్యక్తిత్వం కలిగి ఉన్నారు..డా. ఎ.పి.జె.తో కలిసి పనిచేయడం తన అదృష్టంగా భావిస్తున్నాను అని చెప్పారు..నేను మొదట నా గురించే ఆలోచించేవాడేనని..అబ్దుల్ కలాం ప్రభావంతో నేను ఇతరుల గురించి మరియు దేశం గురించి కూడా ఆలోచించడం ప్రారంభించానని చెప్పారు.

నీరజ్ ఆడటం మొదలుపెట్టారు..అతను ప్రేక్షకుల పోల్‌ను ఒకసారి ఉపయోగించాడు, కానీ అతను ”డబుల్ డిప్” లైఫ్‌లైన్‌ని కలిగి ఉన్నందున,అతను దానిని మళ్లీ ఉపయోగించుకునే అవకాశం పొందాడు.

అతను అన్ని ప్రశ్నలకు సులభంగా సమాధానం చెప్పాడు.అతను ₹3,20,000 మరియు సమానమైన బోనస్ మొత్తాన్ని గెలుచుకున్నాడు,ఆపై విరామం లభించింది.

విరామం తర్వాత అమితాబ్ “ముందుకు వెళ్దాం డాక్టర్ సాహబ్ అన్నాడు..ఇదిగో పదకొండో ప్రశ్న “అని ప్రకటించాడు,అప్పుడే నీరజ్ “సార్ నేను నిష్క్రమించాలనుకుంటున్నాను” అని చెప్పాడు.

# వైరల్

అమితాబ్ ఆశ్చర్యపోయాడు..ఎవరైనా చాలా బాగా ఆడుతున్నారు,ఇంకా మూడు లైఫ్‌లైన్‌లు మిగిలి ఉన్నాయి మరియు కోటి (₹1,00,00,000) గెలుచుకునే మంచి అవకాశం ఉన్నందున నిష్క్రమిస్తున్నారా? "ఇంతకుముందెప్పుడూ ఇలా జరగలేదు"ఎందుకు క్విట్ అంటున్నావు అని అడిగాడు...నీరజ్ ప్రశాంతంగా సమాధానమిచ్చాడు.."ఇతర ఆటగాళ్లు వేచి ఉన్నారు,వారు నా కంటే చిన్నవారు..వారికి కూడా అవకాశం రావాలి..
నేను ఇప్పటికే చాలా డబ్బు గెలుచుకున్నాను..

'నాకు ఉన్నది చాలు' అని నేను భావిస్తున్నాను. నాకు అంతకుమించి కోరిక లేదు..." అమితాబ్ దిగ్భ్రాంతి చెందాడు మరియు అక్కడ ఒక క్షణం నిశ్శబ్దం.అప్పుడు అందరూ లేచి నిలబడి చాలాసేపు చప్పట్లు కొట్టారు.ఈ రోజు మనం చాలా నేర్చుకున్నాం,ఇలాంటి వ్యక్తిని చూడటం చాలా అరుదు అని అమితాబ్ అన్నారు..

నిజం చెప్పాలంటే,ఇతరులకు అవకాశం రావడం గురించి ఆలోచించే మరియు తమ వద్ద ఉన్నదానికంటే ఎక్కువ అని భావించే వ్యక్తిని నేను ఇదే మొదటిసారి చూడటం అతనికి మనస్ఫూర్తిగా సెల్యూట్ చేస్తున్నాను అని అమితాబ్ అన్నారు..
నేడు ప్రజలు కేవలం డబ్బు వెంటే ఉన్నారు..ఎంత సంపాదించినా తృప్తి ఉండదు,దురాశకు అంతం ఉండదు.. డబ్బు వెంటాడుతూ కుటుంబాన్ని,నిద్రను,ఆనందాన్ని,ప్రేమను,స్నేహాన్ని కోల్పోతున్నారు. అలాంటి సమయాల్లో డాక్టర్ నీరజ్ సక్సేనా లాంటి వారు గుర్తుకు వస్తారు. ఈ యుగంలో, సంతృప్తి మరియు నిస్వార్థ వ్యక్తులు దొరకడం కష్టం.
అతను గేమ్ నుండి నిష్క్రమించిన తర్వాత,ఒక అమ్మాయి హాట్ సీట్‌లో కూర్చుని తన కథను పంచుకుంది. "మేము ముగ్గురు కుమార్తెలమైనందున మా నాన్న మమ్మల్ని మా అమ్మతో సహా బయటకు పంపించేసాడు.. ఇప్పుడు మేము అనాథాశ్రమంలో నివసిస్తున్నాము..."


నేను అనుకున్నాను నీరజ్ నిష్క్రమించకపోతే,ఈరోజు చివరి రోజు కాబట్టి,మరెవరికీ అవకాశం లభించదు.. అతని త్యాగం కారణంగా ఈ పేద అమ్మాయికి కొంత డబ్బు సంపాదించే అవకాశం వచ్చింది..


నేటి ప్రపంచంలో ప్రజలు తమ వారసత్వం నుండి ఒక్క పైసా కూడా వదులుకోవడానికి సిద్ధంగా లేరు..దాని మీద కొట్లాటలు,హత్యలు కూడా చూస్తున్నాం..స్వార్థం ప్రబలుతోంది..కానీ ఈ ఉదాహరణ మినహాయింపు..

ఇతరుల గురించి,దేశం గురించి ఆలోచించే నీరజ్ లాంటి మనుషుల్లో దేవుడు ఉంటాడు.ఇలాంటి అరుదైన గొప్ప వ్యక్తి ఎందరికో స్ఫూర్తిప్రదాత..ఇలాంటి వ్యక్తిని మనం మరువలేము..ఇలాంటి గొప్ప వ్యక్తి గురించి రాసే అవకాశం లభించినందుకు సంతోషిస్తున్నాను..

మీ అవసరాలు తీరినప్పుడు,మీరు ఆపి ఇతరులకు అవకాశం ఇవ్వాలి..స్వార్థాన్ని విడనాడి అందరూ సంతోషంగా ఉంటారు..ఇది మన అందరం నేర్చుకున్న పాఠం..మనం ఎల్లప్పుడూ ఇలాంటి వ్యక్తులను ఆరాధించాలి.అలాగే వారి గురించి నిజాయితీగా రాయడం సమాజం యొక్క అభివృద్ధికి అవసరమని నమ్ముతాను

# గాడిద బతుకులు





డా. మణికంఠ M.D

మనకు రోజు ఏ ఫేస్ బుక్కు లోనో ,వాట్సాప్ లోనో ఒక గాడిద తారసపడుతూ ఉంటుంది . ఇప్పుడు మీకు లాంటి ఓ గాడిద కదా చెప్పబోతున్నాను .ఒక చెట్టుకు ఓ గాడిద కట్టేయబడి ఉంది. దాని యజమాని రోజూ దాన్ని అలాగే కట్టేస్తూ ఉంటాడు, లేకపోతే ఇంట్లోకి చొరబడి గోలగోల చేస్తుంది , గాడిద కదా దానికి అసలే బుద్ధి తక్కువ .

ఆ చెట్టు మీదే ఓ దెయ్యం కాపురం ఉంటోంది . రోజు ఆ దెయ్యం గాడిద అవస్థలు చూస్తూ జాలిపడుతూ ఉంటుంది. ఓ రాత్రి ఆ చెట్టుపై ఉండే దెయ్యం జాలిపడి ఆ గాడిద కట్లను తెంచేసింది... ఇక ఆ గాడిద గట్టిగా ఒళ్లు విరుచుకుని, మరింత గట్టిగా ఓండ్ర పెట్టి లోకంపై పడింది...

ముందుగా ఆ పక్కనే ఉన్న పొలాల్లో అడుగు పెట్టి, ఆ చేను అంతా తొక్కి ధ్వంసం చేసింది...

# నాలుగో కోతి






దీంతో చిర్రెత్తిన ఆ రైతు భార్య గాడిదను ఓ గొడ్డలితో నరికేసింది...

ఇది చూసి కోపం ఆపుకోలేక సదరు గాడిద యజమాని ఆ రైతు భార్యను వేట కొడవలితో నరికేశాడు..

ఆమె భర్త ఊరుకుంటాడా...?

ఓ గునపం తీసుకొచ్చి ఆ గాడిద యజమాని గుండెల్లో పొడిచాడు.. వాడు వెంటనే చచ్చూరుకున్నాడు...

గాడిద యజమాని భార్య ఆగ్రహం పట్టలేక, కొంగు నడుంకు బిగించి కొడుకులను కేకేసింది...



వాళ్లంతా కలిసి ఆ రైతు ఇంటికి నిప్పెట్టారు...

తన ఇంటిని మంటల్లో చూసి, ఆ బూడిదతో కళ్లు మండిపోయిన రైతు ఆ గాడిద యజమాని భార్యను,కొడుకులను వెంటాడి వెంటాడి చంపేసాడు...

తరువాత కాసేపటికి ఆవేశం తగ్గి, ఆ దెయ్యాన్ని అడిగాడు రైతు .

. "ఎందుకు ఇంత మంది చావుకు కారణమయ్యావు..?"

దెయ్యం ఏమన్నదంటే..? "నన్ను అనవసరంగా నిందించకు... నేను ఒక్కరినైనా చంపానా..? చెట్టుకు కట్టేసి ఉన్న ఓ గాడిదను జాలితో విడిపించాను. అంతే... మీరే మీలో ఉన్న అసలు దెయ్యాలను స్వయంగా బయటికి తీసి, ఒకరికొకరు చంపుకున్నారు..."

మీడియా.., సోషల్ మీడియా కూడా అంతే... రోజుకో గాడిద కట్లు తెంపేసి, సమాజం మీదకు వదిలేస్తయ్... మనం వాదాలు, ద్వేషాలతో తన్నుకుంటూ, పాత స్నేహాల్ని కూడా చంపేసుకుంటూ ఉంటాం. కొత్త శత్రువుల్ని ఆహ్వానిస్తుంటాం.

సోషల్ మీడియా.. గత దశాబ్దంన్నర కాలంలో బాగా వినిపిస్తున్న పదం! సర్వం సోషల్ మయం అయిపోయింది. రోజులో కనీసం ఐదారు గంటల పాటు సోషల్ మీడియాలో గడిపేస్తున్న వారి జనాభా కూడా గణనీయంగా ఉంటుంది. ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థులు, గ్రామాల్లో పనులు చేసుకునే వారు.. ఇలా తేడా ఏమీ లేదు! గంటల కొద్దీ సోషల్ మీడియాలో సమయాన్ని ఇట్టే గడిపేస్తూ ఉన్నారు. మరి దీని ఫలితంగా సామాజిక పరిస్థితుల్లో కూడా చాలా

# నాలుగో కోతి

తేడాలొచ్చాయి!
తాము చేస్తోంది సోషల్ మీడియాలో చూపించుకోవడం ఒకటైతే, సోషల్ మీడియాలో చూపించుకోవడానికి చేయడం కూడా వృత్తిగా మారింది. వృత్తిగా మారిన వారిదైనా ఒక ఎత్తు అయితే, ఇతరుల పోస్టులను చూసి పోటీ పడే వారి పరిస్థితి మరో ఎత్తు! సోషల్ మీడియా మనుషుల మానసిక ఆరోగ్యాలను దెబ్బతీస్తోందని చెప్పడానికి పెద్ద పెద్ద అధ్యయనాలు అవసరం లేదు. ఇతరుల పోస్టుల మీద ఆలోచనలు సాగడమే పెద్ద మానసిక జబ్బు అని స్పష్టంగా చెప్పవచ్చు!

సోషల్ మీడియా ద్వారా కలిగే స్ట్రెస్, యాంగ్జైటీ, జలసీల పుణ్యమా అని అంతిమంగా డిప్రెషన్ లో కూరుకుపోయే అవకాశాలు ఉంటాయి. స్థాయిల్లో తేడాలు ఉండవచ్చు కానీ, విపరీతం అయిన సోషల్ మీడియా పుణ్యాన డిప్రెషన్ కలిగే అవకాశాలు 45 శాతం వరకూ ఉంటాయని అధ్యయనాలు చెబుతూ ఉన్నాయి. ఇతరులతో పోల్చుకోవడం, తమ పాపులారిటీని లైకుల్లో లెక్కేసుకోవడం, అతిగా తాపత్రయడపడటం.. ఇవన్నీ డిప్రెషన్ కు దారి తీసేలా చేయవచ్చు!

. సో, బహుపరాక్... అసలు దెయ్యాలు ఎవరో అర్థమైంది కదా... జాగ్రత్త...!!!

మాటని, ఆవేశాన్ని అదుపు చేసుకుంటే జీవితం ఆనందంగా ఉంటుంది..అవి అదుపులో పెట్టుకోలేక ఇప్పుడు చాలామంది జైలు పాలు అవుతున్నారు .ఎంత ఎత్తుకు ఎదిగితే మాట అంత పొదుపుగా వాడాలి .

ఉంటా మరి నేను కుడా మాటలు పొదుపుగా వాడ దల్చుకున్న ఇకనుంచి

★★★★

మొదటి బహుమతి పొందిన కవిత

# ఎనిమిదో అడుగు

నల్లు రామేష్

ఎడారులలోనే కాదు
ఎండమావులిప్పుడు
ఎక్కడపడితే అక్కడ
విచ్చలవిడిగా వెంట పడుతున్నాయి

అరణ్యాలలోనే కాదు
మనసు చంపే మృగాలు
అందమైన ఖాతా తెరిచి
అరచేతిలోనే తిరుగుతున్నాయి

నమ్మకపు పత్రమని
గుడ్డి ప్రేమతో
జీవితకాల సంతకం చేశావా
ముఖ పుస్తకంలో
మొదటి పేజీ తిప్పకుండానే
ఆఖరి పేజీ చదివేస్తావు

నా అన్న వారి చేయి వదిలి
ఏడు అడుగులు దాటి ఎనిమిదో అడుగు
శూన్యంలో రాల్చేశా!
కొంగుముడి కంటే
మాటలముడి తెగిపోదని
అగాధంలోకి దూకేశా!

నన్ను చేదుకునే మాట
ఇంట్లోనే ఉందని తెలియక
కన్నప్రేగు దాచుకున్న ప్రాణాన్ని వదిలేశా!
దుఃఖం
మహా సముద్రమై దూకినా
ఆవిరి చేసుకునే
ఆత్మీయ ఆకాశం ఉందని
ఆ క్షణం మరిచిపోయా!

కృష్ణ బిలం అంచున
ఒరిగి పోవడానికి సిద్ధపడ్డ
ఒంటరి తారలారా
మీకోసం సాగిన చేయిని
ఒక్కసారి వెను తిరిగి చూడండి

స్పందన లేని దేహంతో
ప్రకృతి ఎన్నటికీ స్పందించదు
కనీస పోరాటంతోనే
పచ్చని ప్రపంచం పుడుతుంది

నెట్టింటి రామాయణం

# " స్టేటస్ సింబల్స్"



ఈ. సాయి అలేఖ్య



చాలా సంవత్సరాల క్రితం అంటే  నా చిన్నతనం లో అన్నమాట , మా ఉళ్ళో ఒకరో ఇద్దరో మోతుబరి రైతులు వుండే వాళ్ళు ఓ వందెకరాల మాగాణి, ఓ ఏభైయకరాల మెట్ట, పదెకరాల మామిడితోట, ఊరి మధ్యలో ఓ పాతిక గడపల ఇల్లు, ఇంటి నిండా పాలేర్లు, నౌకర్లు, ఇంటి పక్కనే ఓ గోశాల అందులో ఓ నాలుగైదు పందెం గిత్తలు, ఓ పది గేదలు, ఇంటి ఎదురుగా రెండు

# నెట్టింటి రామాయణం

పాతకాలం కాలం నాటి విన్టేజి కార్లు , వసారాలో ఓ పెద్ద పడక్కుర్చి , ఇంట్లోకి ఆహ్వానిస్తూ, ఓ పెద్ద మండిగం, దానిపైన రెండు పెద్ద జింక కొమ్ములతో చేసిన ఓ బొమ్మ, ఇంటి లోపల రంగూన్ టేకుతో చేసిన సోఫాలు, డైనింగ్ టేబులు దానిమీద వెండి కంచాలు, వెండి గిన్నెలు .. ఇలా చెప్పకు పోతే చాలా వున్నాయండి. ఇవన్నీ మాకు తెలియవా?

కర్తలు గావుండి వాటి ఆలనా పాలనా చూసే వాళ్ళు ప్రతి పండగకి ఇంట్లో వాళ్ళతో పాటు , పాలేర్లకు, నౌకర్లకు కూడా బట్టలు కోనే వాళ్ళు, పాలేర్ల పిల్లలకు ఉచితంగా చదువులు చెప్పించే వాళ్ళు .

ఏమిటి 1960 దశకం నాటి బ్లాక్ అండ్ వైట్ సినిమా గుర్తొస్తుందా

నేను హైస్కూల్ కి వెళుతున్న రోజుల్లో, మోతుబరి రై తుల కుటుంబాల్లోని,రెండోతరం మూడోతరం వాళ్ళు వ్యవసాయం గిట్టుబాటు కావట్లేదని ఓయాభైయకరాలు అమ్మి పట్నంలో ఓ రైసు మిల్లు, సినిమా హాలు వంటి వ్యాపారాలు మొదలు పెట్టారు, మకాం కూడా పట్నానికి మార్చారు.



ఇంతక్కి ఎందుకు చెపుతున్నావు అంటారేమో ..ఆరోజుల్లో స్టేటస్ సింబల్స్ ఎలా వున్నాయ మీకు గుర్తు చేద్దామని.

అప్పట్లో వాళ్ళ స్టేటస్ కు

తగ్గట్టు దానధర్మాలు కూడా చేసేవాళ్ళు, చాల గుడులకి ధర్మ

అయితే అది నా తప్పు కాదు ఎందుకంటే నిన్నటి జీవితాలే నేటి సినిమాలు , జరిగిన కదలనే సినిమాలుగా తీస్తున్నారు . ఈ నాటి తరానికి ఇవవన్నీ తెలియక పోవచ్చుగా.. అందుకని చెపుతున్నా

ఓ పదేళ్ళ తరువాత అంటే

ఓ రోజు మా నాయన వాళ్ళ ఇంటికి తీసుకెళ్లాడు ఏదో పని మీద. బహుసా వాళ్ళ పొలం తాలుకు కౌలు డబ్బులు ఇద్దామని అనుకుంటా. మా నాన్న ఓ సన్నకారు రైతు, వున్న నాలుగెకరాలు తనే సాగు చేస్తూ గుట్టుగా సంసారం నెట్టుకొచ్చేవాడు.ఇప్పుడు మోతు బరి రైతుల పొలాలు

# నెట్టింటి రామాయణం

కూడా కౌలుకి తీసుకుని సాగు చేస్తున్నాడు

నాన్నను చూడగానే "రండి లోపలికి రండి "అంటూ గౌరవంగా లోపలికి పిలిచి కూర్చోపెట్టి మరీ కాఫీ ఇచ్చే వాళ్ళు అది వాళ్ళ సంస్కారం అనేకన్నా నాన్న తెచ్చిన డబ్బు మీద ప్రేమ అనుకోవచ్చు లేదా చదువులతో పాటు సంస్కారం కూడా పెరుగుతు వస్తోంది అనుకోవచ్చు. అంతకు ముందు వాళ్ళతాతలు తండ్రులు నాన్నను బయటే నిలబెట్టి "ఏరా.. ఒరేయ్. " అని పిలిచేవాళ్ళు. ఆ పిలుపులో ఆప్యాయత, అహంకారం రెండు కలిసి వుండేవి. ఇంకా చెప్పాలంటే అహంకారమే ఎక్కువ పాళ్ళు వుండేది .

నాన్న వాళ్ళతో మాట్లాడుతుంటే, నేను వాళ్ళ ఇల్లంతా కలియ తిరిగే వాడిని. వంటగదిలా వుండే "చద్ది పెట్టి " (అదేనండి ఫ్రిజ్ , దాన్ని మానానమ్మ అలాగే పిలిచేది) అంటే బాగా ఇష్టం. నేరుగా అక్కడికెళ్ళ, ఎవరూ చూడట్లేమ అని నిర్ధారించుకుని ఫ్రిడ్జ్ తెరవంగా లోపలనుంచి వచ్చే చల్లటి గాల్లులు మొఖానికి తగిలి గిలిగింతలు పెట్టేవి. డీప్ ఫ్రిజ్ లో వున్నా నాలుగైదు ఐస్ ముక్కలు నోట్లో వేసుకోగానే పళ్ళు జివ్వు మనేవి .

అక్కడి నుంచి హాల్లోకి వస్తే, అక్కడ ఓ పొడవాటి తీగను (అదే వైరు) పట్టుకుని ఆ ఇటు నడుస్తూ ఫోన్ మాట్లాడు తూ కాలేజి కి వెళ్ళే వాళ్ళ అమ్మాయిలు కనపడేవాళ్ళు. వాళ్ళ పడగ్గదిలో పట్టె మంచాలకు బదులు డబ్బుల్ కాట్లు , ఏ.సి మెషీన్లు వచ్చి చేరాయి. ఆరోజుల్లో ఏ.సి.లు ,



టివి లు ఫిడ్జీలు, టెలిఫోను వున్న వాడంటే కోటిశ్వరుడి కింద లెక్క! ఎందుకంటే మా ఇంట్లో కనీసం ఫానుకూడా లేరు. ఆరు బయట మంచాలేసుకుని, పడుకుని పంచాయితీ రేడియో లో నుండి వచ్చే పాటలు వింటూ నిద్ర పోయేవాళ్ళం . అదీ ఓ రకం కొత్త అను భూతిని పంచేది.

ఇంట్లో వస్తువులు పెరిగే సరికి నౌకర్ల సంఖ్య తగ్గుతూ వచ్చింది. ఒకప్పుడుపదుల సంఖ్యలో వుండే నౌకర్లు, ఇప్పుడు ఒకరో ఇద్దరో ఉన్నట్టున్నారు . అంతా అంతర్జాతీయకరణ మహిమ . ఇక దానాలు, ధర్మాలు అంటారా? అవన్నీ అటకెక్కిపోయాయి. ఏ శివరాత్రి కో, సంకురాత్రి కోగుడికి వెళితే అక్కడ చేస్తే చేసినట్టు, లేకపోతే లేదు

నిజానికి ఏసిలు, ఫ్రిడ్జీలు, టివి లు ఆ రోజుల్లో పెద్దగా అవసరం లేదు. ఆ రోజుల్లో అవి విలాసాలతో సమానం .కాని వాటిని కొని ఇంట్లో పెట్టు కోవటం స్టేటస్ సింబలుగా భావించే వాళ్ళు. మారుతున్న కాలంతో ప్రజల జీవన ప్రమాణాలు కూడా పెరిగి అవే విలాసాలు ఈనాడు అవసరాలుగా మారాయి. నేను ఉద్యోగంలో కొచ్చే నాటికి అవన్నీ మా ఇంట్లోకి వచ్చి చేరాయి కాని, మాస్టేటస్ ఏమి మారలేదు.

అప్పటికే పిల్లల్ని విదేశాల్లో పై చదువులు చదివించటానికి మిగిలిన భూములన్నీ

కరిగించేసారు మోతుబరి వారసులు. నాన్నకు కూడా వయసు మీద పడటంతో కౌలుకు పొలాలు చెయ్యటం మానుకుని నాదగ్గరకు వచ్చేసారు శేష జీవితం ప్రశాంతంగా గడపటానికి.అప్పుడప్పుడు మోతుబర్ల దగ్గర కెళ్ళొస్తూ వుండే వాడు,ఎంతైనా సహాయం చేసినవాళ్ళను మరిచిపోకూడదు కదా .

పిల్లలు అమెరికాలో సెటిల్ అవటం వల్ల చూసే వాళ్ళు లేక ఊరి చివర ఓ గెటెడ్ కమ్యూనిటికి మారారు . ఉదయం టిఫిన్లు, మధ్యాహ్యం భోజనం,రాత్రి డిన్నరు అన్నీ వాళ్ళే అందిస్తారు. కాకపోతే నెలకింతని ఉబ్బులు చెల్లించాలి అంతే . వాళ్ళు ఏపేరుతో పిల్చినా అది వృద్ధాశ్రమం అని ఈ పాటికే మీకు అర్ధమయి ఉంటుంది . . కాని వాళ్ళు ఆ మాటంటే ఊరుకునే వాళ్ళు కాదు వాళ్ళ స్టేటస్ కి భంగంగా భావించే వాళ్ళు ..గేటెడ్ కమ్యూనిటీ అని చెప్పి మురిసిపోయే వాళ్ళు.

ఒకసారి ఎందుకో నాకు పనివుండి అక్కడకు వెళ్ళా . అగ్గి పెట్టల్లాంటి అపార్టుమెంట్లలో చిక్క బిక్కుమంటూ గడుపుతున్నారు. ఇంట్లో కూడా పెద్దగా సామాను లేదు, ఏమున్నా లేక పోయినా వాళ్ళ దగ్గర స్మార్ట్ ఫోన్లు మాత్రం వున్నాయి.పొద్దున సాయంత్రం అంతర్జాలంలో ఓ పది నిమిషాలు అమెరికాలోని పిల్లలు పలకరిస్తే అదే పది వేలు అని సంబరపడి పోతుంటారు . వాళ్ళ పిల్లలు పెట్టిన పోస్టులు చూస్తూకాలక్షేపం చెయ్యటం నేర్చుకున్నారు.

అంతే మరి,ఒకప్పుడు జీవితం అంటే ఒకప్పుడు ప్రేమలు, ఆప్యాయతలు , బంధాలు, అనుబంధాలసమాహారం . కానీ నేటి అంతర్జాల యుగంలో జీవితం అంటే నాలుగు పోస్టులు , పది లైకులు, మూడు కామెంట్లు .ఇప్పుడు అవే స్టేటస్ సింబల్సుగా మారాయి . ముఖపుస్తకం లో నో (ఫేస్ బుక్ ), ఏమిటి విషయంలోనో (వాట్స్ అప్ ) ఎన్ని గూపులకు ను నిర్వహిస్తే అంత గొప్ప. కొంత మందైతే పొద్దున లేచిన దగ్గర నుంచి ప్రతి చిన్న పనిని రీల్స్ గా మర్చి ఇంస్టా గ్రాములో పెట్టటమే పనిగా పెట్టుకుని బ్రతుకుతునారు. ఇప్పుడు నాదని అవార్డులు,పద్మశ్రీ అవార్డుల కన్నా మీగేట్టం (యూట్యుబ్) వాళ్ళు ఇచ్చే అవార్డులకె గిరాకి ఎక్కువ . అదే ఇప్పుడు స్టేటస్ సింబల్.

ఒకప్పుడు పక్కవాడికి ఆస్తులు, అంతస్తులు వున్నాయని అసూయ పడేవాళ్ళం . కాని నేడు వేరే వాళ్ళు ఎక్కువ పోస్టులు పెడుతున్నారని, వాళ్ళ పోస్టులకు లైకులు ఎక్కువ వస్తు న్నాయని, వాళ్ళని ఎక్కువ మంది అనుసరిస్తున్నారని ఏడ్చే వాళ్ళేఎక్కువ. తమ స్టేటస్ ను లైకుల్లో లెక్కేసుకుంటూ చాలామంది బతికేస్తున్నారు. ఒక వేళ వా ళ్ళకు తక్కువ లైకులొస్తే కుటుంబం పరువు బజారున పడినంతగా బాధపడి మంచం ఎక్కుతున్నారు .

★★★

## గోపాల కృష్ణ కార్టూన్ లు

# నవ్వండి ప్లీజ్ !












## శ్రీ నాగచంద్రేశ్వర ఆలయం



మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఉజ్జయిని శ్రీ మహాకాళేశ్వర ఆలయంలోని రెండో అంతస్తులో ఉన్న శ్రీ నాగచంద్రేశ్వర ఆలయ తలుపులను ఏడాదిలో కేవలం ఒక్కసారి మాత్రమే తెరచుకుంటాయి. అది కూడా నాగ పంచమి రోజు పండుగ వేళ మాత్రమే తెరచుకుంటాయి. ఈ పవిత్రమైన రోజున ఆలయంలో పూజలు చేసి, భక్తులు దర్శనం చేసుకున్న అనంతరం మళ్లీ ఆలయ తలుపులు మూసేస్తారు. ఈ నేపథ్యంలో ఈ ఆలయం శ్రావణ మాసంలో శుక్ల చతుర్థి తిథి నాడు అర్ధరాత్రి 12 గంటల నుంచి నాగ పంచమి రోజున అర్ధరాత్రి 12 గంటల వరకు తెరిచి ఉంటుంది. అందుకే ఈ ఆలయంలో అర్ధరాత్రి నుంచే భక్తుల రద్దీ విపరీతంగా పెరుగుతుంది.

హిందూ మత విశ్వాసాల ప్రకారం కొన్ని శతాబ్దాలుగా పాములను దేవతలుగా భావించే పూజించే సంప్రదాయం ఉంది. పాముని శివుని మెడలో ఆభరణంగా పరిగణిస్తారు. ఉజ్జయినిలోని శ్రీ మహాకాళ ఆలయ గర్భగుడి పైన, ఓంకారేశ్వర్ ఆలయం, దానిపైన శ్రీ నాగచంద్రేశ్వరుని ఆలయం నిర్మించబడింది.

ఈ ఆలయంలో 11వ శతాబ్దానికి చెందిన అద్భుతమైన విగ్రహం స్థాపించబడింది. ఈ విగ్రహంలో శ్రీ నాగచంద్రేశ్వరుడు స్వయంగా తన ఏడు గుండాలతో అలంకరించబడ్డాడు. దీంతో పాటు శివ–పార్వతి, నంది విగ్రహాలు ప్రతిష్ఠించబడ్డాయి. శివయ్య తన కుటుంబంతో పాటు శేష నాగుపై కూర్చున్న ఏకైక ఆలయం ఇదే.

పూర్వ కాలంలో మాల్వా రాజ్యానికి చెందిన పర్మార్ రాజు భోజ్ ఈ ఆలయాన్ని సుమారు 1050 ADలో నిర్మించాడని నమ్ముతారు. దీని తర్వాత, మహాకాళ్ ఆలయాన్ని సింధియా కుటుంబానికి చెందిన మహారాజ్ రాణోజీ సింధియా 1732లో పునరుద్ధరించారు. శ్రీ నాగచంద్రేశ్వర భగవాన్ విగ్రహాన్ని నేపాల్ నుంచి ఇక్కడికి తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. ఈ విగ్రహాలలో శివుడు తన ఇద్దరు కుమారులు గణేష్, కార్తీకేయలతో కలిసి కూర్చున్నారు. ఈ విగ్రహం పైభాగంలో సూర్యచంద్రుల విగ్రహాలను సైతం చూడొచ్చు. పురాణాల ప్రకారం, సాధారణంగా శివయ్య మెడ, భుజాల మీదు పాము చుట్టుకుని ఉంటుంది. కానీ ఒక్క ఉజ్జయినిలో మాత్రం శేషనాగుపై శివపార్వతుల విగ్రహం కనిపిస్తుంది. ప్రపంచంలో ఎక్కడా ఇలాంటి విగ్రహం లేదని చాలా మంది నమ్మకం. ఈ విగ్రహాన్ని దర్శనం చేసుకుని లోపలికి ప్రవేశించగానే శ్రీ నాగచంద్రేశ్వరుని ప్రధాన విగ్రహం అంటే శివ లింగం కనిపిస్తుంది. నాగ పంచమి రోజున శ్రీ నాగచంద్రేశ్వర మహాదేవుని ఆలయం 24 గంటల పాటు భక్తులకు దర్శనమిచ్చేందుకు అందుబాటులో ఉంటుంది. ఆ తర్వాత ఈ ఆలయ తలుపులు మూసివేయనున్నారు.

శ్రీ నాగచంద్రేశ్వరుని త్రికాల పూజలు నాగ పంచమి రోజునే చేస్తారు. అర్ధరాత్రి 12 గంటలకు ఈ ఆలయ తలుపులు తెరిచిన తర్వాత మహంత్ పూజలు నిర్వహిస్తారు. ఆ తర్వాత 12 గంటల పాటు పూజలు చేస్తారు. అనంతరం నాగ పంచమి రోజున అర్ధరాత్రి 12 గంటలకు అఖండ పూజలు చేసి ఆలయ తలుపులు మూసివేస్తారు.



# వందేళ్ల
# గేట్ వే ఆఫ్ ఇండియా



ముంబయిలోని చరిత్రాత్మక స్మారక తోరణం గేట్ వే ఆఫ్ ఇండియా డిసెంబర్ 4న వందేళ్లు పూర్తి చేసుకుంది.వందేళ్లుగా ఈ ప్రఖ్యాత కట్టడం భారత దేశపు ప్రముఖ నగరానికి చిహ్నంగా నిలిచింది. అంతే కాదు చరిత్రలో ఈ ప్రాంతంలో జరిగిన అనేక సంఘటనలకు ప్రత్యక్ష సాక్షిగా నిలిచింది.



1911లో బ్రిటన్ రాజు జార్జ్ VI, రాణి మేరీ భారత దేశంలో అడుగు పెట్టినందుకు గుర్తుగా బ్రిటిషర్లు ఈ కట్టడాన్ని నిర్మించారు. బ్రిటన్ రాజ దంపతులిద్దరు ముంబయిలోని అపోలో బందర్‌లో అడుగుపెట్టారు. అయితే, తర్వాతి రోజుల్లో ఆదే కట్టడం బ్రిటిషర్లు 1948లో భారత దేశాన్ని వీడి వెళ్లడాన్ని చూసింది. భారత దేశం బ్రిటిషర్ల నుంచి స్వేచ్ఛను పొందింది. పరిపాలన భారతీయుల చేతుల్లోకి వచ్చింది. ట్ వే ఆఫ్ ఇండియాను బసాల్ట్ స్టోన్, రీఇన్‌ఫోర్స్‌డ్ కాంక్రీట్ కలిపి నిర్మించారు. ఇది 26 మీటర్ల (85 అడుగులు) ఎత్తు ఉంది. దీన్ని ఇండో సార్సెనిక్ శైలి(దీన్నే ఇండో గోతిక్ శైలి అంటారు)లో నిర్మించారు.ఇండో సార్సెనిక్ శైలిలో ఇండో ఇస్లామిక్, పాశ్చాత్య నిర్మాణ శైలి కలిసి ఉంటాయి .సముద్రం ఒడ్డున అపోలో బందర్ ప్రాంతంలో ఒక రాతి గోడ ఉంది. అప్పట్లో ఇక్కడ నుంచి ప్రయాణికులు, సరకు రవాణా జరిగేది. ఇక్కడే గేట్ వే ఆఫ్ ఇండియాను నిర్మించారు.

గేట్ వే ఆఫ్ ఇండియాకు ఎదురుగా టాటా గ్రూప్ వ్యవస్థాపకుడు జెంషెడ్‌జీ టాటా ప్రఖ్యాత తాజ్‌మహల్ ప్యాలెస్ హోటల్‌ను నిర్మించారు. ఈ హోటల్ 1903 డిసెంబర్ 16న ప్రారంభమైంది.



1911లో కింగ్ జార్జ్ VI, క్వీన్ మేరీ బ్రిటిష్ సామ్రాజ్య రాజు, రాణిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత్‌ను సందర్శించారు. భారత దేశాన్ని సందర్శించిన తొలి రాజదంపతులు వీరే.వారు ముంబయిలో అడుగు పెట్టినందుకు గుర్తుగా గేట్‌వే ఆఫ్ ఇండియాను నిర్మించారు. 914లో గేట్ వే ఆఫ్ ఇండియా చివరి నమూనాను స్కాటిష్ ఆర్కిటెక్ట్ జార్జ్ విట్టెట్ రూపొందించారు.1924లో గేట్ వే ఆఫ్ ఇండియా నిర్మాణం పూర్తైంది.ఈ నిర్మాణానికి సంబంధించిన నమూనాను రావు బహదూర్ యశ్వంత్‌రావు హరిశ్చంద్ర దేశాయ్ ఒక రాయితో రూపొందించారు. ఈ కట్టడానికి యన ఓవర్ సీర్( సూపరింటెండెంట్ మేనేజర్)గా పని చేశారు.ఆయన వారసులు తర్వాత ఆ చిట్టి గేట్ వేను



ముంబయిలో భద్రపరిచారు. బ్రిటిష్ వైస్రాయ్‌లు, గవర్నర్లు, ఇతర ప్రముఖులు భారత్ వచ్చినప్పుడు వారిని ఆహ్వానించడానికి, వేడుకలు జరపడానికి గేట్ వే ఆఫ్ ఇండియా ఒక వేదికగా ఉండేది.

1915లో మహాత్మ గాంధీ సౌతాఫ్రికా నుంచి భారత దేశానికి తిరిగి వచ్చినప్పుడు అపోలో బందర్‌లోనే అడుకు పెట్టారు.గేట్ వే ఆఫ్ ఇండియా వద్ద చెప్పుకోదగ్గ మరో కార్యక్రమం స్వతంత్ర్యం వచ్చిన తర్వాత జరిగింది.1948 ఫిబ్రవరి 28నన బ్రిటిష్ బలగాలు గేట్ వే ఆఫ్ ఇండియా వద్ద నుంచి బ్రిటన్ వెళ్లాయి.సోమర్‌సెట్ లైట్ ఇన్‌ఫాంట్రీకి చెందిన ఫస్ట్ బెటాలియన్ భారత దేశంలో బ్రిటిష్ రాజ్యం ముగిసినట్లు సంకేతాలు ఇస్తూ ఈ కట్టడం గుండా నిష్క్రమించాయి. కెప్టెన్ కింగ్‌కు చెందిన రెజిమెంటల్ పతాకాలను కిందకు దించి ఇండియాకు సెల్యూట్ చేస్తూ భారత దేశంలో సేవలందించిన చివరి బ్రిటిషన్ బెటాలియన్‌గా బాంబే నుంచి నిష్క్రమిస్తున్నట్లు పరేడ్ నిర్వహించారు.

ముంబయిలో గేట్ వే ఆఫ్ ఇండియా ప్రాంతం అతిపెద్ద పర్యటక కేంద్రం.ఈ కట్టడం ఆర్చ్ ఎదురుగా 1961లో చత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కింగ్ జార్జ్ VI కాంస్య విగ్రహాన్ని తొలగించి శివాజీ విగ్రహాన్ని నిర్మించారు.ఈ కాంప్లెక్స్‌లో స్వామి వివేకానంద విగ్రహం కూడా ఉంది. ఆయన ఇక్కడి నుంచే ఆమెరికాకు వెళ్లారు. క్కడ నిర్మించిన జెట్టీ నుంచి ఫెర్రీలు ప్రయాణికుల్ని ఎలిఫెంటా గుహల వరకు తీసుకెళతాయి. ఈ ప్రాంతాన్ని యునెస్కో హెరిటేజ్ సైట్‌గా గుర్తించారు.ఎలిఫెంటా కేవ్స్‌తో పాటు తీర పట్టణాలు అలిబౌగ్, రేవాస్, మండ్వ వెళ్లడానికి కూడా పడవలు ఇక్కడి నుంచే బయల్దేరతాయి.



2003 ఆగస్టులో గేట్ వే దగ్గర తీవ్రవాదులు పేలుళ్లకు పాల్పడటంతో అప్పటి నుంచి ఈ ప్రాంతంలో భద్రతను పెంచారు.

# అజ్ఞానాన్ని నింపుకోకు...

దేరంగుల భైరవ

కాలినడక వలన దారి
నీటి ప్రవాహం వల్ల నదీగర్భము
మార్మిక జీవితం వలన దైవత్వము
నిరంతర మార్పులతో ప్రకృతి సూత్రాలు
వాటంతటవే వాస్తవాలై నిజ జీవితాన్ని
ముందుకు సాగించే సారథ్యాలు...

కంటి చూపులు వెలుగులతో ప్రయాణం
మనస్సు మర్మాలతో నిండిన కూటమి...
ఆరని మంటలతో గుండె ఆవేదనలు
దిగుడుబడని కాఠిణ్యంతో గొంతున
పెగలని మాటల తీరు నీలో సగమైతే...
మౌనం వేసిన అడుగులు దరిజేర్చవు...

అత్యాశతో భయాన్ని తాగకు
సంపదలెన్నైనా కోపాన్ని ప్రదర్శించకు
విది లేనప్పుడు విధియే అంగీకారమని
నాలుకలు చాపిన ఆశలను మందలించు
మొలువని శిలగా అజ్ఞానాన్ని నించుకోకు

కాలంతో పాటు నడకలు నేర్చుకో
అది నిలిపిన స్థానమని కోరికవు కాకు
సామరస్యమైన సమితి నిర్మాణాలతో
చేతులు జోడించి దైవమొక్కటేనని...
వికాసం పురివిప్పినదై చూపించు...
నీవన్నది ఏదీలేదని వాటంతటవి
ఏదీ నీదరికిరాదని తెలియజెప్పు

# నవ్వండి ప్లీజ్ !





## నవ్వటం ఒక యోగం ,

నవ్వలేక పోవటం ఒక రోగం , తరువాత మీ ఇష్టం



నాగిశెట్టి కార్టూన్లు






కథ

# వరమా ?శాపమా ?

కొల్ల పుష్ప

అమ్మా వెళ్దాం అని ఎంత చెప్పినా, ఎన్నిసార్లు చెప్పినా నీ మాట నీదే గాని ఈ ఊరు వదిలి రానంటావు" అన్నాడు హరీష్ సూట్ కేసు సర్దుకుంటూ.

"నేను ఈ ఊరు వదిలి రాలేను నాన్న, ఈ ఊరితో నా బంధం 50 ఏళ్లు... మీ నాన్న చేయి పట్టుకుని 12 ఏళ్ళ వయసులో ఈ ఊరు వచ్చాను."

"ఇక్కడ మనుషులతో, ఈ నేలతో ఎంతో అనుబంధం ఏర్పడింది. ఇప్పుడు ఆ పట్టణంలో ఆ ఇరుకు ప్రపంచంలో నేను ఇమడలేను" అన్నది సరస్వతమ్మ మనవడికి ఇష్టమైన సున్నుండలు ప్యాక్ చేస్తూ.

"మరి ఎలా అమ్మ ఎలా ఉన్నావో అని అనుక్షణం టెన్షన్ పడుతూ ఉండవలసిందేనా? అన్నాడు దిగులుగా.

"ఏం పర్వాలేదు నాన్న ఇరుగుపొరుగు, ఊర్లో అందరూ తెలిసిన వారే, మంచి వారు కూడా నాకేం పరవాలేదు" అన్నది సరస్వతమ్మ.

"నీ ఇష్టం" అంటూనే "ఒరేయ్ చింటూ నీ ఫోన్ ఇలా ఇవ్వు." అన్నాడు అదే పనిగా సెల్ చూస్తున్న చింటూని. చింటూ పలకలేదు సరి కదా ఫోన్ లాక్కోవడంతో ఏడుపు మొదలు పెట్టాడు.

వాడి చేతిలో ఫోను తీసుకొని "నీకు మరో ఫోన్ కొనిస్తాలేరా" అని తల్లి చేతిలో ఫోన్ పెట్టి "అమ్మ నేను రోజూ వీడియో కాల్ చేస్తుంటాను మాట్లాడు నాకు బెంగ ఉండదు. ఇలా వచ్చి కూర్చో నీకు ఫోను ఎలా చేయాలో నేర్పిస్తాను, అయినా నాదే పొరపాటు ఇన్నాళ్లు చిన్న ఫోన్ తోటే అక్కల తో, నా తో మాట్లాడే దానివి ఇకనుంచి అక్కలతో, నాతో వీడియో కాల్ మాట్లాడవచ్చు" అని చెప్పి నేర్పించి బయలుదేరాడు.

"అలాగే లేరా కానీ ఫోన్ లాక్కున్నందుకు పసివాడు ఎలా ఏడుస్తున్నాడో చూడు అయినా అంత చిన్నవాడికి ఫోన్ ఎందుకురా? అన్నది.

"అంతలా అలవాటు చేయడం మంచిది కాదు రా హరీష్" అన్నది.

"అమ్మ మేమిద్దరం ఆఫీసులకు వెళ్లి ఎప్పుడొస్తామో తెలియదు. స్కూల్ బస్సు తర్వాత ఆటో లో తిరగాల్సి ఉంటుంది.
వాడుఎక్కడ ఉన్నాడో ఎలా ఉన్నాడో ఎలా తెలుస్తుంది మాకు, అసలే ఈ మధ్య పిల్లల కిడ్నాప్ లు జరుగుతున్నాయి అందుకే జాగ్రత్త కోసం కొన్నాను వాడికి"అంటూ బయటికి నడిచాడు భార్యను పిల్లాడిని తీసుకుని.

@@@

బలరామయ్య ఆ ఊరి సర్పంచ్ చాలా మంచివాడు స్నేహశీలి. ఎవరు ఏ ఆపదలో ఉన్న ఆదుకునేవాడు. అతని భార్య సరస్వతి ఆయన అడుగుజాడల్లో నడిచే మనిషి ఆమె కూడా తన చేతనైన సహాయం అందరికీ చేస్తూ ఉంటుంది. వాళ్లకి ఇద్దరు ఆడపిల్లలు, మగపిల్లవాడే హరీష్ అందర్నీ బాగా చదివించారు. ఆడపిల్లలు పెళ్లిళ్లు అయ్యాక విదేశాల్లో స్థిరపడ్డారు.

హరీష్ మాత్రం విదేశాల్లో అవకాశాలు వచ్చినా వెళ్లడానికి ఇష్టపడలేదు. తల్లి ,తండ్రికి దూరంగా ఉండలేక.

అతని భార్య సరళ మాత్రం చాలా రోజులు భర్తని పోరు పెట్టింది అమెరికా వెళదామని కానీ హరీష్ ససేమిరా అనడంతో ఏం చేయలేక ఊరుకుంది.
ప్రతి పండగకు తల్లి, తండ్రి దగ్గరకు వస్తుంటాడు హరీష్.
రెండేళ్ల క్రితం తండ్రి హఠాత్తుగా మరణించడం తో తల్లి ఒంటరిగా ఉండడం నచ్చలేదు. అందుకే వచ్చిన ప్రతిసారి హైదరాబాదు వచ్చేయమని బతిమాలుతుంటాడు. కానీ ఆమె వినదు. అందుకే ఉద్యోగ బాధ్యతల్లో ఎంత బిజీగా ఉన్నా సంక్రాంతికి ,దీపావళికి తప్పనిసరిగా వస్తుంటాడు. అలాగే ఈసారి సంక్రాంతికి వచ్చాడు.

@@@

"మిస్టర్ హరీష్ స్కూల్లో మీ అబ్బాయి ఏం చేస్తున్నాడో తెలుసా?" అన్నది టీచర్.

"ఏం చేస్తున్నాడు చెప్పండి మిస్" అన్నాడు వర్క్ చేసుకుంటూ.
"ఎప్పుడు సెల్ ఫోన్ తో ఆడుతూనే ఉంటాడు ఎంత చెప్పినా వినకుండా, కొడితే మీరు ఊరుకోరు" అన్నది విసుగ్గా. "సారీ మిస్ వాడి తరపున నేను క్షమాపణ చెప్తున్నాను ఇక నుంచి అలా జరగకుండా చూసుకుంటాను" అన్నాడు.

'ఏడవ తరగతి చదువుతున్న తన కొడుకు ఇలా తయారవుతున్నాడు ఏమిటి' అని బాధపడ్డాడు.

"మిస్టర్ హరీష్ నేను చెప్పేది అర్థమైందా? దీని పరిణామాలు ఎలా ఉంటాయో అర్థం చేసుకోండి, పరిష్కారం ఆలోచించండి" అని ఫోన్ పెట్టేసింది.
ఈ విషయం భార్యతో మాట్లాడాలని అనుకున్నాడు కానీ ఆఫీసు మీటింగ్ పనిలో పడి తల్లికి కూడా ఫోన్ చేయలేదు అన్ని మర్చిపోయాడు.

@@@

అక్కడ తల్లి ఏ బాధలో ఉందో అతనికి తెలియదు. సరస్వతమ్మకు సాయంత్రమే అల్పాహారం చేసి పెంద్రాలే పడుకోవడం అలవాటు.

పగలంతా ఎవరో ఒకరు అత్తయ్య ,పిన్ని అనుకుంటూ వస్తారు కానీ రాత్రిపూట ఎవరూ రారు అలా పెంద్రాలే పడుకున్న ఆమెను ఇబ్బంది పెట్టడం ఇష్టం లేక రారు.

ఒక రాత్రివేళ గుండెలో సన్నగా నొప్పి మొదలైంది సరస్వతమ్మకు. చాలాసేపు ఓర్చుకుంది. కానీ తెల్లవారుజామున ఇక ఓర్చుకోలేక కొడుక్కి ఫోన్ చేసింది.
'ఈ టైంలో ఎవరు ఫోను' అనుకుంటూ తీసాడు. తల్లి వీడియో కాల్
తల్లి గుండె పట్టుకొని బాధపడుతూ విలవిల లాడిపోతుంది. ఒకపక్క తల్లికి ధైర్యం చెబుతూనే ఇంకొక ఫోన్ నుంచి ఆ ఊర్లో ఉన్న తన స్నేహితులకు, ఇరుగుపొరుగులకి ఫోన్ చేసి తగిన చర్యలు తీసుకోనేటట్టు చేశాడు. వెంటనే తల్లి దగ్గరికి బయలుదేరాడు ఆ గ్రామం చేరే సరికి తల్లికి సరియైన సమయంలో వైద్యం అందడం వల్ల తల్లి ఆరోగ్యంగానే ఉంది.

ఆ రోజు తల్లికి సెల్ ఫోన్ ఇవ్వడం మంచిదయింది లేకపోతే చాలా ప్రమాదం జరిగేది.
'పక్కింటికి కూడా వెళ్లలేని పరిస్థితిలో తనకు ఫోన్ చేసి అమ్మ మంచి పని చేసిందని' అనుకున్నాడు హరీష్.

కానీ అదే ఫోను కొందరి జీవితాలను ఎలా చిన్నాభిన్నం చేయబోతుందో తెలుసుకోలేక తల్లి ఆరోగ్యం కుదుటపడే వరకు కొన్నాళ్లు తన దగ్గరికి తీసుకెళ్లాలని నిశ్చయించుకుని కారులో బయలుదేరారు.

@@@

గుమ్మంలో అడుగుపెడుతుండగానే "ఏవండీ మీ ఫ్రెండు కొడుకుని అరెస్టు చేశారంటూ" చెప్పబోయి సరళ అత్తగారిని చూసి ఆగిపోయింది చెప్పాలా వద్దా అనుకుంటూ.

"ఏమైంది సరళా అలా గాబరా పడుతున్నావు" అన్నది సరస్వతమ్మ.

"నేను కనుక్కుంటానులే"అని తల్లిని సోఫాలో కూర్చోబెట్టి భార్యని బాల్కనీలోకి తీసుకెళ్లాడు.

"ఏమైంది" అని అడిగాడు.
" పోలీసులు మీ ఫ్రెండు గిరి కొడుకుని అరెస్టు చేశారండి, మీరు వచ్చే ముందే వాడిని తీసుకెళ్లారు ఇరుగు పొరుగు ముందు తలెత్తుకోలేకపోయారు అన్నయ్య, వదిన" అంది సరళ బాధపడుతూ.

'ఎందుకు వాడిని అరెస్ట్ చేయడం? పసివాడు నేరం చేయడమేమిటి? ఏనేరం చేసాడు?' అన్ని ప్రశ్నలే మనసులో.

"నేను కనుకుంటానులే కంగారు పడకు అమ్మను చూసుకో, ఈ విషయాలు ఏమీ ఆమెకు చెప్పకు... పిల్లలు పిక్నిక్ కి వెళ్లి రాలేదని గాబరా పడుతున్నానని చెప్పు"బయటకు వచ్చి కార్లో కూర్చొని "పోలీస్ స్టేషన్ కి వెళ్ళాలి పద రాజు"అన్నాడు డ్రైవర్ తో

@@@

"వేలడంత లేరు వెధవల్లారా అమ్మాయిల ఫోటోలు తీస్తారా? మీరు" అంటూ లాఠీ తో కొడుతున్నాడు ఎస్సై.

లబోదిబోమని ఏడుస్తున్నారు పిల్లలు.

"ఏమైందిరా గిరీ" అన్నాడు స్నేహితుడి భుజం మీద చెయ్యి వేస్తూ అన్నాడు హరీష్. ఫ్రెండ్ గిరి ఇంకొక ఇద్దరు వ్యక్తులు ఆ పిల్లల ఫాదర్స్ అనుకుంటా ముఖాలు వేలాడేసుకుని ఉన్నారు పిల్లలు చేసిన పనికి.

"ఏం చేశారా ఒకసారి అటు చూడండి అక్కడున్న ఆమె వీళ్ళ టీచర్ ఆమె ఏం చెప్తుందో వినండి" అన్నాడుఎస్సై కుర్చీలో కూర్చుంటూ.

"మిస్టర్ ఆరోజే మీ అబ్బాయి గురించి హెచ్చరించాను. కానీ మీరు పట్టించుకోలేదు ఏదో చిన్న పిల్లాడు అని ఊరుకున్నారు. ఫోన్లో అశ్లీల చిత్రాలు చూడటానికి అలవాటు పడ్డారు ఈ ముగ్గురు.

చూసి ఊరుకోకుండా స్కూల్ బాత్రూం కిటికీల్లో ఆ సెల్ ఫోన్లు పెట్టి అమ్మాయిలు ఫోటోలు తీసి వాటిని ఫేస్బుక్లో, ఇంస్టాగ్రామ్ లో అప్లోడ్ చేస్తున్నారు.

"మొన్న ఏకంగా 10 ఏళ్ళ పాపను ఈ ముగ్గురు కలిసి ఆ వీడియోలో ఉన్న మాదిరిగా డాన్స్ చేయమని బలవంత పెట్టారు"అని టీచరు ముఖం పక్కకు తిప్పుకుంది.

@@@

"మిస్టర్  మీరు పిల్లల జాగ్రత్త కోసం సెల్ఫోన్ ఇవ్వాలని అనుకోవడంలో తప్పులేదు కానీ చిన్న ఫోన్ తో సరిపెట్టొచ్చు కదా !కానీ ప్రెస్టేజ్ కి  పోయి స్మార్ట్ ఫోన్లు కొనివ్వడం, వాళ్ళు అందులో ఏం చూస్తున్నారో వాళ్ళని గమనించకపోవడం. చాలా తప్పు చేస్తున్నారు మీరు.

డబ్బు సంపాదనే ధ్యేయంగా పెట్టుకొని పిల్లల నడవడికను కనిపెట్టలేకపోయారు.

పిల్లలకు ఎప్పుడు ఏది ఇవ్వాలి, ఇవ్వకూడదు అని తెలుసుకో లేకపోతే ఇటువంటి అనర్థాలే జరుగుతాయి".

"మేం పడ్డ బాధలు పిల్లలు పడకూడదు అని వాళ్ళు ఏది అడిగితే అది బట్టలు, బొమ్మలు దగ్గర నుంచి ఈ ఫోన్ల వరకు కొని ఇస్తున్నారు."

వాళ్లకి డబ్బు విలువ, మనుషులు విలువ తెలియకుండా  పెరగడానికి కారణం మీరే. ఇప్పుడు ఈ పిల్లలు బాల నేరస్తుల జైలుకు వెళితే దానికి బాధ్యులు  ఎవరు?
మీరు మీ లాంటి తల్లితండ్రులే".

"ఫోను ఉపయోగం చాలా ఉంది కానీ అది ఎవరి చేతిలో ఎలాంటిది ఉండాలి అని ఆలోచించి ఇవ్వాలి. వాళ్ళ వయసుకు మించి స్మార్ట్ ఫోన్ ఇవ్వడం వలన జరిగిన అనర్థాలు చూశారు కదా! ఈసారికి పిల్లల్ని తీసుకుని వెళ్ళండి ఇక ఇదే లాస్ట్ వార్నింగ్, మళ్లీ ఇలా జరిగితే బాల నేరస్థుల జైలుకి వెళ్లక తప్పదు మీ పిల్లలు" అన్నాడు ఎస్సై కోపంగా.

@@@

'తనతల్లిని కాపాడింది ఈ ఫోనే, ఈరోజు గిరి కొడుకుని నేరస్తుడిని చేసింది కూడా ఈ ఫోనే ఎస్.ఐ అన్నట్టు ఎవరికి అందుబాటులో ఉండాలి ఎవరికి అందకుండా ఉంచాలి' అనే విషయం ఆలోచించాల్సింది తల్లిదండ్రులు.

'తనకు కూడా చింటూ అల్లరి గురించి వాళ్ళ టీచర్ ఫోన్ చేసి చెప్పింది నేను పట్టించుకోలేదు ఇకనైనా జాగ్రత్తగా ఉండాలి' అనుకున్నాడు హరీష్.

వాళ్ల వెనుకే వచ్చిన టీచర్ "సార్ మీకు ఉద్యోగం, డబ్బు మీద ఉన్న శ్రద్ధ కొంచమైన పిల్లల మీద చూపించండి లేకపోతే ఇలాంటి వే జరుగుతాయి" అన్నది గిరి తో.
@@@

"ఒరేయ్ హరీష్ నా తల కొట్టేసినట్టు ఉందిరా! వీళ్ళు చేసిన పనికి ఈ గొడవ అంతా ఫోన్ వల్లే వచ్చింది.
వాడు అడిగిన వెంటనే స్మార్ట్ ఫోన్ కొనివ్వకుండా ఉండి ఉంటే బాగుండేది దిక్కుమాలిన ఫోన్లు అని ఫోన్ల ను తిట్టడం మొదలు పెట్టాడు" గిరి

" ఒరేయ్ మన పెద్దలు ఒక పది రూపాయలు ఇవ్వాలంటే ఎంతో ఆలోచించేవారు. ఎందుకు, ఏమిటి? అంటూ కారణాలు తెలుసుకొని ఇచ్చేవారు. కష్టం విలువ తెలియజేసేవారు కానీ ఈనాడు తాము కష్టం విలువ తెలిసి సంపాదిస్తూ కూడా తమ పిల్లలు తమలా కష్టపడకూడదు అని అడిగినవి, అడగనవి కొనివ్వడం.

ఆప్యాయంగా దగ్గరకు తీసుకోకపోవడం కష్టం, సుఖం వాళ్లతోమాట్లాడకపోవడం, పెద్దలను ఎలా గౌరవించాలో నేర్పక పోవడం ఇదంతా మన పెంపకలోపమే తప్ప ఫోన్ ది కాదు"అన్నాడు హరీష్.
"నువ్వు చెప్పింది నిజమే రా హరీష్ మన పెంపకం లోపమేరా! జాగ్రత్తగా పెంచాలి  ఈ రోజుల్లో ముఖ్యంగామగపిల్లలని పద్ధతిగా పెంచాలి లేకపోతే ఇలాంటి అనర్థాలే జరుగుతాయి...

ఆడపిల్లలకు రక్షణ లేకుండా పోతుంది. నా కొడుకు లాగా తయారవుతే చాలా కష్టం, అందుకనే మగ పిల్లల పట్ల శ్రద్ధ తీసుకుని పెంచాలి రా" అన్నాడు గిరి తల పట్టుకుంటూ.

"ఫోన్ ఏం చేసింది రా! మన పిల్లలకి వయసుకు మించి అటువంటి ఫోన్లు కొనివ్వడం మన తప్పు. ఆ ఫోనే కదా మా అమ్మని కాపాడింది నీకు తెలుసు కదరా! మంచికి ఉపయోగిస్తే ఫోను వరమేరా లేకపోతే శాపం"అన్నాడు హరీష్ ఓదార్పుగా గిరి భుజం మీద చేయి వేసి.

@@@

"అవును రాజు మర్చిపోయాను అంత లాంగ్ డ్రైవ్ చేసి వచ్చి నిన్ను మళ్ళీ పోలీస్ స్టేషన్ కి తీసుకువచ్చి ఇంతసేపు కూర్చోబెట్టాను నీకు అలసట కలగలేదా" అన్నాడు హరీష్.

"లేదు సార్ అమ్మగారు మీ చిన్నతనం గురించి పిల్లల్ని ఎలా పెంచాలో, ఎలా పెంచితే వాళ్లు సన్మార్గంలో నడుచుకుంటారోచాలా మంచి మంచి విషయాలు చెప్పారు.
అవి ఆచరించడానికి ప్రయత్నిస్తాను సార్". అన్నాడు రాజు.
"నువ్వు అన్నది నిజం రాజు పెద్దవాళ్ళ నుంచి మనం చాలా నేర్చుకోవాలి" అన్నాడు గిరి కారు దిగుతూ.
పిల్లలు టీవీ లేదా మొబైల్ చూసినప్పుడు వారి మెదడు వినియోగం చాలా తక్కువగా ఉంటుంది దాంతో వారు నేర్చుకునేది ఆలోచనలకు పదును పెట్టేది కూడా తక్కువే ఉంటుంది.

అదే తల్లి, తండ్రి, నాయనమ్మ, తాతయ్య ఎవరో ఒకరు పిల్లల తో ఆటపాటలతోగడిపితే వాళ్ల మెదడు చురుగ్గా పనిచేస్తుంది, వాళ్లు ప్రతి దాన్ని ఆస్వాదించగలుగుతారు. పిల్లల్లో మానసిక, శారీరక ఆరోగ్యం పెరుగుతుంది. మొబైల్ వలన సమస్యలు ఉన్నాయని తెలిసినా పెద్దవాళ్లు పట్టించుకోవటం లేదు.
ఎందుకంటే వాళ్ళ పనులు వాళ్ళ ఉద్యోగాల తో బిజీగా ఉంటారు.

ఇంక పెద్ద వాళ్ళ విషయానికొస్తే వాళ్ళను కుటుంబాలతో కలిసి ఉండనివ్వకుండా వేరుగా పెట్టడమో లేకపోతే వృద్ధాశ్రమాలకి పంపడమో జరుగుతుంది. ఈ విషయాన్ని ఇలాగే వదిలేయకుండా తల్లితండ్రులు అందర్నీ సమావేశపరిచి పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని గిరి,హరీష్ ఇద్దరూ నిర్ణయించుకున్నారు.

ఓం సహనావతు
సహనౌ భునక్తు
సహవీర్యం కరవావహై
తేజస్వి నావధీతమస్తు
మావిద్విషావహై
ఓం శాంతి శాంతి శాంతిః
టీవీ లో నుంచి చాగంటి వారి ఉపన్యాసం వినిపిస్తుంది ఆ శ్లోకానికి అర్థం వివరిస్తున్నారు.

"ఈ ఒక్క శ్లోకానికి అర్థం తెలుసుకోండిరా కుటుంబాన్ని ఎలా నడిపించాలో అర్థం అవుతుంది" అన్నది తల్లి. అప్పటికే ఆమె అన్ని విషయాలు తెలుసుకుంది కోడలి ద్వారా అందుకే ఆ మాట అన్నది.
'నిజమే పెద్దల నుంచి తెలుసుకోవాల్సింది చాలా ఉంది' కొత్త పద్దతిలో జీవితం గడపడానికి సన్నద్ధమైనట్లుగా ఇంట్లోకి నడిచాడు హరీష్.

శుభం

## శ్రీ–సుక్తం –3
## "పూర్ ఫెలోస్"

ఈ మధ్య మా స్నేహితుడొకడు గ్రాండ్ పార్టీ ఏర్పాటు చేసి తన పరిచయస్తులందరినీ పార్టీకి పిలిచాడు. ఇంతకీ పార్టీ ఎందుకు అనుకుంటున్నారా ? వాళ్ళ ఇంట్లో ఎవరిదన్నా పుట్టినరోజో , పెళ్ళి రోజో అనుకుంటే మీరు పప్పులో కాలేసినట్లే .పోనే వాళ్ళ పిల్లలకు ఏ ఐ ఐ టి టిలో నో ఎన్ ఐ టి లోనో సీటు వచ్చిందని అనుకుంటున్నారా లేదా ఏ టి సి ఎస్ లో నో, ఇన్ఫోసిస్లోనో ఉద్యోగం వచ్చింది అని అనుకుంటే అనుకుంటే మీరు పెద్ద పేడ తట్టలో కాలేసినట్లే . మరింతకి ఎందుకు పిలిచాడో విసిగించకుండా చెప్పమంటారా,

"సరే నండి, మావాడి దూరపు చుట్టం, దూరం అంటే చాలా దూరపు చుట్టం లెండి, ఎంత దూరం అంటే మన ఇండియాకు –అమెరికాకు ఉన్నంత దూరం.సదరు చుట్టం అమెరికా ఎన్నికల్లో గెలిచి ట్రంప్ మహాశయుడి కాబినెట్లో మంత్రిగా కొలువు తీరబోతున్నాడట, అదీ విషయం.

వాడెవడో అమెరికాలో గెలిస్తే, వీడు ఇక్కడ పార్టీ ఇవ్వటం ఏమిటి అనుకుంటున్నారా ? అసలు ఇన్నాళ్ళు వీడి బంధువులు అమెరికాలో వునారన్న విషయం మనకెందుకు చెప్పలేదు అనుకుంటున్నారా?

అసలు ఆ గెలిచినవాడు వీడికి బంధువని వీడికి తెలిసి ఏడిస్తే కదా, మనకు చెప్పేది. అమెరికాలో వీడి బంధువులు వున్నారని మరి వాడికెలా తెలిసిందంటూన్నారా? మంచి ప్రశ్నే వేసారు.

అమెరికాలో ఎన్ని కలు జరిగినన్నాళ్ళు మన పత్రికలు , మన మీడియా గుడ్లప్పగించి (అదే నండి కెమారాలు ) చూస్తూ కూర్చున్నాయి . గెలిచిన వాళ్ల లో తెలుగు వాళ్ళు లేదా తెలుగు మూలాలు వున్న వాళ్ళు వున్నారా అని తెగ వెతికాయి .ఆ వెతుకులట ల్లో ,మీడీయా ముచ్చట్లలో గెలిచిన వాళ్ళు మాది ఫలానా ప్రాంతం, ఫలానాఊరు, ఫలానా ఇంటిపేరు అని చెపితే అప్పుడు వీడికి తెలిసింది ,ఆ గెలిచినతను వీడికి దూరపు బంధువణి .వీడే కాదు ,మనలో చాలామంది ఎవరన్నా మంత్రులో ముఖమంత్రులో , కలెక్టరో , ఎస్పి నో కొత్తగా అయితే వాళ్ళ పుట్టు పూర్వోత్తరాలు ఆరా తీస్తారు .ఖర్మ కాలి సదరు వ్యక్తి ఆరాతీసిన వాడి కులం వాడయితే ఇంకే ముంది , వాడు మా దూరపు బంధువు అంటూ దారాలు సేవతారు వాళ్ళ పూర్వకులది మన ఊరే, మనకు చాలా దగ్గర బంధువులౌతారు , మన గోదారోళ్ళు, మన గుంటురోళ్లు అంటూ మురిసిపోతారు .

పార్టీలో ఒక పెద్దాయన మా వాడు చెప్పే సొల్లు కబుర్లు అన్నీ విని, ఇంతకీ గెలిచిన అతనికి ఫోన్ చేసి అభినందనలు చెప్పావా అని అడిగాడు. ఆ ప్రశ్నకు మావాడు గతుక్కు మని , చాలా సార్లు ఫోన్ చేసాను కలవలేదు , వాళ్ళు బిజీ పర్సన్స్ కదా అందుకే మెసేజ్ పెట్టాను అని జవాబిచ్చాడు . అసలు వీడికి అతని ఫోన్ నెంబరు తెలిస్తే కదా? ఏదిరా మెసేజ్ చూపించు అని అడుగుదామనుకుని కుడా , నాకెందుకులే ఈ గొల అని అనుకుంటూ మిన్నకుండిపోయాను.

అయినా వీళ్ళ పిచ్చిగాని, మా వాడిలాంటి వాళ్ళు, ఆ గెలిచిన నాయకులకు వందల మంది తారస పడతారు. మాతాతలు మీ తాతలు అంతా కలసి నేతులు గారు, ఇంకా అదే వాసవ వస్తోంది అని వాళ్ళ దగ్గరకు వెళితే, ఎగాదిగా చూసి దూరం పెడతారు. ఎందుకంటే ఈ రోజుల్లో డబ్బు , అధికారం రాగానే మాది తెనాలి మీది తెనాలి అంటూ దగ్గరకు చేరే బ్యాచీలే ఎక్కువయ్యాయి.ఈ భజన గాళ్ళకే ఇన్ని తెలివితేటలుంటే ,ఆ గెలిచిన వాళ్లకు ఎన్ని తెలివితేతలున్నాలి . వాలు ఓ పది ఆకులు ఎక్కువే చదివుంటారు , వాళ్ళు ఏ ఊరు వెళితే, ఆ ఊరే మా ఊరని ఏరోటి కాడ ఆ పాట పాడతారు. ఈ మధ్య ఎన్నికల్లో గెలిచినా ఓ యువనాయకుడు, ఎన్నికల్లో నిలబడ్డ ప్రతి సారి , ప్రతి చోట మీ ఊరితో నాకు నాకు ప్రత్యేకమైన అమబంధంఉంది , ఇక్కడే పుట్టాను , ఇక్కడే పెరిగాను, రోడ్ల మీద బలాదురుగా తిరిగానంటూ చెపుతుంటే , ఆ నాయుకుడిని ఎప్పుడు చూడని అఊరి వాళ్ళు నోరు వెళ్ళ పెట్టటం వాళ్ళ వంతయ్యింది.

మన లో చాలామంది జీవితాలు అమెరికాతో ముడి పడి ఉన్నాయి. వాళ్ళ పిల్లో , పిల్లాడో అక్కడ చదువుతూనో ఉద్యోగం చేస్తూనో , యిక్కడికి డాలర్లు పంపుతున్నారు. హైదరాబాదు లేదా బెంగుళూరు లాంటి సిటీలో 3బిహెచ్ కె అపార్టుమెంటు కొనగాలిగారు అంటే వాళ్ళ పిల్లల దయ . అందుకే వాళ్ళు ఇక్కడ మన ఇండియాలో ఏమి జరిగినా పెద్దగా ఏమి పట్టించుకోరు కాని అమెరికాలో ఏ మూల చీమ చిటుక్కుమన్న కంగారుపడిపోతారు.

ట్రాంప్ గెలిచాడు మరి మన పిల్లల ఉద్యోగాలు ఏమైపోతాయో నని ఆందోళన చెందుతున్నారు అసలు ఈ ఆందోళనలు ఎందుకంటే, మొదటి నుంచి మనది 'జనరల్ భోగి ' మెంటాలిటీ మన వాళ్ళు దూర ప్రయాణాలు చేసేటప్పుడు, రద్దీగా ఉన్న ఏ బస్సో రైలో కష్టపడి తోసుకుంటూ ఎక్కగానే వాళ్ళు కూర్చున్న పక్కసిట్లో ఖర్చీఫ్ వేస్తారు , కొంతమందైతే తువాలు కుడా వేస్తారు ఓ నాలుగు సీట్ల మీద . ఎవరన్నా వచ్చి ఖాళీ ఉందా అంటే ,"ఉన్నారు ..బాత్రుం కి వెళ్ళారు" అని తేలిగ్గా అబద్ధం ఆదేస్తాము. తాము ఎలాగూ దూరిపోయాం ఇకపై వచ్చే వాళ్ళని అడ్డుకోవాలి అనే సంకుచిత భావన మనకి ఎక్కువ ..అమెరికాకు వచ్చే వాళ్ళ మీద ఆంక్షలు పెడితే ఆనంద పడతాము ,ఎందుకంటే కొత్తగా వచ్చే వాళ్ళు తమ పిల్లలతో పోటిపడి అవకాశాలు తన్నుకు పోతారని.

మావాడు, పార్టీ మధ్యలో , అక్కడికొచ్చిన వాళ్ళకు నన్ను పరిచయడం చేశాడు. పరిచయం అయిన ప్రతి ఒక్కరూ మీవాడు వుండేది ఏ స్టేటండి, ఏ సిటి అండి అని అడుగుతుంటే నాకు ఏం జవాబు చెప్పాలో అర్థం కాలా . ఎందుకంటే మా ఇద్దరి పిల్లలు ఇక్కడ ఇండియాలోనే చదువుకుని, ఇక్కడే ఉద్యోగాలు చేస్తున్నారు. ఎందుకో నాకు మొదటి నుండి పిల్లలు నాకళ్ళ ముందే తిరుగుతూ వుండాలని కోరిక.మా వాళ్ళు కుడా హైదరాబాదులో కాకపోయినా మా ఉళ్లోనే ఇళ్లు కట్టుకున్నారు .

అదే విషయం అక్కడున్న ఒకరిద్దరికి చెప్తే నన్ను ఓ అజ్ఞానిలా, ఓ అమాయకుడిలా చూసారు. ఒకాయన అయితే ,"పూర్ ఫెలో ,హిస్ సన్స్ అర్ ఇన్ ఇండియా "అంటూ నా మీద జాలి చూపించాడు.

నిజమే నేను మా ఆవిడా పూర్ ఫేలోసే, ఎందుకంటే పిల్లల మీద ప్రేమ పెంచుకోవటం తప్ప పేగు తేన్చుకోవటం తెలిదు .మా పిల్లలు కుడా పూర్ ఫెలొసే ,ఎందుకంటే వాళ్లకు తలిదండ్రుల్ని అనాధ ఆశ్రమాల్లో వదిలేసి,రూపాయలు తప్ప డాలర్లు సంపాదించటం తెలిదు.

★★★★

# కారుకు అంత్యక్రియలు

సాధారణంగా మనుషులు చనిపోయిన తర్వాత కుటుంబ సభ్యులు, బంధువులు వారికి అంత్యక్రియలు నిర్వహిస్తూ ఉంటారు. అయితే కుక్కలు, పిల్లులు సహా పెంపుడు జంతువులు కూడా చనిపోయినపుడు వాటిని ఇష్టంగా పెంచుకున్న వారు.. వాటికి ఘనంగా అంత్యక్రియలు నిర్వహించిన ఘటనలు కూడా మనం చూశాం. కానీ ఇక్కడ మాత్రం ఓ కారుకు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కారుకు అంత్యక్రియలు నిర్వహించడానికి ఆ కుటుంబం ఏకంగా రూ.4 లక్షలు ఖర్చు పెట్టింది. ఇక ఈ అంత్యక్రియల కార్యక్రమానికి ఏకంగా 1500మంది హాజరయ్యారు. తమ కుటుంబానికి ఎంతో అదృష్టాన్ని తీసుకువచ్చిన ఆ కారును.. తమ పొలంలోనే ఆ కుటుంబం పూడ్చి పెట్టింది. ఈ సంఘటన గుజరాత్‌లో చోటు చేసుకుంది.

గుజరాత్‌లోని అమ్రేలీ జిల్లా పదార్‌శింగా గ్రామంలోని ఓ రైతు కుటుంబం.. తమకు అదృష్టాన్ని తీసుకువచ్చిన కారుకు ఘనంగా అంత్యక్రియలు



నిర్వహించింది. ఈ తుది వీడ్కోలు కార్యక్రమానికి సాధువులు, ఆధ్యాత్మిక నాయకులు సహా దాదాపు 1500 మంది హాజరు కావడం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సంజయ్ పోలారా అనే రైతు కుటుంబం.. రూ.4 లక్షలు ఖర్చు చేసి మరీ.. గురువారం (నవంబర్7) ఈ అంతిమ యాత్రను నిర్వహించింది. వారి ఇంటి నుంచి పొలం వరకు ఆ కారును ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సమయంలో ఆ కారుకు భారీగా పూలమాలలతో అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు కూడా నిర్వహించారు.

కథ

# "శాంతాబాయి - సెల్లు ఫోను "

జి .సూర్య

కామేశం ఆఫీసునుంచి ఇంటికొచ్చేసరికి ఇంటి తలుపులు బార్లా తీసి ఉన్నాయి. 'కొంపదీసి ఇంట్లో దొంగలుగానీ పడలేదుకదా' అని కంగారుపడ్డాడు. ఒక్క ఉదుటున "శాంతా" అని కేకేస్తూ హాల్లోకి వెళ్ళాడు. లోపల్నుంచి జవాబు శూన్యం. 'ఎక్కడకు పోయింది?' అనుకుంటూ బెడ్రూంలోకి వెళ్ళాడు. అక్కడ తన పెళ్ళాం కనబడకపోయేసరికి కిచెన్‌లోకి వెళ్ళాడు. ఊహూ.. అక్కడా కనబడకపోయేసరికి అనుమానం వచ్చింది. 'ఎప్పుడూ ఇంట్లోనే ఉండేదే? ఈ సమయంలో ఎక్కడికి వెళ్ళుంటుంది?' అనుకుంటూ జేబులోంచి ఫోన్ తీసి ఆమెకు రింగ్ చేసాడు. అది కొద్దిసేపు రింగై, కట్ అయింది. మళ్ళీ మళ్ళీ కాల్ చేశాడు. ముప్పై మూడోసారి కాల్ లిఫ్ట్ చేసిన శాంతాబాయి, "ఇక్కడ నేను మా 'కాంతామణులు – కంచి పట్టుచీరలు' వాట్సాప్ గ్రూప్ జూమ్ మీటింగులో ఉన్నా. ఎందుకు మాటిమాటికి ఫోన్ చేసి డిస్టర్బ్ చేస్తారు?" అంటూ అరిచింది.

"ఇంతకీ ఇల్లొదిలిపెట్టి ఎక్కడ తగలడ్డావ్?" అని అడిగే లోపల ఫోన్ కట్. 'ఇంట్లోనే ఎక్కడో ఉండివుంటుంది' అని, ఆమెను వెతుక్కుంటూ పెరట్లోకి వెళ్ళాడు. అక్కడ కాంపౌండ్ వాల్ పక్కన ఒక కుర్చీ వేసుకుని దానిమీద ఎక్కి నిలబడి, ఫోన్లోకి చూస్తూ మాట్లాడుతున్న పెళ్ళాం కనిపించింది.

అతడు వెళ్ళి పక్కన నిలబడ్డా పట్టించుకోకుండా ఫోన్లోకే చూస్తూ "నేను మా పెరట్లో ఉన్నానొదినా! ఇంట్లో సిగ్నల్ సరిగ్గా వచ్చిచావటంలేదు. ఇక్కడైతే ఎప్పుడూ నెట్ బాగా వస్తుంది. ఆ... ఇప్పుడు చెప్పు. ఏమిటీ ఆ బ్లౌజుకి ఆ శారీ ఎలా ఉందా? నా బొందలా ఉంది. ఆ బ్లౌజ్ కలర్ కి ఆ జరీ బోర్డర్ శారీ అస్సలు నప్పలేదు. ఇంకొకటి సెలెక్ట్ చేయాలి వదినా. శారీ మీదున్న పూల డిజైన్ కూడా అంత బాలేదు" అంటోంది.

కామేశానికి ఒళ్ళు మండిపోయింది. ఇక కోపం ఆపుకోలేక "శాంతా!" అంటూ అరిచాడు. అ అరుపుకి ఉలిక్కిపడిన ఆమె చటుక్కున వెనక్కి తిరిగింది. వెనక మొగుడు కనిపించటంతో నుదురు చిట్లించి, "ఏమిటా కేకలు? ఇవతల జూమ్ మీటింగులో ఉన్నానని చెప్పాగా. కాస్త ఆగలేరా?" అంటూ కుర్చీమీంచి కిందికి దూకబోయింది. అయితే అక్కడ నేల ఎగుడుదిగుడుగా ఉండటంతో కుర్చీ కాస్త పక్కకు కదిలింది. దాంతో ఆమె బ్యాలెన్స్ తప్పి కామేశం మీద పడింది. ఆమె బరువుకు కామేశం తట్టుకోలేక వెనక్కి విరుచుకుపడ్డాడు. అతని మీద ఆమె పడింది. ఆ ఊపులో ఇద్దరూ దొర్లుకుంటూ పల్లంలోకి ఆమడ దూరం వెళ్లారు.

కాంపౌండ్ వాల్ పక్కనే నీళ్ళ పంపు దగ్గర కూర్చుని అంట్లు తోముతున్న గిరీశం, ఆ చప్పుడు విని ఉలిక్కిపడ్డాడు. గబుక్కున లేచి "ఎవరూ? ఏమైంది?" అంటూ గోడ మీదనుంచి తొంగిచూశాడు. అక్కడ అతడికి ఒకళ్ళ మీద పడి ఒకళ్ళు దొర్లుతున్న కామేశం జంట కనిపించింది.

నేలమీద వెల్లికిలా పడి ఉన్న కామేశం, గిరీశం గొంతు విని, తన మీద ఉన్న పెళ్ళాన్ని అతి కష్టం మీద పక్కకి నెట్టేశాడు. పక్కకి దొర్లిన ఆమె, గిరీశం చూస్తుండటంతో గాభరాగా లేచి, చీర సర్దుకుని లోపలికి వెళ్ళిపోయింది. కామేశం గోడ పట్టుకుని మెల్లిగా లేచి, పట్టేసిన నడుము సర్దుకోసాగాడు.

గిరీశం అతన్ని చూసి కన్ను గీటి "చూసా చూసా. అయినా చీకటి పడకుండానే ఈ రొమాన్స్ ఏమిటి బావా?" అన్నాడు.
"రోమాన్సా నా తలకాయా? నా మొహానికి అదొక్కటే తక్కువ. హబ్బబ్బ... దీని ఫోను పిచ్చితో చచ్చిపోతున్నాననుకో. ఈమధ్య అది నాతో సంసారం చేయటం మానేసి, ఆ ఫోనుతోనే ఎక్కువ సేపు గడిపేస్తోంది బావా" అన్నాడు రొప్పుతూ.
"మరదే. నేన్నీకు చిలక్కి చెప్పినట్లు చెప్పాను. విన్నావా?" అన్నాడు గిరీశం .

"అవును బావా. అంతా నా ఖర్మ. ఏం చేసేది? చేసుకున్నవాడికి చేసుకున్నంత అంటారు. అట్లా అయ్యింది నా పరిస్థితి. బయటికి చెప్పుకోలేను. భరించలేను. దీంతో ఎట్టా చచ్చేది. నాకేమీ పాలుపోవటంలేదు" అన్నాడు దిగులుగా.

★★★

పెళ్ళయ్యాక కామేశం తన ముద్దుల భార్య శాంతాబాయితో సిటీలో కాపురం పెట్టాడు. పల్లెటూరిలో పుట్టి పెరిగిన ఆమెకి అసలు ఫోను వాడటమే తెలీదు. అయినా ఇంట్లో ఉన్న ల్యాండు ఫోను ఎలా రింగ్ చేయాలో నేర్పించటంతో, ప్రతిరోజూ మొగుడు ఆఫీసుకి వెళ్ళగానే, ఆమె తన పుట్టింటివాళ్ళతో కనీసం అరగంటైనా మాట్లాడేది. తర్వాత్తర్వాత ఇక ఆమెకు ఆ ల్యాండ్ ఫోను బాగా అలవాటైపోయింది.

కొన్నాళ్ళకి మెల్లిగా మార్కెట్లోకి సెల్ ఫోన్లు రావటం మొదలైంది. అయినా కామేశం ఫోను కొనటానికి అంతగా ఉత్సుకత చూపించలేదు. అయితే వాళ్ళ పెళ్ళిరోజున అతని మామ లావాటి సెల్ ఫోను ఒకటి తెచ్చి అతనికి బహుమతిగా తెచ్చాడు. దాన్ని అతని చేతిలో పెడుతూ "దీన్లో సిమ్ము వేసుకుని గుమ్మిగా వాడుకో

అల్లుడూ” అన్నాడు.

ఆ ఫోను చూసి, కామేశం ఎంతగానో సంబరపడిపోయాడు. ఫ్రీగా ఫోను రావటంతో ఇక ఆగలేక అతడు ఆరోజే మార్కెట్టుకి వెళ్ళి ఒక కొత్త సిమ్ము కొని, దాన్లో వేసుకున్నాడు. జేబులో పెన్ను పెట్టుకోవాలన్నా చికాకుపడే అతడు, చాలా బరువుగా ఉన్న ఆ ఫోన్ని మాత్రం ఎంతో అపురూపంగా చూసుకునేవాడు. ఎటు వెళ్ళినా అది అతని చేతిలోనే ఉండేది. ఆ ఫోన్ని స్టైలుగా చెవి దగ్గర పెట్టుకుని, ఫోన్లు లేని తన కోలీగ్స్ ముందు ఫోజులు కొట్టేవాడు. ఇంట్లో పెళ్ళానిక్కూడా ఆ ఫోను చూపించి దాన్ని వాడమనేవాడు. కానీ ఆమె మాత్రం “ఆ బరువైన ఫోను వాడటమంటే నాకు మాచెడ్డ చిరాకు బాబూ. ఎంచక్కా లాండు ఫోను అయితే ప్రశాంతం” అనేది.

కాలంలో మార్పులతో సహా సెల్ ఫోన్లో కూడా ఎన్నో మార్పులు వచ్చి, వాట్సప్పు, ఫేసుబుక్కులాంటివి మొదలవటంతో కామేశం, తన బరువైన ఫోన్ని పక్కన పడేసి, స్లిమ్ముగా ఉండే స్మార్టు ఫోను ఒకటి కొనుక్కున్నాడు.

కానీ ఆమె మాత్రం ‘నాకు లాండు ఫోనే మహా భాగ్యం’ అన్నట్లుండేది.

పెళ్ళాం వాలకం చూసి, అతడు తెగ జాలిపడిపోయి, ఆమెను దగ్గర కూర్చోబెట్టుకుని, “మారుతున్న కాలంతో పాటు మనమూ మారాలోయ్. ఇంట్లో కూర్చుని ఎంతసేపని ఆ లాండు ఫోన్లో మాట్లాడతావు? సెల్ ఫోనుంటే ఎక్కడున్నా ఎవరితోనైనా మాట్లాడొచ్చు. అదీగాక వాట్సప్పులో ఫ్రెండ్స్, చుట్టాలు, పాటలు, భక్తి ఇలా రకరకాల గ్రూపులుంటాయి. పాపం మీ నాన్న నాకు ఎంతో ప్రేమతో ఇచ్చిన ఫోను కదా! నువ్వు దీన్ని వాడుకో శాంతా!” అంటూ తన పాత ఫోనుని ఆమె చేతికిచ్చాడు.

“ఏమో బాబూ! నాకే కొత్త స్నేహాలూ వద్దు. మీతోనే నా లోకం. మీరే నా సర్వస్వం” అని ఆమె అరమోడ్పు కన్నులతో అంటుంటే సంబరపడిపోయి, “సరేలే కానీ. కనీసం నా ఫోన్లో మన ఫ్యామిలీ గ్రూపునన్నా చూస్తుండు” అనటంతో సరేనంది.

ఎవరూ వాడకపోవటంతో అతని మామగారిచ్చిన పాత ఫోను కాస్తా పాత సామాన్లు పడేసే స్టోర్ రూములోకి చేరిపోయింది.

★★★

ఓరోజు కామేశం తన ముద్దుల పెళ్ళాం పక్కన కూర్చుని, తన ఫోను చూపిస్తూ అందులో ఉన్న రకరకాల ఫీచర్సుని వివరిస్తూ, స్మార్ట్ ఫోనువల్ల కలిగే లాభాలను చెప్పసాగాడు.

అది చూసిన గిరీశం అతన్ని పక్కకి పిలిచి “మా చెల్లాయికి అసలు సెల్ ఫోనంటేనే పడదని తెలిసి, నువ్వెంతో అదృష్టవంతుడివని అనుకున్నాను. కానీ నువ్వింత తెలివితక్కువ పని చేస్తావని అనుకోలేదు బావా. మా చెల్లాయికి ఈ ఫోను పాఠాలేంటి? నా మాట విను. నిప్పుతో తల గోక్కుంటున్నావ్. ఈ సెల్ ఫోను జాడ్యాన్ని మా చెల్లాయికి అంటించి, హాయిగా ఉన్న ప్రాణాన్ని ఎందుకు కష్టాలపాలు చేసుకుంటావు? నేనూ మొదట్లో నా పెళ్ళానికి ఇలాగే ఫోన్ గురించి నేర్పించాను. తర్వాత అది తనకొక స్మార్ట్ ఫోను కొనిచ్చేదాకా నన్ను చంపుకుతిన్నది. ఇప్పుడు చూడు ఇంటిపనీ, వంటపనీ నా నెత్తికి చుట్టుకుని నా కొంప కొల్లేరయ్యింది” అన్నాడతనితో.

“అదేంటి బావా అట్లా అంటావ్? ఆడవాళ్ళకి మాత్రం లోకజ్ఞానం ఉండవద్దా? అస్తమానం ఇంట్లో పనులతో విసిగిపోయే ఆడాళ్ళకి టైమ్ పాస్ కావద్దా? వాళ్ళకీ కొత్త కొత్త లోకాల్ని చూపించాలి” అన్నాడు.

దానికి గిరీశం “నువ్వో పిచ్చిమాలోకానివి బావా! ఇప్పుడు ఇలా అంటున్నావుగానీ ముందుముందు జరగబోయే ప్రమాదాన్ని ఊహించలేకపోతున్నావ్” అన్నాడు. “అదేమీ కాదు. ఈరోజుల్లో ఆడవాళ్ళు అన్ని రంగాలలో ముందడుగు వేస్తున్నారు. వాళ్ళని మనం ఎంకరేజ్ చేయాలి” అన్నాడతడు.

“నేను చెప్పాల్సింది చెప్పాను. ఆపైన నీ ఇష్టం బావా! అయినా ఎవరి

ఖర్మకి ఎవరు కర్తలు" అని నెత్తి బాదుకుంటూ గిరీశం వెళ్ళిపోయాడు.

★★★

కొద్దిరోజుల తర్వాత శాంతాబాయి తమ్ముడి పెళ్లి జరిగింది. ఆ పెళ్ళికి వచ్చిన ఆమె ఫ్రెండ్స్ ఆమె దగ్గర సెల్ ఫోను లేకపోవటం చూసి ఆశ్చర్యపోయారు. 'ఏమిటే నువ్వింకా పురాతన కాలంలోనే ఉన్నావు? నీ ఒక్కదానికి తప్ప మన ఫ్రెండ్స్ అందరికీ స్మార్ట్ ఫోన్లు ఉన్నయ్. ఇప్పటికైనా అప్ డేట్ అవ్వవే" అన్నారు.

"ఏమోనే. ఆ సెల్ ఫోనంటేనే నాకు చిరాకు" అందామె.

"అలా కాదే. నువ్వూ ఒక సెల్ ఫోను కొనుక్కున్నావనుకో. మేమందరం ఉన్న వాట్సప్పు గ్రూపులో నిన్నూ చేర్చుకుంటాం. దాంతో ఇహ మనకి రోజంతా కబుర్లే కబుర్లు. నువ్వు ఊ అను. మా అన్నయ్యగారితో చెప్పి, నీకు ఒక ఫోను కొనిపించేట్లు చేస్తాం" అన్నారు.

'తన భర్త ఈ మాట ఎప్పుడో చెప్పాడు. తనే కాస్త భయపడింది. ఇప్పుడు తాను సెల్ ఫోను కొనాలా వద్దా?' అన్న ఆలోచనలో పడిందామె. అప్పుడే అక్కడికి వచ్చిన కామేశం వాళ్ళ మాటలు వింటూనే "అదే నేనూ చెప్తుంటానండీ. మీ ఫ్రెండు వింటేనా? ఫోను కొనిస్తానంటే ససేమిరా అంటోంది" అన్నాడు.

"ఇంకేమిటే. అన్నయ్యగారే కొనిస్తానంటూంటే వద్దంటున్నావా? నీకేమైనా పిచ్చా? మా మాట విని ఎంచక్కా ఒక సెల్ ఫోను కొనిపించుకోవే" అన్నారంతా. అందరూ బలవంతపెట్టటంతో ఎట్టకేలకు సెల్ ఫోన్ వాడటానికి ఆమె సరేనంది. ఆ రకంగా ఆమె ఒక కొత్త స్మార్ట్ ఫోన్ స్వంతదారు అయింది.

★★★

ఆ మర్నాడు అతడు ఆఫీసునుంచి వస్తూనే "డార్లింగ్! నీ ఫోను తీసుకురా" అని పిలిచాడు.

"అబ్బ ఇప్పుడేగా వచ్చారు. ఎందుకంత తొందర? కాస్త టీ తాగి రిలాక్స్ కండి. వేడివేడి పకోడీలు చేశాను. అవి ఆరగించండి. ఆ తర్వాత ఫోను సంగతి చూద్దురుగాని" అని శాంతాబాయి గోముగా అంటుంటే, "నా పెళ్ళాం బంగారం" అనుకున్నాడు. ఆ తర్వాత ఆమెను కూర్చోబెట్టి, స్మార్ట్ ఫోను ఎలా ఓపెన్ చేయాలి అన్న దగ్గర్నుంచి, దానిలో ఏమేమి ఫీచర్లు ఉన్నాయి, వాటిని ఎలా వాడాలి అన్న ప్రతి విషయాన్నీ ఆమెకు నేర్పటం మొదలుపెట్టాడు.

"అన్నీ ఒక్కసారే అంటే నా మెదడుకి ఎక్కట్లేదు. మిగిలింది రేపు నేర్చుకుంటాన్లెండి" అని ఆమె లేచి వెళ్లిపోతుంటే 'బుద్ధావతారం' అంటూ విసుక్కున్నాడు.

అలా నెలరోజులు గడిచేసరికి స్మార్ట్ ఫోను మీద ఆమెకు మంచి అవగాహన వచ్చేసింది. ఆ రోజునుంచీ రోజూ భర్త ఆఫీసుకి వెళ్ళాక, అతన్ని పలకరించటం, లంచ్ టైమ్ లో ఫోను చేసి, 'వంటకాలు ఎలా ఉన్నాయి' అని అడగటం చేసేది. దాంతో అతడు తెగ మురిసిపోయేవాడు.
ఆ తర్వాత కొద్దిరోజులకు ఆమె అతన్ని పలకరించటం కాస్త తగ్గించింది. మరికొన్నాళ్ళకి ఆ పలకరింపు కూడా పూర్తిగా తగ్గిపోయి, భర్త ఫోను చేస్తే, 'కొంచెం బిజీగా ఉన్నానండీ' అని జవాబివ్వటం మొదలుపెట్టింది. అతడు కాస్త నిరాశ పడ్డా తన పెళ్ళాం ఏ పనిలో మునిగిపోయి ఉందో అని తనని తాను సమాధానపరచుకున్నాడు.

ఇంకొన్నాళ్ళ తర్వాత ఆతనెన్నిసార్లు ఫోను చేసినా, ఆమె ఫోను ఎంగేజ్ రావటం మొదలైంది. ఆదేమని అడిగితే, మా వాళ్ళతో మాట్లాడుతున్నాననో, ఫ్రెండ్సుతో మాట్లాడుతున్నాననో చెప్పేది. "ఏమిటి? ఎప్పుడు చూసినా నీ ఫోను ఎంగేజ్ వస్తుంది?" అని అతను విసుక్కున్నాడో రోజు.

అంతే. ఆమె ఒక్కసారి అతనివైపు చురుగ్గా చూసి, "నేనేమైనా ఫోను కొనివ్వమని అడిగానా? వద్దు వద్దంటూంటే మీరేగా కొనిపెట్టింది. అసలు నాకు ఫోనే వద్దు. మీరే తీసుకోండి" అంటూ ఫోను అతని ఒళ్ళో పడేసి, మూతి ముడుచుకుంది.
ఇక ఆరోజంతా ఆమెను బ్రతిమాలి

బామాలి, దోవలోకి తెచ్చుకునేసరికి అతని 'బట్టతల ప్రాణం అరికాల్లోకి' వచ్చింది.

★★★

ఇక ఆరోజునుంచి ఆమెని కంట్రోల్ చేయటం అతనివల్ల కాలేదు. ఓరోజు పొద్దున్నే లేచి బ్రష్ చేసుకుని, ఆమె అందించే టీ కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నాడు. కానీ ఎంతసేపైనా టీ వచ్చే దాఖలాలేవీ కనబడకపోవటంతో, విషయం కనుక్కుందామని కిచెన్లోకి వెళ్ళాడు. అక్కడ స్టౌ పైన టీ మరిగి మరిగి, గిన్నె మాడి మసైపోయి కనిపించేసరికి కంగారుపడిపోయి, 'దీనికేమీ కాలేదుగదా' అనుకుంటూ ఆమె కోసం వెతికాడు.

పెరట్లో ఆమె బ్రష్ చేసుకునే సింక్ దగ్గర కనిపించేసరికి 'హమ్మయ్య' అనుకుని మెల్లిగా దగ్గరికెళ్లాడు. తీరా వెళ్ళి చూస్తే ఆమె అక్కడ బ్రష్ పక్కకి పడేసి, ఫోను చూస్తూ కనిపించింది. అది చూడగానే అతనికి ఒక్కసారిగా బీపీ రైజై పోయింది.
"ఏం చేస్తున్నావిక్కడ?" అని అడిగాడు.

ఉలిక్కిపడి వెనక్కి చూసిన ఆమె "హబ్బ... మీరా? చెవ్వు దగ్గర సడెన్‌గా మాట వినిపించేసరికి ఏ దొంగ వెధవో అని హడలి చచ్చాను కదండీ" అంటూ తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది.

"దొంగ వెధవను కాదే, పిచ్చి వెధవని. పొద్దున పొద్దున్నే నా మొహాన కనీసం టీ నీళ్ళు పోస్తావని ఎదురుచూస్తుంటే నువ్విక్కడ ఫోను చూస్తూ కూర్చున్నావా?" కోపంగా అడిగాడు.

"అయ్యో సారీ అండీ. నిన్న మనింట్లో 'మాడిపోయిన మసాలా దోశ' ఫోటో ఫేసు బుక్కులో పెట్టానుకదా! దానికి ఎన్ని లైకులు వచ్చాయో చూస్తున్నా. అయినా టీ తాగాలనిపిస్తే స్టౌ మీద ఉన్న గిన్నెలోంచి పోసుకు తాగొచ్చుగా. దానికోసం ఇక్కడిదాకా రావాలా?" అంది.

"ఏంటి తాగేది? ఒకసారి లోపలికొచ్చి చూడు" అనటంతో, కిచెన్లోకి వచ్చి మాడిపోయిన టీ గిన్నెను చూసి, "మళ్ళీ సారీ అండీ. ఆ మాడిపోయిన మసాలాదోశ గోడవలో పడి, టీ గిన్నె మాడిపోతుందన్న సంతే మర్చేపోయాను చూశారా! అసలు మిమ్మల్నే టీ పెట్టుకోమంటే సరిపోయేది. ఈసారి ఇలా జరగనివ్వనులెండి" అంది.

అతనికేం మాట్లాడాలో పాలుపోలేదు. ఏమైనా అందామంటే మూతి ముడిచి ముప్పై రోజులదాకా మాట్లాడదాయె. ఇలా లాభం లేదని తనే టీ పెట్టుకుందామని తయారవుతుంటే "టీ పెట్టుకుంటున్నారా? థాంక్యూ. కాస్త ఎక్కువ పెట్టి నాక్కూడా ఓ కప్పు పొయ్యండి. పుణ్యముంటుంది" అంటూ ఫోన్లోకి తల దూర్చేసింది.
ఆమెను ఏమనాలో తెలీక జుట్టు పీక్కున్నాడు. దాంతో గుప్పిటినిండా జుట్టు ఊడొచ్చి, బేరుమన్నాడు. ఆమె ఇవేవీ పట్టించుకునే స్థితిలో లేదు.
ఇక అప్పటినుంచి అతడు రుచికరమైన భోజనానికి మొహం వాచిపోయాడు. సెల్ ఫోను పుణ్యమా అని ఉడికీ ఉడకని అన్నం, ఉప్పు కారం లేని మాడిపోయిన కూరలు అతని లంచ్ బాక్స్ లో కనిపించేవి. ఒక్కోసారి ఫోన్ చూస్తూ, మాటల్లో పడి ఆమె గడప దాటి వెళ్ళిపోయిన సందర్భాలుకూడా ఉన్నాయి. అతడు వెనక పరిగెత్తుకుంటూ వెళ్ళి, ఆమెను ఇంట్లోకి లాక్కొచ్చేవాడు.

పక్కింటి గిరీశం చిలక్కి చెప్పినట్టు చెప్పినా వినకుండా, ఆమెకు ఫోను అలవాటు చేసినందుకు తనకి తగిన శాస్తి జరిగిందని తనని తానే నిందించుకోవటం తప్ప ఏమీ చెయ్యలేక దిగాలుగా అయిపోయాడు.

★★★

పెరట్లో జరిగిన సంఘటనతో కామేశం బాధపడుతూ కనబడేసరికి, గిరీశం అతనితో "ఈమాత్రం దానికే ఇలా డల్లైపోతే ఎలా బావా? సందర్భం కాకపోయినా ఒక సామెత చెబుతా విను. 'కుక్క కాటుకు చెప్పు దెబ్బ'

అని విన్నావుగా. మా చెల్లాయికి తన స్టైల్లోనే జవాబు చెప్పు. ఈ చిట్కా మా ఆవిడ మీద ట్రై చేశాను కానీ వర్కవుట్ అవ్వలేదు. నువ్వు ట్రై చేసి చూడు. మా చెల్లాయి అమాయకురాలు కాబట్టి కనీసం నీకైనా పని చేయవచ్చు!" అన్నాడు. "డొంక తిరుగుడు మానేసి ఆ సామెత ఎంతో చెప్పేడువ్" అన్నాడు కామేశం చికాగ్గా.

"ఓకే ఓకే. నీ ఫ్రస్టేషన్ నాకర్థమవుతోంది. తను ఎప్పుడూ ఫోనుతోనే ఉంటుందిగదా! నువ్వు సరిగ్గా అలాగే తనని ఫాలో అయిపో. కాస్త ఎగస్ట్రా చేసినా పర్లేదు. కానీ ఏమాత్రం తగ్గకూడదు. నీ దెబ్బకి తను పూర్తిగా మారిపోవాలి" అన్నాడు.

దాంతో కామేశానికి కర్తవ్యం బోధపడింది. మర్నాడు అతడు ఆఫీసునుంచి ఇంటికొచ్చేసరికి ఫోను చూడటంలో మునిగిపోయిన శాంతాబాయి కనిపించింది. అతడు మాట్లాడకుండా వెళ్ళి, ఆ పక్కనే ఉన్న సోఫాలో కూర్చుని జేబులోంచి తన ఫోను తీసి చూడటం మొదలుపెట్టాడు. రాత్రి భోజనాల దగ్గర పలకరిస్తే అతడు ఫోన్లోంచి తల తిప్పలేదు. తల మాత్రం ఊపాడు.

రాత్రి పక్కమీదకు చేరగానే, ఆమె వైపు చూడనైనా చూడకుండా నిండా దుప్పటి కప్పుకుని పడుకున్నాడు. అతడు కప్పుకున్న దుప్పటిలోంచి వెలుగు కనిపించటంతో "ఏం చేస్తున్నారు?" అంటూ ఆమె దుప్పటిని ఒక్క లాగు లాగింది. లోపల అతను అదేపనిగా ఫోనులోకే చూస్తున్నాడు.

"మిమ్మల్నే. పిలుస్తుంటే పలకరేం? ఇంతరాత్రి దుప్పటి కప్పుకోని మరి ఏం చూస్తున్నారు?" అనడిగింది.

అతను ఫోన్లోంచి తల తిప్పకుండా "నిన్న నేను వేసుకెళ్లిన నా బ్లాక్ షర్టంటే తనకి బాగా నచ్చిందని మా కొలీగ్ పంకజం చెప్పింది. వెంటనే ఫోటో దిగి, దాన్ని ఎఫ్ బీలో పెట్టాను. దానికి ఎన్ని లైకులో చూశావా?" అంటూ మళ్ళీ దుప్పటి కప్పుకున్నాడు. ఆమెకు ఒళ్ళు మండిపోయి అటు తిరిగి పడుకుంది.

మర్నాడు ఉదయం లేచిన దగ్గర్నుంచీ అతడు ఫోన్ని వదల్లేదు. ఆఫీసుకి వెళ్తున్నప్పుడు లంచ్ బాక్సు అందిస్తూ ఏదో అన్నది. అతడు ఆమె మాటలు వినకుండానే బాక్స్ అందుకుని, ఫోను చూస్తూ బయటికి నడిచాడు. ఆమెకు ఒళ్ళు మండిపోయి, అతడిని ఆపి, "నేనో పక్కన మాట్లాడుతుంటే మీకు చీమ కుట్టినట్లయినా లేదా?" అనడిగింది. "మా ఆఫీసులో నా జూనియర్సుకి జూమ్ మీటింగ్ పెట్టి వర్క్ అలాట్ చేయాలి. ఇంకా మా పంకజం పెట్టిన వాట్సప్ గ్రూపులో రోజూ అందరినీ పలకరించాలి. లేకపోతే వాళ్లెంత ఫీలవుతారు చెప్పు? అదీగాక నేను దాదాపు పది గ్రూపులకి అడ్మిన్ని. అన్నీ చూసుకోవద్దూ. ఫోను అంటూ ఉన్నాక ఎన్ని పనులుంటై" అంటూ వెళ్ళిపోయాడు. లంచ్ టైంలో ఫోన్ చేస్తే "ఐ యామ్ బిజీ" అంటూ ఫోను కట్ చేశాడు.

అలా భర్త నాలుగు రోజులు మాట్లాడకపోయేసరికి ఆమెకి పిచ్చెక్కినట్లైంది. అప్పుడుగానీ సెల్ ఫోను పిచ్చిలో పడి, తను సంసారాన్ని నిర్లక్ష్యం చేసిన సంగతి ఆమె బుర్రకి ఎక్కలేదు. 'ఛీ. వెధవ ఫోను. దీనిమూలంగా బంగారంలాంటి నామొగుణ్ణి కష్టపెట్టాను' అని పశ్చాత్తాపపడింది.

సాయంత్రం మొగుడు ఇంటికి రాగానే తన ఫోను అతనికి ఇచ్చేస్తూ 'నాకిక ఈ ఫోనూ వద్దు పాడూ వద్దు. నా తప్పు నాకు తెలిసొచ్చింది. ఇంకెప్పుడూ దీని ముఖమైనా చూడను" అంది.

అతడు నవ్వి, ఆ ఫోను ఆమె చేతిలో పెడుతూ "అదే తప్పు. నేన్నీకు ఫోను నేర్పింది ఖాళీ సమయాల్లో నీక్కాస్త టైమ్ పాస్ అవుతుందనీ, కొత్త కొత్త విషయాలు నేర్చుకుంటావని. కానీ నువ్వు దాన్నే లోకంగా భావించి మిగిలినవన్నింటినీ వదిలేసావు. అతి సర్వత్ర వర్జయేత్ అన్న సూక్తి ఏ విషయంలోనైనా వర్తిస్తుంది" అన్నాడు.

"సారీ అండీ. ఇంకెప్పుడూ ఈ ఫోను గొడవలో పడి మిమ్మల్ని నిర్లక్ష్యం చేయను" అందామె నిజాయితీగా.

"అవునా! థాంక్యూ" అన్నాడతడు ఆమెని దగ్గరికి తీసుకుంటూ.

ఇక ఆరోజునుంచీ శాంతాబాయికి సెల్లు పిచ్చి తగ్గిపోవటంతో కామేశం ఫుల్లు హ్యాపీ అయ్యాడు.

★★★

## నమ్మకాలు- నిజాలు

# ఇన్ఫ్లుయెన్సర్ల మాటలు నమ్మొద్దు

మహిళలు తరచు పీరియడ్స్ నొప్పి, అధిక బరువు, డిప్రెషన్, అలసట వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఇది ప్రతి పది మంది మహిళల్లో ఒకరికి వచ్చే సమస్య. కానీ, వైద్యం ఆమెకు సాంత్వన చేకూర్చలేకపోయింది. అదే సమయంలో ఇన్స్టాగ్రామ్లో కొంత మంది పీసీఓఎస్ సమస్యకు మూల కారణాన్ని పరిశోధకులు ఇప్పటికీ గుర్తించనప్పటికీ, దానికి చికిత్స చేస్తానని హామీ ఇస్తున్నారు .

కస్టమర్ ల్యాబ్ పరీక్షలు, 'హెల్త్ ప్రోటోకాల్' (డైట్, సప్లిమెంట్ ప్లాన్), కోచింగ్ పేరిట రూ.3-4 లక్షలు ఫీజుగా తీసుకుంటున్నారు . వాళ్ళ సూచనల మేరకు పలు వెబ్సైట్స్లో ప్రోడక్టులను కొనుగోలు చేయడానికి మరికొన్ని వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది .రోగులకు టెస్ట్లు చేయడానికి వాళ్ళకు అర్హత లేదని స్త్రీ వ్యాధుల నిపుణులు, మహిళా ఆరోగ్య అధ్యాపకులు చెపుతున్నారు ..

అంతేకాదు, క్లినికల్‌గా వాటిని తక్కువగా ఉపయోగించారు .ఏడాది పాటు ఆ ప్రోడక్టులను వాడినా ఉపయోగం లేకపోవడంతోమోసపోయామని తెలుసుకుంటున్నారు .

లక్షలాది ఫాలోవర్లున్న కొందరు ఇన్‌ఫ్లుయెన్సర్‌లు వైద్యపరంగా అర్హత లేకపోయినా కోర్సులు ఆఫర్ చేస్తున్నారు. పీసీఓఎస్ కోసం సులువైన వైద్య చికిత్స లేకపోవడాన్ని అనువుగా మలుచుకుంటున్నారు. తమను తాము నిపుణులుగా ప్రచారం చేసుకుంటూ నకిలీ నివారణ చికిత్సలను విక్రయిస్తున్నారు. కొందరు తమను తాము పోషకాహార నిపుణులు లేదా 'హార్మోన్ కోచ్‌లు'గా చెప్పుకొంటారు. ఆన్‌లైన్‌లో కొన్ని వారాలు కోర్సులు చేసి ఇలాంటి ట్యాగులు సంపాదించుకుంటున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో 'పీసీఓఎస్' హ్యాష్‌ట్యాగ్ ఉండి అత్యధిక వ్యూస్ కలిగిన వీడియోల సగం వీడియోలు తప్పుడు సమాచారాన్ని పంచుకున్నట్లు గుర్తించాం. ఈ బృందం ఇంగ్లిష్, స్వాహిలి, హిందీ, పోర్చుగీస్‌లో టాప్ 25 వీడియోలను పరిశీలించింది. అనేక ఆంగ్ల వీడియోలు భారత్, నైజీరియా, కెన్యా బ్రెజిల్‌లోనూ ప్రాచుర్యం పొందాయి.ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా 70 శాతం మంది మహిళలు పీసీఓఎస్‌తో బాధపడుతున్నారు. రోగ నిర్ధరణ జరిగినప్పటికీ చాలామంది మహిళలు సరైన చికిత్సను పొందలేకపోతున్నారు.

ఇన్‌ఫ్లూయెన్సర్లు షేర్ చేసే కొన్ని తప్పుడు ప్రకటనలు:

తక్కువ కార్బొహైడ్రేట్, అధిక కీటో ఆహారం వంటివి పీసీఓఎస్‌ను నయం చేయగలవు.
జనన నియంత్రణ మాత్రలు పీసీఓఎస్‌కు కారణమవుతాయి లేదా పరిస్థితిని మరింత దిగజార్చుతాయి.
పీసీఓఎస్‌ను డైట్ సప్లిమెంట్స్‌తో నయం చేయవచ్చు.
మెడిసిన్లు పీసీఓఎస్ లక్షణాలను బయటికి కనిపించనివ్వవు కానీ, దాని 'మూల కారణాన్ని' అవి పరిష్కరించవు.
కానీ.. కఠినమైన క్యాలరీ కంట్రోల్ ఆహారాలు పీసీఓఎస్‌పై ప్రభావం చూపుతాయనడానికి ఎటువంటి రుజువు లేదని, కీటో డైట్ అనేది పీసీఓఎస్ లక్షణాలను మరింత దిగజార్చవచ్చని నిపుణులు అంటున్నారు.

గర్భనిరోధక మాత్రలు పీసీఓఎస్‌కి కారణం కాదని చెప్పారు.
పీసీఓఎస్‌కు ఒక్క కారణం కూడా లేదన్నది నిపుణుల మాట.

భారత్, కెన్యా, నైజీరియా, బ్రెజిల్, యూకే, అమెరికా, ఆస్ట్రేలియా సహా పలు దేశాల నుంచి 14 మంది ఇన్‌ఫ్లుయెన్సర్‌లు ప్రచారం చేసిన ఉత్పత్తులను ఆ మహిళలు వాడారు.

వారిలో ఒకరు బెంగుళూరుకు చెందిన వైష్ణవి. అన్య శర్మ అనే ఇన్‌ఫ్లుయెన్సర్‌ను వైష్ణవి నమ్మారు. డైట్ ప్లాన్, డీటాక్స్ వంటి 'సహజ' నివారణలను అన్య ప్రోత్సహిస్తుంటారు. బరువు తగ్గే సూచనలు కూడా ఇస్తుంటారు. అన్య చెప్పిన డైట్ ప్లాన్ అనుసరించారు వైష్ణవి. ఆ డైట్ ప్రకారం రోజుకు 1,000 నుంచి 1,200 కేలరీల శక్తినిచ్చే ఆహారం తినేవారు.

ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పీసీఓఎస్ లక్షణాలను తగ్గిస్తాయి. కానీ, కఠిన కేలరీల పరిమితులు రుగ్మతలకు దారితీయవచ్చు. సగటు స్త్రీకి రోజుకు 2,000 కేలరీలు అవసరమని యూకే నేషనల్ హెల్త్ సర్వీస్ సలహా ఇస్తోంది.

కోర్సు అనుసరించాక వైష్ణవికి ఆరు నెలల పాటు పీరియడ్స్ ఆగిపోయాయి, తక్కువ తినడం వల్ల కలిగే దుష్ఫలితమిది. అదేసమయంలో అన్య చెప్పినట్లు త్వరగా బరువు కూడా తగ్గలేదు. ఇది ఆమెను కుంగదీసింది. రీరంపై వెంట్రుకలు, బరువు పెరగడం, పీరియడ్స్ నొప్పి, వంధ్యత్వానికి సంబంధించిన ఆందోళనలపై వైద్యుల నుంచి సరైన సహాయం అందలేదన్న కారణంతో ఓ ఇన్‌ఫ్లుయెన్సర్‌ను ఆశ్రయిస్తున్నారు . వీరి బారిన పడి మోసపోతున్నారు .

★★★

# సిరియా - భారత్ సంబంధాలు





కొండేటి వీణ

భారత్, సిరియాల మధ్య చాలాకాలంగా మంచి సంబంధాలు ఉన్నాయి. ప్రస్తుతం రెండు దేశాలు కొన్ని ప్రాజెక్టులలో కలిసి పనిచేస్తున్నాయి. 2022లో సిరియా విదేశాంగ మంత్రి ఫైసల్ మక్దాద్ భారత్‌లో పర్యటించారు. ఆ సమయంలో భారత విదేశీ వ్యవహారాల శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది.సిరియాలో పవర్ ప్లాంట్, స్టీల్ ప్లాంట్ నిర్మించడానికి భారత్ రూ.2,370 కోట్లు ఆర్థిక సహాయం చేయనుంది.స్వాతంత్ర్యానంతరం భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అలీన ఉద్యమ పరిధిని దాటి అరబ్ దేశాలతో సత్సంబంధాలు ఏర్పరుచుకున్నారు. నెహ్రూ 1957,1960లలో సిరియా పర్యటనకు వెళ్లారు.నెహ్రూ పర్యటన గురించి స్థానిక పత్రికలు చాలా కథనాలు రాశాయని ఇజ్రాయెల్‌లోని బార్ ఇలాన్ విశ్వవిద్యాలయంలో పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్ డాక్టర్ రామి గినాట్ తన పరిశోధనా పత్రాలలో తెలిపారు.

# కరెంట అఫైర్స్

"ప్రజలలో చాలా ఉత్సాహంగా తరలివచ్చారు. నెహ్రూకు స్వాగతం పలికేందుకు విమానాశ్రయంలో 10 వేల మందికి పైగా జనం నిలబడి ఉన్నారు. నెహ్రూను చూడగానే వారంతా ఒక స్వరంలో – 'ప్రపంచ శాంతి వీరుడికి స్వాగతం' అంటూ నినదించారు. 'ఆసియా నాయకుడు చిరకాలం జీవించాలి' 0నినాదాలు చేశారు'' అంటూ ఆ పత్రాలలో పేర్కొన్నారు. 1978, 1983లలో అప్పటి సిరియా అధ్యక్షుడు హఫీజ్ అల్ అస్సాద్ భారత్‌లో పర్యటించారు. 2003లో అప్పటి భారత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి సిరియాలో పర్యటించారు.
వాజ్‌పేయి సిరియా పర్యటన సందర్భంగా అప్పటి భారత విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి నవతేజ్ సర్నా సిరియా టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో.. అరబ్ ప్రపంచంతో ముఖ్యంగా సిరియాతో భారత్‌కు చాలా బలమైన సంబంధాలు ఉన్నాయని చెప్పారు. వాజ్‌పేయి పర్యటన భారత్‌కు సిరియా ఎంత ముఖ్యమో తెలియజేస్తోందని అన్నారు. తర్వాత 2008లో సిరియా అధ్యక్షుడు బషర్ అల్ అస్సాద్ భారత్‌లో పర్యటించారు. అనంతరం ఇరు దేశాల మధ్య ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందాల రాకపోకలు కొనసాగాయి.

2010లో అప్పటి భారత రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ సిరియాలో పర్యటించారు.

అస్సాద్ కుటుంబంతో భారత్ ఎప్పుడూ సత్సంబంధాలు కొనసాగిస్తుందని చెప్పారు. బషర్ అల్–అస్సాద్ తండ్రి హఫీజ్ అల్–అస్సాద్ 1971 నుంచి 2000 వరకు సిరియాలో అధికారంలో ఉన్నారు. 2000 నుంచి అధికారం బషర్ అల్–అస్సాద్ చేతుల్లోనే ఉంది. 2011లో ప్రారంభమైన అరబ్ స్ప్రింగ్ (ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాలు) తర్వాత బషర్ అల్–అస్సాద్‌కు కష్టాలు పెరిగాయి. రాజీనామా చేయాలని ఆయనపై ఒత్తిడి వచ్చింది. దీనికి అమెరికా మద్దతిచ్చినా అది సాధ్యపడలేదు. ఆ సమయంలో సైనిక బలగాలను ఉపయోగించకుండా వివాదాన్ని పరిష్కరించుకోవాలని భారత్ సూచించింది. సిరియాలోని అన్ని పార్టీలను కలుపుకొని చర్చల ద్వారా పరిష్కారం కనుగొనాలని తెలిపింది. ఈ సమయంలో దమాస్కస్‌లో భారత రాయబార కార్యాలయం సేవలు కూడా నడిచాయి.
2013లో సిరియాలో కొనసాగుతున్న వివాదాన్ని పరిష్కరించడానికి జెనీవా–II సమావేశం జరిగింది. ఈ సదస్సుకు అప్పటి భారత విదేశాంగ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ హాజరయ్యారు. జెనీవాలో ఖుర్షీద్ మాట్లాడుతూ.. "సిరియాలో కొనసాగుతున్న సంఘర్షణ కారణంగా భారత ప్రయోజనాలు ప్రమాదంలో పడ్డాయి. మాకు పశ్చిమ ఆసియా, గల్ఫ్ ప్రాంతాలతో మంచి సంబంధాలున్నాయి. సిరియాలో ఘర్షణలు భారత ప్రయోజనాలను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. అందుకే ఈ సంక్షోభాన్ని శాంతియుతంగా పరిష్కరించే ప్రయత్నాలకు భారత్ గట్టిగా మద్దతు ఇస్తుంది'' అని అన్నారు.

2022లో సిరియా విదేశాంగ మంత్రి భారత్‌ను సందర్శించారు. ఆ సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. 'దమాస్కస్ నుంచి దిల్లీకి చేరుకోవడానికి కేవలం 4 గంటల సమయం మాత్రమే పడుతుంది. దీన్ని బట్టి మీరు అర్థం చేసుకోవచ్చు సిరియాకు ఏదైతే ప్రమాదకరమో, భారత్‌కు అదే ప్రమాదకరం. భారత్, సిరియాలు రెండు లౌకిక దేశాలు. మేం ప్రజాస్వామ్య సూత్రాలను నమ్ముతాం'' అని అన్నారు. సిరియా ముస్లిం మెజారిటీ దేశం కావచ్చు, కానీ దాని రాజ్యాంగంలో అధికారిక మతం ప్రస్తావన లేదు. సిరియా ఒక రిపబ్లిక్, రాజ్యాంగపరంగా లౌకిక దేశం. సిరియా తాజా పరిస్థితిపై తుర్కియే, ఇరాన్, రష్యా విదేశాంగ మంత్రులు చర్చించనున్నారు. సిరియా అధ్యక్షుడు బషర్ అల్–అస్సాద్‌కు సహాయం చేయడానికి సైనిక సలహాదారులతో పాటు క్షిపణులు, డ్రోన్‌లను పంపుతామని ఇరాన్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. తిరుగుబాటుదారులపై నిఘా ఉంచుతామని తుర్కియే అధ్యక్షుడు రీసెప్ తాయిప్ ఎర్దొవాన్ ప్రకటించారు.

★★★

## జాయింట్ థెరపీ' అంటే ఏమిటి?



కుటుంబ సమస్యలకు సంబంధించి ఏదైనా థెరపీ తీసుకోవడం లేదా సైకియాట్రిస్ట్‌ను కలవడంపై మన సమాజంలో అంతగా సుముఖత లేదు. ఇటీవల కాలంలో దీనిపై కొద్దిగా చైతన్యం పెరుగుతోంది.వివాహాలు విచ్ఛిన్నం అయ్యేటప్పుడు, విడాకుల కోసం పట్టుబడుతున్నప్పుడు జంటలు కౌన్సెలింగ్ తీసుకోవాలని తరచుగా సలహా ఇస్తుంటారు. విడిపోవాలనుకున్నవారు కొంత కాలం కలిసి ఉండాలని కూడా చెబుతారు. దీని వల్ల వారి మధ్య సంబంధాలు గాడిన పడతాయని భావిస్తారు.అయితే దైనందిన జీవితంలో భాగంగా బంధాలను మెరుగుపరుచుకోవడానికి, ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి, అంతరాలను తగ్గించడానికి మాత్రం ఎవరూ ఎవరికీ ఎలాంటి చికిత్సను సూచించరు.

టాక్ థెరపీలో ఫ్యామిలీ థెరపీ ఒక భాగం. ఇందులో కుటుంబం లేదా కుటుంబంలోని వ్యక్తులు ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి, వారి సమస్యలను పరిష్కరించడానికి నిపుణులు సాయం చేస్తారు.ఈ చికిత్స లక్ష్యం ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది కుటుంబ సభ్యుల మధ్య బంధాన్ని మెరుగుపరచడం, ఒకరి మీద ఒకరికున్న కోపాన్ని, ద్వేషాన్ని తగ్గించడం.జీవితంలో జరుగుతున్న ప్రతి పరిణామానికి ఎవరైనా తన కుటుంబాన్ని లేదా కుటుంబంలో వ్యక్తులను నిందిస్తున్నప్పుడు ఈ చికిత్స ఉపయోగపడుతుంది. కుటుంబంలో ఓ వ్యక్తి వల్ల ఆ కుటుంబం అంతా ఇబ్బంది పడుతూ ఉండవచ్చు లేదా కుటుంబ సభ్యుల వల్ల ఆ వ్యక్తి ఇబ్బంది పడుతూ ఉండవచ్చు. ఇలాంటి పరిస్థితి ఉన్నప్పుడు, అందరూ కలిసి కూర్చుని సమస్యలకు పరిష్కారం వెతుక్కోవాల్సిన అవసరం ఉంది. మాట్లాడుకోవడం వల్ల కూడా వారి మధ్య ఉద్రిక్తతలు పెరిగే పరిస్థితి వస్తే ఈ థెరపీని పొందడానికి కౌన్సెలర్‌ని సంప్రదించాలి.

కుటుంబ సభ్యుల్లో ఒకరితో ఒకరు భావోద్వేగాలు, ఆర్థిక బంధాలు, ఇంకా ఇతర అనుబంధాలు ఉంటాయి. అందువల్ల మన దేశంలో ఫ్యామిలీ థెరపీ చాలా అవసరం. మనం సాధారణంగా కుటుంబ సభ్యులతో ఈ రోజు వంట ఏంటి?, టీవీలో ఏం వస్తోంది? మన ఇరుగు పొరుగు వారి గురించి మాట్లాడుకుంటాం. అయితే కుటుంబంలో ఎవరైనా మానసికంగా కలత చెంది ఉన్నారా? ఏదైనా చెప్పుకోలేని సమస్యతో సతమతమవుతున్నారా? అలాంటి వాటిని పంచుకోలేనప్పుడు ఏం చేయాలి? మాట్లాడుకుంటే సమస్యలు పరిష్కారం అవుతాయనేది నిజమే కానీ, మాట్లాడుకోలేని పరిస్థితి ఏర్పడితే ఏం చేయాలి? ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి ?ఫ్యామిలీ థెరపీలో భాగంగా కుటుంబంలోని అనేక మంది సభ్యులు బృందాలుగా వెళ్లి నిపుణులను సంప్రదించవచ్చని క్లీవ్‌ల్యాండ్ క్లినిక్ చెబుతోంది. ఉదాహరణకు పిల్లలు, తల్లిదండ్రులు, అక్క చెల్లెళ్లు, అన్నదమ్ములు, రెండు మూడు తరాలకు చెందిన వాళ్లు కూడా ఒక చోట కూర్చుని వారి ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవచ్చు.

**ఫ్యామిలీ థెరపీ ఈ క్రింది సందర్భాల్లో ఉపయోగపడుతుంది**

ఇంట్లో ఎవరైనా చనిపోతే, ఒకరినొకరు నిందించుకోకుండా దాన్నుంచి ఎలా బయటపడాలి? పెద్దవారైన తల్లిదండ్రులు, వారి సంతానం, మనవళ్లు, మనవరాళ్ల మధ్య బంధాన్ని పెంచేలా మాట్లాడుకోవడం. తల్లిదండ్రులు విడిపోవాల్సి వస్తే దాని ప్రభావం పిల్లల మీద పడకుండా ఏం చేయాలి? కుటుంబంలో ఎవరైనా మానసిక అనారోగ్యంతో పోరాడుతుంటే ఈ థెరపీ ద్వారా కుటుంబమంతా వారికి అండగా ఉండటాన్ని నేర్చుకోవచ్చు.

ఫ్యామిలీ థెరపీకి అంగీకరించేవారి సంఖ్య చాలా తక్కువ. అందుకే, నిపుణులు మొదట చికిత్స కోసం వచ్చిన వారితో ప్రారంభిస్తారు. వారికి మొదట కొన్ని క్లినికల్ టెస్టులు చేస్తారు. వీటిని సైకోమెట్రిక్ పరీక్షలు అని కూడా పిలుస్తారు. పరీక్షల ద్వారా ఆ వ్యక్తి మానసిక స్థితిని తెలుసుకుంటారు.దీంతో ఆ రోగికి ఎలాంటి చికిత్స అందించాలో తెలుస్తుంది.ఇదంతా వ్యక్తి స్వభావం, అనేక అంశాల్లో అతని ప్రతిచర్యలపై ఆధారపడి ఉంటుంది. ఆ వ్యక్తి ఇంట్రావర్ట్ లేదా ఎక్స్‌ట్రావర్ట్ ఏదైనా కావచ్చు.

సైకాలజీలో జనరేషన్ ట్రోమా అనే భావన ఉంది.కోడలితో అత్తగారు ఎలా ప్రవర్తిస్తారో, కోడలు అత్తగా మారిన తర్వాత తనకోడలితో అలాగే ప్రవర్తిస్తారు. తండ్రి చిన్న విషయాలకే కోపం తెచ్చుకుని కొడుకుని కొడితే, ఆ కొడుకు తండ్రిగా మారిన తర్వాత తన పిల్లల విషయంలో అలాగే ప్రవర్తించవచ్చు. జనరేషన్ ట్రోమాగా పిలిచే ఇలాంటి పరిస్థితులకు ఏకైక సమాధానం కుటుంబ చికిత్స. గాయం ఒక తరం నుండి మరొక తరానికి సంక్రమించకుండా నిరోధించడానికి కుటుంబ చికిత్స ముఖ్యం, ఎందుకంటే మనం

ప్రవర్తించే విధానం, దాని వెనుక ఉన్న
ఆలోచనలు మన గత అనుభవాల
ద్వారా ఏర్పడతాయి తండ్రి కోపంగా
ఉంటే, తండ్రి అంటే అలాగే ఉండాలని
పిల్లవాడు అనుకుంటాడు. అప్పుడు
అతను తన పిల్లలతో కూడా అలాగే
ప్రవర్తిస్తాడు.

“మన ఆలోచనా విధానం తప్పని
మనం భావిస్తే, సరైనదేంటో ఎవరైనా
మనకు చెబితే మంచిదని భావిస్తాం.
ఈ చికిత్స ద్వారా, జనరేషన్ ట్రోమాను
నయం చేయడం, తరువాతి తరంతో
ఎలా మమేకం కావాలోమనం
నేర్చుకుంటాం.అంటే ఒక తరం
గాయపడితే, సమాధానాలు కనుగొనే
బదులు, ఆ గాయం తరువాతి తరానికి
సంక్రమిస్తుంది

.కుటుంబ సంబంధాలు క్షీణించడానికి
కారణమేంటి?కొంతమంది
తాము అనుకోనిది జరిగితే వారిలో
కోపం కలిగితే అది కొన్నేళ్ల పాటు
అలాగే ఉంటుంది. వాళ్లు దాన్ని
మర్చిపోలేరు.అటువంటి సందర్భాల్లో
తప్పును అంగీకరించడం,
ముందుకు సాగిపోవడం అనే థెరపీ
ఉపయోగిస్తారు . మీరు మీ కుటుంబ
సభ్యులు, రక్త సంబంధీకులు,
స్నేహితులతో గొడవలు పడుతూ
ఉంటే వాదనలు, గొడవలు
తీవ్రమవుతాయి. అవి మీ జీవితంలో
చాలా విలువైన వాటిని మీకు
దూరం చేస్తాయి.అటువంటి నష్టాన్ని
నివారించాతానికే ఈ జాయింట్ థెరపీ

★★★

# ఈ అరటి పండు 52 కోట్ల రూపాయలు



టేపుతో గోడకు అతికించిన ఒక అరటి పండు దాదాపు 52 కోట్ల రూపాయలకు (6.2 మిలియన్ డాలర్లు) అమ్ముడుపోయింది.చైనాకు చెందిన ఔత్సాహిక వ్యాపారవేత్త జస్టిన్ సున్ ఈ అరటి పండును వేలం పాటలో దక్కించుకున్నారు.ఆశ్చర్యపరిచే విషయం ఏంటంటే, ఈ అరటి పండును అదే రోజు 30 రూపాయలకు కొనుగోలు చేసి, టేపుతో గోడకు అతికించారు.ఈ ఆర్ట్ వర్క్ పేరు 'కమీడియన్ '. దీనిని మౌరీజియో క్యాటేలాన్ అనే ఇటలీకి చెందిన ఒక విజువల్ ఆర్టిస్ట్ సృష్టించారు.న్యూ యార్క్‌లోని ప్రముఖ వేలం సంస్థ సోదబీస్ ఈ వేలాన్ని నిర్వహించింది.

ఇలాంటి 'కమీడియన్' ఆర్ట్ వర్క్‌ను మొదట 2019లో ప్రదర్శించారు. అప్పుడు అది సంచలనం సృష్టించింది. కాలక్రమేణా మారుతున్న 'కళ' మీద ప్రపంచవ్యాప్తంగా అనేక చర్చలకు దారి తీసింది.గతంలో సుమారు కోటి రూపాయలకు అమ్ముడుపోయిన 'కమీడియన్', ఈసారి ఊహించిన దానికంటే నాలుగింతల ధర పలికింది.ఈ అరటి పండును చేజెక్కించుకునేందుకు వేలంపాటలో ఆరుగురితో పోటీపడి గెలిచిన జస్టిన్ సున్.. 'త్వరలో, ప్రత్యేక అనుభూతిని పొందేందుకు నేనే స్వయంగా ఈ అరటి పండును తింటాను' అని ప్రకటించారు.ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ఫలాలలో ఇదొకటని చెబుతున్నారు. ఈ ఆర్ట్‌వర్క్ చాలా దేశాలకు వెళ్లింది. చాలా మ్యూజియంలలో దీనిని ప్రదర్శించారు.2023లో దక్షిణ కొరియా రాజధాని సోల్ నగరంలోని ఒక మ్యూజియంలో దీన్ని ప్రదర్శించినప్పుడు, ఒక విద్యార్థి అరటి పండును లాక్కొని తినేశారు.వెంటనే మ్యూజియం అధికారులు ఇంకో అరటి పండుని తెచ్చి అక్కడ అతికించారు.ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తినకపోవడం వల్ల తనకు బాగా ఆకలేసిందని, అందుకే ఆ అరటి పండును తీసుకుని తినేశానని ఆ విద్యార్థి చెప్పారు. మ్యూజియం అధికారులు ఆయనపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

మూడో కన్ను

## శరదృతువులో విశాలప్రకృతి సస్యక్షేత్రాల చిత్రీకరణ



**తమ్మ శ్రీనివాస రెడ్డి**

శరదృతువులో ఉషోదయ సమయాన, లేక ఆ ఋతువునకు ప్రాధాన్యతనిచ్చే చిత్రాల చిత్రీకరణ కనుకూలంగా వుండే సాయం సంజె వెలుగులు నిబిడీకృతంగావీస్తూ సంజె మేఘాలు మెరిసే సమయాలు ఎంతో అపురూప అనుకూలాంశాలు. రోజంతా ఆఫీసుల్లో చల్లబడ్డ శరీరాలకు ఉషోదయ కాలాలకంటే, సాయం వెలుగులే మరింత వెచ్చదనాన్ని ప్రోది చేసుకోగలుగుతారు కూడా. ఈ శరదృతువు ఛాయా సమయాలు పెరిగే వేళల్లో, బయలుదేరే ముందు ఒకసారి వాతావరణ పరిస్థితుల ప్రభావాలపై ఒక కన్నేసి వుంచి, ప్రణాళికతో, ప్రకృతి దృశ్య చిత్రీకరణకు మీరు సిద్ధమవ్వాలి. ఉషోదయాలు, సాయంసమయాల్లో చిత్రీకరణ కనుకూలమైన మరో అంశమేమంటే సమయాల్లో ప్రకృతి వెలుగు నీడలు పెనవేసుకుని వెలుగుల విపరీత స్వభావాన్ని, వాతావరణం నిరోధించగలుగుతుంది. దృశ్యచిత్రీకరణలో ఇదొక అనుకూల ప్రాధాన్యతాంశం.

# ఫోటోగ్రఫీ పాఠాలు



అంతేగాక, మీ కెమేరాను సర్వసన్నద్ధంగా వుంచుకోవాలి, అలా లేకపోతే దాన్ని సరిజేసుకుని, చిత్రించబోయే ప్రకృతి దృశ్యం స్పష్టంగా వుండేలా దృష్టిసారించాలి. ఒకవేళ ఆకాశంలో కాంతి సంప్రోక్షణలు అధికంగా వుంటే, ఎన్.డి ఫిల్టర్ను కెమేరా కటకం ముందు అమర్చి ప్రదర్శిత దృష్టి తారతమ్యతను సరిజేసుకోవాలి. పశ్చిమదిశలో వాలిపోయే సూర్యుడు తక్కువ కోణంలో ఆవిష్కృతం అవుతుండగా, దీర్ఘఛాయలు ప్రతికృతమవుతాయి సహజరీతిలో. అలాంటి వేళల్లో, చిత్రాన్ని నిక్షిప్తం జేయటానికి 3డి లో కంటే 2డిలోనే మరింత ప్రస్ఫుటంగా వుంటుంది. ఒకవేళ మీరు ప్రొద్దుటే లేచే అలవాటు లేనట్లయితే, మీ తేనీటి సేవనలు ముగించిన తరువాత, శరదృశ్యాల వర్ణ సమ్మేళనాలను, చిత్రీకరణకు మీ సాంకేతిక సాయుధ సంపత్తినుపయోగించి, అంటే సాఫ్ట్వేర్ సాయంతో, ఆయా విశిష్టతలను, వర్ణాలను క్రోడీకరించవచ్చుగూడా దృశ్యమానంగా.

సందర్శనాస్థలాలు : అపురూప సరస్సులు, శిఖరాయమాన ప్రదేశాలు, ప్రత్యేకంగా అవి తమ తమ అపురూప ముద్రలను ఈ శరదృతువులో ప్రదర్శితమవుతాయి. ఇలాంటి అపురూప సందర్శనా స్థలిని యెంచుకునేందుకు ఎత్తైన ప్రదేశాలు సందర్శనా పరిధిని విస్తృతం జేస్తాయి, శ్వాసను బిగించేటంత దృశ్యరూపాలుగా వుంటాయి.

వెలుగు ప్రసారాల సమతుల్యత : మీ చిత్రీకరణ సమయాల్లో కాంతి ప్రసారాల్లో సమతుల్యత కోసం కెమేరా స్విచ్ను ఆటోమేటిక్ విధానం నుండి సాధారణ స్థితిలో మసకగా లేదా ఛాయా మాత్రంగా వుంచినట్లయితే ఛాయా ప్రతిరూపాలు హృద్యంగా వుంటాయి.

సమతుల్యతను బేరీజు వేసుకోండి : అరణ్య ప్రాంతంలోని కొండ శిఖరాల నుండి దృశ్యాలను వీక్షిస్తూ ఛాయాచిత్ర చిత్రీకరణలో, ఆ దృశ్యక్షేత్ర సమయంలో సింధూర, పసిడి వర్ణాలను

# ఫోటోగ్రఫీ పాఠాలు

ప్రకాశమానం జేసేందుకు ఆయా వర్ణాలకు సమతుల్యంగా హరితవర్ణాన్ని దృశ్యవీక్షణా కోణంలో బంధించినట్లయితే, చిత్రానికి అపురూపం ప్రాప్తిస్తుంది. క్షేత్ర దృశ్యాలకోసం, కెమేరాను క్రిందికి దించి, హరితక్షేత్రాల ఛాయారూపాలను అరణ్యపు సింధూర వర్ణరాగాన్ని సమీకృథం జేసేలా సమతుల్యత గావించాలి. సమతల ప్రాంతాల్లో, విశాల సస్యక్షేత్రాల్లో అరణ్యమార్గాల్ని, గమ్యంగా, కంటిని ప్రతిమా రూపానుసారంగా, రేఖాంశమానాలైన వృక్షరూపాలతో అనుసంధిస్తూ సమీకృతం చేయాలి చిత్రాన్ని, నీలాకాశం క్రింద వృక్షశాఖలకున్న ఎండిపోయి రాలిపోవటానికి సిద్ధంగా వున్న పత్రదళాలు, పసిడి వర్ణభరితమై, సన్నివేశాన్ని చిత్రభరితం జేసి, సందర్శకుడి వీక్షణా దృక్పథాన్ని దెబ్బతీయకుండా ఆకాశంలోని నల్లటి మేఘాలను స్థిరీకరించినట్లయితే, ఆ చిత్రానికి ఒక సంపన్నత చేకూరుతుంది. విశాలకాశంలో వర్షించే వర్షమేఘాలు, వాటి సౌందర్యం అపురూపంగా, వర్షాల్లో వర్ణాల్లో విలీనమవుతుంటాయి. ఆ క్షణంలో సహజసౌందర్యం యినుమడిస్తుంది. గాలి వీచినపుడు, వృక్ష శాఖల పత్రదళాలు నేలరాలే ఎండుటాకుల దృశ్య చిత్రీకరణలో కెమేరా షట్టర్ వేగాన్ని తగ్గిస్తూ, పత్రాల చలనాన్ని మంద్రస్థాయిలో చిత్రీకరించినట్లయితే, గాలిలో తేలియాడే పత్రదళాల సముదాయాన్ని చిత్రప్రతిమగా రూపొందించుకోవచ్చు.

భూ ఉపరితల వస్తువులను దగ్గరగా, పెద్దవిగా, లోతులగా చిత్రించాలనుకున్నపుడు, ఆ సన్నివేశాలకు త్వరితంగా, అతిగా స్పందించక, కొలమానాలతో దృశ్యీకరించాలి.

భూపరితల దృశ్యాసక్తి : భూ ఉపరితల క్షేత్రస్థాయి దృశ్యాలపట్ల ఆసక్తి వుంటే, ముఖ్యంగా కెమేరా కటకానికి ముందు, విశాల ఆకాశాన్ని ప్రతిక్షేపిస్తూ చిత్రీకరిస్తే, దృశ్యానిఇక వైశాల్యం, లోతు స్పష్టంగా ధృవీకరింపబడతాయి. ఏదో ఒక వస్తువును కేంద్రంగా తీసుకుని, త్వరత్వరగా చిత్రించక, అంచనా ప్రకారం, కొలతలతో, భూ ఉపరితల ఎత్తులోతులను సమీక్షిస్తూ చిత్రంలో బంధించినట్లయితే,



అది సందర్శకుడికి వీక్షణానందాన్ని కలుగుజేస్తుంది. అలాగే, గండశిలలను, వృక్షకాండాల సౌందర్యాన్ని ఉపరితలంపై కేంద్రంగా జేసుకుని, ఆ దృశ్యముఖాన్ని, సన్నివేశ నేపథ్యానికి సమీకరించే ప్రయత్నం చేసినట్లయితే, ఆ చిత్రం కూడా ఎంతో ఆహ్లాదాన్నిస్తుంది. ఇంకా పాదచారుల కాలిబాటలు, వాగులవంకలు, సరిహద్దులు, వంతెనల్లాంటివన్నీ గూడా స్వయం సన్నద్ధ చిత్రాలు, గుర్తుంచుకోవలసిందల్లా చిత్రంలో స్పష్టత కోసం, చిన్న వీక్షణా రంధ్రానికి (big f number) ఎఫ్/11 లాంటి దానిని అమర్చుకోవాలి.

మీ ఆసక్తికి తగినట్లుగా, మీరు టెలిఫొటో కటకాన్ని ఉపయోగించి, విశాల దృశ్యాలకు బదులుగా, ఒక కేంద్రీకృత చిత్రాన్ని చిత్రీకరించాలనుకుంటే, అందుకు తగినట్లుగా, నీ శక్తిని వుపయోగించుకోగలిగే వస్తు విషయాన్ని ముందుగా ఎంచుకోవలసి వుంటుంది.

కావలసిన పరికరాలు :

1. 3 3 AF 70-300 or 80-200n mm F/2.8 to 5.6 .
2.AF 10-24mm 17-35mm F/2.8-4.5 . 17-50mm F2.8 x R
3.పోలరైజింగ్ ఫిల్టర్ – ఇది వర్ణాల ప్రేరణకు తోడ్పడుతుంది. ఎంతగానో ఉపయోగం.
4. ఎన్.డి.ఫిల్టర్ – అవనిని, ఆకాశాన్ని చిత్రంలో బంధించే ప్రక్రియలో చిత్రం యొక్క తులతమ్యతను ప్రదర్శిస్తుంది. పై వాటిని ఉపయోగించి మంచి ఛాయాచిత్రాలు తీయండి.



# యువత తెలుసుకో
# నిన్ను నువ్వు మలుచుకో



## మచ్చ లేని వ్యక్తిత్వం


సచిన్ విద్యార్థులకు ఓ క్రమశిక్షణ పాఠం, ఉద్యోగులకు ఓ కెరీర్ విజయసూత్రం, ఇంటి పెద్దకు అనుబంధాల వాచకం, వ్యక్తిగత వృత్తిగత జీవితాల్లోను విజేతగా నిలవడమెలాగో సచిన్ను చూసే నేర్చుకోవాలి.

అద్భుతమైన క్రీడాకారులుగా పేరుతెచ్చుకున్నా వ్యక్తిత్వానికి ఏవో మరకలు అంటుకుని చరిత్రహీనులుగా మిగిలిపోయిన వారున్నారు. వ్యక్తిత్వమంటూ ఉన్నా, తమదైన రంగంలో ఉనికి చాటుకోలేక చతికిలపడినవారూ ఉన్నారు. వృత్తిగతం, వ్యక్తిగతం – ఏ కోణంలోంచి చూసినా సచిన్ వ్యక్తిత్వానికి ఒక్క మచ్చా లేదు. అతిశయోక్తులు అవసరం లేదు. రంగులు అద్దాల్సిన పన్లేదు. ఏ స్టీఫెన్కవే పుస్తకాలతోనే, రాబిన్ శర్మ ఉదాహరణలతోనో సరిపోల్చాల్సిన శ్రమ అక్కర్లేదు. యథాతథంగా సచిన్ జీవితమే ఓ వికాస పుస్తకం.

సచిన్, వినోద్ కాంబ్లీ ఇద్దరూ ఒకేసారి తమ కెరీర్ మొదలుపెట్టారు. కాంబ్లి కెరీర్ను



మధ్యలోనే పుల్స్టాప్ పడటానికి అతను అన్ని విధాలుగా దురలవాట్లకులోను కావడమే. కాని సచిన్ మాత్రం, ఎదిగే కొద్దీ ఒదుగుతూ ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఆట మీదే దృష్టి పెట్టడం వల్ల దీర్ఘకాలం తన విజయయాత్ర కొనసాగించగలిగాడు.





ప్రతి మ్యాచ్ అతనికి ఓ పరీక్షే. ప్రతిషాట్ ఓ పాఠమే. ప్రతి మైదానం ఒక పుస్తకమే. తనను తాను ఓ విద్యార్థిగా భావించుకుంటాడు సచిన్. ఓసారి ముంబయి అండర్-15 జట్టు మ్యాచ్ ఆడేందుకు అహ్మదాబాద్ వెళ్లింది. రైలు దిగేసరికి తెల్లవారుజాము నాలుగైపోయింది. తొమ్మిదింటికే మ్యాచ్. కొద్దిసేపు పడుకోమని చెప్పి వెళ్లిపోయాడు మేనేజర్. అంతలోనే ఎవరైనా నిద్రమత్తులో స్టేషన్లో తప్పిపోయారా అన్న అనుమానం వచ్చింది. గబగబా వచ్చి లెక్క బెట్టుకున్నారు. ఆ అనుమానం నిజమే అనిపించింది. సచిన్ కనిపించలేదు. హోటలంతా వెదికాడు. ఎక్కడాలేడు. తీరా చూస్తే... టెర్రస్ పైన బంతికి దారం కట్టుకుని ప్రాక్టిస్ చేస్తున్నాడు. ఇప్పటికీ అంతే తీవ్ర సాధన. మ్యాచ్ ఉందంటే, ఏ నెట్ ప్రాక్టిస్ చేస్తూనో కనిపిస్తాడు. 'నేనే కాదు, ఎవరూ ఏ విషయంలోనూ



పరిపూర్ణులు కాదు. నిరంతరం నేర్చుకోవాల్సిందే' అంటాడా జిజ్ఞాసి. విద్యార్థి తన పుస్తకాల్ని ఎంత జాగ్రత్తగా చూసుకుంటాడో, అంతకంటే జాగ్రత్తగా తన బ్యాట్ను చూసుకుంటాడు సచిన్. పక్కవాళ్ల బ్యాటు మురికిగా కనిపించినా తట్టుకోలేడు. చొరవగా లాక్కొని శుభ్రం చేస్తాడు. సమయపాలన విషయంలో అయితే, సచిన్ను చూసి గడియారం సరిచేసుకోవాల్సిందే. ఆటైనా, సమావేశమైనా ఎప్పుడు ఓ ఇరవై నిమిషాలు ముందుంటాడు. మన లోపాల్ని మనం తెలుసుకోవడం ఒక ఎత్తు దానికి

కాస్త వివేకం ఉంటే సరిపోతుంది. ఆ లోపాల్ని ఆమోదించడం మరో ఎత్తు. ఇక్కడే

అహం అడొస్తుంది. అందులోను వృత్తిలోనో, ఉద్యోగంలోనో ఓ స్థాయికి చేరుకున్నాక, తమని తాము దైవాంశ సంభూతులుగా భావించుకునే వారు అనేకం. క్రికెట్లో ఆ ప్రమాదం మరీ ఎక్కువ. సచిన్ ఆ కాంతివలయంలో ఎప్పుడూ చిక్కుకోలేదు. మైదానంలోనే కాదు, బయటకూడా లిటిల్ మాస్టర్తో వాణిజ్య ప్రకటనలు చేయడానికి వ్యాపార సంస్థలు వరుసలు కడతాయి. కొన్ని సెకన్ల ప్రకటనకు ఎన్ని కోట్లు చెల్లించడానికైనా సిద్ధపడతాయి. అలాంటి ఓ ప్రకటన కోసం, సచిన్తో యాడ్ దిగ్గజం ప్రహ్లాద్ కక్కర్ షూటింగ్ నిర్వహిస్తున్నాడు. ఆ 'యాడురు' ఓ పట్టాన రాజీపడడు. అలాంటి వ్యక్తే అంతా బావుందని 'ప్యాకప్' చెప్పేశాడు. ఎందుకో సచిన్కు మాత్రం, అంతకంటే బాగా చేయగలనేమో అనిపించింది. అప్పటికే అర్ధరాత్రి దాటిపోయింది. అయినా, మరొక్కసారి ప్రయత్నిద్దామంటూ కెమెరా ముందు నిలబడ్డాడు సచిన్.

సచిన్ బంధాల మనిషి. కుటుంబ సభ్యులు మొదలు జట్టు సభ్యుల దాకా ఎవరికి ఇవ్వాల్సిన స్థానాన్ని వాళ్లకిస్తాడు. ఎవరికి కేటాయించాల్సిన సమయాన్ని వాళ్లకు కేటాయిస్తాడు. పుట్టినరోజు, పెళ్ళిరోజూ వంటి ప్రత్యేక సందర్భాల్ని గుర్తుపెట్టుకుని మరీ శుభాకాంక్షలు చెబుతాడు. సాహితీనివాస్ నేస్తాల్నీ పొరుగు వారినీ ఇప్పటికీ పేరు పేరునా పలకరిస్తాడు. చిన్నప్పటి నేస్తం, వాచ్మన్ కొడుకూ అయిన రమేశ్ను తన వ్యక్తిగత కార్యదర్శిగా నియమించుకున్నాడు. పెళ్లయ్యాక అంజలితో కలిసి వెళ్ళి అలనాటి ఆయా లక్ష్మీజి ఆశీస్సులు అందుకున్నాడు. ఎన్ని పనులున్నా... భార్యాపిల్లల కోసం నాణ్యమైన సమయాన్ని కేటాయిస్తాడు. అమ్మ మాటంటే చాలా గురి. తల్లి ఆదేశంతోనే పుట్టెడు దుఃఖంలోనూ ప్రపంచకప్ ఆడాడు. నాన్నకు శతకంతో శ్రద్ధాంజలి ఘటించాడు. అన్నయ్య అజిత్ అంటే అపారమైన గౌరవం. కష్టమొచ్చినా, ఆనందంగా అనిపించినా తొలి ఫోన్కాల్ అన్నయ్యకే.

సచిన్నాక కోసం ఎవరూ పూలబాట వేయలేదు. జయ జయ ధ్వానాలతో స్వాగతాలు పలకలేదు. పిల్లాడనో, పొట్టాడనో ఏవేవో వ్యాఖ్యలు. పాకిస్థాన్కు వెళ్లినప్పుడైతే 'పాలుతాగే పసివాడా... వెనుదిరిగి వెళ్ళిపోరా' అంటూ ప్లకార్డులు దర్శనమిచ్చాయి. సొంతగడ్డమీదా విమర్శలు తప్పలేదు. మ్యాచ్ విన్నర్ కాదనో, జట్టు ప్రయోజనాల్ని పట్టించుకోడనో, సమర్థుడైన కెప్టెన్ కాదనో రకరాల మాటలు.

ప్రతి విమర్శకూ బ్యాటుతోనే జవాబు చెప్పాడు, 'జీవితమన్నాక సమస్యలూ సవాళ్లూ తప్పవు. అవన్నీ నన్ను మరింత రాటుదేల్చాయే కానీ, నీరుగార్చలేదు' అంటాడా కార్యసాధకుడు. అంకిత భావం, ఆత్మగౌరవం, విజయేచ్ఛ విజేత కుండాల్సిన మూడు లక్షణాలని – చెబుతారు సచిన్. ఆ మూడు గుణాలు మూర్తీభవించిన వ్యక్తిత్వం ఆయనది.

★★★

# ఊడలమర్రి ఉపన్యాసాలు



. విక్రమార్కుడు ఉడలమర్రి చేరుకునేసరికి చేట్టు కింద భేతాళుడు ఓ పది దయ్యలను చుట్టూ పెట్టుకుని ఏదో తీవ్రంగా చర్చిస్తున్నాడు.

విక్రమార్కుడిని చూడగానే, భేతాళుడు "రా విక్రమార్క సమయానికి వచ్చావు" అంటూ తన పక్కనే ఉన్న సమాధిరాయిని చూపించాడు కూర్చోమని సైగ చేస్తూ

" నేనెప్పుడు సమయానికె వస్తాను,రాకపోతే మీరు వేసే తింగరి వేషాల వల్ల ఈపాటికి ఎంత మందికో ఇబ్బంది అయ్యేది , ఇంతకీ విషయం ఏమిటి "అన్నాడు

# భేతాళ భారతం

" ఏం లేదు ఓ సినిమా తీద్దామనుకుంటున్నా" అన్నాడు నింపాదిగా భేతాళుడు నింపాదిగా

" సినిమానా, దెయ్యాలు కూడా సినిమాలు చూస్తాయా .. అదే అదే తీస్తాయా ఆశ్చర్యపోతూ?" అన్నాడు.

" ఏం విక్రమార్య మీ మనషులు దెయ్యం సినిమాలు తియంగా లేనిది మేము మీతో సినిమాలు తియ్యకుడదా?" అంటు కాస్త కోపంగా చూసాడు విక్రమార్కుడి వంక

"ఓ అలా వచ్చావా ..సరే కాని ,మరి వీళ్ళంతా ఎవరు' అంటూ భేతాళుడి చుట్టు వువే వాళ్ళ ను చూస్తూ అడిగాడు

"వీళ్ళా ...వీళ్ళంతా ఘోస్ట్ రైటర్స్ ..అంటే మా దెయ్యాల రచయతలు "

ఘోస్టు రైటర్స్ అంటే అర్థం ఇది కాదే . వేరేవాళ్ళ చేత కథ రాయించి తమపేరు వేసుకోనే వాళ్ళను ఘోస్ట్ రైటర్స్ అంటారు.
'

"మా కంత ఖర్మ పట్టులేదు మీ మానవుల్లా వేరొకరి చేత రాయించి మాపేర్లు వేసుకోటానికి. ఆసలైన ఘోస్టు రైటర్ల చేత రాయిస్తున్నా సినిమా 'కథని' అంటు చెప్పుకొచ్చాడు

" సరేలే .. ఇంతకీ కథేమిటి"

"అబ్బా ఆశ దోశ అప్పడం .కథ ముందే చెప్పేస్తే కాపి కొట్టి నువ్వు మాకంటే ముందే సినిమాతీద్దాం అనా ", అన్నాడు భేతాళుడు వెక్కిరింపుగా

" నేనా సినిమా తియ్యటమా ? అది తియ్యక తియ్యక మీ దెయ్యం కథలతో నే సినిమా తీయాలా ..చచ్చినా అటువంటి పని జన్మలో చేయను " అంటూ తనూ పెక్కిరించాడు విక్రమార్కుడు

" మీరు ఇప్పుడు చేస్తున్నది అదేగా? దెయ్యల చేత కథలు రాయిం చుకుంటున్నారు. అదే దెయ్యాలు కథలు రాస్తే తప్పు అంతేనా "

"దెయ్యాల... చేతా ..

'అదే ఘోష్ట రైటర్స్...!"

" సరే కథ నాకు చెప్పొద్దు కాని ... మీ సినిమాలో హిరో ఎవరు"

"ఎవడో హిరో అయితే నేనెందుకు కూర్చుని కథ రాయిస్తాను"

"అంటే కొంపదీసి నువ్వు కాని హిరోగా చేస్తున్నావా ఏమిటి. "అంటు భయపడ్డాడు విక్రమార్కుడు.

"విక )మార్క నాతోనే వేళాకోళమా?" గొంతు పెంచి అన్నాడు. భేతాళుడు "

" లేదు లే, మరి ఏవరో చెప్పు' భేతాళుడిని శాంత పరుస్తూ అడిగాడు విక్కమార్కుడు

"మా అబ్బాయి హిరోగా చేస్తున్నాడు "అంటు అక్కడున్న ఓ పిల్ల దెయ్యన్ని చూపించాడు

" మీ అబ్బాయి హీరోనా.. నీకు కుడా మా సినిమా వాళ్ళ జబ్బు అంటుకున్నదన్నమాట

" ఏమి జబ్బు అది ..?"

" అదా ..స్వ గుల జబ్బు "

' స్వ గుల జబ్బా .."

" అవును .. స్వగుల జబ్బు ..అంటే టాలెంటు ఎంత ఉన్న, పక్కవాడిని ఎదగినీయకుండా వాళ్ళ బంధు వర్గం తోనే సినిమాలు తీస్తారు"

" మరి జనం చూస్తున్నారా ?"

" ఎందుకు చూడరు ..మా సినిమా వాళ్లకు సినిమాలు చూసే జనం అంటే చాల చులకన . అందుకనే ..వాళ్ళ పిల్లల్ని , తమ్ముళ్ళను , బావలను బావ మరుదులను సినిమా హీరోలుగా పెట్టి సినిమాలు తీసి జనం నెత్తిన రుద్దటం అలవాటు చేసుకున్నారు . నీకు గుడా అదే జబ్బు వచ్చింది .."

" ఆ మాటలతో భేతాళుడు ఆలోచనలో పడ్డాడు .."

"ఏమిటి ఆలోచిస్తున్నావ్ .."

" అంటే నా కొడుకుని పెట్టి సినిమా తీయకుడదా .."అమాయకంగా అడిగాడు

" తీయవచ్చు .. ఎప్పుండంటే మీ వాడు ఆంగికం , అభినయం , వాచకం ..ఇలా అన్నింటిలో శిక్షణ

తీసుకుని మంచి నటుడిగా నిరుపించుకున్న తరువాత "

" నిరుపించుకోవాలంటే అవకాసం రావాలిగా ""

" మంచి ప్రశ్న వేశావ్ ..ఈ అవకాసం రాకే ఎంతోమంది మంచి నటులు తెర ముందుకి రాక ముందే తెర మరుగౌతున్నారు ..వల్లనున్నెట్టి సినిమా తీయి .. అందులో మీవాడికి ఓ మంచి పాత్ర ఇవ్వు ..వాళ్ళను చూసి వాడు నటన నేర్చుకుంటాడు "


"విక్రమార్కుడు చెప్పింది .. సమంజసమే అనిపించింది .."

"ఒకప్పుడు మహా నటులందరూ ఇలా వచ్చిన వాళ్ళే .అంతేగాని ఈ నటి హీరోల్ల దొడ్డి దోవన వచ్చిన వాళ్ళు కాదు "


" బాగా చెప్పావ్ విక్రమార్క ..నేను కుడా అదే పని చేస్తా .మా దెయ్యాల్లో ఉన్న మంచి నటులను గుర్తించి వాళ్ళతో సినిమా తీస్తా అందులో మావాడికి మంచి పత్ర యిస్తా.."

" మంచిది ..మీకు ఉన్న మంచితనం మా మనుషులకు లేదు .. ఏమి చేద్దాం " అంటూ వెనుతిరిగాడు విక్రమార్కుడు

★★★








## మహా కవుల మానస పుత్రికలు

## "ఇందిర"

మరపురాని పాత్రను చర్చించే ముందు రచయిత్రి ప్రతిభను చెప్పుకోవడం అవసరం.

1929లో జన్మించి ,1961లో 32 సంవత్సరాలకే అనారోగ్యంతో మరణించిన శ్రీదేవి మరపురాని నవల .

అందులో మరపురాని ఇందిర పాత్ర సృష్టి ఒక కళాఖండం...

నవల మాత్రమే కాక కథలు 17, సమీక్షలు రాసి,ఎం.బి.బి.యస్ చేసి డాక్టరుగా,సేవలు చేసారు. ..ఎంత కాలం జీవించానన్నది కాదు ఎంతకాలం తన రచన ద్వారా మ బ్రతికున్నామన్నది ముఖ్యం..అని పెద్దలు చెప్పినట్లు శ్రీదేవి కలకాలం గుర్తుండిపోయే నవల రాసారు.అందులో 20 సం.ల ముందుచూపుతో ఇందిర పాత్రను సృష్టించారు....

ఈ నవల 1957-58 మధ్యకాలంలో తెలుగు స్వతంత్రలో ధారా వాహికంగా వెలువడింది.

కథకు రంగస్థలం విశాఖపట్టణం. ఈ నవల నాలుగు స్తంభాలాటగా నలుగురి మధ్య, ప్రధానంగా తిరుగుతుంది. ఇందిర,ప్రకాశం, కృష్ణమూర్తి,కళ్యాణి..ఏదో ఒక విధంగా మిగిలిన ముగ్గురితోనూ సంబంధమున్న పాత్ర..అంతేకాదు వాళ్ళ జీవితాల్లోకి చొచ్చుకు పోయే పాత్ర....

## మన కథానాయకులు

కానీ ఒకసారి నవల చదివితే గుర్తుండిపోయే పాత్ర ఇందిరనే... అంత విలక్షణమైన పాత్ర..
నవలాకాలం 1953–54 మధ్యకాలం అయి ఉండవచ్చు..ఆ కాలం నాటికి స్త్రీలు
ఉద్యోగం చేయడమే అరుదు..ఆ మాటకొస్తే చదువుకున్న మహిళలే తక్కువ.సంప్రదాయ చట్రాలలో బిగుసుకొని,బాల్యవివాహాలు తో, ఇంటిచాకిరీతో ఉండే మహిళలే ఎక్కువ ఆనాడు.

సమాజంలో కనిపించే అరుదైన వ్యక్తులకు ప్రతీక ఇందిర.
భవిష్యద్దర్శనంగా ఇందిర పాత్రని సృష్టించారు.

ఇప్పటి కాలంలో ఇందిర లాంటి స్వభావం కలిగిన వాళ్ళు కోకొల్లలు...

ఇందిర పెరిగిన విధానం,..చిన్నప్పుడే తల్లి చనిపోవడం,
తండ్రి బాధ్యతా రాహిత్యంతో ఉండడమే కాక,దురలవాట్లు కలిగి ఉండడం, తనని పోషించాల్సిన వాడు తన మీదేఆధారపడడం ఇవన్నీ ఇందిర వ్యక్తిత్వాన్ని రాటు తేల్చాయి.

ఇందిర వ్యక్తిత్వాన్ని చెప్పడానికి తాను మాట్లాడే మాటలు చాలు...” నా ఇల్లు నేను కట్టుకుంటుంటే పక్కనుంచినడిచే వాళ్ళ మీద ఇటుకలు పడ్డాయంటే నేనేం చెయ్యగలను? ఎవరిమట్టుకీ వాళ్ళు చూసుకు నడవాలి.

అంతె..అంటుంది..అంటె తన జీవితాన్ని బాగుచేసుకునేటప్పుడు ఎవరు అడ్డొచ్చినా అడ్డు తొలగించుకుంటాననే భావంతో కృష్ణ మూర్తి తో చెప్తుంది..

జీవితకాలం అందరూ గుర్తు పెట్టుకునే సంభాషణ కొనసాగిస్తుంది ఇందిర.
“నీ జీవితకాలం లో నిండుగా,నిర్భయంగా బతుకు. రోజుకు పదిసార్లు చావకు.
మన చుట్టూరా వున్న స్వార్థం, ద్వేషం, క్రౌర్యం, భయం యివి మనిషిలోనూ ఉన్నాయి. కాబట్టి వీటికి భయపడకు . అంటూ మనలో మానవత్వం ఉండటం నేరం కాదు...అంటుంది...
ఇవన్నీ పెళ్ళయిన మొదటి రోజు కృష్ణమూర్తి కి బోధిస్తుంది.
ఈనవలలో లోకాన్ని క్షుణ్ణంగా చదివిన పాత్ర ఇందిరనే....నా వ్యక్తిత్వాన్ని చంపుకోను అంటుంది.
అంటే పెళ్ళయ్యాక తనమీద అధికారం చలాయిస్తే ఊరుకోను న్నట్లు కృష్ణమూర్తి తో చెబుతుంది...

...ఇందిర తమ మేడపైనున్న ప్రకాశంతో.”..ఆడదాని మనసు నీకు తెలియదు ప్రకాశం..
బతుకులో నాకు కావలసిందొకటి. దొరుకుతున్నదింకొకటి.అంచేత లోకాన్ని ధిక్కరిస్తున్నాను”
.అంటుంది...తాను ఎందుకంత కఠినంగా ఉంటుందో ముక్కుసూటిగా మాట్లాడుతుందో చెప్తుంది.

తనకు భర్త ఎలాంటి వాడు కావాలో చెప్తుంది.

నేనున్నానులే.నీకేం భయంలేదు. నీ సమస్యలూ, బరువులూ నా మీద పడేయ్....అనే భర్త కావాలంటుంది.
పిరికివాడైన ప్రకాశాన్ని తిరస్కరిస్తుంది.వేరొకరి సానుభూతిని ఆశించని వ్యక్తి.
తన మాటలతో ఎవరినైనా దగ్గర చేసుకోగలదు...అదేవిధంగా తనకు అవసరం లేదు అన్నప్పుడు దూరం కూడా చెయ్యగలదు.
ప్రకాశానికి దగ్గరవుతున్న కళ్యాణిని ఇంటినుంచి బయటకు పంపిస్తుంది..
ప్రేమలు,ఆప్యాయతలు, బంధాలు, బాంధవ్యాలూ ఇవన్నీ ఇందిరకు శాశ్వతం కాదు..అలా ఆమెను ఆ విధంగా తయారు చేస్తాయి పరిస్థితులు..


తనకున్న ఆస్తిపాస్తులు తో కులాసాగా తిరిగే కృష్ణమూర్తి ని చివరిలో వివాహం చేసుకుంటుంది....అదీ, అన్ని తన అభిప్రాయాలతో ఏకీభవించిన తరువాతనే...ఎంతో విలక్షణమైన పాత్ర ఇందిరది.ఆ నవలలో ప్రకాశం,కళ్యాణీ,కృష్ణమూర్తి మొ.న పాత్రలన్నీ వాస్తవిక పాత్రలే..ఆనాడే ఇందిర పాత్ర ద్వారా స్త్రీ స్వేచ్ఛ ను ప్రతిపాదించడం, మహిళలు ధృఢమనస్కులైసాంఘిక జీవనం చెయ్యాలనీ ఇందిర పాత్ర ద్వారా మహిళలకు సూచించారు..

నవల చదివిన వారెవరైనా ఇందిర పాత్రను మరిచిపోరు.నిజంగా మరపురాని పాత్ర ఇందిరది.

★★★★

# కార్టూన్ పేజి

# నవ్వండి ప్లీజ్





శ్రీనివాస్ కార్టూన్లు

**నవ్వటం ఒక యోగం ,**

**నవ్వలేక పోవటం ఒక రోగం ,**

**తరువాత మీ ఇష్టం**









## వార్తల్లో వ్యక్తి

# కాశ్ పటేల్



ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) డైరెక్టర్‌గా భారత సంతతికి చెందిన కశ్యప్ అలియాస్ కాశ్ పటేల్‌ను నియమిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డోనల్డ్ ట్రంప్ ప్రకటించారు. డోనల్డ్ ట్రంప్‌కు అత్యంత నమ్మకమైన వ్యక్తులలో కాశ్ పటేల్ (44) ఒకరని చెబుతుంటారు.ట్రంప్ విజయం తర్వాత కాశ్ పటేల్‌ను అమెరికా గూఢచార సంస్థ అయిన సీఐఏ అధిపతిగా నియమిస్తారనే ఊహాగానాలు వెలువడ్డాయి. అయితే సీఐఏ చీఫ్‌గా జాన్ రాట్‌క్లిఫ్‌ను నియమిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు.ఇప్పుడు కాశ్ పటేల్‌ను ఎఫ్‌బీఐ డైరెక్టర్‌గా నియమించాలని ట్రంప్ నిర్ణయించారు.

# వార్తల్లో వ్యక్తి

అమెరికా రక్షణ శాఖ ప్రకారం.. కాశ్ పటేల్ అమెరికా తాత్కాలిక రక్షణ మంత్రి క్రిస్టఫర్ మిల్లర్‌కు చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా పనిచేశారు. అంతకుముందు ప్రెసిడెంట్‌కు డిప్యూటీ అసిస్టెంట్‌గా, జాతీయ భద్రతా మండలిలో ఉగ్రవాద నిరోధక విభాగం సీనియర్ డైరెక్టర్‌గా పనిచేశారు పటేల్.

షనల్ ఇంటెలిజెన్స్ తాత్కాలిక డైరెక్టర్‌కు ప్రిన్సిపల్ డిప్యూటీగా కూడా పనిచేశారు పటేల్. ఆ హోదాలో ఆయన 17 ఇంటెలిజెన్స్ ఏజెన్సీల కార్యకలాపాలను పర్యవేక్షించారు. ప్రెసిడెంట్‌కు రోజువారీ బ్రీఫింగ్స్ ఇచ్చేవారు. జాతీయ భద్రతా మండలిలో చేరడానికి ముందు, పటేల్ ఇంటెలిజెన్స్‌పై శాశ్వత సెలెక్ట్ కమిటీకి సీనియర్ కౌన్సిల్‌గా పనిచేశారు. 2016 అమెరికా అధ్యక్ష ఎన్నికలను ప్రభావితం చేసేందుకు రష్యా క్యాంపెయిన్ చేసిందంటూ వచ్చిన ఆరోపణలపై జరిగిన విచారణకు పటేల్ నాయకత్వం వహించారు.

కాశ్ పటేల్ ఇంటెలిజెన్స్ కమ్యూనిటీ, అమెరికా స్పెషల్ ఆపరేషన్స్ ఫోర్స్ కోసం సున్నితమైన కార్యక్రమాలను పర్యవేక్షించారు. ప్రపంచవ్యాప్తంగా ఇంటెలిజెన్స్, కౌంటర్ టెర్రరిజంపై పనిచేయడానికి బిలియన్ డాలర్ల నిధులను అందించే చట్టాన్ని ఆమోదించడానికి కూడా ఆయన చొరవ చూపారు.అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్‌కు టెర్రరిజం ప్రాసిక్యూటర్‌గానూ పనిచేశారు.

ట్రంప్ హయాంలో జరిగిన కీలక ఆపరేషన్లలో పటేల్ ముఖ్యమైన పాత్ర పోషించారు. ఆ సమయంలోనే ఐసిస్ చీఫ్ అల్ బాగ్దాదీ, అల్ ఖైదాకు చెందిన ఖాసిమ్ అల్ రిమి మరణించారు. అమెరికన్ బందీలను సురక్షితంగా వెనక్కి తీసుకొచ్చారు.

కాశ్ పటేల్ ఒక భారతీయ వలసదారు కుమారుడు. మీడియా కథనాల ప్రకారం.. ఆయన ఒక గుజరాతీ కుటుంబంలో జన్మించారు. కాశ్ పటేల్ తండ్రి ఒక అమెరికన్ ఏవియేషన్ కంపెనీలో పనిచేశారు. అమెరికా రక్షణ శాఖ ప్రకారం.. పటేల్ న్యూ యార్క్ వాసి. రిచ్‌మండ్ విశ్వవిద్యాలయంలో అండర్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. న్యూ యార్క్ తిరిగి వచ్చి న్యాయశాస్త్రంలో డిగ్రీ పట్టా పొందారు. యూకేలోని యూనివర్సిటీ కాలేజ్ లండన్‌కు చెందిన ఫ్యాకల్టీ ఆఫ్ లాస్ సంస్థ నుంచి అంతర్జాతీయ చట్టంలో సర్టిఫికేట్ పొందారు.

పటేల్‌కు ఐస్ హాకీ ఆడటం ఇష్టం. ఆయనకు త్రిశూల్ అనే కంపెనీ ఉంది.ట్రంప్‌కు మద్దతుగా ఉన్న 'సేవ్ అమెరికా' విభాగానికి త్రిశూల్ కన్సల్టెంట్‌గా కూడా పనిచేసింది. "చాలామంది మాదిరిగానే నా తల్లిదండ్రులు కూడా చదువుపై దృష్టి పెట్టాలని చెప్పారు. నా మతం, వారసత్వంపై అవగాహన ఉండాలని సూచించారు. అందుకే నాకు భారతదేశంతో మంచి అనుబంధం ఉంది. నేను హిందూ కుటుంబంలో పెరిగాను కాబట్టి, మేం గుడికి వెళ్తాం. ఇంట్లో పూజలు చేస్తాం" అని ఒక పుస్తకంలో పేర్కొన్నారు పటేల్. '"కాశ్ ఫౌండేషన్"అనే ఎన్జీవోను పటేల్ నడుపుతున్నారు. ఈ ఎన్జీవో అమెరికన్ పిల్లల చదువుల కోసం స్కాలర్‌షిప్‌లను అందించడానికి, విజిల్‌బ్లోయర్‌లకు సహాయం చేస్తుంది.

★★★

## కొత్త సీరియల్

క్రైం సీరియల్

# ఆమె ఎవరు?



కొండగుంట వెంకటేష్.

WHILE MANY THINGS ARE TOO STRANGE TO BE BELIEVED NOTHING IS TOO STRANGE TO HAVE HAPPENED,

THOMAS HARDY.

మెల్లగా కళ్ళు తెరిచింది మేఘమాల. ముందు ఎదురుగా గోడ మీద ఖరీదైన పేయింటింగ్ కనిపించింది. ప్రఖ్యాత చిత్రకారుడు రవివర్మ గీసిన పేయింటింగ్ అది. ఆమె తలపైన ఫ్యాన్ వేగంగా తిరుగుతోంది. గదిలో డిసిన్ ఫెక్షన్ వాసన వేస్తోంది. అప్పుడే గది శుభ్రంగా కడిగినట్టుగా ఉంది. మెల్లగా లేచి చుట్టు చూసింది. గదిలో చాల ఖరీదైన వస్తువులు ఉన్నాయి. ఆమెకు కుడి వైపు ఖరీదైన సామ్ సంగ్ పెద్ద టీవి ఉంది. దాని పక్కన ఏవో పుస్తకాలు ఉన్నాయి.

అక్కడ ఉన్న వస్తువులు ఏమి సుపరిచతిమైనవి కావు. అసలు ఈ గది ఆమె గది కాదు. మరి ఎవరిది? ఇక్కడికి ఎలా వచ్చింది ఆమె

వెనుక వైపు పెద్ద కిటికి ఉంది. దానికి గ్లాసు తలుపులు ఉన్నాయి. అవి స్లైడింగ్ తలుపులు. ఒక పక్కకు లాగితే బయటదృశ్యాలు స్పష్టంగా కనిపిస్తాయి. మెల్లగా మంచం మీద నుంచి లేచి నిలబడింది. ఒక్కసారిగా తలతిరిగినట్టుగా అయింది. గది గిరగిర తిరుగుతున్న అనుభూతి కలుగుతోంది. కాళ్ళు స్థడిగా నిలబడలేక తడబడుతున్నాయి. బాలన్స్ చేసుకోలేక కొంచం సేపు మంచం మీద కూర్చుంది.

ఏమిటి ఈ వింత అనుభూతి. ఆమెకు కలిగిన పరిస్థితికి ఇంగ్లీష్ లో వెర్టిగో అండ్ డిజ్జినెస్ అంటారు. ఇది ఏమంత పెద్ద జబ్బుకాదు. బి 12 విటమిన్ D శరీరంలో తక్కువైనప్పుడు ఇలాంటి పరిస్థితి వస్తుంది. లేకపోతే చెవిలో ఏదైన ఇన్ ఫెక్షన్ ఉన్నప్పుడు కూడా ఈ సమస్య వస్తుంది. అయిదు నిమిషాలు కూర్చుని మెల్లగా లేచి నిలుచుంది. ఇప్పుడు ఏం కాలేదు. మాములుగానే ఉంది. కిటికి దగ్గర నిలబడి బయటకు తొంగిచూసింది.

ఆశ్చర్యం షాక్ కలిసికట్టుగా ఆమెను కుదిపేశాయి. ఎదురుగా ఉన్న ప్రదేశం కూడా సుపరిచితమైనది కాదు. పైగా ఆమె ఉంటున్న చోటు ఇండియాలో ఉన్నట్టుగా లేదు. ఏదో విదేశాలలో ఉన్నట్టుగా ఉంది. ఎదురుగా కనిపిస్తున్న ఇళ్ళ సముదాయం చూస్తుంటే ఏ లండన్ లో నో స్కాట్ లాండ్ లోనో ఉన్నట్టుగా ఉంది. దాదాపు ఇరవై ఇళ్ళు పైనే ఉంటాయి. అన్ని అందంగా పాతకాలం ఇంగ్లీష్ కట్టడంను పోలి ఉన్నాయి. ఇంటి ముందు పచ్చటి లాన్. కొంచం పక్కన రకరకాల పూలచెట్లు ఉన్నాయి. ఎటుచూసిన పచ్చదనం తప్ప ఇంకేం లేదు.

ఇది ఖచ్చితంగా ఇండియా కాదని ఆమెకు అర్ధమైంది. మరి దేశం. కొంపదీసి తనని కిడ్నాప్ చేసి ఇక్కడికి తీసుకవచ్చారా?

"ఏమిటి మేఘమాల. కిటికి దగ్గర ఏం చేస్తున్నావు"అని వినిపించింది.

చప్పున తలతిప్పి చూసింది. గుమ్మం దగ్గర ఒక స్త్రీ కనిపించింది. దాదాపు యాభైసంవత్సరాలు ఉంటాయి. అక్కడక్కడ నెరిసిన జుట్టు. పాతకాలం ఫ్రిల్ ఫ్రాక్ వేసుకుంది. తలను బన్నులా చుట్టుకుంది. చేతిలో ట్రే ఉంది. దాని మీద టిఫిన్ కాఫీ ఉన్నాయి.

"ఏం తోచక నిల్చున్నాను. ఇంతకి మీరెవరు? అడిగింది మేఘమాల.

"అప్పుడే నన్ను మరిచిపోయావా"అంది నవ్వుతూ.

ఆ నవ్వులో కొంచం కూడా అసహజత్వం కనిపించలేదు. చాల మాములుగా సహజంగా ఉంది.

"అవును. నాకు ఏం గుర్తుకురావటం లేదు. నేను ఎక్కడ ఉన్నాను."

"నువ్వు ఇంగ్లాండ్ దేశంలో లండన్ నగరంలో ఉన్నావు. ఖచ్చితంగా లండన్ కాదనుకో. లండన్ సిటికి పాతిక కిలోమీటర్ల దూరంలో ఉన్నావు."

"ఇది ఎవరి ఇల్లు?

"అది కూడా మరిచిపోయావా. ఇది మీ ఇల్లే. అది కూడా గుర్తులేదా"నవ్వింది ఆ స్త్రీ.

"ఇంతకి నీ పేరేమిటి?


"బెర్లీ"అంది ఆవిడ.

మేఘమాల వచ్చి మంచం మీద కూర్చుంది. పక్కన ఉన్న టీపాయ్ ను దగ్గరకు లాగి దాని మీద టిఫిన్ ప్లేటు కాఫీ కప్పు పెట్టింది బెర్లీ.

"టిఫిన్ చేసిన తరువాత బెల్ నొక్కు"అని చెప్పి బెర్లీ వెళ్ళిపోయింది.

ప్లేటులో పూరి మసాలా కనిపించింది. వాటిని చూడగానే ఆమెకు ఆకలి గుర్తుకువచ్చింది. వెంటనే అవురు ఆవురు అంటు టిఫిన్ తినేసింది. వేడి కాఫీ తాగి వెనక్కి వాలి పడుకుంది. మంచం పక్కన ఉన్న బెల్ ను నొక్కింది. లోపల ఎక్కడో బెల్ మోగుతున్న చప్పుడు లీలగా వినిపించింది. క్షణం తరువాత బెర్లీ లోపలికి వచ్చింది. మౌనంగా ప్లేటు గ్లాసు తీసుకుని వెళ్ళిపోయింది. కళ్ళు మూసుకుని గతం గుర్తుకుతెచ్చుకోవటానికి ప్రయత్నించింది. ఆశ్చర్యం వెంటనే తలపోటు మొదలైంది. ఆలోచిస్తున్న కొద్ది తలభారం ఎక్కువైంది. బాధ భరించలేకపోయింది. ఆలోచనలు ఆపి కళ్ళు మూసుకుంది. కామ్ గా ఉండటానికి ప్రయత్నించింది.

(ఇంకా ఉంది )




# హిమజ్వాల

ఇది వడ్డెర చండీదాస్ గారి తొలి నవల. మంచులా చల్లబడిపోయిన తెలుగు పాఠకుల మనసులో మంటలు రగిలించిన నవల హిమజ్వాల. ఆంధ్రజ్యోతి వార పత్రికలో ధారావాహికగా వెలువడి విపరీతమైన సంచలనాన్ని సృష్టించింది. నాటకీయత, కథనా నైపుణ్యం, చేతనా స్రవంతి అద్భుతంగా మేళవించిన రచన ఇది. కృష్ణ చైతన్య, గీత అనే రెండు ముఖ్యపాత్రల అంతరంగ చిత్రణ ఈ నవలలో అద్భుతంగా జరిగింది.


1960 లో హిమజ్వాల మొదటి అధ్యాయం రాసి, ఏడు సంవత్సరాలు కారణం లేకుండా కలం పట్టుకోకుండా మళ్ళీ 1967 లో మొదలెట్టి ఆర్నెల్లలో పూర్తిచేసారు. Whitehead, Sartre, Jung ల తత్వాలు మూలాంశాలుగా , “గమనాన్నీ, యానాన్నీ, ప్రవాహాన్నీ అక్షరాలలో చిత్రించాలని , అంతర్ బహిర్ వర్తనాల మధ్యన వుండే గొలుసు పొరలు చిరగకుండా వొక్కొక్కటె విప్పి; యేదో శూన్య రహస్యాన్ని తెలుసుకోవాలన్న కోర్కె” తో రాసిన అస్తిత్వ వాద మనోవైజ్ఞానిక నవల హిమజ్వాల.

# చదవాల్సిన పుస్తకం

తన మొదటి నవలతోటే పాఠకులకి శ్చర్యానందభూతిల్ని కలిగించి వున్నత సాహిత్యశిఖరాలను అందుకున్న అరుదయిన రచయిత శ్రీ చండీదాస్.

ఈ నవలలో సెన్సేషన్ లేదు, ఎక్సయిటింగ్ ఎలెమెంట్స్ లేవు, సస్పెన్స్ లేదు. ఉన్నదల్లా పాత్రల్లోని స్పందనలూ, సంఘర్షణలూ మాత్రమే. చదివిన తరువాత కూడా ఆ పాత్రల్ని అంత సులువుగా మర్చిపోలేం. కొన్ని పాత్రలు మనని ప్రశ్నిస్తే, కొన్ని పరిహసిస్తాయి. చివరకు మిగిలేది, అసమర్థుడి జీవయాత్ర, అంపశయ్య లాంటివి నచ్చినవారికి నచ్చుతుంది ఈ నవల. కొందరికి మింగుడుపడకపోవచ్చు. ఇందులో తప్పూ లేదు, ఒప్పూ లేదు. ఉన్నదంతా అస్తిత్వవాదం. మంచు లో చల్లదనాన్ని, జ్వాలలో మంటని కలిపి, వినూత్న మందుగుండు సామాగ్రి చేసి తెలుగు పాఠకుల మస్తిష్కాలలో ఫిరంగులను పేల్చిన నవల హిమజ్వాల. ఆంధ్రజ్యోతి వార పత్రికలో ధారావాహికగా వెలువడి ఆ కాలంలో బోలెడు ఖ్యాతిని ,అలాగే అంతకు మించి అపప్రథ ని మూటగట్టుకున్న మనోవైజ్ఞానిక నవల . ఇందులో నాటకీయత, కథనా నైపుణ్యం, చైతన్య స్రవంతి, ముప్పేట పేనుకుని, సమాజాన్ని ధిక్కరిస్తూ, కొత్త గొంతుక లేవనెత్తిన నవల. ఇందులో ప్రధాన పాత్రలు రెండు –కృష్ణ చైతన్య, గీత . వీరి వ్యక్తిత్వ,మానసిక చిత్రణ ఈ నవలలో ఒక నూతన ఒరవడిలో సాగింది.

క్లుప్తంగా కథని పరిశీలిస్తే, ఇందులో ప్రధాన పాత్రలు రెండు,ఆపైన కొన్ని సహాయ పాత్రలు ఉన్నాయి.గీతాదేవి అనే పాత్ర, భావుకత,సౌందర్య



ఆరాధన,సంగీత అభిలాష ఉన్న విద్యాధికురాలు. కృష్ణ చైతన్య, తత్వ శాస్త్రము లో లెక్చరర్. ప్రవృత్తి,వృత్తి రెంటి వల్ల అబ్బిన తాత్విక ధోరణి ,మంచి నడవడిక ఉన్నవాడు. వీరిరువురు, గీతాదేవికి జరిగిన ఒక ప్రమాదం లో ,ఒకరికొకరు తారస పడతారు. అప్పటికే తల్లిని, తండ్రిని, కోల్పోయి రోడ్డు పాలైన గీతని, కొన్నాళ్ళుతన ఇంట్లో ఉండటానికి, కృష్ణ తీసుకు రావడం తో కథ మెదలౌతుంది. వారిద్దరి అభిప్రాయాలు,ఆలోచనలు కలుస్తాయి.అందుకనే సామీప్యత పెరిగి ఒకానొక రోజు మరింత చేరువ అయ్యే సందర్భంలో గీత తన కోరికను వెలిబుచ్చినా, కృష్ణ సంకోచం తో వెనుకంజ వేస్తాడు.ఆ తిరస్కారాన్ని జీర్ణించుకోలేని గీత ఇల్లు వదిలి వెళ్ళిపోతుంది.ఆమె వెళ్ళాక తన పొరపాటు గుర్తించి కృష్ణ కూడా దేశ ద్రిమ్మరి అవుతాడు. ఇక గీత తన స్నేహితురాలు వద్ద చేరి, ఎమ్మే చదువు ,అలాగే ఉద్యోగాన్వేషణ చేస్తుంది. స్నేహితురాలి భర్త, తనను కోరుకోవడం,అందుకు స్నేహితురాలు, పెద్దగా అడ్డు చెప్పక పోవడం వల్ల వారికి దూరమై , ఒంటరిగా ఉంటూ ,ఒక పత్రికలో సబ్ ఎడిటర్ గా పనిచేస్తుంది. కొంత కాలానికి ,అక్కడ కూడా మానేసి వాల్తైర్ లో ,కాలేజ్ లెక్చరర్ గా చేరుతుంది. ఈ తరుణం లో పరిచయం అయిన శివరాం, ఆమెను దేవత లా అరాధిస్తున్నాను అంటాడు. ప్రేమ లేమి తో ఉన్న గీత , శివరాం మాటలు నమ్మి ,అతని వత్తిడి కి లొంగి అతన్ని పెళ్లి చేసుకుంటుంది.

కానీ పెళ్లయ్యాక తెలుస్తుంది శివరాం లో లేని రస స్పందన. అతనికి నాలుగు గోడల మధ్య మొక్కు బడి శృంగారమే తప్ప ,స్త్రీ లకు కూడా కొన్ని శృంగార భావనలు ఉంటాయని తెలీదు. పైగా, తనంతట తాను చొరవ చూపే ఆడది, అతని దృష్టిలో చెడి పోయిన సరుకు . అతడు తల్లి చాటు బిడ్డ. అరకు లోయ

సందర్శన లో, గీత సహనం చచ్చి పోయి తిరగబడుతుంది. శివరాం లో మగవాడు, పాశవికంగా బయటకు వచ్చి, ఆమెను తన్ని అయినా, తీసుకు పోతానంటాడు లేదా, తాళి తెంపి ఇవ్వు అంటాడు. ఆమెను అడవి లో ఒంటరిగా వొదిలి, వెళ్లి పోతాడు.ఇంకోవేపు ఊర్లు పట్టుకు తిరుగుతున్న కృష్ణ, ఊటీ లో పరిచయం అయిన రోగిష్టి చిదంబరం పెళ్ళాం మాధురి వలలో, చిక్కి లొంగిపోతాడు. అయితే చిదంబరంకి అనూహ్యంగా, ఆరోగ్యం బాగవటంతో, ప్లేటు తిప్పిన మాధురి ప్రవర్తనకు, హతాశుడై ఆశ్రమం దారి పడతాడు. అరకు లోయలో ఒంటరి అయి, తుఫాను లో చిక్కుకుని, దారి తప్పిన గీతను, కృష్ణ తండ్రి సారధి కాపాడతాడు. అతనికి ఆమె ,తన చనిపోయిన భార్యలా, అనిపిస్తుంది . అసలే రెండుసార్లు ప్రేమలో దెబ్బ తిన్న గీత ,సారధి వ్యక్తిత్వానికి ,చనిపోయినా, భార్య పై చెరగని అతని ప్రేమ మెచ్చి , చేరువ అవుతుంది. అయితే సారధి వయసు లో వ్యత్యాసాన్ని గుర్తు చేసి ,ఆమెని వారించినా ఆమె వినదు. తనతో గీతను ఇంటికి తీసుకువెళ్లిన కొద్దికాలానికే, అయన చనిపోతాడు. తండ్రి మరణ వార్త విని, ఇల్లు చేరిన కృష్ణకు, తన తండ్రి చేరదీసింది గీతనని, తెలిసినా,ఆమె సాన్నిహిత్యాని కోరుకుంటాడు. ఇంతలో శివరాం ప్రత్యక్షమై గీతను తనతో రమ్మంటాడు. తన తప్పుల్ని ఒప్పుకుని,గీతను తీసుకు వెళ్ళే ప్రయత్నంలో, ఆమె వినలేదని, కోపంలో గొంతు నులిమి చంపి, తాను మరణిస్తాడు.ఈ నవలలో కృష్ణ స్నేహితుడు శశాంక,గీత స్నేహితురాలు పద్మ,మాధురి,ఆమె భర్త చిదంబరం ఇలాంటి ఇతర పాత్రలు కూడా ఉన్నాయి.

ఈ కథలో అడుగడుగునా మనల్ని ఆశ్చర్య పరచేవి వర్ణనలు. గడ్డి పోచ మొదలుకుని, కరి మబ్బు దాకా, అన్నిటిని తనదైన శైలి లో వర్ణిస్తారు,చండీదాస్. ముఖ్యంగా పాత్రల వేషధారణ,ముఖ కవళికలు,మానసిక చిత్రణ,ప్రకృతి వర్ణన,అన్నీ పొందికగా, పోలిక లేనట్టుగా చిత్ర విచిత్ర వర్ణనలు, రసరమ్యంగా చెక్కినట్టు ఉంటాయి.

ఇక నవల లో వచ్చే అధ్యాయాల పేర్లు కూడా వినూత్న మైనవే చూడండి.వెలుగు మరక, మూగవోయిన వీణ, వుప్పొంగిపోనాది గోదారి,అనుభూతి సిగ్గెరుగదట,ప్రేమ వెర్రిబాగులదట ,మరీచికాన్వేషణ,సశేషం జీవితం. ఇవన్నీ ఆయా భాగాలలో వచ్చే కథను క్లుప్తంగా ఒక మాటలో సూచించేవే..

కొన్ని కథలు,ఇంకొన్ని సినిమాలు, రాసినా / తీసినా అర్ధం చేసుకుని స్వీకరించే కాలానికంటే ముందే రావటం మూలాన వాటి గొప్పదనం నివురుగప్పిన నిప్పులా మసిబారిపోతుంది.

సమాజంలో పురుషునికి శృంగారం పట్ల ఉంటే అది ఆసక్తి, అదే స్త్రీ కి ఉంటే యావ ఎలా అవుతుంది? ప్రేమ అంటే శృంగారం ఉండాలనుకునే మనం ,పెళ్లి అంటే మాత్రం దానికి ప్రాధాన్యత ఎందుకు ఇవ్వం ? రస స్పందన,రసానుభూతి లేని సంగమం ఏ విధంగా కోరుకోదగ్గది?. దానికి అత్యాచారానికి ఏమి తేడా? నేటికాలపు డేటింగ్ లో ,సహజీవనం లో యువతీ యువకులు కలిసి సాధించేది ఏమిటి?. ఇరువురి మధ్య సంయమనం,సమన్వయం ,పొందిక,భావ సారూప్యత ఇవేనా. శృంగార అనుకూలత / అనుగుణ్యత (sexual compatibility) అవసరం లేదా ? దానికి ఏ విధమైన విలువా ఇవ్వ నవసరం లేదా?. కేవలం ప్రత్యుత్పత్తి కి మాత్రమే పెళ్లియా? మారిన పరిస్థితుల్లో ఇంకా ఆ భావాలే సరిపోతాయా? చిన్న వయసు అమ్మాయినిచ్చి, తాత వయసు వాడితో, పెళ్లి చేస్తే అది ఒప్పు– అదే ఒక యువతి తనకు నచ్చి ఒక ముసలి వాడిని పెళ్లి చేసుకుంటే అది సహించరాని అపరాధమా? ప్రేమించే టప్పుడు ఉన్న ఆకర్షణ ,పెళ్లి కాగానే ఎందుకు పోతుంది?

ఇవి అన్నీఆ కాలంలో ఆయన లేవనెత్తిన తూటాల్లాంటి ప్రశ్నలు. వీటికి ఇప్పటి కాలంలో నైనా, మనదగ్గర సమంజసమైన సమాధానం ఉంటే ఈ నవల రాయటం లో అర్థమే లేదు. అలా కాదు అనుకుంటే నవల స్పృశించిన అంశాలకు జవాబు వెతుక్కునే పని లో ఉందాం

★★★

# బిచ్చగాడి విందు





పాకిస్థాన్‌లోని గుజ్రాన్‌వాలాకు చెందిన ఓ బిచ్చగాడి కుటుంబం... తమ నానమ్మ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన విందు కోసం అక్షరాలా 1.25 కోట్ల రూపాయలను (పాకిస్థాన్ కరెన్సీ) ఖర్చు చేసింది. ఈ విందులో 20 వేల మందికి పైగా భోజనం పెట్టింది. గుజ్రాన్‌వాలాలోని రాహ్‌వలి రైల్వే స్టేషన్ సమీపంలో ఇటీవల ఈ విందును ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. బిచ్చగాడు కోట్లాది రూపాయలు ఖర్చు చేసి విందు ఏర్పాటు చేయడం అందర్నీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. పంజాబ్ ప్రావిన్స్‌లోని ఈ ప్రాంతంలో ఇటీవల బిచ్చగాడి నానమ్మ చనిపోయింది. 40వ రోజు ఆమె జ్ఞాపకార్థం భారీ విందును ఏర్పాటు చేశారు. ఈ విందుకు తమకు తెలిసిన వారందరినీ ఆహ్వానించారు. పంజాబ్ ప్రావిన్స్‌లోని పలు ప్రాంతాల నుంచి వేలాదిమంది వచ్చారు. మరో ఆసక్తికర అంశం ఏమంటే అతిథులను వేదిక వద్దకు తరలించేందుకు దాదాపు 2 వేల వాహనాలను ఏర్పాటు చేశారు. ఈ విందులో వారి సంప్రదాయ వంటకాలైన సిరి పాయా, మురబ్బాలతో పాటు మాంసాహారం ఉండేలా చూసుకున్నారు. మటన్, స్వీట్ రైస్ కూడా పెట్టారు. ఈ విందు కోసం 250 మేకలను వధించినట్లుగా కథనాలు వచ్చాయి.

## చూడాల్సిన సినిమా

ఆణిముత్యాలు

# 'రామ చిలుక'





ఈదర శ్రీవిద్య

ఇప్పుడు వచ్చే సినిమాల్లో హీరొయిన్ కేవలం పాటలకో లేక అంగాంగ ప్రదర్సనకో పరిమితం .కొంత మంది హీరోయిన్లు సినిమా కదా ఏమిటో కుడా తెలియకుండా నటించేస్తున్నారు .ఒకప్పుడు హెరాయిన్ వేరుగా , వాంపు కారక్టర్ వేసే వాళ్ళు వేరుగా ఉండేవాళ్ళు ఇప్పుడు అన్ని వాళ్ళే వేస్తూ తమ విలువ తగ్గించుకున్నున్నారు .

ఒకప్పుడు సావిత్రి ,జమున ,భానుమతి వఃఅన్ని హీరోయిన్ల కోసమే కథలు రాసేవాళ్ళు . సినిమా లో సైతం వాళ్ళదే పైచేయి . వాణిశ్రీ కుడా ఇదే వారసత్వాన్ని నిలబెట్టుకుంది . 1970 ప్రేమ నగర్ నుండి 1979 శ్రీ మద్విరాట పర్వం వరకు వాణిశ్రీ గారి యుగం వర్ధిల్లింది, మధ్యలో జయసుధ,జయప్రద,జయచిత్ర,శ్రీదేవి వంటి అందాల తారలు వచ్చినా వాణిశ్రీ తన అభినయం తో కట్టి పడేసారు,ఆమె ముందు తరం తారలు జమున,కృష్ణకుమారి,కాంచన,జయంతి గుణచిత్ర నటీమణులు గా మారడం వాణిశ్రీ సీనియర్ నటీమణి గా మిగిలిపోయారు,అందులోనూ 1975 తరువాత గోరంత దీపం,అనుగ్రహం,వంటి చిత్రాలు వచ్చాయి ఆ వరసలో అభినయం ప్రధానంగా వచ్చిన చిత్రం ఈ రామచిలుక,ఇటువంటి పాత్రలు ఆమెకు నల్లేరు మీద నడక, వాణీశ్రీ గారి

# చూడాల్సిన సినిమా

మరో మంచిచిత్రం..ఇది వాణిశ్రీ సినిమా . ఆమే హీరో . సినిమా అంతా ఆమే కనిపిస్తుంది . మేకప్పు లేకుండా  నటించింది . గ్రామంలో మంత్రసానిగా , అందరికీ తల్లో నాలికలాగా , ఎప్పుడూ కిలకిలా నవ్వుతూ జీవించే పాత్ర . ఆ ఊళ్ళోకి టీచరుగా వచ్చిన రంగనాధ్ , ఆమె మనసులు ఇచ్చిపుచ్చుకుంటారు .టీచర్ గారి  పెళ్లి ఆ ఊరు మునుసబు గారమ్మాయితో జరగటంతో భగ్న ప్రేమికురాలు అయి , ఆ టీచర్ గారబ్బాయిని రక్షించే క్రమంలో చనిపోతుంది

చిత్రం 1978 న విడుదల. చంద్రమోహన్, వాణీశ్రీ, రంగనాథ్ నటించిన ఈ చిత్రానికి సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహించారు.చెళ్లపిళ్ల సత్యం సంగీతం సమకూర్చారు . సింగీతం శ్రీనివాసరావు రావు అప్పటికే అమెరికా అమ్మాయి వంటి హిట్ సినిమాను చేసిన ప్రముఖ దర్శకుడు.. నహతా కొన్ని క్రైం ఏక్షన్ చిత్రాల నిర్మాత.ఈఇద్దరి కాంబినేషన్ లో అనూహ్యంగా,

నిజంగా అందమైన సినిమానే.. వాణిశ్రీ చంద్రమోహన్ రంగనాథ్ ల చక్కని నటన..సత్యం గారి బాణీలో వినసొంపైన పాటలు..”రామచిలకా పెళ్లి కొడుకెవరే?!”, “మావయ్య వస్తాడంట “ ఈ రెండు పాటలూ బాగా పాపులర్ అయ్యి నేటికీ బతికున్నాయంటే సత్యం మాష్టారి సంగీతమే కారణం..జానకమ్మ స్వరమే నిదర్శనం..మళ్లీ మళ్లీ చూడదగ్గ సినిమా నే అయినా వాణిశ్రీ చనిపోవడం మళ్లీ చూడలేక అభిమానులు విలవిలలాడారేమో !



. బహుశా వాణిశ్రీ చనిపోవటం ప్రేక్షకులకు నచ్చి ఉండదు . భరించలేకపోయి ఉండవచ్చు అందుకే సినిమా పెద్దగ ఆడలేదు

.

విజయలక్ష్మి పిక్చర్స్ పతాకంపై శ్రీకాంత్ నహత నిర్మించిన ‘రామచిలుక’ తెలుగు చలన

ఆశ్చర్యంగాఎగురుకుంటూ వచ్చింది ఈ రామచిలుక.. అచ్చమైన పచ్చని పల్లెటూరి ప్రేమకథ..పల్లెఅందాలతో వాణీశ్రీ అందాలతో అలరారిన సినిమా..ఈ సినిమాచూసినప్పుడు ఎందుకో నాకు పదహారేళ్ళ వయసు సినిమా గుర్తుకొస్తూ ఉంటుంది.. పోలికలు కాదు కానీ పోకడలు..

రామచిలుక సినిమా తమిళంలో కమర్షియల్ గా సక్సెస్ అయిన ,అన్నక్కిలి’ సినిమాకు రీమేక్ . ఇళయరాజకు “అన్నక్కిలి” సంగీత దర్శకుడిగా మొదటి చిత్రం. 1976 లో విడుదల అయిన ఈ చిత్రంలో పాటలు అరవ దేశంలో మారుమ్రోగిపోయాయి. అప్పటివరకూ ఒక బాణీ పాటలను

# చూడాల్సిన సినిమా

వినడానికి అలవాటుపడిన తమిళ శ్రోతలకు ఇళయరాజా – మధురై ప్రాంతంలోని జానపద బాణీలకు వెస్ట్రన్ ఫ్లేవర్ ను అద్ది చేసిన ఈ పాటలకు దాసోహం అయిపోయారు. పాటలన్నీ సూపర్ హిట్. తర్వాతి చిత్రం పదునారు వయదిలే. ఇక ఆ తర్వాత చరిత్రే!1976లో నేను మద్రాసులో ఉన్నందున...ఈ చిత్రంలోని పాటలు వినపడని ప్రాంతం ఉండేది కాదు. తమిళ చిత్రంలో ఇళయరాజా పాడిన పాట కూడా చాలా బాగుంటుంది. తమిళ సినిమాలో వాణిశ్రీ పాత్రను సుజాత , రంగనాధ్ పాత్రను శివకుమార్ పోషించారు . తమిళంలో సుజాత చనిపోవటం తెలుగులో వాణిశ్రీ చనిపోవటం ఒకటి కాదు కదా ! వాణిశ్రీని బతికించి ఆ ప్రమాదంలో ఫటాటప్ జయలక్ష్మి పాత్రను చంపి ఉంటే సినిమా సక్సెస్ అయి ఉండేదేమో ! ఐడియాలు రావాలంటే నిర్మాతకు ధన ప్రాప్తి ఉండాలిగా !

సత్యం సంగీత దర్శకత్వంలో పాటలు చాలా చాలా శ్రావ్యంగా ఉంటాయి . పాటలను అన్నీ వేటూరి వారే వ్రాసారు . అద్భుతంగా వ్రాసారు ఎప్పటిలాగానే . ముఖ్యంగా రామచిలకా పెళ్ళికొడుకెవడే మాఘమాసం మంచిరోజు మనువాడ పెళ్ళికొడుకెవడే పాట సూపర్ హిట్ సాంగ్ . యస్ జానకి పాడింది .

సినిమాలో సముద్రాల జూనియర్ డైలాగులు కూడా చాలా బాగుంటాయి . కథను కూడా దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు బాగానే నడిపించారు . నటీనటులు అందరూ చాలా బాగా నటించారు . అయిననూ కమర్షియల్ గా సక్సెస్ కాలేదు .

వాణిశ్రీ , రంగనాధ్ , చంద్రమోహన్ , రావు గోపాలరావు , సాక్షి రంగారావు , ఫటాఫట్ జయలక్ష్మి , రాధాకుమారి , కాంతారావు , రావి కొండలరావు , మణిమాల ప్రధాన పాత్రలలో నటించారు .

సుందర్ లాల్ నహతా నిర్మించిన ఈ సినిమా ఆహ్లాదకరమైన గ్రామీణ వాతావరణంలో షూట్ చేయబడింది . చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం లోని దండుమిట్ట గ్రామంలో షూటింగ్ చేయబడింది .

ముఖ్యంగా వాణిశ్రీ అభిమానులకు , సంగీత ప్రియులకు బాగానే నచ్చుతుంది . సినిమా , పాటల వీడియోలు యూట్యూబులో ఉన్నాయి . ఆసక్తి కలవారు చూడవచ్చు . రామచిలకా పెళ్ళికొడుకెవడే పాట వీడియోని మాత్రం అస్సలు మిస్ కావద్దు .

★★★

" గాజు వాక పిల్లా మేము
గాజులోల్లం కాదా ......."



గాజువాక పిల్లా మేం గాజులోల్లం కాదా..నీ
చేయి చాపలేదా మా గాజు తొడగలేదా..

గాజువాకే పిల్లా మాది.. గాజులోల్లమే పిల్లా
మేము.. .....గాజువాకే  పిల్లా మాది ....

ఒకానొక టైం లో ,అమ్మాయికి లవ్ ప్రపోజ్ చేయడానికి అబ్బాయిలంతా కులశేఖర్ పాటలనే ఎంచుకునేవారు. కాలేజీ క్యాంటిన్లలో, ప్రెషర్స్ పార్టీలలో.. ఎక్కడ చూసినా ఆయన పాటే పెట్టుకుని చిందేసేవారు. అంతలా పాపులర్ అయ్యాయి ఆ పాటలు. పాటలా ప్రవహించాడు ఇన్నాళ్ళు .అదే  పాటలా తరలి పోయాడు కుల శేఖర్ .మరలిరాని లోకాలకు వెళ్ళిపోయినా మరపురాని పాటలనే మనకు అందించాడు. ఆయన లేకపోయినా ఆయన పాటలు మాత్రం మన మధ్యనే ఉన్నాయి. పాటలా. కులశేఖర్ మన మధ్యనే ఉన్నాడు. ఎప్పటికీ ఉంటాడు.

కులశేఖర్ విశాఖపట్నం జిల్లా సింహాచలంలో 1971 ఆగష్టు 15న పుట్టారు. తండ్రి మహామహోపాధ్యాయ టి.పి.శ్రీరామచంద్రా చార్యులు, తల్లి శ్రీమతి రంగనాయకమ్మ. చిన్నప్పటి నుంచే కులశేఖర్కు సంగీత సాహిత్యాల మీద ఆసక్తి ఉండేది. చదువుకుంటున్న రోజుల్లోనే పాటలు రాసి బహుమతులు పొందాడు. చదువు తరువాత ఈటీవి గ్రూప్లో విలేకరిగా పనిచేశాడు.

ప్రసిద్ధ సినీగీత రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి దగ్గర శిష్యరికం చేస్తూ సినీగీతాల రచనలో మెళకువలు తెలుసుకున్నాడు. తరువాత తేజ దర్శకత్వంలో రామోజీరావు ఉషాకిరణ్ మూవీస్ పతాకంపై నిర్మించిన 'చిత్రం' సినిమాతో గీత రచయితగా పరిచయం అయ్యాడు. ఈ సినిమాలో అన్ని పాటలూ ఆయనే రాశాడు.

మొదటి సినిమాతోనే సూపర్ డూపర్ హిట్ కొట్టాడు. ఇక వెనక్కి తిరిగి చూసుకోలేనంత బిజీ రైటర్గా సాగిపోయాడు. ఎక్కువగా ఆర్. పి.పట్నాయక్, తేజ లతో కలిసి అనేక సినిమాలకు పనిచేశాడు.ఆర్.పి. పట్నాయక్, కులశేఖర్, తేజ కలిస్తే ఓ సంచలనమే. ఎన్నో బ్లాక్ బస్టర్ సినిమాలకు వాళ్ళు కలిసి పనిచేశారు. ఓ దశకంలో ఆయన పాటలంటే ప్రేమికులందరికీ నిత్య పారాయణాలు.




'రాను రానంటూనే సిన్నదో ..సిన్నదో.... రాములోరి గుడికొచ్చే సిన్నదో... సిన్నది

కాదు కాదంటూనే ...కుర్రదో... కుర్రదో తోటకాడికొచ్చిందోయ్ కుర్రదో... కుర్రది'

...అంటూ ప్రియు రాలిని . ఆటపట్టించే సందర్భం ఈ పాటలో కనబడుతుంది.

'ఏ చిలిపి కళ్ళలోన కలవో... ఏ చిగురు గుండెలోన లయవో ...

నువు అచ్చుల్లోన హల్లువో.... జడకుచ్చుల్లోన మల్లెవో'.

... అమ్మాయిని చిలిపి కళ్ళలోని కలగా, లేతగుండెలోని లయగా చూస్తూ, అచ్చులలో హల్లుగా భావించడం కొత్తగా ఉంది. ఈ పాటలు ఎంత ఊపు ఊపాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

సుబ్బు, మృగరాజు, స్నేహమంటే ఇదేరా. సంతోషం. హోలీ ఆడవారి ఆడవారి మాటలకు అర్థాలే వేరులే వంటి సినిమాల్లో దాదాపు 500కు పైగా పాటలు రాశాడు కులశేఖర్. గీతరచయితగా పాటలు రాస్తూనే 'ప్రేమలేఖ రాశా' సినిమాకు దర్శకత్వం వహించాడు.మెదడుకు సంబంధించిన వ్యాధి సోకి కొంత కాలం జ్ఞాపకశక్తి కోల్పోయాడు. ఆ తరువాత కొన్నేళ్ళకు కొంత కుదుట పడ్డాడు. ఈ మధ్యే అనారోగ్యం పాలై నవంబర్ 26న హైదరాబాద్లోని గాంధీ ఆసుపత్రిలో కన్నుమూశాడు. అయన పాటలు వింటూ ఓ క్షణం ఆయన్ని స్మరించుకుందాం .

# పావలా వస్తువుకి పదిరూపాయల ప్రచారం

## క్రాస్ రోడ్ కబుర్లు

జి .అనుదీప్



అనగనగా ఓహీరో , తన ప్రియురాలిని విమానాశ్రయం లో విమానం (చార్టర్ ఫ్లైటు) ఎక్కించటానికి కారులో తీసుకొస్తాడు. ప్రియురాలు విమానం ఎక్కి వెళ్ళిన తరువాత, కారులో ఆమె తన చేతి సంచి (హ్యాండ్ బ్యాగు) మరచి పోయిందని గమనిస్తాడు. అబాగు ఆమెకు అందించటానికి, విమానశ్రయంలో వున్న జెట్ విమానం తీసుకుని, వేగంగా ప్రియురాలి విమానాన్ని దాటి, ప్రియురాలి కన్నా ముందే గమ్య స్థానం చేరుకుని, ప్రియురాలికి బ్యాగ్ అందిస్తాడు !

ఈ కథంతా ఎక్కడో విన్నట్టు ,చూసినట్టు ఉంది కదా? చూడకపోతే తక్షణం నెట్టింట్లో చూడండి. ఇదో వ్యాపార ప్రకటన. 'ఈ వ్యాపార ప్రకటన ఆడవాళ్ళ బ్యాగులమ్మే కంపెనీది అనుకుంటే మీరు పప్పులో కాలేసినట్లే. ఆ ప్రకటన ఓ యాలుకలు, లవంగాలు అమ్మే సంస్థకు చెందింది. ఇప్పుడు చెప్పండి, అసలు ఆ ప్రకటనకు, ఆ వస్తువుకు ఏమన్నా సంబధం వుందా ? ఈ వ్యాపార ప్రకటన కేవలం నాలుగైదు సెకన్లు మాత్రమే మనకు కనిపిస్తుంది. కాని దానికి ఎంత ఖర్చు అయ్యిందో తెలుసా? అక్షరాలా 50 కోట్లు. ఒక యాలుకలు అమ్మే సంస్థ ఇన్నికోట్లు పెట్టి ప్రకటనలు ఇవ్వాలా? ఈ ఖర్చంతా ఎవరు భరిస్తున్నారనుకుంటున్నారు.. అయినా వాళ్ళ డబ్బు, వాళ్ళు ఖర్చు

# కబుర్లు... ఉత్తినే



పెట్టుకుంటే మీకేంటి నొప్పి అంటారా ? వాళ్ళ డబ్బు అయితే ఎందుకు ఖర్చు పెడతారండీ. ఆ ఖర్చంతా మనబోటి కష్టమర్ల మీదే వేస్తారు

పావలా వస్తువుకు, పదిరూపాయల ప్రచారం, మొత్తం ఖరీదు పదింబావలా. ఇది కేవలం ప్రకటన రూపొందించటానికి అయిన ఖర్చు మాత్రమే, ఈ ప్రకటనలను టీ.వి లో ప్రసారానికి ,పత్రికల్లో ప్రకటనలకు ఓ 50 కోట్లు దాట వుంటుంది. అంటే మొత్తం కలిపి ఓ 100 కోట్లు . అంటే ఓ పెద్ద హీరో సినిమా ఖర్చు అన్నమాట .

మరో హీరోగారు హెలీకాప్టర్లో, వేగంగా వెళుతున్న రైలు మీదకు దుమికి, ఆరైల్లో ప్రయాణి స్తున్న విలన్లను చిత్తు చిత్తుగా ఓడించి వాళ్ల ఆధీనం లో వున్న శీతల పానీయం సీసాను చేజిక్కుంచు కుంటాడు. మరో హీరోగారు ఓ సుడిగాలి తూఫాను లో చిక్కుకున్న ఒక కారులోని వ్యక్తి ని రక్షించటానికి సుడిగాలి కన్నా వేగంగా వెళ్లి ఆ కారులో వున్న అతన్ని రక్షించతామే కాక అందులో ఉన్న ఓ శీతల పానీయం అందుకుంటాడు.

మరో హీరో విమానంలో నుండి ఓ జీపు తో సహా కిందకు దూకి, పారాచూట సహాయంతో కిందకు దిగి ,ఎదురుగా వున్న కిల్లీ కొట్లో ఓ శీతల పానియన్ని కొనుగోలు చేస్తాడు. ఇలా చెప్పుకుంటూ పోతే, మనదేశంలోని వ్యాపార ప్రకటనలు చిత్ర విచిత్రంగా వుంటాయి.

ఈ ప్రకటనలు చూసిన ఓ బామ్మగారు, ఆకుర్రాడు ఆ కూల్ డ్రింకు కోసం అంత కష్ట పుడుతున్నాడు, ఇంతకి దాని ఖరీదు ఎంతే మిటి అని అడిగింది

''ఆ కూల్ డ్రింక్ సీసా ఖరీదు 20 రుపాయలు “అని చెప్పంగానే ,”ఇరవైరుపాయల సీసా కోసం ప్రాణం మీదకు తెచ్చుకోవాలా? అసలు వాడికి ఏమున్నా పిచ్చా ?చాదస్తమా ? అంటూ పెదవి విరవటం కొసమెరుపు.



ఆ హీరోగారిది పిచ్చో , ఛాదస్తమో పక్కన పడితే కొంతమంది కుర్రకారు ఆ హీరో గారిలా సోహసాలు చెయ్య బోయి ప్రాణాల మీదకు తెచ్చుకున్నారు.

ఇటు వంటి ప్రకటనలు టీ వి లో ,సినిమాల్లో చూపిస్తూ కింద చిన్న అక్షరాలో , సిగిరెట్లు పెట్టె మీద “ఆరోగ్యానికి హానికరం అని చిన్న చిన్న అక్షరాలతో రాసినట్లు”, ఎక్కడో అడుగున ‘ఇది కేవలం గ్రాఫిన్స్ మాయాజాలం, అనుకరించి ప్రాణం మీదకు

# కబుర్లు ...ఉత్తినే

తెచ్చుకోవద్దు “ అని చూపిస్తారు కనపడీ కనపడ నట్లు

ఇవాళ మార్కెట్ల ప్రచారం లేకుండా అమ్మడు అవుతున్న. వస్తువులు లేవంటే అతిశయోక్తికాదు .వ్యాపారసంస్థలు తమవస్తువులు అమ్మ కావటానికి ప్రకటనలు ఇవ్వటమూ కొత్తిమి కాదు . ఇటువంటి వాపార ప్రకటనలు. తయారు చెయ్యటంలో మన దేశంలో అందె వేసిన చేయి లింటాస్ సంస్థది. ఆ సంస్థ తో పనిచేసిన అలెక్యు పదమ్సీ రూపొందించిన లిరిల్ సబ్బు , 'సర్ఫ్ వాషింగ్ పౌడర్, బజాజ్ చేతక్ “నీర్మా' వాషింగ్ పౌడర్ ,వీకో టర్మరిక్ వంటి ప్రకటనలు నేటికీ మరచిపోలేవు. ఈ ప్రకటనలన్నీ ఎంతో అర్థవంతంగా, తక్కువ ఖర్చుతో రూపొందించినవే.

అసలు వ్యాపార ప్రకటనలకు పెద్దగా ఖర్చు పెట్టకుండా, అమ్మకాలు పెద్ద ఎత్తున డజరపవచ్చు అని నిరూపించాడు ఓబోడి గుండాయన.'బ్బులు ఊరికే రావు” అంటూ తననగల వ్యాపారాన్ని అందరికన్నా మిన్నగా పెంచుకుంటూ పోతున్నాడు. ఈ యనగారెవరో నేను మళ్లీ వేరే చప్పనక్కరలేద నుకుంటా

“మరక మంచిదే”, “సంస్కారవంతమైన సబ్బు”,” “గాలి మారుతోంది” వంటి వ్యాపార ప్రకటనలు విన్నప్పుడు తప్పకుంగా ఏదో కొత్తగా ఉండే అనే ఆలోచనలో పడతాము. ఆ ఆలోచనే ఆ వస్తువుని కనిపిస్తుంది. అంతే కాని కోట్లు కుమ్మరించి ప్రకటనలను రూపొందించినంత మాత్రాన అవి ఆకట్టుకుంటాయి అనుకోవటంఅమాయకత్వమే అవుతుంది. ఇది వ్యాపార ప్రకటనలకే కాదు , సినిమాలకు కూడా వర్తిస్తుంది. సినిమా కథ బాగుంటే కోట్లు చేస్తుంది, అంయ్యే కాని కోట్లు పెట్టి తీసినా కథ బాగాలేక పోతే నిర్మాతలకు కన్నీళ్ళు మిగులుతాయి.అలా కన్నీళ్లు మిగిల్చిన చిత్రాలు ఎన్నో ఉన్నాయి .

★★★









కథ

# రహదారి

మళ్ళ కారుణ్యకుమార్

"ఇప్పటికే చానా ఆలస్యం అయినాది సారు....మీరు ఎప్పటి నుండో ఇలానే చెప్తున్నారు."అసహనంగా సిగరెట్ పొగను పీల్చి, వదులుతూ అన్నాడు బుచ్చి ఫోన్లో అవతల వ్యక్తి తో...

"నువ్వు అనుకున్నంత ఈజీ కాదు బుచ్చి.....

మీ గూడెం పట్నం కు ఎంత దూరం వుందో నీకు తెలుసు కదా!.... అక్కడకు రోడ్డు వేయడం సామాన్యమైన పని కాదు....ప్రభుత్వాన్ని ఒప్పించాలి, ప్రభుత్వం అనుమతి ఇవ్వాలి, మళ్ళీ దానికి ఎవరో కాంట్రాక్టు ఎత్తాలి....అలాంటి ఏరియాలో కాంట్రాక్టు తీసుకొని పని చేయడానికి ఎవరు ముందుకు వస్తారు చెప్పు..... అందరూ తమ కాంట్రాక్టు లో లాభాలు చూసే వాళ్ళే తప్ప....అందుకే సమయం పడుతుంది....నువ్వేమి దాని గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు...నేను చూసుకుంటాను."కొత్త సాకు చెప్పాడు రావు.

హలో , హలో.... ఛా.. సిగ్నల్ కట్ అయ్యింది."అని మరింత అసహనంతో అక్కడ వున్న రాయిని కాళ్లతో గట్టిగా తన్నాడు...

తాను ఉంటున్న గూడెం కి ఇరవై అడుగుల దూరంలో వున్నాడు బుచ్చి, కేవలం అక్కడికి మాత్రమే సిగ్నల్ వస్తుంది. అది కూడా అరకొరగానే. తన వూరికి కనీస వసతులు కల్పించాలని బుచ్చి తాపత్రయం.

“అక్కర అయితే నేను కావాలి .కానీ ,నా మాట మాత్రం వినడు.... నాకు సాయం చేయకపోయినా నష్టం లేదు. కానీ , ఈ గూడెం కు మంచి చేస్తాడనుకునే గదా .. వీడు ఏది చెప్తే అది చేశాను... విశ్వాసం లేదు........”అని అనుకుంటూ గబగబా నడుస్తూ తన గూడెం లోపలికి చేరుకున్నాడు.... అక్కడే వున్న విశాలమైన రాయి మీద కూర్చుంటూ తన దగ్గర వున్న మత్తు పదార్థాన్ని తీసి ఒక పీల్పు పీల్చి సేద తీరుతున్నాడు.

ఇంతలో తన చుట్టూ ఎప్పుడూ తిరిగే సూరీడు ఇప్పుడు తనని పట్టించుకోకుండా వెళ్లిపోవడం చూసి... “రేయ్. సు...సూరీడు.... గిటు...రా. రా...”అని కళ్ళు తేలేస్తూ ,సగం తెరిచిన కళ్ళతో చూస్తూ పిలిచాడు...

“ఆగు అన్న....”అని ఆగి, ఒక్క క్షణంలో సమాధానం చెప్పి మళ్ళీ తుర్రుమన్నాడు సూరీడు.....

సూరీడు నేరుగా వెళ్ళి, ఆ పక్కనే చెట్టు కింద గుంపుగా చేరి వున్న పిల్లల మధ్యలోకి చేరి కూర్చున్నాడు....

“పిల్లలూ, సిద్ధంగా ఉన్నారా.... ఈరోజు మనం తెలుసుకోబోయే వ్యక్తి జిజాబాయి!....

ఆమె ఒక యోధుని తల్లి,

కొడుకుని ఒక ఉత్తముడిగా తీర్చి దిద్దిన ఒక మహిళా శక్తి....ఈ రోజు మీకు ఆ చరిత్ర చెప్తాను......”అని శివాజీ చరిత్ర చెప్తుంది శకుంతల..

రోజూ ఆమె అక్కడ వున్న పిల్లలకు చదువు గురించి, అలాగే ఎందరో గొప్ప వ్యక్తులు గురించి చెప్తూ ఆ గూడెం పిల్లలకు చదువు పట్ల ఆసక్తి కలిగేలా చేయాలని ప్రయత్నిస్తుంది.

“చెప్తావు, ఎన్నైనా చెప్తావు... నీదేమి పోయింది... సొమ్ములు కాజేసి. ఇలా సేవలు అంటూ ఇక్కడకు వచ్చి పిల్లల్ని పోగేసి, జనాల్ని పోగేసి ,ఏవేవో చేసి, చిల్లర సేవలు చేసి ,పెద్ద మొత్తంలో వెనుకేసుకుంటారు. ఎవడికి తెలియదు ఈ మోసాలు!..”అని ఆమె వైపు చూస్తూ తనలో అనుకుంటున్నాడు బుచ్చి.

ఆమె అక్కడికి వచ్చి వారం రోజులు అవుతుంది. ఆమె తో పాటు మెడికల్ సిబ్బంది... మిగిలిన వాళ్ళు వున్నారు...అక్కడ మెడికల్ క్యాంప్ నిర్వహించి ప్రజలకు కొన్ని మందులు ఇస్తున్నారు.

“మేడం మీరు రెస్ట్ తీసుకోవాలి, అలా ఎక్కువ సేపు మాట్లాడకూడదు....”అని శకుంతల దగ్గరకు వచ్చి చెప్పింది డాక్టర్...

“లేదు డాక్టర్, నాకు బాగానే వుంది....

మీరు కంగారు పడాల్సిన అవసరం లేదు...”

“అది కాదు మేడం, మిమ్మల్ని కేర్ గా చూసుకోవడం మా బాధ్యత...మీకేమైనా ఐతే మేము తట్టుకోలేము. అందుకే మేము ఇక్కడ మిమ్మల్ని రావద్దు అన్నాను..కానీ మీరు మా మాట వినకుండా ఇక్కడకు వచ్చారు....”

“డాక్టర్...ఇది నా బాధ్యత అందుకే నేను ఇక్కడికి రాకుండా ఉండలేకపోయాను.”అని శకుంతల అనే సరికి మరో మాట మాట్లాడకుండా అక్కడ నుండి వెళ్ళిపోయింది డాక్టర్.

దూరంగా వుండి అంతా గమనిస్తూనే వున్నాడు బుచ్చి....

ఇప్పుడు ఆమె ఎందుకో ప్రత్యేకంగా కనిపిస్తుంది!...

“అసలు ఆమెకు ఏమైంది?... డాక్టర్ చెప్పినా కూడా వినకుండా ఈ పనులు ఎందుకు చేస్తుంది!”అని అనుకుంటూ మెల్లగా మత్తులోకి జారుకున్నాడు బుచ్చి...

తర్వాత రోజు జనాలు అందరూ పరుగు తీస్తున్నారు.....

పెద్దగా అలికిడి అవ్వడం తో ఒక్కసారిగా మత్తులో నుండి లేచాడు బుచ్చి. సూర్యుడు నెత్తి



మీదకు వచ్చి చాలా సమయం అయ్యింది... ఎప్పుడూ నిశ్శబ్దంగా వుండే గూడెం ఎందుకు ఈరోజు ఇంత గోలగా వుంది!... అసలు ఏమి జరిగింది?అని అనుకుంటూ....అటు వైపుగా పరుగుతీస్తున్న కర్రోడు ను బలవంతంగా ఆపాడు బుచ్చి..

“ఏమి రా?...ఎందుకు ఈ ఉరుకు,ఇప్పుడు ఏ కొంప మునిగిపోయిందని......ఇలా ఉరుకుతున్నారు!.”అని అడిగాడు బుచ్చి...

“మళ్ళీ వాళ్లు వచ్చినారు రా బుచ్చి,,,, మెషీను లు పట్టుకొచ్చినారు!..... గాళ్ళని ఆపడానికి పోతున్నాము.”అని ఆయాసంతో చెప్పాడు కర్రోడు.

“ఎన్ని సార్లు చెప్పాలి వాళ్లకు ఇక్కడకు రావద్దని, ఇప్పటికే పచ్చగా వున్న ఈ చోటుని ఎడారిలా మార్చారు...”అని అనుకుంటూ తాను పరుగు తీసాడు బుచ్చి...తీరచూసే సరికి వెల్లిన వాళ్ళు అందరూ అక్కడ కూర్చొని వున్నారు, ఎదురుగా శకుంతలా వుంది!....అది చూసిన బుచ్చి...

“ఈ జిజాబాయి ఏమిటి ఇక్కడ వుంది!...కొంపతీసి ఇక్కడ చెట్లు అవసరం అయ్యాయా?.. ఈ సారి ఈమెను అడగాలి ఎందుకు ఇదంతా చేస్తుందని. లేకపోతే వీళ్ళను బుట్టలో వేసుకుని ఇక్కడ యాపారాలు చేస్తుంది.” అనుకుంటూ ఆవేశం తో వేగంగా ముందుకు అడుగులు వేస్తున్నాడు.....

“మీరేమి కంగారు పడాల్సిన అవసరం లేదు.. నేనేమీ ఇక్కడ చెట్లు నరకడానికి, ఈ అడవి సంపద దోచుకోవడానికి ఈ యంత్రాలు తెప్పించలేదు.... ఇక్కడ రహదారి నిర్మించడానికి ఈ ఏర్పాట్లు.”అని వాళ్లందరినీ సావధాన పరుస్తూ అంది శకుంతల......

ఒక్కసారిగా ఆ మాటలు విని ఆగి పోయాడు బుచ్చి ....ఈ మాట ఎందుకో అతనికి సంతోషం కలిగించింది.....

ఈ కల ఎప్పటిదో, చిన్నప్పుడు సరైన రహదారి లేక తన తల్లి ప్రసవించే సమయంలో ఇబ్బందులు ఎదురై ఆసుపత్రికి తీసుకు వెళ్ళలేక ఆమెకు ప్రమాదం జరిగి ప్రాణాలు కోల్పోయింది.... అలా ఎందరో సరైన సమయానికి సరైన వైద్యం జరగక చనిపోయారు.... పండుతున్న పంటలు మార్కెట్ కు తీసుకు పోయి అమ్మడానికి చాలా కష్టపడుతున్నారు తన గూడెం జనాలు. తాను ఎప్పటి నుండో ప్రయత్నిస్తున్నా కాని పని... ఇప్పుడు ఆమె చేయడం బుచ్చి కి ఆశ్చర్యం కలిగించింది!.... “ఇక్కడకు వచ్చి ఈమె రోడ్ వేయడానికి కారణం ఏమిటి?... నిజంగా మా కోసమేనా ..లేకా ఏదైనా తిరకాసు వుందా?...”అని ఆలోచనలో వుండగా...

“హే పక్కకు జరగవయ్యా”అంటూ కేకపెడుతూ జె సి బి డ్రైవర్ హార్న్ కొట్టాడు. ఒక్కసారిగా తుళ్ళి పడి వెనక్కి జరిగాడు బుచ్చి... ఆ గూడెం జనాలు కూడా ఆనందంతో అక్కడ రోడ్డు పనులకు శ్రమ దానం చేయడానికి సిద్ధం అయ్యారు....

“ఎవరు ఆమె ?..ఎందుకు ఇవన్నీ చేస్తుంది!...ఎంత ఫౌండేషన్ అయినా ఇంత మదుపు పెట్టి రోడ్డు వేయిస్తుందా!...”అని ఆలోచిస్తూ ఆమె దగ్గరకు వెళ్లడానికి సిద్ధం అయ్యాడు...ఇంతలో అక్కడ పనులు వేరే అతనికి అప్పగించి శకుంతల గూడెం కు వెళ్ళడానికి సిద్ధం అయ్యింది....ఆమెను అనుసరించాడు...కొంత దూరం వెళ్ళిన తర్వాత

“జిజాబాయి!...”అని పిలిచాడు...

ఒక్కసారిగా తన సిబ్బంది తో వెళ్తున్న ఆమె ఆగి వెనక్కి చూసింది, ఆమె ఆగడం తో వేగంగా ఆమె దగ్గరకు పరిగెత్తుకుంటూ వెళ్ళాడు బుచ్చి....

“ఎవరు మీరు?....అసలు రోడ్డు వేయడానికి కారణం ఏమిటి...?..”అని అడిగాడు.....

చిన్నగా నవ్వి ఆమె మళ్ళీ ముందుకు కదిలింది....

“అడుగుతుంటే అలా పోతారు ఏమిటి?”అని అడిగాడు బుచ్చి...

కానీ ,ఆమె సమాధానం చెప్పకుండా వెళ్లిపోయింది.....ఆమె గూడెంలో వున్న ఆమె స్థానానికి

వెళ్ళింది....

కాసేపు ఆగి ,ఆమెను కలవడానికి వెళ్ళాడు బుచ్చి...."మిమ్మల్ని తప్పుగా అర్థం చేసుకున్నాను జీజాబాయి....మీరు చేస్తున్న మంచికి నా సాయం." అని ఇరవై వేలు రూపాయిలు ఆమె ముందు పెట్టాడు...

"ఇవి ధర్మబద్ధంగా సంపాదించినవా?..."అని వాటి వైపు చూసి అడిగింది శకుంతల......

ఒక్కసారిగా బుచ్చి ముఖంలో నెత్తురు గడ్డ కట్టిన విధంగా మారిపోయింది...ఏమి సమాధానం చెప్పాలో తెలియదు... మరో మాట మాట్లాడకుండా ఆ డబ్బులు తీసుకొని అక్కడ నుండి వెళ్లిపోయాడు....

" ఆమె అడిగిన ఒక మాటకు నా నోట మాట రాలేదు...ఇంత వరకు నేను ఆ విషయమే ఆలోచించ లేదు....ఐనా డబ్బుకి మంచి చెడు వుంటుందా?...బహుశా ఈమెకి పిచ్చేమో..."

అని తనలో అనుకుంటూ ముందుకు సాగుతున్నాడు.....ఇంతలో ఎప్పుడూ శకుంతల తో వుండే డాక్టరమ్మ...ఎదురుగా చెట్టు కింద ఏవో పేపర్లు చూస్తూ కూర్చొని వుండడం గమనించాడు....

"ఈమెను అడిగితే వివరాలు చెప్తుందేమో.."అని అనుకుంటూ ఆమె దగ్గరకు చేరుకున్నాడు....

"డాక్టర్ మేడం...."అని పిలిచాడు....

"ఏమైంది...ఏమైనా ఆరోగ్య సమస్య..."అని తన పని నుండి చూపు మరల్చి బుచ్చి వైపు చూస్తూ అడిగింది...

" ఆరోగ్య సమస్య!...నాకేం సమస్య లేదు....అసలు ఎవరు మీరు?...ఆమె ఎవరు ...ఎందుకు ఇక్కడ ఇదంతా చేస్తున్నారు?.."

"ఆమె గురించి చెప్పాలి అంటే ఎంత చెప్పినా తక్కువే... ఎందరో అభాగ్యులకు దారి చూపించిన దేవత... శకుంతల మేడం ఒకప్పుడు కలెక్టర్ గా పని చేశారు.. కానీ, తనకు యాక్సిడెంట్ జరిగింది... అది ఎవరో కావాలనే చేయించారని తర్వత తెలిసింది... మేడం కుటుంబం అభ్యర్ధన మేరకు, తన వలన తన కుటుంబానికి ఎటువంటి ఇబ్బందీ కలగకూడదని ఆమె ఉద్యోగం వదిలేశారు.. తనికి ఆర్ధికంగా ఎటువంటి ఇబ్బంది లేదు.. ఆమెకు ప్రజా సేవ అంటే ఇష్టం...ఇలా మారుమూలల్లో వున్న జనాలకు సహాయం చేయాలని నిర్ణయించుకున్నారు. ఆమెకు అండగా ఎంతో మంది నిలిచారు"ఆమె సమాధానం ఇచ్చింది.....

ఒక్కసారిగా బుచ్చి కళ్ళలో నీరు తిరిగాయి....మాటలు రావడం లేదు... "అంటే ఒకప్పుడు ఈ జిల్లాకు పని చేసిన కలెక్టర్ శకుంతలా మేడం ఆ!..."అని వణుకుతున్న స్వరం తో అడిగాడు...

"అవును ఆవిడే....నీకు ఆమె తెలుసా?..."

"తెలుసు...."అని ఒక్కసారి తన పాత జ్ఞాపకాల్లోకి వెళ్ళాడు..

"రేయ్ బుచ్చి, శకుంతలా అమ్మగారు చాలా మంచోలు రా. మనలాంటి వాళ్ల కష్టాలు తెలుసుకొని మేలు చేస్తుంటారు. ఆ అమ్మగారిని చూసి నువ్వు నేర్చుకోవాలి. మంచిగా చదువుకొని అందరికీ సహాయం చేయాలి. నీకు బడిలో చేర్పించడానికి కాస్త ఆలస్యంగా అవుతుంది రా. కానీ, నిన్ను తప్పకుండా బడిలో చేర్పిస్తాను."అని చిన్నప్పుడు తన తండ్రి చెప్పిన మాటలు జ్ఞప్తికి తెచ్చుకున్నాడు..

బుచ్చి తండ్రికి తన దగ్గర తోటమాలి గా చేర్చుకొని వాళ్ళకు జీవన ఉపాధి కల్పించింది శకుంతల....

రోజూ బుచ్చి తండ్రి ఆమె గురించి కొడుక్కి చెప్తుండే వాడు...అలా రెండు సంవత్సరాలు గడిచాయి... బుచ్చి తండ్రికి కూడా నెల బ్రతికేటందుకు జీతం సరిపోయేది. అయితే శకుంతల మేడం అక్కడ నుండి వేరే జిల్లాకు ట్రాన్స్ఫర్ ఐపోయిన తర్వాత బుచ్చి తండ్రి ఉద్యోగం పోయింది.... దిన దినము బ్రతకడం కష్టంగా మారింది... కానీ అక్కడే వూరిలో వ్యవసాయం చేసుకుంటూ కష్టమైన బ్రతకడం మొదలు పెట్టారు...

అయితే విధి వక్రించిన కారణంగా బుచ్చి తండ్రి పాము కాటుకు గురై మరణించాడు..... బుచ్చి ఒంటరి వాడు అయ్యాడు..... కానీ, ఆ గూడెం జనాలు బుచ్చిని చేరదీసి పెంచారు...అందుకే వాళ్ళ కోసం బుచ్చి ఎప్పుడూ పాటుపడుతుంటాడు.....అందుకే పెద్ద వ్యక్తులతో చేతులు కలిపి చేసేది అధర్మం ఐనా తన వూరికి మంచి చేయాలని నిర్ణయం తీసుకున్నాడు బుచ్చి.

"హెల్లో ఏమైంది!...ఏంటి ఆలోచిస్తున్నావు?.."అని ఒక్కసారిగా బుచ్చిని కదుపుతూ అంది డాక్టరమ్మ...

ఒక్కసారిగా ఆలోచనల నుండి బయటకు వచ్చాడు బుచ్చి..

"డాక్టరమ్మ!... మేడం అంటే నాకు చిన్నప్పటి నుండి ఇష్టం... కానీ, ఆమెను ఇప్పుడు గుర్తు పట్టలేక పోయాను...మంచి చేస్తున్న ఆమెను అనుమానించాను...మేడం గారి వలన ఈ వూరికి మంచి జరుగుతుంది....మంచిదే...కానీ ,ఈ ఊరే ఎందుకు మేడం ఎంపిక చేసుకున్నారు."

"దీని వెనుక ఒక వ్యక్తి ఆశయం వుంది...అతని కోరిక తీర్చడానికి మేడం ఇక్కడకు వచ్చారు."

"ఎవరా వ్యక్తి?.."

"ఈ గూడెం లో పుట్టి పట్నం వలస వచ్చిన రుద్రుడు....."

"రుద్రుడు....ఆ రుద్రుడా?...అతను మేడం కు ఎలా తెలుసు?...వాడు బాగానే వున్నడా?....ఇప్పుడు ఎక్కడ వున్నాడు...వాడు నా చిన్ననాటి మిత్రుడు."అని రుద్రుడు గురించి తెలిసిన బుచ్చి రుద్రుడిని గుర్తు తెచ్చుకుంటూ ఆశ్చర్యంతో అన్నాడు.

"రుద్రుడు ఇప్పుడు డిప్యూటీ కలెక్టర్, మేడం ఇచ్చిన స్ఫూర్తి తో ఆ స్థాయిలో వున్నాడు."

ఒక్కక్షణం ఆశ్చర్యపోయాడు,మళ్ళీ తేరుకొని,"చాలా సంతోషం...ఈ గూడెం వ్యక్తి అంత స్థాయికి వెళ్ళడం నాకు చాలా ఆనందంగా వుంది..."అని ఆనందం తో అన్నాడు.

"కానీ, రుద్రుడు ఇప్పుడు ఒక దోషి!."

"ఏమిటి మీరు అంటున్నది.."

"అవును, మంచి చేయడానికి ప్రయత్నించిన అతన్ని దోషిలా మార్చింది ఈ లోకం.ఈ లోకం తీరే అంత కదా" అని నిట్టూర్చింది---

"ఏమిటి మీరు అంటున్నది?."

"అవును...ఈ మధ్యనే రుద్రుడ్ని ఒక కేసులో ఇరికించారు... లంచం తీసుకున్నాడు అని దొంగ సాక్ష్యాలు చూపించి ఇరికించారు.... చూసావా, ఈ సమాజం ఎలాంటిదో, ఈ సమాజం కు మంచి చేసేవాళ్ళు వద్దు. కానీ మంచి కావాలని ప్రాకులాడుతుంటారు."సమాజం తీరుని ఎండ గడుతూ అంది.

"రుద్రుడు ఫోటో మీ దగ్గర వుందా?.."అని అడిగాడు బుచ్చి.

వెంటనే తన సెల్ లో ఫోటో తీసి చూపించింది.

ఆ ఫోటో చూసిన బుచ్చి కళ్ళలో ఒక్కసారిగా నీరు తిరిగాయి. ఒక్కసారిగా మోకాళ్ల మీద కూలబడ్డాడు .

"దేవుడా ఎంత పాపం చేశాను.... ఊరికి ఏదో చెయ్యాలని. దుష్టులతో చేతులు కలిపి,మా వాడినే ఇరికించానా!...."అని నెత్తి బాదుకుంటూ విలపించాడు... బుచ్చి బాధపడటం చూసి ఆశ్చర్యపోయింది డాక్టర్ అమ్మ!..

"ఏమైంది నీకు?...ఎందుకు ఇలా ఏడుస్తున్నావు?.."

"మేడం రుద్రుడు ను ఇరికించింది నేనే, నేనే ఆ పాపాత్ముడ్ని....."అని వణుకుతున్న స్వరం తో అన్నాడు.

"నువ్వా?....."అని ఆశ్చర్యపోతూ అంది...మళ్ళీ ఆశ్చర్యం లో నుండి తేరుకుంటూ.., "ఎంత పని చేసావు..అతను ఈ వూరికి సదుపాయాలు కల్పించాలని ఎంతో శ్రమపడ్డాడు... ఈ వూరికి మంచి చేసిన తర్వాతే ఈ వూరికి రావాలి అనుకున్నాడు. కొన్ని రోజులు వుండి వుంటే అన్ని పనులు పూర్తి అయ్యేవి.... రుద్రుడు ఇలా ఇరుక్కు పోవడం తో మేడం చాలా బాధపడ్డారు...అతని ఆశయాన్ని

తీర్చడానికి తాను బాధ్యత వహించారు.... నిజానికి మేడంకు ఆరోగ్యం బాగాలేదు. కానీ, ఇక్కడ మంచి జరగాలని ఆమె డేర్ చేసి ఇక్కడకు వచ్చారు.... మారుమూల ప్రాంతాల్లో వున్న ప్రజల్ని , పిల్లల్ని ఆదుకోవడమే ఆమెకు ఇప్పుడున్న లక్ష్యం...నేను కూడా ఆమె ఆదరించడం తో ఈ స్థాయిలో వున్నాను..."అని ఆమె చెప్పింది...

"నేను ఆమెను వెటకారంగా జీజాబాయి అని పిలిచాను...కానీ, నిజంగా ఆమె జీజాబాయి నే,,, మా లాంటి వాళ్ళ కోసం పుట్టిన దేవత.... ఆమె చెప్పిన కథ పరోక్షంగా నాలో ఆలోచన నింపింది.... కష్టపడి ఊరికి మంచి చేయాలని చూసిన రుద్రుడు లా నేను ఆలోచించ లేకపోయాను... మూర్ఖులతో చేతులు కలిపి ఎందరి పొట్ట కొట్టానో .....

ఇంత చేసిన ఆమెకు నేను చేయగలిగింది ఏమిటి....

అందుకే నేనే సాక్షిగా మారి మళ్ళీ మా రుద్రుడు ను వెనక్కి తెచ్చుకుంటాను."

అని అంటూ అక్కడ నుండి కన్నీళ్లు కారుతున్న తన కళ్ళను తుడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

బుచ్చి గురించి తెలిసి, అతనిలో కలిగిన పరివర్తన చూసి ఆశ్చర్యపోయింది డాక్టరమ్మ..

"మేడం ఎప్పుడూ ఒక మాట చెప్తుండే వారు,,,మన సంకల్పం గొప్పది అయితే తప్పకుండా ఆ ప్రకృతి మనకు సహాయం చేస్తుందని, అది నిజమే అని నాకు ఇప్పుడు అర్థం అయ్యింది.... లేకుంటే రుద్రుడు ను విడిపించుకోవడానికి ఎప్పటి నుండో అధర్మంగా నడుస్తున్న ఇతను సిద్ధ పడటం ఏమిటి.... ఇదంతా మేడం సంకల్ప బలం కారణంగా జరిగింది."

అని అనుకుంటూ ముందుకు అడుగువేసింది డాక్టరమ్మ.

"వ్యోమా!.. ఏం జరుగుతుంది?.."అని కంగారు పడుతూ అడిగాడు వ్యోమగామి చిరాగ్.
వ్యోమా నుండి ఎటువంటి సమాధానం లేకపోవడంతో, తనలో కంగారు ఎక్కువైంది. ఏమి చేయాలో తెలియని స్థితి..

చుట్టూ అంతా శూన్యంగా కనిపిస్తుంది. తన గోడు వినేవారు ఎవరూ లేరు. చిరాగ్ వున్న క్రూ మాడ్యూల్(వ్యోమగామి వుండడానికి అనువైన వాతావరణం కలిగిన సిస్టమ్) తన క్రమం తప్పి ఎటుపోతుందో తెలియని పరిస్థితి. కంట్రోల్ చేద్దాం అంటే మొత్తం మిషన్ ఫెయిల్ అయ్యింది. తనతో పాటు వున్న వ్యోమా అనే మ్యానెడ్ రోబోట్ కూడా ఎటువంటి ప్రతిస్పందనలు లేకుండా వుంది. ఒక్కసారిగా తనకు దుఃఖం కలిగింది..

భూమిపై ఉన్నప్పుడు తన కుటుంబ సభ్యులతో గడిపిన క్షణాలు అన్ని చివరి సారిగా గుర్తు చేసుకున్నాడు..

"మీ అందరినీ నేను మరలా చూడలేను."అని అనుకుంటూ బాధపడుతూ వున్నాడు.
మాడ్యూల్ ఆ గురుత్వాకర్షణ లేని శూన్యంలో తిరుగుతూ ఎటో పోతుంది... ఇంతలో చిరాగ్ కు అంతరిక్ష నౌక కొంత దూరంలో వుండడం కనిపించింది.. వాళ్లకు సంకేతాలు ఇవ్వాలని ప్రయత్నం చేశాడు కానీ వేగంగా కదులుతున్న అంతరిక్ష నౌక తన కనుచూపు లోనుండి తప్పించుకుంది. మళ్ళీ చిరాగ్ లో నిరాశ... ఆ శూన్యంలో ఏదో వెలుగులా కనిపించింది ఆశ్చర్యంతో చూస్తున్నాడు చిరాగ్.. తాను వున్న మాడ్యూల్ ఆ వెలుగు వైపుకు వెళ్తుంది..

"బహుశా ఇది అప్పుడు టెలిస్కోప్ ద్వారా గుర్తించిన అల్లీస్ స్టార్ కాదు కదా?" అని అనుకుంటుండగా.
ఇంతలో వున్నట్టు వుండి ఆ మాడ్యూల్ గమనం మారింది. ఏదో శక్తి బలంగా లాగుతునట్టుగా తన మాడ్యూల్ ఆ వెలుగు వైపుకు కాకుండా వేరే వైపుకు కదులుతుంది. ఇదంతా గమనించిన చిరాగ్ కంగారు పడ్డాడు. "ముందుకు వెళ్తున్న ఈ మాడ్యూల్ ఈ విధంగా వెళ్ళిపోతుంది అంటే ఏదో కృష్ణ బిలం శక్తి తనని లాగుతుందని

అనుకున్నాడు. ఈ క్షణమే నాకు చివరి క్షణం అనుకోని గట్టిగా కళ్ళు మూసుకున్నాడు.

కొంత సమయం తర్వాత చిరాగ్ కళ్లుతెరిచాడు. తనలో కంగారు కలిగింది.. ఇంకా తాను శూన్యంలో వున్నాడు. ఇంతవరకు తాను వున్న క్రూ మాడ్యూల్, పక్కనే వున్న రోబో ఏవి కూడా కనిపించడం లేదు.
"మా బామ్మ చెప్తుండేది.. స్వర్గం కూడా శూన్యం లా వుంటుంది అని.. బహుశా నేను మరణించి స్వర్గం కు వచ్చానా?.."అని అనుకుంటూ తన శరీరం తడిమి చూసుకున్నాడు. ఇంతకు ముందు వేసుకున్న స్పేస్ సూట్  అలానే వుంది. అన్నీ వున్నాయే అని సందిగ్ధంలో పడ్డాడు.

మళ్ళీ బామ్మ మాటలు గుర్తుకు వచ్చాయి..

"చనిపోయినప్పుడు ఏ దుస్తులతో వుంటమో ..స్వర్గంలో కూడా ఆ దుస్తులుతోనే వుంటామంట.."అని ఆమె మాటలు గుర్తుకు వచ్చాయి. ఒక్కసారిగా దుఃఖం పొంగుకు వచ్చింది. ఏడుస్తున్నాడు.

ఇంతలో ఒక్కసారిగా తాను వుండే చోటులో ఏవో మార్పులు చోటుచేసుకున్నాయి. రెప్పపాటులో తన ఎదురుగా ఒక క్యాబిన్ లాంటి ఆకారం ప్రత్యక్షం అయ్యింది. కంగారు పడుతూ చూశాడు.

ఒక్కసారిగా ఆ క్యాబిన్ డోర్ ఓపెన్ అయ్యింది. వేగంగా దాని లోపలికి వెళ్ళాడు.  ఆ క్యాబిన్ డోర్ మూసుకుంది. వేగంగా భ్రమిస్తూ ఒక్కసారిగా ఆ క్యాబిన్ ఆగి డోర్ తెరుచుకుంది.. దాని నుండి బయటకు వచ్చిన చిరాగ్ కు మళ్ళీ శూన్యమే దర్శనం ఇచ్చింది..  ఏదో తెలియని పళ్ళెం ఆకారం లో వుండే ఒక యంత్రం తన వైపుకు రావడం గమనించాడు. చూస్తున్నంతలో ఆ యంత్రం చిరాగ్ ముందుకు వచ్చి ఆగింది.

"హాయి చిరాగ్.. వెల్కమ్ టు అవర్ వరల్డ్.."అని ఆ యంత్రం నుండి వినిపించింది.

ఒక్కసారిగా ఆశ్చర్యపోయాడు..

"నా పేరు మీకెలా తెలుసు?.. పైగా నా భాషలో మీరు మాట్లాడుతున్నారు.. ఇంతకీ ఎవరు మీరు?."అని కంగారు పడుతూ అడిగాడు చిరాగ్.
"అదేంటి నన్ను గుర్తు పట్టలేదా. ఎప్పుడూ నా కోసం అన్వేషణ చేస్తూ వుంటావు కదా?."

ఆలోచనలో పడ్డాడు చిరాగ్..
"లేదు నేను ఎవరి గురించి అన్వేషణ చేయలేదు. ఇంతకీ ఎవరు మీరు?.."అని అడిగాడు చిరాగ్.

"నేనే చిరాగ్ నీ ఆలోచనల్లో ఎప్పుడూ మెదిలే నీ మిత్రుడిని. గ్రహాంతర వాసిని."అని ఆ యంత్రం నుండి వినిపించడం తో ఒక్కసారిగా కంగారు పడుతూ..

"ఏంటి నువ్వు ఏలియన్ వా?. ఆశ్చర్యం!. నా ముందుకు వచ్చావా?. పైగా నా భాషలో మాట్లాడుతున్నావు?.."అని అన్నాడు చిరాగ్.
"చూస్తుంటే నీకు, మీ భూమి పైన ఎటువంటి సమస్యలు లేనట్టు వున్నాయి."

"ఎవరు చెప్పారు నాకు సమస్యలు లేవని.. మా భూమి మీద ఎన్ని సమస్యలు ఉన్నాయో నీకు తెలుసా.. ఇప్పటికీ  ఆకలితో అలమటిస్తున్న ప్రజలు వున్నారు. సరిగ్గా మంచి నీరు దొరకని ప్రజలు వున్నారు. వాతావరణం అంతా కాలుష్యం అయిపోయి చాలా ఇబ్బందులు కలుగుతున్నాయి.ఇంకెన్నో సమస్యలు నీకేం తెలుసు మా బాధలు గురించి."అని కోపంతో అన్నాడు చిరాగ్.
"ఆల్ రైట్. మరి అలాంటప్పుడు నీ అమూల్యమైన సమయాన్ని ఆ సమస్యలు రూపుమాపడానికి ఉపయోగించ వచ్చు కదా.. మరి ఎందుకు నా కోసం అనవసరంగా వెతుకుతూ నీ సమయాన్ని వృధా చేసుకుంటున్నావు?."

ఒక్కసారిగా కంగుతిన్నాడు చిరాగ్..

"ఏమిటి నువ్వు అంటున్నది?.. నేనేమి చెయ్యాలో నువ్వు చెప్తే కానీ నాకు తెలియదా.. అయితే నా క్రూ మాడ్యూల్ డిస్ ఫంక్షన్ చేసి నీ వైపుకు నన్ను రప్పించు కున్నది నువ్వే అన్నమాట. ఆ విషయానికి వస్తే నువ్వే నా సమయాన్ని వృధా చేశావు."అని అసహనంగా అన్నాడు చిరాగ్.

ఒక్కసారిగా నవ్వు వినిపించింది...

ఆశ్చర్యంగా చూస్తూ వున్నాడు చిరాగ్..

"ఒక్కసారి ఆలోచించు. నేనా నీ మిషన్ ను ఫెయిల్ చేశాను. మిషన్ ప్రారంభం కు ముందు నువ్వే కదా దాన్ని చెక్ చేసుకోవాలి. ఈ మిషన్ కి హెడ్ గా అది నీ బాధ్యత కదా. అవి ఏవి చూసుకోకుండా నా గురించి ఆలోచిస్తూ అజాగ్రత్తగా వున్న కారణంగా నీ మిషన్ ఫెయిల్ అయి తన భ్రమణం నుండి తప్పిపోతూ ఏటో వెళ్ళిపోతున్న దాన్ని నేను నా వైపుకు వచ్చేలా చేశాను."

చిరాగ్ ఒక్కసారిగా ఆశ్చర్యపోయాడు.. ఏలియన్ చెప్పిన విషయానికి అంగీకరించాడు.

"నిజమే నా అజాగ్రత్త కారణంగా ఇలా జరిగింది."అని పశ్చాత్తాపంతో అన్నాడు.

"మరి మీరు వుంటున్నది బ్లాక్ హోల్ అవతలి వైపునా?."అని కుతూహలం తో అడిగాడు చిరాగ్.

"మళ్ళీ పప్పులో కాలేసావు.. నీ మాడ్యూల్ ను నా దగ్గరకు రప్పించుకోడానికి నేను వాడిన గురుత్వాకర్షణ సాంకేతికత అది. పైగా నువ్వు ఆ క్యాబిన్ లోకి ప్రవేశించడం కారణంగా ఎన్నో కాంతి సంవత్సరాలు ప్రయాణించి ఇక్కడకు చేరుకున్నావు."

ఆశ్చర్యపోయాడు!..

"మరి నా భాష నువ్వు ఎలా మాట్లాడుతున్నావు?."

"నీ భాషే కాదు, భూమి మీద వున్న అన్ని భాషలు నాకు వచ్చు. అలాగే మీ అణువణువు కూడా మాకు తెలును."

ఒక్కసారిగా ఆశ్చర్యపోయాడు..

"సరే నాకొక సహాయం చేయగలవా?.."అని సందిగ్ధ పడుతూ అడిగాడు.
"మళ్ళీ భూమి మీదకు వెళ్ళాలనే కదా నీ కోరిక.. తప్పకుండా నెరవేరుతుంది మిత్రమా...అయితే చిన్న షరతు?."అని వినిపించింది.
"ఏమిటది?.."అని ఆశ్చర్యంతో అడిగాడు.
"ఇక్కడ జరిగిన విషయాలు నువ్వు ఎవరితోనూ చెప్పకూడదు. ఒకవేళ చెప్పావనుకో .... జరిగే పరిణామం నీ ఆలోచనకే వదిలేస్తున్నాను."
"లేదు ,లేదు నేను ఎవరితో చెప్పను."అని హామీ ఇస్తూ అన్నాడు.
"సరే నా గుర్తుగా నీకొక బహుమతి ఇస్తున్నాను."అని ఏలియన్ అనడం తో..
ఒక రాగి రేకు ఎగురుకుంటూ వచ్చి చిరాగ్ ముందు కదులుతూ వుంది.
"తీసుకో అది నీకోసమే."అని ఆ ఏలియన్ అనడంతో ,దాన్ని అందుకున్నాడు చిరాగ్..

"ఏంటి ఇది రాగి రేకు కదా... దీనితో నేనేమిటి చేసుకోవాలి."అని అసహనంగా అన్నాడు.

"మరి ఈ శూన్యంలో ఇవ్వడానికి ఇది మాత్రమే నాకు దొరికింది. సరే నీ క్రూ మాడ్యుల్ సిద్ధంగా వుంది. నువ్వు ఇక నీ ప్రయాణం కొనసాగించవచ్చు."అని ఏలియన్ చెప్పడం తో,

ఆ క్రూ మాడ్యూల్ లోపలికి ప్రవేశించాడు చిరాగ్. మిషన్ అంతా పని చేస్తుంది.. వ్యోమా కూడా స్పందిస్తుంది .. చిరాగ్ సంతోషానికి అవధులు లేవు...

ఒక్కసారిగా నిద్రలో నుండి మేల్కొన్నాడు చిరాగ్. కంగారు పడ్డాడు.

"ఏమిటి ఎప్పుడూ లేని విధంగా ఇలాంటి కల వచ్చింది?..నేను ఏలియన్స్ గురించి పరిశోధన చేయడమే దీనికి కారణమా? లేక కొన్ని రోజుల్లో జరగబోయే అంతరిక్ష ప్రయాణం కోసం నేను జాగ్రత్త పడాలని హెచ్చరిక"అని అనుకుంటూ లేచి చూశాడు. అప్పటికి సమయం ఏడు గంటలు అవుతుంది.. వామ్మో చాలా సమయం అయ్యింది. మనకి పని వుంది కదా అని లేచి వెళ్ళబోయాడు ...ఒక్కసారి ఆగి తన ముందున్న టేబుల్ వైపు చూసాడు..
ఆశ్చర్యంతో ఆ టేబుల్ వైపుకు

కదిలాడు...

కలలో ఏలియన్ ఇచ్చిన రాగి రేకు ఆ టేబులే పై వుంది...

కంగారు పడుతున్నాడు.. "ఇది కలలో ఏలియన్ ఇచ్చిన రాగి రేకు కదా!. ఇక్కడికి ఎలా వచ్చింది?. ఎవరు ఇది ఇక్కడ పెట్టారు" అని చుట్టూ చూసాడు.

డోర్ లోపలి నుండి లాక్ చేసి వుంది...విండోస్ కూడా లాక్ చేసి వున్నాయి. ఏమిటి జరిగింది అన్నది తనకు అర్థం కావడం లేదు..
తన చేతిలో వున్న ఆ రాగి రేకును క్షుణ్ణంగా పరీక్షించి చూసాడు..
దాని మీద ఏదో సమాచారం వుండడం గమనించాడు..

ఎప్పుడో తన గురువు చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి.

"ఇది మన మిషన్ మూన్ పై నుండి తెచ్చిన శాంపిల్స్ లో దొరికిన ఒక వస్తువు. దీన్ని అధ్యయనం చేయగా నాకొక విషయం తెలిసింది.. ఇందులో ఏలియన్ పంపిన సమాచారం వుంది. కానీ ఆ సమాచారం ఏమిటో నేను కనిపెట్టలేక పోయాను. కానీ అక్కడకు కొన్ని రోజులకు వర్షాలు పడటం మానేశాయి ఎక్కువ గ్లోబల్ వార్మింగ్ కారణంగా విపత్కర పరిస్థితులు నెలకొన్నాయి. తర్వాత దాని మీద వున్న సమాచారం డీకోడ్ చేయగా నాకు ఈ విషయం తెలిసింది."అని గురువు మాటలు గుర్తుకు వచ్చాయి.

వెంటనే దాని మీద వున్న సమాచారం ఏమిటో తెలుసుకోవడానికి ప్రయత్నం చేశాడు. రెండు రోజులు తర్వాత విషయం అర్థం అయ్యింది. భూమి మీద నీటి కొరత ఏర్పడబోతుంది అని దాని మీద సమాచారం వుంది. అదంతా తెలుసుకొని ఆశ్చర్యపోయాడు.

కానీ ఒక విషయం మాత్రం తనకి అంతుచిక్కని దిగా అనిపిస్తుంది. ఆ రాగి నా రూం లోపలికి ఎలా వచ్చింది. ఆ కలకు ఆ రాగి రేకుకు ఏదైనా సంబంధం ఉందా అని ఆలోచిస్తూ వున్నాడు.

కొంత సమయానికి తన ప్రశ్నకు జవాబు లభించింది..

" టెలిపోర్టేషన్!...అవును ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశంకు క్షణాల్లో ప్రయాణించే సాంకేతికత వాడారు. అంటే తమ బాడీని పార్టికల్స్ లోకి మార్పు చేసి. వాళ్ళు అనుకున్న లక్ష్యానికి చేరుకోవడం అనే సాంకేతికత వాళ్ళు కలిగి వున్నారు అని నిర్ధారణకు వచ్చాడు. అంటే ఈ లెక్కన వాళ్ళు మనకంటే పటిష్ఠమైన సాంకేతికత కలిగి వున్నారు. అంటే ఆ ఏలియన్ టెలిపోర్టేషన్ సహాయంతో ఇక్కడకు వచ్చిందా ఈ సమాచారం ఇవ్వడం కోసం ."అని అనుకుంటూ నిజం తెలిసి ఆశ్చర్యపోయాడు.
"మరి ఆ కల నిజమా లేక అబద్ధమా?...
ఒకవేళ ఇది కూడా ఏదైనా సాంకేతికత వాడి ఆ కల సృష్టించారా!.."అని నిజం తెలియక సందిగ్ధంలో వున్నాడు.

★★★

కథ

# " ది టచ్ " .

కోటమర్తి రాధా హిమబిందు

ఉదయం ఎనిమిది గంటలదాకా కూతురు నిద్రలేవకపోవడంతో హడావుడిగా కూతురు దగ్గరికి వచ్చి తట్టిలేపింది సరోజిని.. ఇబ్బందిగా మూలిగి ఇంకోవైపు తిరిగి పడుకుందేగాని కళ్ళు తెరవలేదు మల్లి.. నాలుగుసార్లు గట్టిగా తట్టిలేపింది. అయినా లేవలేదు మల్లి..ఈసారి నాలుగు దెబ్బలు వేసి లెమ్మని కోప్పడుతూ అరిచి బలవంతంగా చేయిపట్టిలాగి మల్లిని కూర్చోబెట్టింది సరోజి ని.

"నేను ఈరోజు స్కూల్ కు వెళ్ళనమ్మా..నాకు చేతకావటంలేదు, పడుకుంటాను" అంటూ బెడ్ షీట్ కప్పుకుంది. "దానికి ఓపిక లేదేమో, ఒకరోజు స్కూలుకు పోకుంటే ఏమవుతుంది, రేపు ఎలాగూ ఆదివారం..రెండురోజులు హాయిగా ఉండనీ.. దానికి మా అమ్మ పేరు మల్లీశ్వరి పెట్టుకున్నాను. మల్లిని ఏమైనా అంటే మా అమ్మను అన్నట్లే.. మనకు పెళ్లయిన పదేళ్లకు బంగారుతల్లి ఇది పుట్టింది. ఎన్ని పూజలు ఎన్ని వ్రతాలు చేసాం..ఎన్ని దేవాలయాలు తిరిగాం. దాన్ని నువ్వు ఎంత ప్రేమగా చూసుకోవాలి?

ఎప్పుడూ ఏదో ఒకటి అంటుంటావు" "అయ్యా.. మహానుభావా.. మీ అమ్మ పేరు పెట్టుకున్న నీ కూతుర్ని నేను ఏమీ అనటం లేదు. చదువు విషయంలో మాత్రం నువ్వు పట్టించుకోవద్దని ఎప్పుడో చెప్పాను. నీ గారాబం చదువు దగ్గర ఉండొద్దన్నాను నువ్వే అంటావుగా, నా కూతురు కలెక్టర్ కావాలని.. ఇదిగో ఇట్లా మునగ తీసుకొని పడుకుంటే ఎట్లా అవుతది కలెక్టరు? రోజూ స్కూలుకు పోవాల్సిందే, శ్రద్ధగా చదువుకోవాల్సిందే, నాబిడ్డ నాకు ముద్దు కాదా ఏంటి? అది క్లాసు ఫస్ట్ వస్తుంది. ఇప్పుడు తొమ్మిదో తరగతి, పదోతరగతి చదువు అయిపోగానే అది సిటీలో కాలేజీలో చదువుతుంది. హెడ్మాస్టర్ గారు మనకు సహాయపడతానన్నారు కదా..అది బాగా చదువుకుంటేనే, సారు మనకు సహాయం చేసేది. మన జాగ్రత్త మనం పడదాం.. ఏమంటావు?" శీను చేయి పట్టుకుని ప్రేమగా అంది. "మల్లి మీద ప్రేమతో ఇట్లా ఏదో అంటానుగానీ, అది బాగా చదువుకోవాల్సిందే.. గొప్ప ఉద్యోగం చేయాల్సిందే.. దానికి తగ్గ మంచి మనసున్న భర్త దానికంటే గొప్ప ఉద్యోగస్తుడు రావాల్సిందే" నవ్వుతూ కూతురి తలమీద ప్రేమగా నిమిరి బయటకు వెళ్లిపోయాడు.. సరోజిని శీను ఇంటర్ పాసయ్యారు. వాళ్లది ప్రేమ వివాహం. పైగా బంధువులు కూడా అవుతారు. శీను కారు డ్రైవర్ గా పని చేస్తున్నాడు, సరోజిని ఇంటి దగ్గరే కొంతమంది పిల్లలకు ట్యూషన్ చెబుతుంది, కుట్టుమిషను కూడా కుడుతుంది. ఇద్దరి ఆదాయాలతో సంసారం చక్కగా సజావుగా సాగిపోతుంది. పాప పుట్టినప్పుడు శ్రీ మహాలక్ష్మి తన ఇంట్లో పుట్టింది అని మురిసిపోయారు.. ఇంకా ఆనందించడానికి అటు పెద్దవాళ్ళు ఇటు పెద్దవాళ్లు లేకపోవడంతో కూతురు ఎన్నెన్నో మురిపాలు కోల్పోయిందని బాధపడ్డారు. కూతుర్ని మాత్రం పద్ధతిగా పెంచుకుంటూ, అందరూ మెచ్చుకునేలా, గొప్ప స్థాయిలో నిలబెట్టాలని వాళ్లకున్న ఏకైక కోరిక, ఆశ, త్వరగా సంవత్సరాలు గడిచిపోతే బాగు అన్న ఆరాటం.

★★★★★

కూతురు నిద్రలేవగానే నుదురు మెడ చేత్తో తాకి చూసింది సరోజిని, జ్వరంలేదని నిర్ధారించుకుంది, కానీ మల్లి అదోలా ఉండటం, నడవలేక నడవటం గమనించింది. కూతుర్ని అడిగితే ఏమీలేదని ముఖం కడుక్కొని టిఫిన్ తిని పుస్తకాలు తెచ్చుకొని హోంవర్క్ చేయసాగింది. ఎంతోసేపు హోంవర్క్ చేయాలనిపించక మళ్లీ బెడ్ మీద పడుకుని బెడ్ షీట్ కప్పుకుంది. అప్పుడు సరోజిని భయపడి శీనుకు ఫోన్ చేసింది. ఈలోగా కూతుర్నిలేపి మరీ మరీ అడిగేసరికి తల్లిని బిగుతుగా కౌగిలించుకుని పెద్దగా ఏడుస్తూ చిగురుటాకులా వణికిపోయింది మల్లి. సరోజిని గుండె బేజారెత్తిపోయింది.. కూతురు చెంపలు నిమురుతూ గారాబం చేస్తూ విషయమంతా రాబట్టింది. ఆమెకు క్షణకాలం గుండె ఆగినట్లయింది. కూతుర్ని పడుకోబెట్టి దుస్తులు తొలగించి చూసి రాయిలా అయింది. ఆ తర్వాత దుస్తులు ఎప్పటిలా సవరించింది. శీను గదిలోకి వచ్చాడు. భార్యను కూతుర్ని మార్చి మార్చి చూశాడు. అతనికి ఏమీ అర్థం కాలేదు. సరోజిని భర్త చేయి పట్టుకొని వంట గదిలోకి తీసుకొచ్చి ఏడుస్తూ విషయం చెప్పింది. అతను ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. సరోజిని కూడా కూలబడి ఏం చేయాలో తోచక వెర్రిగా భర్తనే చూసింది. శీను కుమిలి కుమిలి ఏడ్చాడు. "ఎవడట వాడు? అదేం చెప్పింది? కఠినంగా అడిగాడు "స్కూల్లో పిఇటి సారట..చాలా రోజులుగా ఇబ్బంది పెడుతున్నాడట. నువ్వు చాలా తెలివికలదానివి అంటూ ఆటలు ఆడుతున్నప్పుడు మెచ్చుకున్నట్లు చేస్తూ వళ్ళు తడుముతూ పిచ్చి చేష్టలు చేసేవాడట. నిన్న ఆటలు ఆడిస్తూ మల్లి భుజాలమీద చేయి చుట్టి క్లాస్ రూమ్ లోకి తీసుకెళుతుంటే మల్లి ఫ్రెండ్ శోభ వెంట వెళ్లిందట. సారు శోభను కోప్పడి వెనక్కు వెళ్లిపోమని అరిచాడట. ఆ అమ్మాయి వెళ్ళిపోయింది. ఇక దీన్ని..." చెప్పలేక ఏడ్చింది సరోజిని. శీను ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లిపోయి వాస్తవంలోకి వచ్చాడు. 'ఇప్పుడేంచేయాలి?' అన్న ప్రశ్న అతని ముందు నిలిచింది.

ఈ విషయం బయటపెట్టి ఆ సారు అంతుతేల్చాలనే పౌరుషం ఒకవైపు మల్లిని చేయని నేరానికి సమాజంలో దోషిగా నిలబెట్టి భవిష్యత్తు లేకుండా చేయటమా? అనే తర్జనభర్జనలో ఎంతోసేపు ఏడుస్తూ వుండిపోయారు. చివరగా ఒక నిర్ణయానికి వచ్చి పిఇటి అంతు తేల్చాలనుకున్నారు.

★★★★★
★★★★★

ఇంటిప్రక్కన వున్న సౌభాగ్యంతో మల్లికి జ్వరం వచ్చిందని చెప్పి తాము వచ్చేదాకా చూడమని స్కూలుకు వెళ్లారు ఇద్దరు. హెడ్మాస్టర్ నారాయణతో విషయం అంతా చెప్పారు. నారాయణ నమ్మలేదు. ఇది నిజమంటూ

ఆవేశంతో ఖచ్చితంగా చెబుతుంటే వాళ్లకు ఏం చెప్పాలో తోచకుండా అయింది నారాయణకు. పిఇటి ప్రసాద్ ఈరోజు సెలవు పెట్టాడని, రేపు ఆదివారం, ఎల్లుండి రాగానే విషయం తేలుస్తానని ధైర్యం చెప్పాడు. ఇంకేం చేయాలో తోచక వెనక్కు వస్తూ ప్రసాద్ ఇంటికి వెళ్దామని బైక్ ను అటు తిప్పాడు. శీను. ఈలోగా నారాయణ ప్రసాద్ కు ఫోన్ చేసి మాట్లాడాడు. నారాయణ ద్వారా విషయం తెలవటంతో అప్పటికప్పుడు తన అక్క ఊరు వెళ్ళటానికి ప్రయాణమయ్యాడు. ప్రసాద్ ఇంటిముందు బైక్ ఆపి శీను సరోజిని పరుగున లోపలికి వెళ్ళారు. వాళ్లను చూసి దిగ్భ్రాంతి చెంది వణికిపోయాడు ప్రసాద్. చిన్న బ్యాగ్ తో ప్రసాద్ భార్య గదిలోనుండి హాల్లోకి వచ్చింది. వీళ్ళను చూసి అర్థంకానట్లు ముఖం పెట్టింది. వాళ్ళిద్దరూ వాళ్లను వాళ్లు పరిచయం చేసుకున్నారు. “అమ్మా.. మీకు ఎంతమంది పిల్లలు? ఈసారు పనిచేసే స్కూలోనే చదువుతున్నారా? కాదనుకుంటా.. మా లాంటి వాళ్ళకుగానీ, మీకు గవర్నమెంట్ స్కూల్లో మీ పిల్లల్ని చేర్చే ఖర్మ ఏంటి? “మీరు ఎవరు? ఏం అడుగుతున్నారు? ఎవరండీ వీళ్ళు?” భర్తను చూస్తూ బ్యాగ్ అందిస్తూ అడిగింది సరళ “మీరు చెప్తారా, నన్ను చెప్పమంటారా? అమ్మా.. వీడు నా కూతుర్ని నిన్న స్కూల్ లో అత్యాచారం చేశాడు. నా కూతురు తొమ్మిదో తరగతి చదువుతుంది. బొద్దుగా ముద్దుగా ఉంటుంది. దాని జీవితాన్ని సర్వనాశనం చేశాడు. ఇప్పుడు వీడిని అమ్మాయి తల్లిదండ్రులుగా మేము ఏం చేయాలి? మీరే మాకు న్యాయం చెప్పండి?” భర్త గురించి ఇలాంటి మాటలు వింటున్న సరళ శిలావిగ్రహంలా నిలబడిపోయింది. శీను తనలో వున్న ఆవేశం ఆరేదాకా అతన్ని పిచ్చి కొట్టుడు కొట్టాడు, తిట్టాడు. ఆ తర్వాత ఇద్దరూ ఇంటికి వచ్చారు. ఆరోజు గడిచింది.

SUMATHI TV Channel

మల్లి పడుతున్న బాధను చూడలేక వాళ్లు ఒక నిర్ణయానికి వచ్చారు. ఇక గుట్టుగా ఉంచటం వద్దనుకొని పోలీస్ స్టేషన్ కు వెళ్లి కంప్లైంట్ తీసుకొని, గవర్నమెంట్ హాస్పిటల్ కు వెళ్లారు. డాక్టర్ తో మల్లి గురించి చెప్పారు. డాక్టర్ టెస్ట్ చేస్తానన్నాడు. కొద్దిసేపటి తర్వాత మీ అమ్మాయి భయపడుతుంది, ఏమీ చెప్పట్లేదు, కోఆపరేట్ చేయట్లేదు అని చెప్పి వాళ్లను పంపించాడు. గవర్నమెంట్ డాక్టర్ నారాయణకు ఫ్రెండే కావడంతో అతనికి ముందే ఈ విషయం చెప్పాడు. రెండవరోజు ఉతక్కుండా దాచిన మల్లి బట్టలు తీసుకొని మళ్లీ వెళ్లారు. టెస్ట్ చేసి రిపోర్టు ఇవ్వటానికి రెండు రోజులు పడుతుంది అని చెప్పాడు. ఇక దాచి ప్రయోజనం లేదనుకొని చుట్టుపక్కల ఉన్న వాళ్లందరికీ పిఇటీ గురించి చెప్పారు. ఒక్కొక్కరు ఉగ్రనరసింహస్వామిలా అయ్యారు. అంతా కలిసికట్టుగా వెళ్లి హాస్పిటల్ ముందు కూర్చుని రిపోర్ట్ ఇవ్వాలని గొడవ చేశారు. డాక్టర్ రిపోర్టు ఇవ్వక తప్పలేదు. నారాయణ ప్రసాద్ ను కాపాడుతున్నాడని వాళ్లకు అర్థమై అంతా స్కూలుకు వెళ్లి అతన్ని కూడా బెదిరించారు. విషయం తెలిసిన చాలామంది పేరెంట్స్ శీనుకు సరోజినికి అండగా నిలిచారు.

★★★★
★

ప్రసాద్ ను పోక్సో మరియు ఎస్సి ఎస్టీ అట్రాసిటీ కేసుక్రింద అరెస్టు చేశారు. డబ్బు ఇస్తే లొంగుతారేమో అని చాలామంది ద్వారా, పొలిటికల్

గా కూడా ప్రయత్నాలు జరిగాయి. అవి ఏవీ ఫలించలేదు. ఆరోజు సరళ శీను ఇంటికొచ్చింది, కేసు వాపసు తీసుకోమని ఎంతోసేపు ఇద్దరినీ బ్రతిమాలింది. ఇద్దరి పాదాలు పట్టుకుని ఏడ్చి ప్రాధేయపడింది. కోరుకున్నంత డబ్బు ఇస్తానన్నది.. చివరికి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తే పెద్దగా నవ్వాడు శీను. "ఏమ్మా.. మమ్మల్ని బెదిరిస్తున్నారా? నిజానికి ఆ పని చేయాల్సిందే మేము. కానీ ఎప్పుడైతే ఇలా బయటకు వచ్చామో, పూర్తిగా తెగించాం. మీ బిడ్డను సిటీలో కాలేజీలో చదివించుకుంటూ హాస్టల్లో ఉంచారు. మరి అక్కడ కూడా మగ మృగాలు ఉంటాయి కదా.. నీ భర్తలా నీ బిడ్డను ఇలా చేస్తే మీకు ఎంత ఆవేశం వస్తుంది? వాడిని చంపాలనుకుంటారు, అవునా.. నేను చంపలేదు కదా.. అరెస్టు చేయించడం కూడా తప్పే అవుతుందా? ఇదేం న్యాయం? అదిగో నా బిడ్డ, మా బంగారు తల్లి.. మానవమృగం అయిన నీ భర్త చేసిన నిర్వాకానికి ఘోరంగా ఎలా అయిపోయిందో చూడండి.. దాన్ని బాగా చదివించి కలెక్టర్ చేయాలనుకున్నాం. దాని ముందు జీవితం అంతా బుగ్గిపాలు అయిపోయింది కదా.. ఇప్పటికే ఊరంతా ఈ విషయం తెలిసిపోయింది. మీ డబ్బుకు మేము ఆశపడి మా కేసు మేము వాపసు తీసుకుంటే, మా అమ్మాయి చెడ్డది అవుతుంది. మీభర్త మంచి అవుతాడు, ఇంత అన్యాయం చేసిన వాడిని ఎలా వదిలిపెడతాం? మీ అమ్మాయిని చూసొద్దామని మీరు వెళ్ళినప్పుడు ఈ ఘోరం జరిగిందని మాకు తెలిసింది. మీ కూతుర్ని కూడా మీతో తీసుకువస్తే భలేగా వుండేది..ఆ అమ్మాయే మీకు తగిన సమాధానం చెప్పేది. మీరు ఇలా మాట్లాడటానికి రావటం మాకు నచ్చట్లేదు. ఆ మృగానికి తగిన శిక్ష వేయాలి అని ఒక కూతుర్ని కన్నతల్లిగా మీరు బయటకు వచ్చి మాతో సహకరించండి, అంతేగానీ ఇలా రహస్యంగా ఇంటికి వచ్చి మమ్మల్ని కోరటం పెద్ద తప్పు.. ఆ వెధవ గురించి చాలా విషయాలు సేకరించాము. అవన్నీ ముందు ముందు మీకు తప్పక తెలుస్తాయి, ఇంకా కొన్ని విషయాలు మీకు తప్పకుండా చెప్పాలి.. ఆడపిల్లల్ని సొంతవాళ్లు, పరాయివాళ్ళు వయసుతో సంబంధం లేకుండా పెద్దలు చిన్నలు అనబడే మగాళ్ళు దగ్గరికి తీసుకుంటారు. అలా తీసుకున్నప్పుడు వాళ్లు ప్రవర్తించే తీరు, ఆ టచ్ లోని మంచి చెడులు పిల్లలు వెంటనే గమనిస్తారు. ధైర్యవంతులైన పిల్లలైతే ఇంట్లో చెప్పుకుంటారు. ఎక్కువమంది పిల్లలు ఇంట్లో చెప్పరు, పెద్దలంటే భయంతో గౌరవంతో మా అమ్మాయిలా మౌనంగా ఉండిపోతారు. అప్పుడు మగమృగాలు మీ భర్తలా ఇంకా పెట్రేగిపోతారు.. అసలు ఏంటండీ ఈ ఆడదానికి ఇలాంటి పరిస్తితి? మా కజిన్ మా ఇంట్లో చదువు కోసం వుండేవాడు. అతను చదువులో బాగా రాణించకుంటే మా నాన్న మా ఇంటికి తెచ్చి అతన్ని చదివించాడు. అతను మా చెల్లి స్నానం చేస్తుంటే తనకు అనుకూలంగా ఉండే పద్ధతిలో ప్రతిరోజు చూసేవాడట. అసభ్యంగా ప్రవర్తించేవాడట, అది బాగా భయపడి మాకు చెప్పలేదు, అలాగే తాతలు, తండ్రులు మగవాడినన్న అహంకారంతో తమ పిల్లల్ని తప్పించి వేరే పిల్లలతో అసభ్యంగా ఉండేవారు. ఇప్పుడు మరీ ఘోరంగా అయిపోయింది కదండీ.. మనం పేపర్లలో ఎన్నో చదివాం.. టీవీలో ఎన్నెన్నో చూసాం. కన్న తండ్రి సొంత అన్నలే తప్పు చేస్తున్నారు.. వీటి గురించి ఎవరిని అడగాలి? ఎవరు సమాధానం చెప్తారు? అందుకే నిలదీయాలి.. శిక్ష పడేలా చేయాలి. ఇప్పుడు అదే మేము చేస్తున్నది" కఠినంగా అంటున్న శీను మాటలకు అవమానం పొందుతూ బయటకు వెళ్ళిపోయింది సరళ.

★★★★★

ప్రసాద్ పై ఎఫ్ఐఆర్ వ్రాసి, కోర్టులో హాజరు పరిచారు. కోర్టు పద్నాలుగురోజులు రిమాండ్ విధించింది. అతన్ని రెండురోజులు పోలీసు కస్టడీకి పంపమని పోలీసులు పిటిషన్ వేశారు. దానికి కోర్టు అనుమతించింది. అతనిపై చాలా కంప్లైంట్స్ అప్పటికే రావటం, ఇంతకుముందు ప్రసాద్ పనిచేసిన స్కూళ్లలోని పిల్లల పేరెంట్స్ కూడా ధైర్యంగా కంప్లైంట్స్ ఇవ్వటంతో అతన్ని పోలీసులు తమదైన శైలిలో విచారిస్తే అన్నీ ఒప్పుకున్నాడు. కోర్టులో కేసు విచారణకు వచ్చింది. జిల్లా విద్యాధికారి, ప్రసాద్ ను సస్పెండ్ చేశాడు. నిజాన్ని దాచి నిందితుడికి సహకరించినందుకు హెడ్మాస్టర్ నారాయణకి వార్నింగ్

ఇచ్చారు. కోర్టు ప్రసాద్ కు
చట్టప్రకారం న్యాయపరమైన శిక్ష
విధించింది. అతన్ని ఉద్యోగం నుండి
తొలగించారు. ప్రసాద్ భార్య సరళ
భర్తకు విడాకులు ఇచ్చేందుకు అప్లై
చేసి పుట్టింటికి బయలుదేరింది.

★★★★★
★★★★★

కథ

# "మారిన వైఖరి"

సి.యస్.జి. కృష్ణమాచార్యులు

కుండపోతగా వాన పడుతోంది. వాన తగ్గు ముఖం పట్టగానే బయలుదేరుదామని మురుగన్ అతని స్నేహితుడు యెదురుచూస్తున్నారు. మాటల మధ్యలో మురుగన్, స్నేహితుడికి తను యెదుర్కొంటున్న యింటి సమస్య గురించి చెప్పాడు.

"ప్రస్తుతం నేనుంటున్న విక్టోరియా అపార్టుమెంటు ఖాళీ చెయ్యాల్సి రావచ్చు. మళ్ళీ ఆ ప్రాంతంలో అలాంటి అనువైన యిల్లు దొరకాలంటే, కష్టమే."

"" ఏం? ఎందుకు ఖాళీ చేయాలంట?"

"బ్రహ్మచారులకు యివ్వకూడదన్నది వాళ్ళ పాలసీ అట. మా ఓనర్, ఇది వుద్యోగస్తులకు వర్తించదని భావించి, నాకు అద్దెకిచ్చాడు. మిగిలిన వాళ్ళు ఇది రూలు అతిక్రమణ అని వాదిస్తున్నారు."

"అయితే___ నీ ముందు రెండు ఆప్షన్స్ వున్నాయి . మొదటిది. తాత్కాలికం.

అవకాశం వచ్చినప్పుడు వారికి వుపయోగపడే పని చేసి వారి వైఖరి మార్చడం, రెండోది, శాశ్వత పరిష్కారం, వెంటనే పెళ్ళి చేసుకోవడం."

" పెళ్ళి ఇప్పుడొద్దు గాని, మొదటిదే ప్రయత్నించి చూస్తాను "

" ఇంతకీ ఆ అపార్టుమెంట్సులో పెళ్ళికాని అమ్మాయిలున్నారా?"

" వున్నారు. అందుకేననుకుంటా ఈ బ్రహ్మాచారి వ్యతిరేకత."

" పూర్ ఫెలోస్! అద్దెకుండే బ్రహ్మాచారులు, అక్కడి అమ్మాయిలనే చేసుకోవాలని రూల్ పెట్టి వుంటే, ఉభయతారకంగా వుండేది."

" ఏం ఐడియారా బాబు? నా కొంప ముంచే నీ ఆలోచన వారికి రాకముందే, నేను ఖాళీ చేయడం మేలు" అన్నాడు అతని వీపు చరుస్తూ.

" ఓకే! కాలగమనంలో ఎంతటి కఠిన వైఖరైనా మారిపోతుంది. అలా మారాలి కూడా! సరైన అవకాశం కోసం వేచి వుండు" అని అతని స్నేహితుడు సలహా యిచ్చాడు.

ఇంతలో వాన తగ్గు ముఖం పట్టింది. అది గమనించిన మురుగన్ స్నేహితుడికి" బై" చెప్పి తన క్వాలిస్ వ్యానులో యింటికి బయలుదేరాడు.

@@@

ఏకధాటిగా కురిసిన వానవల్ల లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. ప్రధాన రహదారి నుంచి విక్టోరియా అపార్టుమెంటుకు వెళ్ళే రోడ్డు పైన రెండు వందల అడుగుల పొడవైన కాలువ యేర్పడింది. కాలువ దాటుకుంటూ వెళ్ళిన కొందరు, నీరు మోకాలి దాకా వుందని చెప్పడంతో ఆ అపార్టుమెంటుకు వెళ్ళాల్సిన నలుగురు మహిళలు, ముందుకు సాగడానికి సంకోచిస్తూ అక్కడే నిలిచిపోయారు. నడిచి వెడితే తడిసిపోవడం ఖాయం. తడిసిన చీరలతో, మరింత దూరం నడిచి అపార్టుమెంటు చేరుకోవడం, యిబ్బంది కరంగా వుంటుంది. ఈ సందుకు సమాంతరంగా వేరొక సందు కూడా లేదు. ఇప్పటిలో నీటి మట్టం తగ్గే అవకాశం లేదు. పల్లంలో వున్న మట్టిరోడ్డుని కాస్త యెత్తు పెంచి తారు రోడ్డు వేసి, డ్రైనేజ్ వ్యవస్థని యేర్పాటు వుంటే ఈ సమస్య వచ్చేది కాదు. ఈ విషయాలను చర్చిస్తూ, అపార్టుమెట్ కమిటీని, ప్రభుత్వాన్ని, వారు నిందిస్తున్న సమయంలో, మహదేవన్ స్కూటీ మీద వచ్చాడు. మహదేవన్ అపార్టుమెంటు పాలక సభ్యుడు. ఆయన కనబడగానే, మహిళలు చర్చని ఆపి, ఆయనను చుట్టుముట్టారు.

ఏడాది నుండి అడుగుతున్నాఇంతవరకు రోడ్డు వేయించలేక పోయారని ఆయనను నిందిస్తూ, తలో మాట అన్నారు మహదేవన్ వాళ్ళకు నచ్చచెప్పేందుకు విఫల ప్రయత్నం చేసాడు. మా తప్పు లేదు, తప్పంతా అవినీతి, అశ్రద్ధ పెరిగిపోయిన ప్రభుత్వ యంత్రాంగానిదే నని నచ్చచెప్ప ప్రయత్నం చేసాడు. కానీ వారు అతని మాటలు నమ్మడానికి సిద్ధంగాలేరు.

ఆపద రాక ముందు మనుషులు, వాగ్దానాలకు ముగ్ధులు కావచ్చు. కానీ ఆపద వేళ అవి గడ్డిపోచ విలువ చేయవు. అప్పుడు కావల్సినది ఆపన్న హస్తం. సమస్యకు ఒక పరిష్కారం. అది చూపిన వాడు దేవుడవుతాడు. సముద్ర మథన వేళ జరిగింది అదే. మందర పర్వతాన్ని మోసిన విష్ణువు, హాలాహలాన్ని మింగిన శివుడు దేవుళ్ళయ్యారు.

" ఎన్నాళ్ళు మిమ్మల్ని నమ్ముకుని యెదురు చూస్తాం. మీకు చేతగాకపోతే, రాజీనామాలు చెయ్యండి. అంతేగాని నాటకాలాడుతూ మమ్మల్ని మభ్యపెట్టకండి" అని ఒకావిడ పరుషంగా ఆయన ముఖం మీద అనేసింది.

మహదేవన్ బదులు చెప్పలేక, చెప్పినా ప్రయోజనముండదని భావించి, మౌనం వహించాడు.

ఆ సమయంలో, మురుగన్, తన వ్యానులో అక్కడికి వచ్చాడు. ఒక గుంపుగా నిలచి వున్న వారిని, కాలవలాంటి రోడ్డును చూడగానే అతనికి వారి సమస్య అర్ధమైంది. అతడు వ్యాను నాపి, వారి దగ్గరకు వచ్చాడు. థాంక్ గాడ్ ! వీరి మనసు మార్చడానికిదొక అవకాశం అని లోలోపల సంతోషిస్తూ, వారితో యిలా

అన్నాడు.

" రండమ్మా! మీరు వ్యానులో కూర్చోండి. అంకుల్ మీరు కూడా రండి. స్కూటీ ఆ ప్రక్కన వుంచి, తాళం వెయ్యండి. నేను మిమ్మల్ని దించి, స్కూటీ తీసుకుని వస్తాను" అన్నాడు.

అతని మాటలకు, వారు తేలిక పడిన హృదయాలతో, వ్యానులో సర్దుకుని కూర్చున్నారు. నీళ్ళల్లో, గతుకుల రోడ్డు పైన పయనించి వ్యాను కొద్ది సేపటిలో అపార్టుమెంటును చేరుకుంది.

వ్యాను దిగే సమయానికి ఆ మహిళల్లో మాతృత్వం మేల్కొంది.

మంచి మాట, మర్యాద వున్న ఈ కుర్రాడి విషయంలో అనవసర రాద్ధాంతం చేస్తున్నామేమో నన్న భావం వారిలోయేర్పడింది. వారు ఆప్యాయంగా అతనికి ధన్యవాదాలు చెప్పి వెళ్ళిపోయారు.

స్కూటీ తీసుకు వస్తానని, మురుగన్ కాలి నడకన వెడుతుంటే చూస్తూ నిలబడ్డ మహదేవన్, అపరాధ భావంతో యిలా అనుకున్నాడు.

"తప్పుచేస్తే కదా ఫిర్యాదులు, శిక్షలు. ఇంతవరకు యే తప్పూ చేయని వాడిని యెందుకు, శిక్షించాలనుకున్నాము? బ్రహ్మచారి అంటే వందకోతులని, భయం. కానీ కోతుల్లోనే కదా, ఆంజనేయుడున్నది. అతడే కదా కష్టంలో రామునికి తోడున్నది! తన దోవన తాను పోకుండా సహాయం చేసిన మురుగన్ ని దూరం చేసుకోకూడదు. ఇదే మాట మిగిలిన వారికి చెప్పాలి.".

పది నిమిషాల తర్వాత, మోకాలు వరకు తడిసిన పేంటుతో మురుగన్ స్కూటీ తీసుకుని వచ్చాడు. మహదేవన్ అతనికి ధన్యవాదాలు తెలిపి వెళ్ళిపోయాడు. జరిగిందంతా ఒక సారి సమీక్షించుకుని, ఈ నా ప్రయత్నం యెంతవరకు లాభిస్తుందోనని ఆలోచిస్తూ, మురుగన్ తన అపార్టుమెంటుకు వెళ్ళిపోయాడు.

@@@

నాలుగు రోజుల తర్వాత మురుగన్ కి మహదేవన్ నుంచి టీ కి రమ్మని ఆహ్వానం వచ్చింది. మహదేవన్ ఎటువంటి ప్రస్తావన తెస్తాడోనన్న ఆందోళనతో, మురుగన్ ఆయనను కలిసాడు. మహదేవన్, మురుగన్ ని సాదరంగా ఆహ్వానించాడు. తన భార్య నిర్మలని , కూతురు మీనాని పరిచయం చేసాడు. అందరూ కూర్చుని స్నేహపూర్వక వాతావరణంలో, కబుర్లాడుకుంటూ సమోసా, టీ తీసుకున్నారు.

ఆ తర్వాత నిర్మల, మీనా లోనికి వెళ్ళిపోయారు.

వారు వెళ్ళిన తర్వాత, మహదేవన్, మురుగన్ తో యిలా అన్నాడు.

" మొన్న నీవు చేసిన సహాయం వల్ల నీ విషయంలో ఇప్పుడు కొందరి వైఖరి మారింది. కానీ మాకిక్కడ అంబరసన్ అని ఒక లాయరున్నాడు. వాడు ఈ అపార్టుమెంటులో వున్న సమస్య లేవీ పరిష్కారం కాకూడదన్నట్లు వ్యవహరిస్తాడు. డ్రైనేజ్ సమస్య, పార్కింగు సమస్య, బిల్డరు మాకు చేయాల్సిన పనులు అన్నిట్లో వేలు పెడతాడు. ఎక్కడా తెగనివ్వడు. బయట రోడ్డు విషయమే చూడు. మేము ప్రతిపాదనలు ప్రభుత్వ ఆమోదం పొందేదాక కష్ట పడ్డాం. ఇప్పుడు దానికి ఆర్థిక శాంక్షన్ కావాలంటే ముఖ్యమంత్రి అనుమతి కావాలి. మేము ప్రయత్నిస్తే, డబ్బు లేదు, చాలా పనులు నిలిచిపోయాయి. ఆయన అనుమతి దొరకడం కష్టమని చెప్పారు. అదెంత పని , నేను ఆయన అనుమతి తెస్తా, నేను అధికార పక్షం నాయకుడిని, ముఖ్య మంత్రికి నేను క్లోజ్ అని ప్రగల్భాలు పలకడమే గాని అతను చేసి చూపించింది సున్నా. అయినా వాడిని నమ్మే మూర్ఖులు కొంతమంది వున్నారు. వాడే నీకు సమస్య. ఒక సారి అంబరసన్ ని కలుస్తావా?"

"అలాగే", అని మురుగన్ జవాబు చెప్పబోయేలోపు, మీనా వారి మధ్యకు వచ్చి యిలా అంది,

" ఇది అన్యాయం నాన్నా! ఆయనేదో తన మానాన తాను బ్రతుకుతుంటే, మీకు మీరే, ఆయనేదో తప్పు చేస్తాడని వూహించుకుంటూ, ఆయనకు

సమస్యలు కొనితెస్తున్నారు. పోయి పోయి అంబరసన్ ని కలవడమేమిటి? అంత కన్నా ఖాళీ చెయ్యడం మేలు."

" అది కాదు తల్లీ, మూర్ఖుడు రాజు కన్నా బలవంతుడు"

" కావచ్చు. మీ మగవాళ్ళుగొప్పగా చెప్తారు కదా, నా వుద్యోగమే నా మొదటి భార్య అని. ఆ లెక్కన ఈయన మొదటి పెళ్ళానికి మొగుడే గదా! అవుననుకో, కానీ ఇక్కడ, అలా కాదు, అని నసగకండి. తల్లి దండ్రులకు ప్రదక్షిణం చెస్తే భూప్రదక్షిణం చేసినట్లే అని మీరు ధర్మం చెప్తారు కదా.అలాగే ఇదీను. మీ పెద్దరికం మీరు నిలబెట్టుకోండి. ఎవరేమన్నా, ఆయన వెళ్ళాల్సిన అవసరం లేదు."

" అది కాదమ్మా"

" ఏది కాదు. అసలు మీ పెద్దాళ్ళకు మా ఆడ పిల్లలంటేనే అనుమానం. వ్యాపార ప్రకటనలలో చూపించినట్లు, అబ్బాయి పెర్ఫ్యూం వేసుకుంటేను, కట్ డ్రాయరుతో నిలుచుంటేను, మందలు మందలుగా వచ్చి పడిపోతామా? కాలేజిలో, ఆఫీసులో బ్రహ్మచారులున్నట్లే, ఇక్కడ వుండనీయండి. ఇది సమస్యగా మీరు చర్చిస్తే, నేను మిగతా ఆడపిల్లలతో కలిసి మీ మీద పరువు నష్టం దావా వేస్తా. అంబరసన్ ని కోర్టు చుట్టూ తిప్పుతా."

మురుగన్ ఆమె వాదనకు ఆశ్చర్య పోయాడు. ఇంతవరకు అందరిలా ఇది పురుష సమస్యగానే అతను భావించాడు. ఇందులో వున్న మహిళా కోణం అతనికి మీనా వల్ల తెలిసొచ్చింది. మహిళలకు పురుషుని ఆధిపత్యం కన్న వారి అజ్ఞానమే పెద్ద సమస్య అని అతనికి బోధపడింది.

" అలా కాదురా! గాంధి నగర్, స్నేహా అపార్టుమెంటులో గొడవైంది. బ్రహ్మచారి కుర్రాళ్ళు, కాల్చిన సిగరెట్లు ముక్కలు, పై నుంచి క్రిందకు విసిరేయడం, త్రాగిన మందు బాటిళ్ళు పార్కింగ్ స్థలంలో వదిలేయడం, ఆడపిల్లలను తీసుకు రావడం లాంటివి చేసారు. దాంతో పోలీసుల సాయంతో వారిని గెంటేయాల్సి వచ్చింది".

" అది సరే కానీ, అలా అందరూ చెయ్యరు కదా! మీరేగదా! చేతి వేళ్ళన్నీ ఒకేలా వుండవంటారు. ఈయన గౌరవంగా వుద్యోగం చేసుకుంటున్నాడు. అలాంటి పనులెందుకు చేస్తాడు? ఆయనకి పని చేసే, శక్తి వుంది, సహాయం చేసే మనసుంది. పైగా ఒక పెద్ద కారుంది. మీ అసోసియేషన్ పనులకు సహాయం చెయ్యమని కండిషన్ పెట్టండి. పండుగలు చేసేటప్పుడు మీరు హైరానా పడకుండా అతని సేవలు వుపయోగించుకోండి".

కూతురిని సమాధాన పర్చలేక మహదేవన్ మౌనం వహించాడు

మురుగన్ లేచి నిలబడి " మీ వాదన నూటికి నూరు శాతం కరక్టు. మీకు నా అభినందనలు, హృదయపూర్వక ధన్యవాదాలు" అని మీనా తో అన్నాడు

"థాంక్స్" అని మీనా లోనికి వెళ్ళిపోయింది.

నిర్వికారంగా కూర్చున్న మహదేవన్ తో మురుగన్ యిలా అన్నాడు.

" మీరు నాకు రోడ్డు సమస్య తెలియచేయడం మేలైంది. ముఖ్యమంత్రి కొడుకు నా స్నేహితుడు. ఇప్పుడే మాట్లాడుతాను."

మహదేవన్ నిశ్చేష్టుడై చూస్తూండగా, మురుగన్ తన స్నేహితునితో ఒక అయిదు నిమిషాలు మాట్లాడాడు. రోడ్డు సమస్య గురించి చెప్పి నీ సహాయం కావాలని అడిగాడు. "నీకెందుకు, నేను రెండు రోజుల్లో చేయిస్తా" అని అతని స్నేహితుడు అనడం విన్న మహదేవన్ ఇది కలా, నిజమా అన్న అయోమయంలో వుండిపోయాడు.

@@@

రెండు వారాల తర్వాత రోడ్డు వేయడం ప్రారంభమైంది. తమ దృష్టిలో సమస్యగా వున్న మురుగన్, తమ సమస్యను తీర్చిన నాయకుడు కావడంతో అపార్టుమెంటు వాసులు అతని పట్ల తమ వైఖరిని మార్చుకున్నారు. అతడిని తమ ఆప్తబంధువుగా ప్రేమించసాగారు. అయితే ఇంతవరకు మురుగన్ పట్ల, శూన్య వైఖరితో వున్నఅంబరసన్, తన మనసు మార్చుకుని, శత్రువైఖరి నవలబించాడు.

తన సమస్య పరిష్కారమైందన్న ఆనందంలో వున్న మురుగన్ దగ్గరకి, ఒక రోజు మీనా వచ్చి, ఒక బాంబు పేల్చింది.

"అపార్టుమెంటు హీరోని, నాకేం అనుకుంటున్నావా? త్వరలో నీ సమస్య మొదటికొస్తుంది. ఈ కాంప్లెక్సులో పెళ్ళి కాని ఆడపిల్లలు ఆరుగురున్నారు. వాళ్ళ తల్లితండ్రులు, ముందుగా, నీ దగ్గరకొచ్చి త్వరలో పెళ్ళి చేసుకో, అంటారు. నువ్వు ఊ అనేలోగా ఒకరి తర్వాత ఒకరు వచ్చి, మా అమ్మాయిని, అంటే మా అమ్మాయిని అని, నీ వెంట బడతారు. నువ్వు కాదంటే, అంతా కలిసి నీ సామాను బయట పడేస్తారు"

ఆమె మాటలకు, మురుగన్ తల తిరిగిపోయింది.

లోలకం ముల్లులా, ఈ మనుషుల వైఖరి, వ్యతిరేకతనుంచి అనుకూలతకి, అనుకూలత నుంచి, వ్యతిరేకతకి మారేదయితే, దేవుడా! యిల్లు ఖాళీ చేయడం మేలు. విధి విలాసం కాకపోతే, రోడ్డు వేయించింది, నా సామాను లారీ, సుఖ ప్రయాణం కోస మన్నట్లు వుందని అతడు వాపోయాడు.

@@@

# అక్షరమంటే గ్రంథాలయం

తోడుండాల్సిన వాళ్ళు
వెన్ను తట్టి నిలవాల్సిన వాళ్ళు
ఒక్కొక్కరే కనుమరుగవుతుంటే
బంధాల్నీ బంధుత్వాల్నీ పోగొట్టుకుని
కాలం నిన్ను ఒంటరిని చేసినపుడు

దిక్కుతోచని స్థితిలో
అంతా దిగులు కమ్మేసిన వేళ
ఒక జ్ఞానజ్యోతి గ్రంథాలయమై
నిన్ను ఆహ్వానిస్తుంది
మనసుకు సాంత్వన చేకూరుస్తుంది
ఓటమి నిన్ను కృంగదీసినప్పుడు
బతుకుతెరువులో ఓడిపోయి
నిరాశ నిన్ను ఆవహించినపుడు
జీవితానికి వెలుగు బాటను
పరిచేదే ఈ అక్షరాలయం
సమాజం తప్పుదోవ పట్టి
అన్యాయం అక్రమంగా
రాజ్యమేలుతుంటే
నిస్సహాయత నిర్లిప్తంగా
వెంటాడుతుంటే జ్వలించే మనసు
అక్షరాన్ని ఆయుధంగా చేసుకుని
నీకొక వెలుగుబాట చూపిస్తుంది
మాటలు తూటాలై
విజృంభించే వేళ
నీకేమీ చేతకాదంటూ
సమాజం హేళన చేసినపుడు
అక్షరం జ్ఞానదీపమై నీడలా
నిన్ను అక్కున చేర్చుకుంటుంది
నీ చుట్టూ ఎంతమందున్నా
కుట్రలు కుతంత్రాలతో నిండిన
మనుషులు మధ్య
కల్మషాన్ని నింపుకున్న
సమూహానికి దూరంగా
గ్రంథాలయం నిన్ను బంధవిముక్తం
చేసి
ప్రగతిబాటలో నడిపిస్తుంది
మేధస్సుతో వికసించి
విజ్ఞానాన్ని పంచుతుంది
వేల భావాల్ని చుట్టూ
ప్రసరింప చేస్తుంది
నీలో జ్ఞానబీజాల్ని నాటి
నువ్వేంటో అర్థమయ్యేలా
నీకు హితబోధ చేస్తుంది
అహం అంధకారంగా
అలుముకున్న వేళ
కారుచీకట్లను తొలగించి
నిన్నో చైతన్యవంతునిగా
మలుస్తుంది
ఆధ్యాత్మిక ఆలోచనలతో రేకెత్తించి
వ్యవస్థ గమన తీరుని నేర్పిస్తుంది
అక్షరం
ఒక అనంత సామూహిక శక్తి
మస్తిష్కం పొరల్లో
తెరిచిన ప్రతిపేజీ
వేల భావ ప్రకంపనలను
సృష్టిస్తుంది
చూపుల్తో నడిచే ఈ గ్రంథాలయాలే
రేపటి భావితరాలకు పునాదిరాళ్ళు
విజ్ఞాన భాండాగారానికి
ప్రతిరూపాలు
పుస్తకాలతో సహవాసమంటే
మనోనేత్రానికి దారిదీపం
పాఠకులకు ఓ జ్ఞానాలయం
ఈ గ్రంథాలయం

★★★ఎన్ .లహరి

కథ

# విభిన్న వ్యక్తిత్వాలు

అవ్వారు శ్రీధర్ బాబు

గొవర్ధన్ :-

'ఎదురింట్లో ఉండే శ్రీహరి చాలా తెలివి తక్కువ వాడబ్బా.ఒట్టి అమాయకుడిలా ఉన్నాడే.... డ్యూటీకి పోయి ఇంటికి వస్తాడా.... ఇంట్లో కూర్చుని ఏవేవో పుస్తకాలు చదువుతూ ఉంటాడు.

అవేందో కథలో...కవితలో రాస్తుంటాడు. కూటికా... గుడ్డకా.... దేనికి పనికిరావు. టైమంతా వేస్ట్ చేస్తాడు. అదేదో సంఘానికి అధ్యక్షుడట. ఏవో మీటింగులకీ.. ఏవో సాహిత్య సభలకి పోతుంటాడు. దండగ మారి పనులు. అక్కడికి పోయేది ఏవో చెక్కలు తెచ్చి ఇల్లంతా పెట్టుకునేది. కానీ నాలా కాస్ట్లీ ఫ్లవర్ వాజ్ లాంటివి కొంటాడా....! ఆ చెక్కల పేరు... అదేందో చెప్పాడే...ఆ... జ్ఞాపికలట.. షోకేస్ నిండా అవి పెట్టుకొని ఉంటాడు. ఎవరెవరి చేతులమీదో షాలువాలు కప్పిన ఫోటోలు గోడల నిండా వేలాడతీసి ఉంటాడు. కానీ నాలాగ రూఫ్ కి షాండిలియర్ వేళాడదీయగలడా..... అదీకాక డబ్బులు ఖర్చు చేసల్లా పుస్తకాలు వేసుకుంటాడు. వాటిని ఎవరు కొనరు. ఏంటో పిచ్చి మాలోకం. వాడి భార్య ఎట్లా భరిస్తుందో వాడిని...'

శ్రీహరి:-

'ఎదుటి పోర్షన్లో ఉండే గోవర్ధన్ కి ఆశ ఎక్కువ.

ఏమి... గవర్నమెంట్ ఉద్యోగమే కదా... ఇంటికి రాగానే ప్రశాంతంగా ఉండొచ్చు కదా. భార్యను ఎల్ఐసి ఏజెంట్ గా చేసి, అందరి దగ్గరికి పోయి... పాలసీలు కట్టండి అని పీడిస్తుంటాడు. వీడి బాధపడలేక.. మేము...మా బంధువులం అందరం కట్టాం. వదిలితే కదా.... తెలియని వారైనా సరే ఏదో ఒక లింకు పట్టుకుని, పరిచయం చేసుకొని, ఇక కట్టే వరకు వదలడు. అంతేనా అదేదో పోస్టల్ ఏజెన్సీ కూడా తీసుకొని ఆర్డీలు గట్రా కట్టిస్తుంటాడు. ఏమి....! జీతం వస్తుంది కదా.. ఉన్నదాంతో ప్రశాంతంగా బతుకొచ్చు కదా... ఎందుకు అంత కక్కుర్తి. తెలియని వారిని బతిమిలాడటం.... వాళ్ళని పీడించడం... అవసరమా..!

అవేనా ఇంకోపక్క ఫ్లాట్ బ్రోకర్ గా కూడా ఇళ్ళు అమ్మిస్తూ... కొనిస్తూ...ఉంటాడు. కమీషన్లు తీసుకుంటాడు.మరలా చీటీ పాట పెట్టుకుంటాడు. ఈ అపార్ట్మెంట్ లో ఉన్న వాళ్ళందరూ వాడి దగ్గరే చీటీ వేస్తారు. డబ్బు సంపాదించడమే ధ్యేయం. సమాజం ఎటు పోయినా నాకేం నాకు డబ్బులు కావాలి అనే రకం.

ఒకసారి రక్తదానం చేద్దాం వస్తారా అని పిలిచాను. అమ్మో నాకు భయం సార్ అన్నాడు. నేను ఇప్పటికి 30 సార్లు ఇచ్చాను నాకేం కాలేదన్నా కూడా సరే మిరా రానున్నాడు. బాగా సెల్ఫిష్.'

గోవర్ధన్:-

మొన్నీమధ్య ఒకరు పాలసీ కడతాను అంటే మాట్లాడడానికి పోయాను. టౌన్ హాల్లో

ఒక కార్యక్రమంలో ఉన్నాను, అక్కడికి రండి. అది అయిపోయిన తర్వాత మాట్లాడుకుందాం అన్నాడతను. సరే అని వెళ్ళాను.

అక్కడ స్టేజి మీద శ్రీహరి కూర్చొని ఉన్నాడు. అమ్మో...! పక్కన పెద్ద పెద్ద వాళ్ళు ఉన్నారు. మా ఆఫీసర్ కూడా కూర్చొని ఉన్నాడు. అటుపక్క చూస్తే ఎమ్మెల్యే...

. కాసేపటి తర్వాత శ్రీహరి మాట్లాడడం మొదలుపెట్టాడు. సాహిత్యం సమాజ రుగ్మతలను వేలెత్తి చూపుతుందనీ, సమస్యలపై స్పందించి పరిష్కార మార్గాలు సూచిస్తుందనీ, అన్యాయాలను ప్రశ్నిస్తుందనీ, రచనలు... సామాజ దృక్పథాన్ని ప్రతిబింబిస్తాయనీ, ఏది మంచో... ఏది చెడో చెపుతాయనీ, ప్రజలు మంచివైపు నడిచే విధంగా సాహిత్యం పురికొల్పుతుందనీ, కవులు రచయితలు సున్నిత మనస్కులనీ, అందరూ సాహిత్యం వైపు మొగ్గు చూపితే... సమాజం మెరుగవుతుందనీ, అసలు అన్ని ఉద్యమాలలో సాహిత్యం తన వంతు

కృషి చేసిందని అనర్గళంగా మాట్లాడాడు. చెప్పద్దూ...! ఆ మాటలు నాకు కూడా బలే నచ్చాయి. చప్పట్లు కొట్టిన వాళ్లలో నేను కూడా ఉన్నాను.

చివరిలో శ్రీహరికి సన్మానం చేశారు. నేను లేచి నమస్కారం చేసే మా ఆఫీసరు... తను లేచి నిలబడి శ్రీహరికి నమస్కారం చేసాడు. నేనైతే... ఎమ్మెల్యే దగ్గర కూడా పోలేను. అలాంటిది ఎమ్మెల్యే స్వయంగా శ్రీహరికి షాలువా కప్పి, శ్రీహరిని ప్రశంసించాడు.

శ్రీహరి గురించి తప్పుగా అనుకున్నాను. సమాజానికి అవసరమైన వ్యక్తి శ్రీహరి.

శ్రీహరి:-

చాలా బాధాకరమైన విషయం. చిన్నాన్న యాక్సిడెంట్లో చనిపోయాడు. మొన్నీమధ్యే అప్పు చేసి కూతురు పెళ్లి చేశాడు. ఆయన పోయిన తర్వాత చిన్నమ్మ ఒక్కటే ఉంది ఇంట్లో. అప్పుల వాళ్ళు వచ్చి చిన్నమ్మ ను అడగ సాగారు.

చిన్నాన్నది కూడా చిరుద్యోగమే... ఏదో బొటా బోటిగా సంపాదన ఉండేది. కఠిక పేదరికం కాదు గానీ, చిన్నాన్న బతికినంత కాలం సాధారణంగానే బతికాడు.

గోవర్ధన్ లాగా సైడ్ పనులు ఏమైనా
చేసి ఉంటే బాగుండేది.

గోవర్ధన్... చిన్నాన్న
పేరు మీద ఎల్ఐసి కట్టడం
మంచిదయింది. ఇలా జరగాలని
ఎవరు కోరుకోరు కానీ, దురదృష్ట
వశాత్తూ...ఇలా జరిగింది.
యాక్సిడెంట్ జరిగినప్పుడు గోవర్ధన్
వచ్చి, ఆ కాగితాల మీద సంతకాలు
చేయించుకొని, అతనే ఎల్. ఐ. సి.
ఆఫీస్ చుట్టూ తిరిగి, ఆమెకు డబ్బు
వచ్చేటట్టు చేసాడు.

యాక్సిడెంట్ బెనిఫిట్ తో
చిన్నమ్మకు చాలా పెద్ద మొత్తం
వచ్చింది. అప్పులు తీర్చేసింది.
ఇక ఆమె ఎటువంటి ఇబ్బంది
పడక్కర్లేదు. ధైర్యంగా బ్రతకొచ్చు.

గోవర్ధన్ మంచి పనే
చేశాడు.

తను సంపాదించుకొంటూ...
ఎదుటివారి కూడా మంచి జరిగేటట్లు
చూస్తున్నాడు.

నాకు ఎదురు
పడినప్పుడల్లా నేను... చూసి
చూడనట్లు వెళ్ళిపోతుంటాను.
ఈసారి కనపడినప్పుడు అతనితో
నవ్వుతూ మాట్లాడాలి.

------------

# నిజం చెబుతా వింటారా!

కె .విజయకుమార్

మనకు నిష్ఠూరంలాగున్నా నిజానికి

“ నిజం “ నిశ్చలమైనది ,స్వచ్ఛమైనది,

నిప్పులాంటిది , దాచలేనిది .

జబ్బును తగ్గించే చేదుమందులా

మనలోపాన్ని సరిచేసి

మనల్ని ముందుకు నడిపిస్తుంది.

యదార్థం మనల్ని బాగుచేసే పదార్థం

అని గుర్తిద్దాం అందరం .

నీ గురించే , నీముందే , నీ ముఖంమీదే

ఎవరైనా నిజాన్ని నిర్భయంగా చెబితే

యదార్థవాదిని లోకవిరోధిగ ఎంచక

చెప్పినవారిని నిందించక

అందులో నిజమెంతని

నిజమైన ఆత్మవిమర్శ

నిజంగా చేసుకోవాలి.

నిజమే కనుక ఉంటే

స్వీకరించి , ఆచరించాలి.

తియ్యని మాటలతో ఆకట్టుకునే

వెలయాలువంటిది అపద్ధపు పొగడ్త

ఆ మాయలోపడితే నీ ఉనికే మాయం

ఇల్లాలు వంటి నిజం

నువ్వేస్థితిలో ఉన్నా స్వీకరించి

నిను మనిషిని చేసి మనీషిగ
నిలబెడుతుంది.

అందుకే ఎవరినుంచైనా

నిజాన్నే స్వీకరిద్దాం .

జీవనయానంలో ఎదురయ్యేవారిలో

ఎవరి పెద్దరికం ముసుగు ,

ఎవరి ప్రేమ కపటం ,

ఎవరి ప్రేమ నిజమో తెలుసుకుని

కటువుగా, ఖచ్చితంగా ఎవరు

నీ లోపాన్ని చూపి మండిపడతారో ,

వారిని మనవారిగ భావించాలి.

మన నడతలో లోపాన్ని జయించాలి

మన మదిలో నిజం అనే విత్తు నాటితే

అది ఇచ్చే ఫలసాయం పరుల
విశ్వాసం

జీవితంలో దారుణంగా

దివాళా తీసేవాడు ఎవరంటే

నిజం మరిచి నడచేవాడే.

సద్విమర్శను స్వీకరించనివాడే.

తరగతి పుస్తకాల చదువులతో

ద్రవ్యజ్ఞానం పొందినా

తరగని గనివంటి విలువలు

నేర్చుకోడానికి

పెద్దలు బోధించే దివ్యజ్ఞానం
అవసరం.

అందుకే “ నిజం”

సకల సుగుణాల ఖనిజం .

నిజమైన అభివృద్ధి కావాలంటే

నిజాన్ని స్వీకరించడం నీ ధర్మం

అది తెలియకుంటె నీ ఖర్మం .

★★★



# రామాయణ కధ



**ఆచార్య ఇరపని మాధవి**

అన్నదమ్ములా మేఘనాథుని నొప్పించారు.
అతడు ఆశ్చర్యపోయి హోమం చేయడానికి పూనుకున్నాడు.
అతడు హోమాన్ని పూర్తి చేస్తే అజేయుడు అవుతాడు. అందువలన విభీషణుడు లక్ష్మణుడిని అతడిపైకి పురికొల్పి వధించమని ప్రేరేపించాడు. లక్ష్మణుడు అతడిపై విజృంభించాడు. ఇరువురి మధ్య ఘోర యుద్ధం జరిగింది . చివరకు లక్ష్మణుడి బాణాలకు ఇంద్రజిత్తు భుజాలనూ, శూలానికి తలనూ కోల్పోయి చెట్టు వలె నేలపై కూలి మరణించాడు.

పుత్ర శోకాన్ని భరించలేక రావణుడు క్రుద్ధుడై అశోకవనానికి వెళ్ళి కత్తితో సీతను చంపటానికి పూనుకున్నాడు. అప్పుడు అవింధ్యుడు అనే వృద్ధుడు స్త్రీవధ వీరోచిత కార్యం కాదని హితవు చెప్పి ఆ పని మాన్పించాడు. రావణుడు పౌరుషంతో కపిసేన మీద దండెత్తాడు. మాయా యుద్ధంలో తన దేహం నుండి అనేక మంది వీరులను సృష్టించి కపిసేనను సంక్షోభపరిచాడు.

# మన పురాణాలు



రామలక్ష్మణులు వాళ్ళందర్నీ సంహరించారు. రావణుడు మాయా యుద్ధాన్ని ప్రచండంగా సాగించాడు. ఇంద్రుడు మాతలితో తన రథాన్ని రాముడికి పంపాడు. రథారూఢుడైన రాముడు రావణునిపై శస్త్రాస్త్రాలను నిరాఘాటంగా ప్రయోగించాడు. చివరకు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించి దశకంఠుడిని తుదముట్టించాడు. ఇంద్రాది దేవతలు శ్రీరాముడిని కీర్తించి పూలవాన కురిపించారు. శ్రీరాముడు విభీషణుడికి లంకా రాజ్య పట్టాభిషేకం చేశాడు.

విభీషణుడు అవింధ్యుడితో కలిసి సీతను సగౌరవంగా తెచ్చి శ్రీరాముడికి అర్పించాడు. దుష్టాచారుడైన రావణుడు తన ఇంటనుంచుకున్న సీతను తాను గ్రహిస్తే లోకనింద వస్తుందని శ్రీరాముడు సీతను పరిగ్రహించనన్నాడు. శత్రువుపై ప్రతీకారంగానే యుద్ధం చేసి విజయం సాధించానన్నాడు. సీత అతడి మాటలకు మూర్ఛపోయి, కొంత సేపటికి తేరుకొని, తన సచ్చరిత్రం తేటపడేటట్లు చేయడానికి సిద్ధమైంది. అప్పుడు పంచభూతాలు అందరూ వినేటట్లుగా సీతాశీల పావిత్ర్యాన్ని, పతివ్రతా మహాత్మ్యాన్ని చాటిచెప్పాయి. ఆ తర్వాత బ్రహ్మదేవుడు దేవగణాలతో ప్రత్యక్షమై సీతాదేవి పవిత్ర చరిత్రను కీర్తించాడు. శ్రీరాముడు సీతను పరిగ్రహించి, సర్వసేనాసమేతుడై పుష్పకమెక్కి అయోధ్య చేరి, భరతాదులను కూడి, పట్టాభిషిక్తుడై అనేక యాగాలు చేసి అనేక వేల సంవత్సరాలు భూమిని ధర్మమయంగా పాలించాడు.

శ్రీరాముడు వనవాసక్లేశాలను అనుభవించి, శత్రువులు చేసిన అపకారం వలన కలిగిన దురవస్థలను సహించి, శుభాలను పొందినట్లే ధర్మరాజు కూడా వనవాస దుఃఖానంతరం సర్వసామ్రాజ్యసౌఖ్యాన్ని పొందగలడని మార్కండేయ మహర్షి చెప్పాడు.

★★★



# సప్తపదులు








పోడిమి

దాడిమి

శీతవేళ ఉషోదయాన నులివెచ్చని రవికిరణాల వేడిమి.

పట్నాల ఈశ్వరరావు

విజయనగరం

సవరింపు

వివరింపు

ఆత్మాభిమానం చంపుకొని ఏల మన్ననకై దేవిరింపు!

గోపరాజు వెంకట సూర్యనారాయణ ,హైదరాబాద్.

అవతల

ఇవతల

ఇమడని ఆలితో సంసారం ఎక్కడైనా అనితల

అభిషేక్,హైదరాబాద్

వ్యవస్థ

అవస్థ

ఆకలికేకలతో అలమటిస్తూ, అన్నార్తుల అభాగ్యుల దీనావస్థ.

ఋష్యశృంగు ఢిల్లేశ్వరరావు,సారవకోట

కావ్యము

నవ్యము

మహాకవుల సాహితీవనంలో విరిసిన కుసుమాలన్నీ దివ్యముదా.

పి.వి.రామ కుమార్ ,హైదరాబాద్

విభూతి!

అనుభూతి!

ఇరుగుపొరుగులకు ఇబ్బందుల్లో తోడుండి అందించాలి సానుభూతి!

సిహెచ్.వి. బృందావన రావు నెల్లూరు

అహంకారం

వెటకారం

మనుష్యుల మధ్య స్నేహపూరితమైన సత్సంబంధాలుంటేనే మమకారం!

డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచార్య,మహబూబ్ నగర్.

విందు

చిందు

గెలుపునకు ప్రశంసా

– ఓటమికి ఓదార్పు మందు విత్తనాల

విజయ కుమార్,హైదరాబాద్



# జీవితసత్యాల ఆవిష్కరణం -సామాజిక బ్రతుకు ఘటనల వ్యాఖ్యానం: సప్తపదులు

సూత్రధారి

గాత్రధారి

పాత్రలకు ప్రాణప్రతిష్ఠ చేసేవాడే అసలైన పాత్రధారి

ధరణికోట శివరామప్రసాద్ ,హైదరాబాద్

ఉచితం

అయాచితం

కష్టపడకుండా ఆశించటం తనతో సమానమంటోంది యాచితం.

క్రొవ్విడి వెంకట బలరామమూర్తి

సిద్ధాంతం

రాద్ధాంతం

అవసరమైన విషయాలకు మాత్రమే సూచనలిస్తుంది వేదాంతం

ఆలేటి పరంజ్యోతి ,ఖమ్మం

ప్రస్ఫోటనము

విస్ఫోటనము

మానవమాత్రులు ఎప్పుడూ తెలుసుకోలేరు భగవంతుని సంఘటనము

ఉదంద్రావు రమణబాబు ,నరసన్నపేట

రుణము

రణము

ఆదాయానికి మించిన  అప్పులతో బ్రతుకు దారుణము

కపిలవాయి అశోక్ బాబు,నాగర్ కర్నూల్

తథ్యంగా

ప్రాతినిథ్యంగా

ఆలోచన జ్ఞాపకాలనుండి వస్తుంది –నేపథ్యంగా.

కే. ఎం. కే. మూర్తి ,సికింద్రాబాద్

సఫలం

విఫలం

విడదీయలేని బంధం మనం పొందే కర్మఫలం!

మొల్రి గోపి ,కవిటి

భూతాపం

ప్రతాపం

వని తగ్గిన అవని మౌనంగా పరితాపం.

ఆర్ ఎస్ రాజకుమార్ ,విశాఖపట్నం



కవి/కవయిత్రి మిత్రులారా!
మీరూ సప్తపదులు రాయవచ్చు
అందుకోసం
సప్తపదులు వాట్సప్ గ్రూప్ లో
చేరేందుకు  గ్రూప్ అడ్మిన్
శ్రీ జి.వి.నరసింహమూర్తి(శాంతమూర్తి)
97048 67867
నెంబర్ ను సంప్రదించండి



కొత్త సీరియల్

సీరియల్

# నయన



**శ్రీ విజయదుర్గ**

రాఘవ ఆ మాట అనగానే, రామాచారి కళ్ళు ఎర్రజేసి రాఘవ వైపు చూశారు.

ఒక్క క్షణం రాఘవ భయపడి మరల మామూలు అవుతూ...

"అయ్యో అదేంటండి! మీకు ఇంకా తెలియదా ఆ విషయం, మన బజారు బజార్ అంతా వాళ్ళిద్దరూ ప్రేమించుకుంటున్న విషయం తెలుసు. చట్టా పట్టాలు వేసుకుని తిరుగుతున్నారని కూడా తెలుసు. మొన్నే ఇద్దరూ బైక్ మీద షికారులు కూడా చేసి వచ్చారు. మీరు నిజంగా చాలా ఆదర్శవంతులు. ముస్లిం అబ్బాయిని అల్లుడుగా చేసుకుంటున్నారు" అని రామాచారి ని పొగుడుతున్నట్టుగా మాట్లాడుతూ లేని విషయాలన్నీ కల్పించి రామాచారి గారికి నూరి పోసాడు.

రామాచారి మనసులోనే రగిలిపోతూ... రాఘవను తప్పించుకుని ఇంటికి వెళ్లి ఇంట్లోకి అడుగుపెట్టగానే చేతిలో ఉన్న పళ్ళబుట్టను విసిరి కొట్టారు.

జయంతి పరుగున వచ్చి భర్త అకారణంగా ఈ మధ్య అలా ఎందుకు ప్రవర్తిస్తున్నారో తెలియక భయం భయంగా ఎదురు వెళ్లి,

"ఏం జరిగిందండి? ఎందుకలా ఉన్నారు?" అని అడిగింది.

రామాచారి కోపంగా జయంతి గొంతు పట్టుకుని గోడకు ఆన్చి కళ్ళు నిప్పులు కక్కుతూ ఉంటే,

"ఏం జరిగిందా...? ఏం జరిగిందా...? ఎక్కడే నీ ముద్దుల కూతురు? నా పరువు గోదావరిలో కలిపేసింది. నేను ఏదైతే జరగకూడదని ఇన్నాళ్లు అతి జాగ్రత్తగా ఉంటూ వచ్చానో అదే జరిగింది. ముసుగు చాటులో కూడా ఇది మగాడిని వలలో వేసుకుని దాని చుట్టూ తిప్పుకుంటుంది. అదే ఆ ముసుగు కూడా లేకపోయి ఉండుంటే ఇంకెంత భరితెగించేదో బజారుది! ఇలాంటిది బ్రతకడానికి వీల్లేదు. నా కడుపున పుట్టలేదు అనుకుంటాను" అని అంటూ ఉండగా...

తండ్రి హడావిడికి గదిలో పడుకున్న నయన నీరసంగా లేచి వచ్చి గుమ్మం దగ్గర నిలబడి, తండ్రి తల్లి గొంతు పట్టుకోవడంతో హడావిడిగా తండ్రి దగ్గరికి వచ్చి చెయ్యి పట్టి విదిలించింది.

రామాచారి గారికి నయనను చూడగానే కోపం నషాలానికి అంటింది. జయంతి మెడ వదిలిపెట్టి నయన జుట్టు పట్టుకుని,

"ఏంటే అంత ఉండలేకపోతున్నావా? పెళ్లి చేస్తానని చెప్పానుగా... ఈ లోపులోనే నీకు మగవాడి అవసరం వచ్చేసిందా! అంత ఉండలేకపోతున్నావా?" అని, ఏ తండ్రి ఏ కూతురుతోనూ అనుకూడని మాటలు అన్నీ అంటూ వేగంగా విసిరి కొట్టారు.

తండ్రి అన్న మాటలకే సగం చచ్చిపోయిన నయన, తండ్రి అలా విసిరికొట్టాడు తో కింద పడిపోయింది. ఏం జరుగుతుందో అర్థం కాని అయోమయ స్థితిలో లేచి కూర్చుని తల్లి వైపు దీనంగా చూసింది.

జయంతి గారికి కూడా విషయం అర్థం కాక, భర్త అన్న మాటలు కొద్ది కొద్దిగా అర్థం చేసుకుని కాస్త గొంతులోకి ధైర్యాన్ని కూడా తీసుకుని,

"ఏం మాట్లాడుతున్నారండి? మన అమ్మాయి గురించి తెలుసి అలా తప్పుగా ఎలా మాట్లాడుతారు? అది మీరు చెప్పినట్టుగానే అన్నీ పాటిస్తూ దాని మనసు చంపుకుని ఉన్నా కూడా దానిని ఎందుకు అండి మాటలతోనూ మీ చేతలతోనూ హింసిస్తారు" అని కన్నీళ్లు పెట్టుకున్నారు.

రామాచారి కోపంగా జయంతి మీదకు కొట్టడానికి చెయ్యి ఎత్తి వెళుతూ...

"ఏంటే మనసు చంపుకుని అది పాటిస్తున్నది. రోడ్డు ఎక్కగానే అది చేస్తున్న బాగోతాలు మామూలుగా లేవు. మొహం చూపక పోతే ఏమి, కళ్ళతోనే వలపు వలలు విసిరి అబ్బాయిలను వెంటేసుకుని తిప్పుకుంటుంది. అంతటి నెరజాణే నీ కూతురు. ఇక ఉపేక్షించి లాభం లేదు. దీనికి నేను సరైన పరిష్కారమే చెప్తాను" అని అంటూ బయటికి వెళ్లిపోయారు.

తండ్రి నోట్లో నుంచి వస్తున్న ఒక్కొక్క మాట నయనను మానసికంగా చంపేసింది. అప్పటి వరకూ కళ్ల వెంట కారుతున్న కన్నీరు కూడా మా వల్ల కాదు, ఈ ఘోరాలను మేము చూడలేము అంటూ కళ్ళల్లోనే ఆగిపోయాయి.

భర్త బయటకి వెళ్ళిపోగానే జయంతి కూతురు పక్కకి వచ్చి,

"ఏం జరిగింది? మీ నాన్న ఏం మాట్లాడుతున్నారు నాకు ఒక్క ముక్క అర్థం కావడం లేదు. మీ నాన్నలో అంత దారుణమైన ప్రవర్తనని ఇంత వరకూ చూడలేదు. ఏం జరిగింది చెప్పు చెప్పు" అని నయనను భుజాలు పట్టుకుని కుదిపేసారు.

నయన తల్లి వంక చూసి విరక్తిగా ఒక నవ్వు నవ్వి, లేచి తన గదిలోకి వెళ్లి తలుపు పెట్టుకుంది.

భర్త అలా కూతురిలా వెళ్లిపోవడంతో జయంతికి ఏమీ అర్థం కాక, హాల్ లోనే కూర్చుని కన్నీళ్లు పెట్టుకుంటూ...

"దేవుడా! ఏంటిది? ఒక్కగానొక్క కూతురు, దానికి నచ్చినట్టుగా ఉండనివ్వలేదు. తన తండ్రికి

నచ్చినట్టుగానే తను ప్రవర్తిస్తుంది. దానికి ఇంకా ఎందుకు ఈ నరకం. ఈ నరకం నుంచి కాపాడి దానికి విముక్తిని ఇవ్వవయ్యా! ఇకనైనా అది సంతోషంగా ఉండేలా చూడవయ్యా!" అని దేవుడికి దణ్ణం పెట్టుకుని అలాగే మౌనం రోదిస్తూ ఉండిపోయారు.

రాత్రికి ఎప్పటికో వచ్చిన రామాచారి భార్య పెట్టిన భోజనాన్ని తిని తన గదిలోకి వెళ్లిపోయారు. కూతురు విషయంగా ఒక మాట అడగలేదు. జయంతి కూతురు గదిలో నుంచి వస్తుందని ఎంతో ఎదురుచూసింది. కానీ ఎంతకీ రాకపోయే సరికి, మనసులో ఏదో భయం పుట్టి తలుపు తట్టారు.

తలుపు తట్టిన ఐదు నిమిషాలకి నీరసంగా తలుపు తెరిచిన కూతురిని చూసి ముఖం తడిమి,

"తల్లీ? బాగానే ఉన్నావా? కాస్త ఎంగిలిపడమ్మా!" అని బ్రతిమాలారు.

నయన తల్లి వంక నిరాశగా చూసి,

"ఇప్పుడు నేను మూడు పూటలా తిని బ్రతికి ఎవరిని ఉద్ధరించాలి. ఏ కూతురు ఏ తండ్రి తోటి అనిపించుకుని మాటలని అనిపించుకున్నా... ఆయన అనుకున్న విధంగా నేను ఉండలేకపోయాను. ఇంకెందుకు అమ్మా ఈ బ్రతుకు? ఇలాగే ఈ జీవాన్ని ఒడిగట్టనివ్వు!" అని తల్లికి చెప్పి జీవచ్ఛవంలా మంచం పై పడి శూన్యం లోకి చూస్తూ ఉండిపోయింది.

ఆ రాత్రి ఆ ముగ్గురికీ కాళరాత్రే అయ్యింది.

తర్వాత రోజు రామాచారి యథావిధిగా గుడికి వెళ్లి ఆ దేవుడికి చేయాల్సిన కైకర్యాలు పూర్తి చేసుకుని, గుడి అరుగు మీదే కూర్చొని కూతురి కోసం దీర్ఘంగా ఆలోచించారు.

★★★ ★★★ ★★★

ఒక రెండు రోజులు నయన తండ్రికి ఎదురు పడకుండా ఒంటరిగా గదిలోనే గడిపింది. రామాచారి కూడా మరేం పట్టనట్టుగా నయన విషయం వదిలి తన పనిలో తను ఉండిపోయారు. మూడో రోజున నయన ఎప్పటిలానే కాలేజీకి బయలుదేరి, తల్లికి చెప్పి వెళ్ళిపోయింది.

జయంతి వెళుతున్న కూతుర్ని చూస్తూ... 'హమ్మయ్య! ఇప్పటికి ఇల్లు ప్రశాంతంగా ఉంది. అసలు ఉరుములేని పిడుగులా! ఆయనకు కూతురు మీద అంత కోపం ఎందుకు వచ్చిందో అర్థమే కాలేదు. రెండు రోజులుగా ఏమీ మాట్లాడకుండా మామూలుగానే ఉన్నారు. ఈ పిచ్చి పిల్లను ఆయన ఎప్పుడు అర్థం చేసుకుంటారో ఏంటో! భగవంతుడా నువ్వే నా కూతురికి మనోధైర్యాన్ని ప్రసాదించు' అని దేవుని స్మరించుకుంటూ తన పనిలో తాను పడిపోయారు.

నయన నెమ్మదిగా వీధిలో నడుచుకుని వెళుతూ... సుభాన్ షాప్ ముందుకు రాగానే, అటువైపు చూడాలా వద్దా అని తటపటా ఇస్తూ... తన మనసు వద్దు అని వారిస్తున్నా, తన మాట వినని తన కనులు సుభాన్ వైపు తలని తిప్పాయి.

షాప్ లో సుభాన్ కనిపించకపోయేసరికి, నయన పూర్తిగా తన తలని షాపు వైపుకు తిప్పి,

'తను షాపులో లేడు ఏమిటి? ఈ సమయంలో ఎప్పుడూ ఉంటాడుగా?' అనుకుంటూ కళ్ళను చక్రాల తిప్పుతూ ఆ చుట్టుపక్కల వెతికింది.

సుభాన్ అప్పుడే వచ్చిన సరుకుని ఆటోలో నుంచి దించుతూ... పళ్ళ బుట్టను భుజానికి ఎత్తుకుని కనపడ్డాడు.

సుభాన్ కనపడగానే, అప్పటి వరకూ భయం భయంగా బిత్తర చూపులు చూస్తూ ఉన్న నయన, భయాన్ని వదిలి సుభాన్ వైపే మైమరిచి చూస్తూ అడుగులు ముందుకు వేసింది.

సుభాన్ పళ్ళ బుట్టను లోపల పెట్టి, తన గుండె సవ్వడిలో మార్పులు

గమనించి తన గుండె పై చేయి వేసుకుని రుద్దుకుంటూ...

'ఏంటిది ఎప్పుడూ లేనిది ఇలా అవుతుంది?' అనుకుంటూ... షాప్ ముందుకు వచ్చి నిలబడి, రోడ్డు పైన అటు ఇటు తలతిప్పి చూసాడు.

సుభాన్ ఎవరినో వెతుకుతున్నట్టుగా అలా షాప్ బయట నిలబడి చూసేసరికి, నయన కంగారుగా తలను ఎదురికి తిప్పుకుని తన అడుగుల వేగం పెంచి, బస్టాండ్ కు వెళ్లి బస్సు కోసం నిలబడింది.

సుభాన్! చివరి నిమిషంలో వీధి మలుపు తిరుగుతున్న ముసుగులో ఉన్న నయనను చూసి, వెంటనే నాలుగు అడుగులు పరుగున ముందుకు వచ్చి నిలబడి... 'నా నయన సుందరి ఇటుగా వెళ్ళింది. అందుకే నువ్వు నన్ను హెచ్చరిస్తున్నావా!' అని తన హృదయం వైపు చూసి మాట్లాడుతూ... 'ఇప్పుడే వస్తున్నా నీకోసం' అనుకుంటూ టైం చూసుకుని,

'అబ్బా ఇంకా రావడం లేదు. హరే, ఈ రాఘవ వచ్చినా బాగుండును' అని వాళ్ళ కోసం చూశాడు.

ఒక ఐదు నిమిషాలకి సుభాన్ తండ్రి అబ్దుల్లా షాప్ కి రాగానే, సుభాన్ తొందరపడుతూ...

"అబ్బా! నాకు టైం అవుతుంది. సరుకు వచ్చింది వెనక పెట్టాను చూసుకో, రామవ వచ్చాక తనతో సర్దిపించుకో, నువ్వు సరుకు మొయ్యకు నేను బయలుదేరుతున్న" అంటూ అప్పటికే బైక్ స్టార్ట్ చేసి ముందుకు ఉరికించాడు.

ఎప్పుడూ లేనిది కంగారుగా వెళుతున్న కొడుకుని చూసి, 'ఏంటిది! అంత అర్జెంటు పని ఏముంది? ముందుగా నాకు చెప్పలేదే, అలా చెప్పి ఉంటే ఇంకాస్త త్వరగానే షాప్ కి వచ్చేవాడిని పాపం బిడ్డ హడావిడిగా వెళ్లాల్సి వస్తుంది' అని చిన్నగా బాధపడ్డారు.

సుభాన్ బైక్ వేగంగా వీధి మలుపు తిప్పి, బస్టాండ్ వైపు ఆత్రంగా చూసాడు. తన అదృష్టం బాగుండి అప్పటికి ఇంకా బస్సు రాకపోవడంతో, నయన ఇంకా బస్టాప్ లోనే నిలబడి ఉండడం కనపడింది. నాయన కనపడడంతోనే కుదురుకున్న సుభాన్! బైక్ వేగం తగ్గించి, బస్టాండ్ కి దాటించి కాస్త ముందుకు వెళ్లి బైక్ ని ఆపి, తిరిగి బస్టాండ్ కి వచ్చి,

"హాయ్! నయిన" ఆయన పలకరించాడు.

అంత హఠాత్తుగా సుభాన్ తనకి దగ్గరగా వచ్చి పలకరించేసరికి, నయన బెదిరిపోతూ... ఏమని సమాధానం చెప్పాలో తెలియక, ఒక అడుగు పక్కకి వేసింది.

"హాయ్! నయన! నేను సుభాన్! మర్చిపోయావా? ఆరోజు అల్లర్లులో జరుగుతుంటే మనిద్దరం కలిసి వచ్చాం గుర్తుందా!" అంటూ... ఒకవేళ తను మర్చిపోయిందేమోనని గుర్తు చేయడానికి ప్రయత్నించాడు.

నయన ఇక తప్పక, "గుర్తున్నారండి. బాగున్నారా!" అని పలకరించింది.

"ఆ! బాగున్నానండి. కాలేజ్ కేనా! ఈవేళ బస్సు వచ్చేటట్టు కనబడడం లేదు. రండి నేను డ్రాప్ చేస్తాను. మా కాలేజీ అటేగా నాకేమీ ఇబ్బంది లేదు" అన్నాడు.

నయన భయం భయంగా తన భుజాన ఉన్న బ్యాగ్ హ్యాండిల్ ని నలిపేస్తూ...

"వద్దండి లేట్ అయినా పర్వాలేదు. నేను బస్సులోనే వెళ్తాను మీరు వెళ్ళండి. మీ ఫ్రెండ్స్ ఎవరైనా మీ కోసం చూస్తారు" అంది.

"అయ్యో! లేదండి అలా ఎవరూ లేరు. మీకు ఎందుకు రండి. బస్సులో కంటే మీకు బైక్ మీద సేఫ్టీ, నేను ఉన్నాను గా!" అంటూ తప్పనిసరిగా రావాల్సిందే అన్నట్టుగా అన్నాడు.

సుభాన్ మరీ అంత ఇదిగా అడగడంతో, తన మనసు శుభాన్ తో కలిసి వెళ్ళమని మరీ తనని ఇబ్బంది పెడుతూ ఉండడంతో, ఇక తప్పక...

'తప్పు చేసినా చేయకున్నా ఎలానో నాకు వచ్చే అవమానాలు, జరిగే సత్కారాలు జరగక మానవు. ఈ మాత్రం దానికి, నా వరకు వచ్చిన అవకాశాన్ని నేను ఎందుకు వినియోగించకూడదు? ఈ మాత్రం సంతోషాన్నైనా నా మనసుకు నేను అందించకపోతే, ఆ మనసు

# కొత్త సీరియల్

ఇంకా చచ్చిపోతుంది. ఏమీ పర్వాలేదు జరిగేది జరుగుతుంది. నేను నా వరకు తప్పయితే చేయడం లేదు' అని తనని తాను సమాధానపరచుకుని,

"సరే పదండి" అంటూ ఒక అడుగు ముందుకు వేసింది.

సుభాన్ సంబరపడిపోతూ...

"రండి" అంటూ పరుగున బైక్ వరకు వెళ్లి, తన షర్ట్ తో వెనక సీట్ శుభ్రంగా తుడిచి తను బైక్ ఎక్కి కూర్చుని బైక్ స్టార్ట్ చేసాడు.

నయన బైక్ ఎక్కి, తన ఒడిలో బ్యాగ్ పెట్టుకుని బ్యాక్ హ్యాండిల్ పట్టుకుని కూర్చుంది.

సుభాన్ తను అడగగానే నయన ఒప్పుకుని బైక్ ఎక్కినందుకు సంబరపడిపోతూ... బండిని స్పీడ్ గా నడిపి, ట్రాఫిక్ దాటిన తర్వాత కాస్త బండిని స్లో చేస్తూ...

"నయన! ఎందుకు మీరు ముసుగు ఇలా వేసుకుంటున్నారు? పూర్తిగా బుర్కానే వేసుకోవచ్చుగా?" అన్నాడు.

నయనకు ఏం సమాధానం చెప్పాలో తెలియక, ఏమీ మాట్లాడలేదు. ఈలోపు కాలేజీ రావడంతో,

"ఇక్కడే ఆపండి కాలేజీ ముందు మీతో పాటు మీ బైక్ దిగితే, మా ఫ్రెండ్స్ అంతా వేరేగా అనుకుంటారు" అంది.

"అవును అది కరెక్టే! సరే జాగ్రత్తగా వెళ్ళండి. మీకు అభ్యంతరం లేకపోతే సాయంత్రం కూడా నేనే వచ్చి మిమ్మల్ని తీసుకుని వెళ్తాను. కాస్త ఈ రకంగా నైనా మీతో స్నేహం చేసినట్టు ఉంటుంది తప్పుగా అనుకోరుగా" అన్నాడు.

సుభాన్ మాటలకి మనసు సంతోషంతో ఉప్పొంగిపోతుంటే... బుద్ధి ఒప్పుకోకూడదు అని అనుకుంటూనే,

"వద్దులేండి ఎందుకు మీకు శ్రమ! నేను బస్సులో వెళ్ళిపోతాను" అంది.

"అయ్యో! మీరు వెళ్ళలేరని కాదండి. కాస్త మీ అమూల్యమైన సమయంలో కొద్దిపాటి సమయాన్ని మా కోసం కేటాయిస్తారు అని, ఆ విధంగానైనా మీ స్నేహాన్ని పొందవచ్చు అని కోరుకుంటున్నాను. ఆ మాత్రం భాగ్యం ఈ అభాగ్యుడికి లేదా!" అన్నాడు.

మాటలతో సంకెళ్లు వేస్తున్న సుభాన్ ని చూస్తూ... ముసుగులోనే తన పెదవుల పైకి వచ్చిన చిరునవ్వుని స్వేచ్ఛగా వదిలి,

"సరే మీ ఇష్టం! అలానే మీరు నాలుగున్నర సమయానికి ఇదే బస్టాప్ దగ్గరికి వచ్చి ఉండండి నేను వస్తాను" అంది.

"ఓ తప్పకుండా! మా కాలేజ్ నాలుగు గంటలకు అయిపోతుంది. మీకంటే ముందే నేను ఇక్కడికి వచ్చి ఉంటాను" అని హుషారుగా బైక్ స్టార్ట్ చేసి విజిల్ వేసుకుంటూ వెళ్లిపోయాడు.

సుభాన్ వెళ్లిపోయినా కూడా చాలా సమయం అక్కడే నిలబడి సుభాన్ వెళ్లిన వైపే చూస్తూ నిలబడిపోయింది నాయన.

అప్పుడే బస్సు దిగి వస్తున్న నయన స్నేహితురాలు రాగిణి! బొమ్మలా రోడ్డు పక్కన నిలబడిపోయిన నయనను చూసి భుజం మీద తడుతూ...

"నయన! ఇక్కడ నిలబడిపోయావ్ ఏంటే? అవును బస్సులో రాకుండా ఎలా వచ్చావ్? ఒక్కదానివే వచ్చావా?" అంటూ వరుస ప్రశ్నలు వేసింది.

రాగిణి భుజం మీద చెయ్యి వేయడంతోనే, సుభాన్ మైకం నుంచి బయటికి వచ్చిన నాయన ఉలిక్కిపడి, "పద కాలేజీకి టైం అవుతుంది" అంటూ వడివడిగా అడుగులు ముందుకు వేసింది.

రాగిణి నయన ప్రవర్తన చూసి, 'ఏంటిది? ఇది ఇలా బిహేవ్ చేస్తుంది. రెండు రోజుల నుంచి కాలేజీకి రాలేదు. ఇవాళ ఎప్పుడూ వచ్చే బస్సులో మాతో కలిసి రాలేదు. చూస్తే రోడ్డు పక్కన బొమ్మలా నిలబడి ఉంది. అసలు ఏం జరుగుతుంది? ఏమోలే నాకెందుకు? దాని దారిదాంది నా దారి నాది. అయినా! మా అమ్మ దీనికి దూరంగా ఉండేవే అంటూ

# కొత్త సీరియల్

రోజూ నసుగుతూనే ఉంటుంది. ఏదో అమాయకురాలు అని జాలి కొద్దీ తనతో ఉంటున్నాను గానీ లేదంటే తన స్నేహం నాకెందుకు?' అనుకుంటూ... క్లాస్ కి వెళ్ళిపోయింది రాగిణి.

రాగిణి వెళ్ళిపోగానే,

నయన 'హమ్మయ్య!' అని ఊపిరి తీసుకుని వదిలి, తన క్లాస్ కి వెళ్లి కూర్చుని సుభాన్ తో బైక్ మీద రావడానికి ఊహించుకుంటూ... 'ఎంత సంతోషంగా ఉంది తనతో అలా కలిసి రావడం! అలా రోజు ఉదయం సాయంత్రం ఆ పదిహేను నిమిషాల ప్రయాణమైనా తనతో కలిసి వస్తూ ఉంటే, నా మనసు ప్రశాంతంగా ఉంటుంది. మిగిలిన సమయంలో నాన్నగారి ఆంక్షల మధ్య బ్రతకాలి. నా జీవితంలో ఒక అరగంట సమయం అయినా... నాకు నచ్చినట్టుగా బ్రతికే హక్కు లేదా? అలా బ్రతకడం తప్పు కాదు కదా!' అని సుభాన్ తో వెళ్లడం నచ్చ చెప్పుకుంటూ... క్లాసులోకి వచ్చిన లెక్చరర్ మాటతో ఆలోచన నుంచి బయటకు వచ్చి క్లాస్ వినడం మొదలుపెట్టింది.

సాయంత్రం క్లాస్ విడిచిపెట్టిన తర్వాత, నయన రాగిణి కంటపడకుండా వడివడిగా అడుగులు వేసుకుంటూ... కాలేజ్ బయటకి వచ్చేసింది.

రాగిణి నయనను చూస్తూ... 'ఏంటిది? ఇలా బిహేవ్ చేస్తుంది. నేను లేనిదే అడుగు బయట పెట్టడానికే భయపడేది. అలాంటిది నన్ను తప్పించుకుని తిరుగుతుంది. అంటే మొన్నటి వరకూ వాళ్ళ నాన్న అంటే భయపడుతూ ఉండి, ఇప్పుడు ఆ భయం వదిలెయ్యడంతో, ఇప్పుడు అలా ఉందా! ఇప్పుడు వాళ్ళ నాన్న భయం పోయి, స్వేచ్ఛగా విహరించాలని ఉంటుందేమో! పోనీలే నాకేమీ?' అనుకుంటూ నెమ్మదిగా నడుచుకుంటూ బస్సు స్టాప్ కి వచ్చింది.

(ఇంకా ఉంది )

కథ

# "అమల "

ఈదర శ్రీనివాస రెడ్డి

పల్లెవెలుగు ఆఖరి సర్వీస్ పూర్తి చేసుకుని డిపోకి చేరేటప్పటికి రాత్రి పది దాటింది. పండగలు ,పెళ్లిళ్ల సీజను కావటం తో ఎక్స్ట్రా సర్వీసు నడుపుతున్నారు ఆర్ టి సి వాళ్లు

డిపోముందు బస్సును ఆపి, "ఏమ్మా రాధమ్మా ఇక్కడ దిగుతావా? లోపలికొస్తావా?" అంటూ అడిగాడు డ్రైవర్ నాగేశ్వరరావుగారు.

"ఏమ్మా, నిన్నే .. " అంటూ వెనక్కి తిరిగి ." చూసాడు కండక్టర్ సీట్లో మంచి నిద్రలో జోగుతూ కనిపించింది రాధమ్మ
"పిచ్చిపిల్ల, రోజూ ఇంతే... 'అనుకుంటా డ్రైవర్ సీటు పక్క నున్న డోర్ తీసుకుని కిందకి దూకాడు.

జేబులోనుంచి చుట్టముక్క తీసుకుని, నోట్లో పెట్టుకుని వెలిగించాడు. ఓ దమ్ము గట్టిగా పీల్చి . నోటి గుండా పొగ బయటకి ఒదులుతూ. 'కన్యాశుల్కంలో గిరీశం "పొగ తాగని వాడు దున్నపోతై పుట్టన్" అని ఎందుకన్నాడో ఇప్పుడు అర్థమౌతుంది' అని మనసులో అనుకుంటూ, చిన్నగా అడుగులేస్తూ, చుట్టూతిరిగి వచ్చి కండక్టర్ సీటు ఎదురుగా నిలబడి

'ఓ' రాధమ్మ తల్లీ నిద్ర లేమ్మా .. 'అంటూ పెద్దగా అరిచాడు.

ఆ అరుపుకి మెలుకువ వచ్చిన రాధమ్మ కాస్త తత్తరపడుతూ, కళ్ళు నులుముకుంటూ. "ఏమయింది బాబాయ్.. ' అంటూ అడిగింది.

'ఏమి అవటం ఏంటమ్మ, డిపోకొచ్చి అరగంట అయ్యింది. నువ్వేమో మేలుకోవయితివి"

"బాగా అలిసిపోయాను బాబాయ్, అందుకే బాగా నిద్ర పట్టేసింది"

"అదేలేమ్మా, నేను అనుకున్నా. పెళ్ళిళ్ళ సీజను కదా , ఈ నెల్లాళ్ళు జనం జాస్తిగానే ఎక్కుతుంటారు... రద్దీలో ఒళ్లు హూనం హూనం అవుతుంది "

" అవును బాబాయ్ ..బాగా అలసి పోయాను ..అందుకనే నిద్ర పట్టింది " కిటికీ లోనుంచి చూస్తూ అన్నది

" సరే నువ్వు పోయి కలక్షన్ ఇచ్చేసిరా... నేను బండి లోపల పెట్టి వస్తా , ఇద్దరం కలిసెళదాం... "అంటూ కాస్త దూరంగా వెళ్ళి చుట్ట తాగుతూ, గప్పు గప్పున రైలింజనులా పొగ వదలటం మొదలు పెట్టాడు.

రాధమ్మ బద్ధకంగా సీట్లో నుంచి లేచి బస్సు మొత్తం ఓసారి కలతిరిగి చూసింది,

అప్పటి దాకా నిండు గర్భిణిలా జనాలతో కళకళ లాడుతూ కనపడిన బస్సు, ఇప్పుడు ఖాళీగా మనుషులు తిరుగాడని మరుభూమి లా కనిపిస్తోంది. ఎంతలో ఎంత మార్పు తన జీవితం లా ? అనుకుంటూ వుండగానే ఆమెకు తెలియకుండా ఆమె కళ్లు ఎదురుగా ఉన్న సీటుపైనున్న వస్తువు వైపు మళ్ళాయి.

★★★★

"సార్ , మగ దిక్కు లేని ఆడ బిడ్డ సార్ , నైట్ సర్వీసులు వెయ్యకండి సార్ .."డిపో మేనేజర్ని వేడుకున్నాడు నాగేశ్వర రావు

" నువ్వేమో ముసలాడివి , నీకు నైట్ సర్వీసులు వెయ్యకూడదు , ఈవిడ మగతోడు లేని ఆడది , ఈవిడకి వెయ్యగూడదు .. ఇంకెవరికి వెయ్యాలి .."

" మీకు తెలిసుకదా సార్ , మన డ్రైవర్ గోపాలం అర్ధాంతరంగా చనిపోతే , కారుణ్య నియామకం కింద వాళ్ళావిడ రాధమ్మకి కండక్టర్ ఉద్యోగం ఇచ్చారు .."

" ఆ తెలుసులే తాగి తాగి చచ్చగాడు , ఎవడు తాగమన్నాడు , ఎవడు చావమన్నాడు .." విసుక్కున్నాడు మేనేజరు

అప్పటిదాకా మౌనంగా వాళ్ల సంభాషణ వింటూ ఉన్న రాధమ్మ ," ఆయన తాగి చావలేదండి, సడన్ గా హార్ట్ అటాక్ వచ్చి చని పోయారు .." అంది కాస్త కోపంతో

" అవును సార్ బండి నడుపుతున్నప్పుడే హార్ట్ అటాక్ వచ్చింది, అంత నొప్పిలో కూడా తన కుటుంబం గురించి ఆలోచించకుండా పాసంజర్లకు , బండి కి ఏమీ కాకూడదని ఆలోచించి, బండిని పక్కకు తీసి చనిపోయాడు పాపం .."రాధమ్మ ను సమర్ధించాడు నాగేశ్వరరావు

" ఏదో ఒకటి లే , తాగితే గుండె నొప్పి రాకుండ ఉండదా అయినా ఎలా చస్తే నాకెందుకు ,ఇప్పుడు నన్ను ఏమీ చెయ్యమంటావు చెప్పు " విసుక్కున్నాడు మేనేజరు

" అలా విసుక్కోకండి సార్ , మీరు కాకపోతే మాకు ఎవరు సాయం చేస్తారు చెప్పండి . అమ్మాయి కి నాతో పాటు పల్లె వెలుగు వెయ్యండి సార్ ,సాయంత్రానికి ఇంటికి చేరుకోవచ్చు ---"

" నీ బండి కి వెయ్యాలా ---" ఓ వంకర నవ్వు నవుతూ అన్నాడు

" నా బిడ్డ లాంటిది సార్ , గోపాలం బతికున్నప్పుడు మావా అంటూ ప్రేమగా పలకరించేవాడు ..ఇప్పుడు వాడు లేడు .." అంటూ కన్నీళ్లు పెట్టాడు నాగేశ్వర రావు

" సరే సరే --- నీతోనే తీసుకెళ్లు , నాకెందుకు ఈ గోల " అంటూ అక్కడనుంచి కదిలాడు మేనేజరు

" ఎందుకు బాబాయి వాళ్లని బతిమి లాడటం , ఏదో ఒకటి వేసేవాళ్లు , డ్యూటీ అన్నాక తప్పదుగా .." అన్నది రాధమ్మ నాగేశ్వర రావు వంక చూస్తూ

" నీకు తెలియదు తల్లి నైట్ సర్వీసులు అంటే బెంగుళూరు , చెన్నై వాంటి వేరే ఊర్లు వెళ్లాలి. సరైన నిద్ర , తిండి ఉండవు , అక్కడ ఉండటానికి కూడా సరైన చోటు ఉండదు ,ఆడదానివి స్నానాలు గట్రా ఎక్కడ చేస్తావు తల్లి . పైపెచ్చు

పెళ్లికెదిగిన ఆడ పిల్లలు ఉన్నారాయె , వాళ్లను ఒంటరిగా వదిలి రాత్రిళ్లు --- అంత మంచిది కాదమ్మా ..అందుకే అంతలా బతిమిలాడింది " చెప్పుకొచ్చాడు నాగేశ్వరరావు

" సరే బాబాయ్--- " అంటూ నాగేశ్వరరావు వెనకే నడిచింది రాధమ్మ పల్లె వెలుగు లో టిక్కెట్లు కొట్టటానికి



రాధమ్మ తన జీవితం లో ఊహించని పరిణామం అది .. ఇల్లు పిల్లలు మొగుడే జీవితం అనుకుంది అప్పటిదాకా. ఏనాడు గడపదాటి ఎరుగదు. కానీ హఠాత్తుగా భర్త గుండెపోటుతో చనిపోవటంతో , కుటుంబాన్ని పోషించుకోవడానికి ఉద్యోగం చెయ్యక తప్పలేదు .

మొదట కష్టంగానే ఉండేది ,బస్సు అంతా జనం తో నిండి పోయి కిటకిట లాడుతుంటే , వాళ్ల మధ్య లో కి వెళ్లి టికెట్లు కొట్టటం చాలా ఇబ్బందిగా ఉండేది .

పైపెచ్చు కొంత మంది మగాళ్లు కావాలని తాకటం , ఎక్కడెక్కడో చేతులు వెయ్యటం , కొంత మంది చిల్లర ఉంచుకో అని వెకిలి నవ్వులు నవ్వటం అంతా జగుప్సగా , అసహ్యంగా ఉండేది . కానీ తప్పదు బిడ్డల్ని బతికించుకోవాలి అనే తపన ముందు ఈవేవీ పెద్దగా బాధ అనిపించలేదు .

గోపాలం బతికుండ గానే పెద్దదాని పెళ్లి సంబంధాలు చూశారు. ఒకటి రెండు సంబంధాలు వచ్చాయి , పిల్ల నచ్చింది కానీ , కట్నకానుకలు, పిల్లకి పెట్టే బంగారం దగ్గర మాట కుదరక ఆగిపోయాయి

గోపాలం బతికుండగా ఒక్క రూపాయి వెనకేసింది లేదు , ఓ కాసు బంగారం కొన్నది లేదు . అదేమంటే పిల్లలకు చదువులు చెప్పించాను చాలదా అనే వాడు

ఈ రోజుల్లో ఆడ పిల్లల చదువులు చూసి ఎవరు పెళ్లిళ్లు చేసుకుంటున్నారు . ఆ రోజుల్లో చదువులు లేవు కాబట్టి కట్నాలు కానుకలు అడిగే వాళ్లు . ఇప్పుడు పెద్ద పెద్ద చదువులు చదివినా కట్నాలు కానుకలు అడగటం మాత్రం మానలేదు

★★★★

"ఎవరిదో బ్యాగ్ , బహుశా మర్చి పోయినట్టున్నారు "అని మనసులో అనుకుంటూ, బ్యాగ్ వున్న సీటు దగ్గరకు నడిచింది.

చిన్నగా పైనుంచి బ్యాగ్ 'కిందకి దించింది.చాలా ఖరీదైన బ్యాగ్, లా కనిపిస్తోంది . "బ్యాగే అంత ఖరీదైనదైతే, అందులో ఇంకెంత ఖరీదైన వస్తువులు వుండి వుంటాయో" అని అనుకుంటూ, బ్యాగ్ కి ఉన్న జీపు మెల్లగా తెరిచింది

బాగ్ లో ఒక్కసారిగా బంగారు నగలు మెరిసిపోతూ కళ్ళబడ్డాయి. వాటిని చూడగానే ఒక్కక్షణం రాధమ్మకు నోట మాట రాలేదు. అంతలోనే తేరుకుని, వెంటనే బ్యాగ్ జిప్ వేసేసి చుట్టూ చుసింది

ఎవరన్నా గమనిస్తున్నారేమోనని .

ఎవరు లేరని నిర్ధారించుకుని, బ్యాగ్ ను తన క్యారియర్ బుట్టలో అడుగున ఎవరికీ కనపడ కుండా పెట్టుకుని, మరో చేతిలో టికెట్ బాక్స్, తీసుకుని మెల్లాగా బస్సు దిగింది.

నాగేశ్వరరావు గారి కోసం చూసింది , బ్యాగ్ విషయం చెపుదామని . దూరంగా తాపీగా చుట్ట తాగుతూ ఎవరితోనో మాట్లాడుతున్నాడు

" బాబాయ్ .." అంటూ చిన్నగా కేకవేసింది

రాధమ్మ పిలుపు వినపడిందో లేక రాధమ్మ రాక కంట పడిందో గానీ " నువ్వు కలక్షన్ ఇచ్చిరా తల్లి నేను బండి లోపల పెట్టి వస్తా " అని అక్కడనుంచే అరిచాడు

" హమ్మయ్య.. " అనుకొంటూ చిన్నగా అడుగులేస్తూ ముందుకు కదిలింది

కూతురి పెళ్లి ఈ నగల దగ్గరే ఆగిపోయింది . వియ్యాల వాళ్ళు ఆడిగినంత బంగారం ఇవ్వలేదని సంబంధం వాయిదా వేశారు . ఇప్పుడు ఈ నగలు ఉంటే అమ్మాయి పెళ్ళి చేయొచ్చు. కానీ బస్సులో ఏమీ దొరికినా మేనేజరుకు అప్పగించాలి .వాళ్లు అసలు వాళ్లు వస్తే సరే సరి లేకపోతే పోలీసులకు అప్పగిస్తారు .

వాస్తవమైతే ఇదే , కానీ పోగొట్టుకున్న వస్తువులు అసలు వాళ్లకు చేరిన సందర్భాలు చాలా కద్దు, మధ్యలో వాళ్లే కొట్టేస్తారని చాలాసార్లు విన్నది రాధమ్మ .ఎప్పుడో ఒకసారి తప్పనప్పుడు అసలు వాళ్లకు వాళ్లు పోగొట్టుకున్న వస్తువులు ఇచ్చి ఫొటోకు ఫోజులిచ్చి పేపర్లో వేయుంచుకుంటారు.

ఇప్పుడు బ్యాగ్ మేనేజరికి ఇవ్వాలా? వద్దా ? ఒక వేళ ఇస్తే మేనేజర్ అసలు వాళ్లకు తిరిగిస్తాడా ?నగలు పొగట్టుకున్న వాళ్లు వాటి కోసం వస్తారా? రారా ? ఒక వేళ నగలు పోయాయని వాళ్లు పోలీసు కేసు పెడితే ?ఇలా అనేక ప్రశ్నలు ఒకటి తరువాత ఒకటి రాధమ్మ మెదడుపై దాడి చేశాయి

ఏమి చెయ్యాలో పాలుపోవట్లేదు రాధమ్మకు , ఒక పక్క బిడ్డ పెళ్లి మరో పక్క పట్టుబడితే ఉన్న ఉద్యోగం కూడా ఊడుతుంది అని ఆలోచిస్తూ కాష్ కట్టే కౌంటర్ బయటే నిలబడి పోయింది ఓ నిమిషం

సరే ఏదైతే అదే అయ్యింది అని, నగల బ్యాగ్ ఇంటికే తీసుకెళ్లాలని నిర్ణయించుకుంది

ఇంతలో నాగేశ్వరరావు గారు అక్కడకొచ్చి , "ఎమ్మా ఏంటీ ఇంకా కాష్ కట్టలేదా ? ఏమైంది ఇవాళ నీకు పదా" అంటూ రాధమ్మ చేతిలో క్యారియర్ బుట్ట తీసుకుని లోపలికి అడుగు పెట్టాడు

నాగేశ్వరరావు గారు బుట్టలో నగల బ్యాగ్ ను ఎక్కడ చూస్తారో అని భయపడుతూ వెనకాలే అనుసరించింది

" ఇదిగో సుబ్బారావు అమ్మాయి దగ్గర్ కాష్ తీసుకో త్వరగా వెళ్ళాలి ఇప్పటికే ఆలస్యం అయ్యింది , ఇంటిదగ్గర పిల్లలు ఎదురు చూస్తూంటారు " అంటూ కాష్ కౌంటరులో ఉన్న సుబ్బారావును తొందర పెట్టాడు

" అలాగే బాబాయ్ , ఇటీయమ్మా ..." అంటూ రాధమ్మ దగ్గర కాష్ తీసుకుని లెక్క చూసి, " సరిపోయింది .. మీరు వెళ్లండి బాబాయ్ " అన్నాడు సుబ్బారావు

" పదమ్మ .."అంటూ బుట్ట తీసుకుని బయటకొచ్చి అక్కడ పార్క్ చేసి ఉన్న తన బండికి తగిలించబోయాడు బుట్టని

" పడిపోతుద్దేమో బాబాయ్ .." కంగారుపడుతూ అంది " రోజు తగిలించేదే కదమ్మా ఎందుకు పడిపోతుంది నువ్వు ఎక్కు" అంటూ తను బండి మీద కూర్చుని బండి స్టార్ట్ చేశాడు

రాధమ్మ బండి ఎక్కి వెనక కూర్చుంది. చిన్నగా బండి వేగం పుంజుకుంది

బండి కన్నా రాధమ్మ ఆలోచనులు ఇంకా వేగంగా పరిగెడుతున్నాయి .

ఒక వేళ బాబాయ్ బ్యాగ్ చూస్తే , ఏమి సమాధానం చెప్పాలి .తనను ఓ దొంగగా అనుకోడు కదా . ఇప్పటిదాకా ఉన్న మంచి పేరు చెడగొట్టుకున్నట్టు అవుతుందేమో

.ఆలోచనలతో మెదడు వేడెక్కి ,మొఖమంతా చెమటపట్టింది . ముఖానికి తాకుతున్న చల్లటి గాలి ఆ వేడిని చల్లార్చ లేక పోతొంది

" ఇంటి కొచ్చాం దిగమ్మా .." అన్న నాగేశ్వర రావు పిలుపుతో మళ్లీ ఈ లోకం లోకి వచ్చి, చిన్నగా బండి దిగింది .

ఇంటి ఎదురుగా బండి స్టాండు వేసి బుట్టా తీసి ఇస్తూ , "అసలు నీకు ఇవాళ ఏమైందమ్మా ? పిల్ల పెళ్లి గురించేనా ? దిగులు పడకు కక్కొచ్చినా కళ్యాణమొచ్చినా ఆగవు అంటారు , అదే అవుతుంది " సముదాయించాడు నాగేశ్వరరావు

బుట్ట తీసుకింటూ " అబ్బే అదేం లేదు బాబాయ్ ..కాస్త అలసి పోయా" అంది రాధమ్మ

" అలా అయితే సరే ..నే వస్తా " అంటూ బండితో ముందుకు కదిలాడు నడుచుకుంటూ .అక్కడ నుంచి నాలుగు ఇళ్ల అవతలే నాగేశ్వరరావు ఇల్లు .

★★★★★★

పిల్లలిద్దరూ అన్నాలు కూడా తినకుండా తనకోసమే ఎదురుచూస్తున్నారని తెలిసి , వెంటనే నాలుగు చెంబులు నీళ్లు వంటి మీద పోసుకుని ,పిల్లలొద్దారికి అన్నం వడ్డించింది

వాళ్లు అన్నం తింటున్నంత సేపు నగల గురుంచి వాళ్లకు చెప్పాలా వద్దా అని ఆలోచిస్తూనే ఉంది .

" నువ్వు కూడా పెట్టుకుని తినమ్మా .." పెద్ద పిల్ల అమల ,తల్లి పడే కష్టం చూసి అడిగింది

" ముందు మీరు తినండి ---నాకు ఆకలిగా లేదు "రోజు చెప్పే మాటే చెప్పింది రాధమ్మ .తల్లి ఆ మాటెందుకు చెపుతుందో పిల్లలకు తెలుసు .

తను ముందు తింటే పిల్లలకు ఎక్కడ భోజనం చాలదో అని వాళ్లు తిన్న తరువాత మిగిలింది తింటుంది .తల్లి మనసు వాళ్లకూ తెలుసు ఎందుకంటే వాళ్లు రేపటి తల్లులే కదా? అందుకనే , వాళ్లు కూడా అర్ధాకలితో భోజనం ముగించి తల్లికి సరిపడా భోజనం ఉంచటం అలవాటు చేసుకున్నారు .ఆ ఇంట్లో అటువంటి త్యాగాలు మామూలే . ఆ ఇంట్లోనే కాదు ప్రతి పేద వాడి ఇంట్లో అది నిత్యకృత్యం .

పిల్లలు తిన్న తరువాత తను కాస్త ఎంగిలి పడింది . మనసంతా ఆందోళనగా ఉండటం తో అన్నం కూడా పెద్దగా సహించ లేదు .నిద్ర పోదామని కళ్లు మూసిందే కానీ మనసు మాత్రం మేలుకునే ఉంది .

ఇక. ఆ రోజు నిద్ర రాదని నిర్ధారించుకున్న రాధమ్మ ఒకరాత్రి పూట లేచి , బ్యాగు లోనో నగలన్నీ తీసి మంచం మీద కుప్ప పోసింది . చూస్తుంటే పెళ్లికి చేయొంచిన నగల్లా ఉన్నాయి , ఐదారు లక్షల పైనే ఉంటాయి అనుకుంటూ ఒక్కొక్కటి చూడసాగింది .

" ఎక్కడివమ్మా ఈ నగలు ----"పెద్ద కూతురు అమల గొంతు వినపడటం తో కంగారు పడుతూ వెనక్కి తిరిగి చూస్తూ

" నువ్వింకా నిద్ర పోలేదా .." అని అడిగింది

" లేదమ్మా , నిద్ర పోయాను , ఏవో పిచ్చి కలలు వస్తే మెలుకువ వచ్చి నీ దగ్గర పడుకుందామని వచ్చా ,ఇంతకీ---ఈ నగలు"మళ్లీ అడిగింది అమల

"ఈ నగలన్నీ నీకోసమే తెచ్చా --- ఆగిపోయిన నీ పెళ్లి తొందరలోనే జరుగితుందమ్మా,ముందు వీటిని పెట్టుకో ఎలా ఉన్నాయో చూద్దాం "అంటూ కూతురికి నగలు పెట్టబోయింది

" నా పెళ్లి సరే ఈ నగలన్నీ ఎక్కడి నుంచి తెచ్చావు ----"అంటూ దూరంగా జరిగింది అమల

"ఏం జవాబు చెప్పాలో అర్ధం కాక మౌనంగా ఉండిపోయింది ఓ క్షణం "

" ఎమ్మా మాట్లాడావు .."

కూతురి స్వరం లో ఏదో మార్పు గమనించిన రాధమ్మ కాస్త భయపడుతూ జరిగిన దంతా చెప్పింది

రాధమ్మ చెప్పిందంతా విన్న కూతురు ,” తప్పమ్మా , నువ్వు నీకుతురి గురించి ఆలోచించావు కానీ , ఇంకో అడకూతురికి అన్యాయం జరుగుతోందని ఆలోచించలేక పోయావ్ . ఈ నగలు లేక పోతే పాపం ఎవరిదో ఇంకో ఆడపిల్ల పెళ్లి ఆగిపోతుంది కదమ్మా .. నువ్వెందుకు అలా ఆలోచించాలా ..”అంటూ నిలదీసింది

“ నిజమే అంత దూరం నేను ఆలోచించాలా , దానికి కారణం నీ భవిష్యత్తు ఏమౌతుందా అని భయపడ్డాను “ అంటూ కన్నీళ్లు పెట్టింది

“ పిచ్చి అమ్మ ఊరుకో ఏడవకు ,నాన్న చనిపోయినప్పుడు మాకోసం ధైర్యంగా నిలబడ్డావు . ఇప్పుడు ఇంత పిరికి దానిలా ఎలా మారావు “

“ అవసరాలు నన్ను పిరికిదాన్ని చేస్తున్నాయమ్మా ..అందుకే తప్పైనా తప్పదనిపించింది “

“ వద్దమ్మా ఇంకో ఆడ కూతురి ఉసురు మనకెందుకు ..ఈ నగలు ఎవరివో వాళ్లకే ఇచ్చేద్దాం “ అంది అమల

కళ్లు తుడుచుకుంటూ ,” నిజమే తల్లి ఒకళ్ళ ఉసురు మనకొద్దు , ఎవరి ఉసురు తగిలిందో కానీ ఇప్పటికే మీ నాన్న మనకు దూరమయ్యాడు . ఇంకా తప్పు చేసి మిమ్మల్ని కూడా దూరం చేసుకోలేను .ఇచ్చేద్దాం.. నగలు వెనక్కి ఇచ్చేద్దాం “ అని అన్నది

అన్నదే కానీ నగలు ఎలా తిరిగి ఎవరికి ఇవ్వాలో అర్థం కాలేదు. ఒకవేళ రేపు మేనేజరుకు ఇస్తే తనని దొంగలా చూస్తారు, ఇప్పుడెలా ?అని ఆలోచనలో పడింది

“ అమ్మా ...ఇదిగో నగలు కల వాళ్ళ ఫోన్ నెంబరు దొరికింది “ అంటూ బ్యాగులో నుంచి ఓ విజిటింగ్ కార్డు తీసింది కూతురు

“ ఏది ఇటివ్వు..” అంటూ విజిటింగ్ కార్డు తీసుకుని చూసింది , కార్డు మీదున్న పేరు ఎక్కాడో విన్నట్టుంది

★★★★

కాలింగ్ బెల్ మోగటం తో పొద్దున్నే ఎవరై ఉంటారు అని అనుకుంటూ తలుపులు తెరిచాపు లక్ష్మణరావు

ఎదురుగా నాగేశ్వరరావు గారిని చూసి ,” మీరా ఆ సంబంధం కుదరదని అప్పుడే చెప్పాం కదా “ అన్నాడు లక్ష్మణరావు

“ సంబంధం గురించి రాలేదండి మీరు పోగొట్టుకున్న నగల గురించి చెబుదామని వచ్చా” అన్నాడు నాగేశ్వర రావు

అప్పటిదాకా గుమ్మం బయటే నిలబెట్టి మాట్లాడిన లక్ష్మణ రావు , నగల మాట వినగానే ,” రండి లోపలకి రండి మీకెలా తెలుసు నగలు పోయాయని . ఎక్కడో బ్యాగు మరచి పోయింది మా ఆవిడ. ఇప్పుడే పోలీస్ స్టేషన్ లో కంప్లైంట్ ఇద్దామని బయలుదేరా “అంటూ చెప్పాడు

“ మీకు అంత శ్రమ అవసరం లేదు , మీ నగలు మా రాధమ్మకు దొరికాయి .రాధమ్మ రామ్మా లోపలికి .” అంటూ బయట దురంగా నిలబడ్డ రాధమ్మ ను లోపలికి పిలిచాడు నాగేశ్వరరావు

“ రాధమ్మ ...” అంటూ ఎగా దిగా రాధమ్మ వంక చూడ సాగాడు లక్ష్మణరావు

“అదేనండీ ఈ మధ్య మనం ఓ సంబంధం చూశాము , పిల్ల నచ్చింది కానీ నగలు పెట్టటం లేదని వద్దనుకున్నాం “ గుర్తు చేసింది లక్ష్మణరావు భార్య

“ అవునా అంటూ ఆలోచనలో పడ్డాడు లక్ష్మణ రావు “

జరిగినదంతా చెప్పి క్షమించమని ఆడిగింది రాధమ్మ వాళ్లని

“ పర్లేదమ్మా, సమయానికి దేవుళ్లలా నగలు తెచ్చిచ్చారు , లేకపోతే నా కూతురు పెళ్లి ఆగిపోయేది “ అంటూ రాధమ్మ, నాగేశ్వరరావు వంక కృతజ్ఞతగా చూసింది ఆవిడ

“ నిజమే వాళ్లు దేవుళ్లు దేవతలు కాబట్టే మనం పారేసుకున్న లక్షలు ఖరీదు చేసే నగలు తిరిగి తెచ్చిచ్చారు . మరి మనం లక్షణమైన అమ్మాయిని వెధవ నగల కోసం వద్దనుకున్నాం .ఎన్ని నగలు కుమ్మరిస్తే అంత మంచి అమ్మాయి దొరుకుతుంది “ అన్నారు లక్ష్మణ

రావు

" నిజమే నండి...నన్న క్షమించమ్మా " అంటూ రాధమ్మ వంక చూసింది

" ఎటూ నగలు పోయాయి ఇక దొరకవు అనుకున్నాం .అటువంటిది నగలు మన ఇంటికి నడచి వచ్చాయి . ఈ నగలు మనం వద్దనుకున్న కోడకు పిల్లే పంపించింది . నువ్వు కోరుకుంది అదే కదా , కోడలు పిల్ల నగలు తేవాలని . ఇంక మనం వీళ్ల సంబంధం కలుపుకోటానికి ఎటువంటి అభ్యంతరాలు లేవనుకుంటా " అంటూ భార్యని అడిగాడు

" నా కోడలు పిల్లే నా కుతురి పెళ్లి పాడవ్వకుండా చూసింది ,ఇంకా నాకు అభ్యంతరమెందుకుంటుందండి.. వీళ్ల సంబంధమే ఖాయం చేసుకుందాం " అంది ఆనందంగా ఆవిడ

వాళ్ల మాటలు విన్న రాధమ్మకు గుండెల మీద నుండి పెద్ద భారం దిగి నట్టు అనిపించింది

" మా రాధమ్మ మంచితనం , పిల్లల నిజాయితీలే రాధమ్మకు అండగా నిలబడ్డాయి " అంటూ రాధమ్మ వంక చూశాడు నాగేసరరావు

" అంతా నీ అభిమానం బాబాయ్ " అంటూ నాగేశ్వరరావు గార్కి నమస్కరించింది

★★★★★

# ధర్మ సందేహాలు

సహస్ర వ్యాస కవి



## మతం అంటే ఏమిటి ?

మతం అంటే యేమిటో నిర్వచించటం కష్టం. మతం అంటే ఏమిటో వివరించవచ్చు గాని నిర్వచించటం అసాధ్యం. ఎందుకంటే నిర్వచనం జ్ఞానానికి ఆది, తుది. పైగా అన్ని మతాలకు సమానంగా అనువర్తించే నిర్వచనం అసలు సాధ్యమే కాదు.ఒక రకంగా చెప్పాలంటే కొంత మంది ప్రజలు లేక సమూహాలు తామంతా కొన్ని నిబంధనలకు లోబడి జీవిద్దాం అని చేసుకునే ఒప్పందమే మతం . మరణానంతరం సకల చరాచర జగత్తుకు సృష్టి, స్థితి, లయ కర్త అయిన సర్వేశ్వరుడిని చేరే మార్గాలుగా ప్రచారంచేస్తూ, మానవులను మంచి మార్గంలో నడిపించుటకు తార్కిక ఆలోచనాపరులు సృష్టించిన విధానాలు అని ఒక భావన అనికూడా చెప్పుకోవచ్చు

మతం కూడా విజ్ఞానం లాగే మానవ జీవితాన్ని సుకరం చేయాలనే తలంపుతోనే బయలుదేరింది. అయితే ముఖ్యమైన మతాలు ఇహ జీవితాన్ని సుకరం చేయటం కంటే, పర జీవితాన్ని సుఖమయం జేయ తలపెట్టాయి. విజ్ఞానశస్త్రం ఈ జీవితాన్ని ఇప్పుడే, ఇక్కడే సుఖమయం చేయాలంటుంది. ఇది సాధ్యం కావాలంటే మతం గాని, విజ్ఞానం గాని విశ్వాన్ని, దాని స్వభావాన్ని అర్థం చేసుకోవాలి. దానిని వివరించాలి. రెండింటి లక్ష్యం విశ్వాన్ని అర్థం చేసుకోవటమే అయినా, విజ్ఞానం ఇహాన్ని ఇహంలో వివరిస్తే, మతం ఇహాన్ని పరంలో అర్థం చేసుకుంటుంది. ప్రపంచంలో జరిగే సంఘటనలకు కారణాలను విజ్ఞానం ఈ లోకపు సంఘటనలను కారణాలుగా జేస్తుంది. మతం, విజ్ఞానం రెండింటి లక్ష్యం మానవులకి ఉన్న అభద్రతను తొలగించడమే. జ్ఞానం అభద్రతను, వ్యాకులతను తొలగిస్తుంది. ఏ జ్ఞానం ఈ అభద్రతను తొలగిస్తుంది? పార లౌకిక జ్ఞానం అంటుంది మతం. లౌకిక జ్ఞానం అంటుంది విజ్ఞానం. ఏది ఏమైనా జ్ఞానం పెరిగిన కొలదీ సమస్యల గురుత్వమూ, సంశ్లిష్టతా పెరుగుతుంది. ఫలితంగా అభద్రత పెరుగుతుంది. అభద్రత ఉన్నంత కాలం మతానికీ విజ్ఞానంకూ పని ఉండనే ఉంటుంది. అభద్రత, దాని నుంచి జనించే వ్యాకులతా, భీతులను పరిహరించటం మానవుని అంతర్గత అవసరం. మానవునికి ఈ అంతర్గతావసరం సార్వకాలీనంగా ఉంటుంది. అందుకని మతానికి చావు లేదు. అందుకనే మానవుడు అనివార్యంగానే “మతవాది” అంటారు. అందుకే బహుశ మతం లేని మానవుడు లేడేమో. అభద్రత పోవాలంటే ఆలంబనం ఉండాలి. ఈ ఆలంబనాన్ని దేవుడిలో, ధనంలో, హేతువులో, ఈ విశ్వంలో, ప్రేమలో – ఎక్కడైనా చూడవచ్చు. ఆ ఆలంబన సాధనలో అతడికి అనేక అనుభవాలు కలుగుతాయి. అవే మాతానుభవాలు. ఈ అనుభవాల వ్యక్తీకరనం అనేక రూపాలు తీసుకొంటుంది. ఈ రూపాలు దేశ కాల వ్యవస్థలను బట్టి మారతాయి. ఇవి సంస్థాగత రూపాలు పొందిన తరువాత స్థిరపడిపోయి తన జీవితంలో కలసి, వారి నాటి మతావసరాలను తీరుస్తాయి. కాలంలో వచ్చే మార్పులతో అవి మారవు. అవి తరువాత అర్థ రహిత, అంధ ఆధారాలుగ కనిపిస్తాయి. “అసలు మతం” ఈ బాహ్య రూపాలలో లేదు. మతానికీ అంతర్గత విలువలకూ అత్యంత సన్నిహిత సంబంధం ఉంది. ప్రతి మతానికి “పారమార్థిక విలువ” వుంటుంది. విధానాలు దీనికి సంబంధించి ఆవిర్భవించినవే. అయితే వచ్చే పేచీ అంతా “పారిమార్థిక వీలువ” దగ్గర వస్తుంది.ఏది పారిమార్థిక విలువ? అంటే వచ్చే సమాధానాలు కోకొల్లలు. ఒకరికి దేవుడు పారిమార్థిక విలువ అయితే, మరొక్రికి ధనం, వెరొకరికి ప్రేమ, వేరొకరికి వేరొకటి. ఇ విలువలలో ఏది గొప్పది అంటే సమాధానం వివిధమే. విలువలను పోల్చడం సాహసమే అవుతుంది.

# బొమ్మలు చేద్దాం రండి






Image printed on www.supercoloring.com - for personal use only - reproduction is prohibited




**దారి కనిపెట్టటానికి సహాయం చెయ్యండి**



**బొమ్మకు రంగులు వెయ్యండి**




## తేడాలు కనిపెట్టండి



## రాశి ఫలాలు

# ఈ నెల మీ అదృష్టం....




కొలుకుల చంద్ర శేఖర్




తలపెట్టిన పనులు నిర్ణీత సమయంలో పూర్తవుతాయి. ఉద్యోగులకు అధికారుల నుంచి ఒత్తిడి ఉంటుంది. తోటివారి విమర్శలతో ఇబ్బంది పడతారు. రాబడి బాగుంటుంది.




ఇంట్లో అనుకూల వాతావరణం ఉంటుంది. పనిభారం పెరగడంతో అకాల భోజనం చేయాల్సి వస్తుంది. ఫలితంగా అనారోగ్య సూచన. తీర్థయాత్రలు, విహారయాత్రలు చేస్తారు. వివాహాది శుభకార్య ప్రయత్నాలు అనుకూలిస్తాయి. నిర్మాణ పనులు చేపడతారు.





ఆరోగ్యం బాగుంటుంది. వ్యాపారులకు కాలం కలిసి వస్తుంది. సహోద్యోగులతో స్నేహం కుదురుతుంది. మిత్రులతో పనులు నెరవేరుతాయి. బాధ్యతలు శ్రద్ధతో పూర్తిచేస్తారు.




సమయానుకూల నిర్ణయాలతో మంచి ఫలితాలు పొందుతారు. నలు గురిలో గుర్తింపు లభిస్తుంది. తీర్థయాత్రలు, విహారయాత్రలు చేపడతారు. గృహ నిర్మాణ కార్యక్రమాలు కలిసి వస్తాయి.




ప్రారంభించిన పనుల్లో మొదట్లో ఆటంకాలు ఎదురైనా అనుకున్న సమయానికి పూర్తవుతాయి. ఆదాయ మార్గాలపై దృష్టి సారిస్తారు. ఇంట్లో ఆహ్లాద కరమైన వాతావరణం ఉంటుంది. విద్యార్థులు సత్ఫలితాలు సాధిస్తారు. .





వివాదాలకు దూరంగా ఉంటూ పనులు నెరవేరుస్తారు. ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ వహిస్తారు. ఉద్యోగులకు పదో న్నతి, స్థాన చలన సూచన.

# రాశి ఫలాలు

## ఈ నెల మీ అదృష్టం....






కుటుంబ పెద్దలతో సఖ్యత నెలకొంటుంది. చాకచక్యంగా వ్యవహరిస్తారు. నూతన ఆదాయ మార్గాలను అన్వేషిస్తారు. ఆదాయం క్రమేణా పెరుగుతుంది. మాసాంతంలో ఆత్మీయులతో, కొత్తగా పరిచయ మైన వ్యక్తులతో ఇబ్బందులు ఉండవచ్చు.




ఉద్యోగులకు అందరి సహకారం లభిస్తుంది. కళాకారులకు కొత్త అవకాశాలు లభిస్తాయి. పాత మిత్రులను కలుసుకుంటారు. వారితో ఉత్సాహంగా కాలం గడుపుతారు. విద్యార్థులకు అనుకూలం.




వ్యాపారం లాభసాటిగా కొనసాగుతుంది. నూతన ఒప్పందాలు అనుకూలిస్తాయి. విద్యార్థులు శ్రమించ వలసిన సమయం. నిరుద్యోగులకు ఉద్యోగ యోగం. శ్రమ ఎక్కువ అవుతుంది. ఖర్చుల నియంత్రణ అవసరం.




తలపెట్టిన పనులు సకాలంలో పూర్తవుతాయి. ఉద్యోగులకు పనిభారం పెరు గుతుంది. నిర్మాణ కార్యక్రమాలపై మనసు నిలుపుతారు. ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నవారికి అనుకూల సమయం. మంచి సంస్థల్లో ఉద్యోగం లభిస్తుంది.




దూర ప్రయాణాలు చేస్తారు. ఉద్యోగులకు బాధ్యతలు పెరుగు తాయి.ఆరోగ్యంపై మనసు నిలుపుతారు. చేయవలసిన పనులు సకాలంలో పూర్తిచే స్తారు. భూ లావాదేవీల్లో జాగ్రత్త అవసరం.




కుటుంబంలో అన్ని విషయాలను చర్చించి, నిర్ణయాలను తీసుకుంటారు. ఆదాయం స్థిరంగా ఉంటుంది. గతంతో పోలిస్తే ఖర్చులు తగ్గు తాయి. ఆర్థిక లావాదేవీలకు అనుకూలం.

సుమతి
అంతర్జాల సమగ్ర కుటుంబ మాసపత్రిక


# సుమతి ఇప్పుడు ఆన్లైన్లో

**సుమతి** అంతర్జాల కుటుంబ మాసపత్రిక ఇప్పుడు ఆన్లైన్ లో వెలువడుతోంది . మీ మొబైల్ నుండి కాని లేదా మీ కంప్యూటర్ నుండి ఆన్లైన్ లో హాయిగా చదువుకోండి .
www.sumathimasapathrika.com

**సుమతి** మాసపత్రిక అంతర్జాల పత్రిక విడి ప్రతి వెల.


**రూ. 25 /-** రూపాయలు

సంవత్సర చందా కి కేవలం **రూ. 250/-**

ఐదు సంవత్సరాల చందా కేవలం **రూ. 1,200/-**

ఐదు సంవత్సరాలు చందా కట్టిన వారిక రూ.200 విలువచేసే పుస్తకాలను ఉచితంగా పంపబడును




చందా కట్టదలచిన వారు కింది నెంబరుకు గూగుల్ పే లేదా ఫోన్ పే చెయ్యండి

7 8 9 3 1 1 1 9 8 5

చందా కట్టిన వారికి ప్రతి నెల flip బుక్ పాస్ వర్డ్ తో పంపబడును

సుమతి

అంతర్జాల సకుటుంబ మాస పత్రిక

సుమతి" సాహితి సామ్రాట్ " పోటీలు

# సుమతి సాహితి సామ్రాట్ పోటీలు

జనవరి 2024 నుండి డిసెంబర్ 2024 వరకు
ఒక సంవత్సరం పాటు దిగ్విజయంగా ప్రతి నెల కథలు, కవితల పోటి
నిర్వహించబడింది . బహుశా తెలుగు సాహిత్య చరిత్రలో ఇటువంటి పోటీలు
ఒక యజ్ఞం లా నిర్వహించటం ఇదేప్రథమం. అది సుమతి కే చెల్లింది
ఈ పోటిలో పాల్గొన్న రచయతలందరికి హృదయపూర్వక ధన్యవాదాలు
ఈ పోటిలో గెలిచిన విజేతలను ,పాల్గొన్న ప్రతి ఒక్కరిని తగు రీతిగ రాబోయే
ఉగాది(30-03-2025 ) రోజున
సన్మానించ దలిచాము
విజేతల వివరాలు జనవరి 25 సంచికలో

## 2025 సాహితి సామ్రాట్ పోటీలు ఉగాది నుండి ప్రారంభం

సుమతి

అంతర్జాల సకుటుంబ మాస పత్రిక

# సుమతి
# ఉగాది కధల పోటీలు

**చివరి తేది :30-01-2025**

# ఉగాది కధల పోటీల వివరాలు

**1. కధలు యుని కోడ్ లో డిటిపి  చేసి పంపవలెను**

**2 .డిటిపి చేసిన కధలు  కనీసం 4-6 పేజీలు ఉండవలెను**

**3. కధలు ఎక్కడా ప్రచురితం కాలేదని హామీపత్రం తప్పని సరి**

**4. వాట్స్ ప్ లో  పంపిన కధలు స్వీకరించబడవు**

**5.కధల పైన ఉగాది పోటికి అని వ్రాయవలెను**

**6. హాస్యం , శృంగారం ,సస్పెన్స్ కధలకు ప్రాధాన్యం ఇవ్వబడును**

**7. మొదటి 12 ఉత్తమ కధలకు రూ 500 బహుమతి**

**8. రెండవ 12 ఉత్తమ కధలకు రూ250 బహుమతి**

**9.మూడవ 12 ఉత్తమ కధలకు సంవత్సరం పాటు సుమతి పత్రిక ఉచితం**

**10. సాధారణ ప్రచురణకు మరో 12 కధలు ఎంపిక చేయబడును**

కధలు పంపవలసిన మెయిల్ అడ్రస్

sumathi.kadhalu2023@gmail.com

సుమతి

అంతర్జాల సకుటుంబ మాస పత్రిక

# సుమతి
# ఉగాది నవలల పోటీలు

**చివరి తేది :30-01-2025**

# ఉగాది  నవలల పోటీల వివరాలు

**1. నవలలు యుని కోడ్ లో డిటిపి  చేసి పంపవలెను**

**2 .డిటిపి చేసిన నవలలు కనీసం 80-100 పేజీలు ఉండవలెను**

**3. నవలలు ఎక్కడా ప్రచురితం కాలేదని హామీపత్రం తప్పని సరి**

**4. వాట్స్ ప్ లో  పంపిన నవలలు స్వీకరించబడవు**

**5.నవలల పైన ఉగాది పోటికి అని వ్రాయవలెను**

**6. హాస్యం , శృంగారం ,సస్పెన్స్ నవలలకు ప్రాధాన్యం ఇవ్వబడును**

**7. మొదటి 6 ఉత్తమ కధలకు రూ .3000 బహుమతి**

**8. రెండవ 6 ఉత్తమ కధలకు రూ 2000 బహుమతి**

**9.మూడవ 6 ఉత్తమ నవలలకు రూ1000**

**10. సాధారణ ప్రచురణకు మరో 6 నవలలు ఎంపిక చేయబడును**

నవలలు  పంపవలసిన మెయిల్ అడ్రస్

sumathi.navalalu2023@gmail.com

# సుమతి

# ఉగాది కార్టూన్ల పోటీలు

**చివరి తేది :30-01-2025**

## ఉగాది కార్టూన్ల పోటీల వివరాలు

1.కార్టూన్లు A4 సైజు లో ఉండాలి

2 .ఒకరు ఎన్ని కార్టూన్లు అయినా పంపవచ్చు

3. కార్టూన్లు ఎక్కడా ప్రచురితం కాలేదని హామీపత్రం తప్పని సరి

4. వాట్స్ ప్ లో  పంపిన కార్టూన్లు స్వీకరించబడవు

5. కార్టూన్ల పైన ఉగాది పోటికి అని వ్రాయవలెను

6. రాజకీయ కార్టూన్లను పంపవద్దు

7. మొదటి 12 ఉత్తమ కార్టూన్లకు రూ .250 బహుమతి

8. రెండవ 12 ఉత్తమ కార్టూన్లకు రూ125 బహుమతి

9.మూడవ 12 ఉత్తమ కార్టూన్లకు సంవత్సరం పాటు సుమతి పత్రిక ఉచితం

10. సాధారణ ప్రచురణకు మరో 12 కార్టూన్లను ఎంపిక చేయబడును

**కార్టూన్లు** పంపవలసిన మెయిల్ అడ్రస్

sumathi.cartoons2023@gmail.com

సుమతి
అంతర్జాల సకుటుంబ మాస పత్రిక

# సుమతి
# ఉగాది కవితల పోటీలు

**చివరి తేది :30-01-2025**

# ఉగాది కవితల పోటీల వివరాలు

**1.కవితలు 24 లైన్లు మించి ఉండరాదు**
**2 .ఒకరు ఎన్ని కవితలు అయినా పంపవచ్చు**
**3. కవితలు ఎక్కడా ప్రచురితం కాలేదని హామీపత్రం తప్పని సరి**
**4. వాట్స్ ప్ లో పంపిన కవితలు స్వీకరించబడవు**
**5. కవితలు పైన ఉగాది పోటికి అని వ్రాయవలెను**
**6.సమకాలీన సమస్యల పైన రాసే కవితలకు ప్రాధాన్యం**
**7. మొదటి 12 ఉత్తమ కవితలకు రూ .250 బహుమతి**
**8. రెండవ 12 ఉత్తమ కవితలకు రూ125 బహుమతి**
**9.మూడవ 12 ఉత్తమ కవితలకు సంవత్సరం పాటు సుమతి పత్రిక ఉచితం**
**10. సాధారణ ప్రచురణకు మరో 12 కవితలు ఎంపిక చేయబడును**

**కవితలు** పంపవలసిన మెయిల్ అడ్రస్
sumathi.kavithalu2023@gmail.com

